# వొడువని ముచ్చట



## తెలంగాణ సిద్ధాంతకర్త
## ప్రొఫెసర్ జయశంకర్

# వొడువని ముచ్చట

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్


ఇంటర్వ్యూ, సంపాదకత్వం :

కొంపెల్లి వెంకట్ గౌడ్

సహ సంపాదకులు :

దివాకరుని కృష్ణమోహన్ శర్మ

రాంపల్లి మహాలక్ష్మి

చంద్రశేఖర్ పొన్నాల



ప్రచురణ:

భారతి పబ్లికేషన్స్

నిడమనూరు

నల్లగొండ, తెలంగాణ

వొడువని ముచ్చట - తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్

ⓒ కొంపెల్లి వెంకట్ గౌడ్

| | | |
|---|---|---|
| ప్రచురణ | : | జూలై, 2011 |
| కవర్ డిజైన్ | : | జోశ్యభట్ల సుజిత్‌కుమార్ |
| కవర్ ఫోటో | : | అనుమల్ల గంగాధర్ |
| బ్యాక్ కవర్ డ్రాయింగ్ | : | పామర్తి శంకర్‌గౌడ్ |
| అక్షరీకరణ, లేఅవుట్ | : | రాంపల్లి మహాలక్ష్మి |
| కవర్, కలర్ పేజీల ముద్రణ | : | చరిష్మా ప్రింటర్, హైదరాబాద్ |
| ముద్రణ | : | చరిత ప్రింటర్స్, అజామాబాద్, హైదరాబాద్ |
| అడ్రస్ | : | భారతి పబ్లికేషన్స్,<br>దివాకరుని కృష్ణ మోహన్‌శర్మ,<br>నిడమనూరు, నల్లగొండ, తెలంగాణ - 508 278<br>9849112799, 9440580075 |
| ఇ మెయిల్స్: | | kompellivenkatgoud@gmail.com<br>sharmadkm@gmail.com |

**వెల : రూ.100/-**

సోల్ డిస్ట్రిబ్యూషన్ : 'అక్ష' 2-1-477, ప్రతీక్ టవర్స్, ఓయు రోడ్, నల్లకుంట, హైదరాబాద్, తెలంగాణ - 44. ఫోన్ - 7396383722.

పుస్తకాలకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, నవోదయ, ప్రజాశక్తి, సహచర, దిశ, పాలపిట్ట

ఇగ ఏందంటె...


| | |
|---|---|
| సిద్ధాంతకర్త అని ఎందుకొచ్చిందో నాకు తెలవదు | 13 |
| ఎంత చిన్నగ మొదలైందో జూడు | 16 |
| నేను ఎక్స్‌పెక్ట్ జేయలె | 18 |
| ఇదేం గుసగుస గాదు | 19 |
| నేను ఇంప్రెస్ అయ్యింది ఏందంటె | 21 |
| స్ట్రైట్లైన్ అవుద్ది అనుకున్న | 25 |
| నాకు చేతనైంది చేస్తనయ్యా | 27 |
| నా అడ్వాంటేజ్ గదే! | 28 |
| స్వభావరీత్యా చాలా లిబరల్ మనిషి | 29 |
| అది మెయిన్ రీజన్ | 30 |
| కల్చరల్ డైమెన్షన్ వచ్చింది | 31 |
| తెలంగాణను తప్పకుండ జూస్త! | 32 |
| విడిపోతే సాధ్యం అయిద్ది | 33 |
| బ్రేక్ చేసిందే నేను | 35 |
| బిసిలల్ల ఐక్యత లేదు | 37 |
| నా క్యాస్ట్‌గ నేను గర్విస్త | 38 |
| తెలంగాణలో ఆ సంస్కారం వున్నది | 40 |
| మందుగుండు జేయడం మానుకోను గద | 41 |
| ఒక ఫాదర్ ఫిగర్‌గ ట్రీట్ జేసి | 42 |
| కంటెంపరరీ పాలిటిక్స్‌లో అట్ల లేకుంట బతకలేడు | 43 |
| సామాజిక న్యాయం.. నా కాన్సెప్ట్ అదె | 46 |
| మొత్తం కమ్యూనిటీ డివైడ్ అయ్యింది | 47 |

| | |
|---|---|
| పిస్టల్ ట్రిగ్గర్ నొక్కినట్టయింది | 49 |
| ఆంధ్ర లాబీల కుట్రల చరిత్ర | 52 |
| ఒక రహస్యం దాగి వున్నది | 57 |
| అకస్మాత్తుగ తుంచిపారేయలేం | 58 |
| ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్యు రెండు ఒకటే | 60 |
| ఇట్స్ ఎ యూనివర్సల్ ఫ్యాక్ట్ | 64 |
| ఏకైక నాయకుడు ఈనాటికీ | 68 |
| ఈ వాగ్గేయకారులు పెద్ద కాంట్రిబ్యూషన్ | 69 |
| అదొక క్వాలిటీ ఆఫ్ మైండ్ | 70 |
| ఉద్యమాల్లో ఐక్యత వుండాలి | 71 |
| ఎందుకు నడుస్తది అంటె ప్రజల్లోకి బోయిందది | 73 |
| నువ్వు పిరికివానిగ వుండొద్దు | 75 |
| మన సదువుకున్న వాల్లకన్న బెటర్ | 76 |
| అది మాకే కనువిప్పయింది | 78 |
| ఇది యాచక అప్రోచ్ | 79 |
| విడిపోతె అవకాశం వున్నది | 81 |
| కమ్యూనిటీ చరిత్ర చెప్తున్న | 84 |
| ఉమ్మడి రాష్ట్రంలో ఇంపాజిబుల్ | 86 |
| రైట్ ఫ్రం స్టూడెంట్ డేస్ నుంచి యిప్పటి వరకు | 88 |
| 65 ఏండ్ల కిందటి సంఘటన అది | 89 |
| మన్మోహన్సింగ్కు నాకు ఏర్పడ్డ పరిచయం | 93 |
| శ్రీకృష్ణ కతలు | 101 |
| మాది ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం | 104 |
| ఎ పొట్టా పాగల్ హొగయా క్యా? | 107 |

లాఠీ చార్జిలో దెబ్బలు తిన్నవాల్లల్లో నేను ఒకన్ని 108
బతకలేకపోతె బిచ్చమెత్తుకొనైన 110
నా లైఫ్ యాంబిషన్ ఎకనామిక్స్‌లో లెక్చరర్ గావాల 112
స్టేట్ ఫాం గాంగనె ఇమీడియట్ రియాక్షన్ 113
చాలా విషయాల్లో విజయం సాధించిన 116
గవర్నమెంట్‌కి ప్రెస్టేజ్ ఇష్యూ అయింది 118
సికెయం కాలేజ్ ప్రిన్సిపల్‌గ ఎక్కువ తృప్తి 120
అసలు కలలో గూడ అనుకోలేదు 130
అంత రెస్పెక్ట్ వుంది నాకు 134
అదే వూళ్లో వైస్ ఛాన్సలర్‌గ 137
ఆ స్టైల్ నన్ను కాపాడింది 139
అదే నాకు పెద్ద తృప్తి 141
అధ్యాపక వృత్తి నన్ను ప్రభావితం జేసింది 143
నిజంగ నాకు ఉర్దే ఇప్పటికి 145
నన్ను నేనే ఎడ్యుకేట్ జేసుకొని 148
ఉర్దూ - ఇంగ్లిష్ - తెలుగు 150
కాళోజి! ఉద్యమాలల్లో నాకు గురువు 154
లైఫంత సాహిత్య సేవ జేసిండు 158
సంపాదన అనేది ముఖ్యమైపోయింది 160
నేను చేసిన యూనివర్శిటీ రిఫార్మ్స్ 161
లక్ష్మీపార్వతి జేయబట్టి పోయింది 166
వరంగల్ మొదట్నుంచి ఇంటలెక్చువల్ సెంటర్ 167
బిసిలె ఆత్మ విమర్శ జేసుకోవాలె 169
ఆయన చదవకుండ ఏది మాట్లాడడు 171

| | |
|---|---|
| ఆ హ్యాండీక్యాప్ పిల్లలకు రావొద్దు | 172 |
| సిఫెల్ రిజిస్ట్రార్‌గ వుండి గూడ వంట చేసుకున్న | 173 |
| ఇచ్చే స్టాటిస్టిక్స్ ఆథెంటిక్‌గ వుండాలె | 175 |
| జంద్రల్‌గ | 177 |
| ప్రొఫైల్ | 179 |
| రవానీ...(జీవిత ప్రయాణం) | 183 |

# కోల్పోయిన చివరి సంతకం

నిజానికి జయశంకర్ సార్‌ని 22-6-2011న ఉదయం కలవాల్సి వుండె. ప్రధాన వుద్దేశం నేను తలపెట్టబోయె పుస్తకాన్ని ఫైనలైజ్ జేసుకోవడం, దాంతోపాటు పుస్తకం బ్యాక్ కవర్‌పేజీ కోసం శంకర్ వేసిన బొమ్మమీద సంతకం తీసుకోవడం.

మధ్య మధ్యలో సార్‌ను కలుస్తూనే, కలవనప్పుడు ఫోన్‌లో రెగ్యులర్ కాంటాక్ట్‌లో వుంటూ, ఆరోగ్యం గురించి తెలుసుకుంటూనే (బ్రహ్మం ద్వారా)  వున్న. ఆ క్రమంలో సార్ ఈ లోకాన్ని విడిచిపోయే ముందు రోజు రాత్రి 9.30 ప్రాంతంలో ఫోన్‌లో బ్రహ్మంతో మాట్లాడిన. 'సార్ ఎవర్ని కలవడం లేదు ఇపుడు, ఈ రోజే కె.యు ప్రొఫెసర్లు ఇద్దరు వచ్చి కలిసింద్రు. మీరొక్కరే కాబట్టి రేపు ఎప్పుడైన రావొచ్చు' అన్నడు. మరుసటి రోజు సార్‌ని కలిసి చివరి సంతకం తీసుకోవాల్సి వుండె. అది అలాగే మిగిలిపోయింది.

ఒక సంవత్సరం ముందే జయశంకర్‌సార్ అనుభవాల్ని పూర్తి స్థాయిలో రికార్డు చేయాలనే అభిప్రాయం కలిగింది. 'ధర్మభిక్షం మాట ముచ్చట', 'నోముల సార్ అన్‌టోల్డ్ లెసన్స్' రెండు పుస్తకాలు పూర్తి అయిన వెంటనే మిత్రులతో చర్చించిన తర్వాత వచ్చిన ఆలోచన అది. తెలిసిన కొంత మంది జర్నలిస్టులు, రచయితలు, మిత్రులు, ఉద్యమకారుల సంభాషణలో తెలిసింది ఏందంటే సార్ ఆరోగ్యం బాగా లేదు, కలవడం కష్టం అని. కాని కలిసిన, ఎట్ల?

నేను జేసిన పనులే నా ధైర్యం. ఎవరి రికమండేషన్ లేకుండ డైరెక్టుగ హబ్సిగూడలో వారి ఇంటికి పోయిన. నన్ను నేను పరిచయం చేసుకొని నా ద్వారా వచ్చిన పుస్తకాలు ఇచ్చిన. నేను ప్లాన్ జేసుకొన్న మూడో పుస్తకం మీ అనుభవాలు రికార్డు జేయడమే నా పని అని ఓపెన్‌గ జెప్పిన. రెండు రోజుల తర్వాత ఫోన్ జేయమన్నరు. ఆ తర్వాత నాకు ప్రత్యేకమైన టైం కేటాయించింద్రు గంటల తరబడి. (అప్పటికే క్యాన్సర్ అని తెల్వడం, ట్రీట్‌మెంట్‌లో వుండి గూడా నాకు సమయాన్ని కేటాయించడము ఎప్పటికీ మరువలేను). సమయాన్ని కేటాయించడమే గాదు, పుస్తకం ఎట్లుండాలె, ఏ ఫార్మెట్‌లో రావాలె, ఎన్ని ఫోటోలు అవసరమో, ఇంతకు ముందు ఇచ్చిన పుస్తకాల్ని కూలంకషంగ అబ్జర్వ్ జేసి, కొలిచి కొలిచి సార్ 54 ఫోటోలు ఇచ్చిండు. చాలా ఫోటోలు ఇప్పటి వరకు ఈ ప్రపంచానికి తెలియనివి, ఒక్క బ్రహ్మానికి తప్ప. ఇక్కడొక విషయం గుర్తు జేసుకోవాలె. సార్ పుస్తకం

పూర్తి అవ్వొచ్చింది అన్నప్పుడు 'గౌడు!.. నేను పెంచుకొన్న బ్రహ్మం ఫ్యామిలీ  గురించి ప్రత్యేకంగ చెప్పాలె, ఎందుకంటే వాస్తవాలు తెలవాలె' అన్నరు.

తెలంగాణ చరిత్రలో ఒక కాన్సెప్ట్ కోసం పూర్తి జీవితాన్ని పణంగా బెట్టి పనిజేసిన సార్ అనుభవాలు రికార్డ్ చేసే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్న.

సార్ చనిపోయిన తర్వాత చాలా సంఖ్యలో వ్యాసాలొచ్చినయ్, కొన్ని పుస్తకాలు వొచ్చినయ్. ఐతే ఇప్పటి వరకు వచ్చిన ఏ రచనలో గూడ రాని అనుభవాలను, జ్ఞాపకాలను చిన్నవాడినైన నాతో పంచుకున్నరు. అవి సార్ భాషలోనే వస్తున్న పుస్తకం ఇది. ఒక మహావ్యక్తి నాకిచ్చిన అరుదైన అవకాశం.

ఒక పుస్తకం ఎట్లుండాలంటె అని సార్ చెపుతూ 'గౌడు! నేను ప్రతీది ఉర్దూలో ఆలోచించి, ఇంగ్లిష్‌లో రాసి, తెలుగులో మాట్లాడుత అనేవారు. నేను రాస్తే ఎట్లుంటది అంటె ప్రతి అక్షరం చెక్కినట్లు వుంటది. రాసే ప్రతి పదం చదివేవాళ్లను ఆలోచింపజేయాలె నా స్టైల్ అట్లుంటది'

జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవిత కాలం ఓపిక పట్టిండ్రు. నేను 'తెలంగాణను కండ్ల జూస్త' అని సాధికారికంగా చెప్పిన సార్ ఆ కల సాకారం కాకముందే కన్ను మూయడం మన దురదృష్టం. కాని తన 60 ఏండ్ల ఉద్యమ జీవన సారమంతా మనకందించి వెళ్లిపోయారు. సార్‌తో పాటు మన అందరి కల, ఆకాంక్ష తెలంగాణ సాధనే. సారిచ్చిన స్ఫూర్తి, ఆలోచన, అనుభవాలు చాల విలువైనవి. మన లక్ష్యం సాధించేవరకు మన  ప్రతి అడుగు, ఆచరణ 'వొడువని ముచ్చటే' అంతదాక సార్ మనతోనే ఉంటారు. తెలంగాణ ప్రజలు జయశంకర్ సార్‌కు అర్పించే నిజమైన నివాళి ఏందంటే రాష్ట్రం సాధించే దిశలో నిజాయితీగ, నిబద్ధతగా పనిచేయడం ఒక్కటే.

'వొడువని ముచ్చట' తెలంగాణ ఉద్యమంలో నడుస్తున్న ప్రతి విద్యార్థి, కార్యకర్తకు చేరాలన్నదే ప్రధాన ధ్యేయం. జయశంకర్ సార్ జీవితం, అనుభవాలు రాష్ట్రసాధనకు మరింత బలాన్ని ఇస్తాయని ఆశిస్తున్న.

- కొంపెల్లి వెంకట్‌గౌడ్

చరిత్ర రికార్డింగ్‌కు సహకరించిన మిత్రులు, పెద్దలు

ఆర్ కృష్ణయ్య (అధ్యక్షులు, బిసి సంక్షేమ సంఘం)

వర్దెల్లి మురళీగౌడ్ (ఎడిటర్,సాక్షి) సతీష్ కమాల్, టి. వెంకటేశ్వరాచారి (జీ న్యూస్ 24 గంటలు)

డా॥ నోముల సత్యనారాయణ, డా॥ కె. దామోదరరావు (కేయూ), కోరబోయిన కృష్ణమూర్తి (అసిస్టెంట్ ఎడిటర్ 'నమస్తే తెలంగాణ'), డా॥ అంబటి సురేంద్రరాజు, రమణ జీవి, కడెంపల్లి సుధాకర్‌గౌడ్

కవర్ డిజైన్ చేసిన జోశ్యభట్ల సుజిత్‌కుమార్, బ్యాక్ కవర్ డ్రాయింగ్ వేసిన పామర్తి శంకర్ గౌడ్ (కార్టూనిస్ట్, సాక్షి), అనుమల్ల గంగాధర్ (ఫోటో గ్రాఫర్)

మద్ది శ్రీధర్, మోహన్‌రుషి, వద్దుల వెంకట్‌రెడ్డి, దుర్గాప్రసాద్ అవధానం, కొంపెల్లి వీరబాబుగౌడ్

### ఈ చరిత్రకు రాళ్లెత్తిన ...

విరసనోల్ల శ్రీనివాస్‌గౌడ్(టిజివో), కనకమామిడి స్వామి గౌడ్(టిఎన్‌జీవో), మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ (తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్), సబ్బండ వెంకన్న, సినీ నటుడు హీరో సుమన్.

ఈ పుస్తకం రావడానికి ముఖ్య కారకులు నల్లగొండ జిల్లా నిడమనూరు మిత్రులు - గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, చాపల వెంకట్‌రెడ్డి, దివాకరుని శ్రీనివాస్‌శర్మ, సూదిని గోపాల్‌రెడ్డి, ఉన్నం శ్రీనుబాబు, ఉన్నంహరిబాబు, ఏటూరిశ్రీకాంత్, దంతాల శ్రీనివాస్(దేవరకొండ) తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి (చలకుర్తి)

జినుగు భిక్షం, బండారి ఎల్లన్నయాదవ్.

ఎం వెంకటరెడ్డి (రైల్వే వరంగల్), సంజీవ్ కుమార్ (సాఫ్ట్‌వేర్, యుఎస్ఎ), మరీదు శ్రీనివాస్ గౌడ్ (ప్రిజం మల్టీ మీడియా, హైదరాబాద్), డా॥ గోపగాని ఆనంద్

ప్రొఫెసర్ విద్యావతి (మాజీ వైస్ చాన్స్‌లర్ కేయూ)

ప్రొఫెసర్ నరేంద్రబాబు (కేయూ)

కంకట రాజారాం (తెలంగాణ యూనివర్శిటీ)

ఎర్ర యాదగిరి (ఫణిగిరి, నల్లగొండ జిల్లా)

సముద్రాల పృధ్వీ చక్రవర్తి (అడ్వకేట్), కొండా సప్తగిరి

నిరంతరం నా పనిలో సహకారం...



సోమగాని విద్యాసాగర్‌గౌడ్



వేనేపల్లి పాండురంగారావు



మాదు సత్యం గౌడ్



మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

# సిద్ధాంతకర్త అని ఎందుకొచ్చిందో నాకు తెలవదు

సిద్ధాంతకర్తఅని ఎందుకొచ్చిందో నాకు తెలవదు. ఇపుడు నన్ను నేను ఎప్పుడు సిద్ధాంత కర్త అనుకోలె, అనుకోనుగూడ. నన్ను నేను ఒక కార్యకర్తగనె భావిస్తాను. ఒక స్వచ్ఛంద కార్యకర్తను. ఏ రాజకీయ పార్టీలతోగాని, వేదికలతో గాని, అందులో సభ్యత్వం గాని అటు వంటిది ఏమీ లేదు. విద్యార్థి దశనుండి ఇప్పటి దాకా ఒక కార్యకర్తగ పనిజేస్తున్న. విద్యార్థిగ వున్నా, ఉద్యోగిగ వున్నా, టీచర్‌గ వున్నా పెద్ద పదవిలో వున్నా, లేకపోయినా రిటైర్ అయినా తెలంగాణ సమస్యతోనే నా జీవితాన్ని పెనవేసుకున్న కార్యకర్తను. అంతకు మించి ఏమి లేదు. ఈ సిద్ధాంతకర్త అనేది ఎట్ల వచ్చిందంటె.. చాలా కాలం కింద ఇవే ప్రశ్నలు! ఏమిటి, మీ పాత్ర ఏమిటి అని. నాకు ఏం పొజిషన్ లేదు, నాకు పాత్ర లేదు. పొజిషన్ అంటూ ఏమీ లేదు. తెలంగాణ గురించి అధ్యయనం జేస్తున్న. నాకు తోచిన విధంగ విశ్లేషిస్తున్న. తెలంగాణ గురించి ఎవరు పనిజేసినా వారితో మమేకమై పనిజేస్తున్న. వాళ్లపైన విశ్వాసమున్నంత కాలం  కలిసి పనిజేశాను.

కనుక.. ఈ ఇంగ్లిష్ మీడియా వాళ్లు, ఇంగ్లిష్‌లో ఒక పదం వుంది ఐడియలాగ్ అని. వాళ్లు ఎటూ తోచక తెలంగాణ ఐడియలాగ్ అని రాయడం చాలా కాలంగ మొదలుపెట్టారు. చాలా కాలంగ తెలంగాణ ఐడియలాగ్, తెలంగాణ ఐడియలాగ్ అని. ఎందుకంటే నేను స్టూడెంట్‌గ వుంటి, టీచర్‌గ వుంటి, వైస్‌ఛాన్సలర్‌గ వుంటి, ప్రిన్సిపల్‌గ వుంటి నా అఫీషియల్ పొజిషన్ అదే గదా! తెలంగాణకు ఒక పార్టీతో సంబంధం లేదు, కనుక ఇంగ్లిష్‌లో ఒకపదం వుంది ఐడియలాగ్ అంటె ఒక విషయం గురించి కాన్సెప్ట్ దాని భావం, దాని భావజాలం గురించి మాట్లాడడం ఐడియలాగ్ అంటరు.

కనుక.. తర్వాత 1996 వరకు ఎవరు రాసినా ఐడియలాగ్ అనే రాసేది. సరే స్టూడెంట్‌గ వున్నప్పుడు ఆ సమస్యలు రాలేదు. ఉద్యోగం జేస్తున్నప్పుడు రచనలు జేయడం, ప్రసంగాలు జేయడం, రీసెర్చ్ జేయడం కనుక తెలంగాణ విషయంలో స్టడీజేసే ఒక స్కాలర్‌గ అట్ల వచ్చిందన్నమాట. 1996 నుంచి మల్లీ నేను రిటైర్ అయిపోయిన తర్వాత ఫుల్‌టైం వచ్చినప్పటి నుంచి అందరికీ ఇదే సమస్య. ఈయనకు  ఏ పార్టీ  సంబంధం అది ఇది అని. నాకు ఏ పార్టీలు లేవు, పదవులు లేవు. అందరితో.. కాంగ్రెస్‌తో జేసిన, లెఫ్ట్‌పార్టీలతో జేసిన, బిజెపితో అందరితో కలిసి పనిజేసిన. ఐడియలాగ్ అనే పదం పడిపోయిందది. తర్వాత ఏంది.. 96 తర్వాత, 96నుంచి 2001 వరకు అనేక వేదికలతో కలిసి పనిజేసిన,

ఇంక అప్పటికి టిఆర్ఎస్ రాలేదు, అనేక వేదికలతో కలిసి పనిజేసిన. అసలు మొదలైంది స్వచ్ఛందంగ.. మేం 'తెలంగాణ ఐక్య వేదిక' అని నాన్ పొలిటికల్ అకడమిషన్స్ గ్రూప్ పెట్టుకున్నం. కేశవరావ్ జాదవ్, నేను అటువంటి వాల్లం పెట్టుకున్నం. ఓ స్వచ్ఛంద గ్రూప్‌పెట్టుకొని పనిజేసినం అంతె. 1996 నుంచి, 97, 98 వరకు చాలావరకు మేం జేసింది భావజాల వ్యాప్తి, నాన్ పొలిటికల్ గ్రూప్ అకడమిషన్స్ జేసినది. మేం చేసిన రచనలతో, తెచ్చిన సాహిత్యంతో చాలా భావజాల వ్యాప్తి జరిగింది. చివరికి అది ఏందంటె విదేశాల వరకు బోయింది.

1998-99లో నన్ను అమెరికా బిలిపించుకున్నరు, వాల్లు ఇక్కడ పత్రికలు జూసి. ఇదే ఎందుకు జెప్తున్న అంటె యాక్టివిటీ బెరిగింది. యాక్టివిటీ.. పదవేం గాదు. పదవిలేదు, పార్టీలేదు, వేదిక లేదు. తెలంగాణ గురించి మాట్లాడుతున్నం గనుక తెలంగాణ గురించి ఆలోచించేవాల్లు, తెలంగాణ గురించి తపించేవాల్లు తెలుసుకోవాలి. నేనిచ్చేది సాహిత్యమే, ప్రధానంగ దాంతోనె జరిగింది. ఇంతలో 'తెరాస' వచ్చింది. తెరాస పార్టీ సభ్యున్నిగాదు నేను. చాలా మంది అనుకుంటరు. ఎందుకు జేరలేదంటె.. నేను ఎన్నడు ఏపార్టీలో జేరలేదు. కాంగ్రెస్‌లో చెన్నారెడ్డితో కలిసి పనిజేయలేదా? చిన్నారెడ్డితో గలిసి పని జేయలేదా? పిడబ్ల్యుజితో గలిసి పనిజేయలేదా? జనశక్తితో.. అందరితో కలిసి పనిజేసిన ఎండ్ల చేరలేదు గదా?

కనుక తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపన విషయంలో నా ఇన్వాల్‌మెంట్ వుందిగని నేను మెంబర్ని గాదు. ఎందుగ్గాలేదంటె పర్పస్ ఏమిటి? పార్టీలన్నది పదవుల కొరకా, ఎన్నికల కొరకా, నా ఎజెండాలో అవి లేవు గద? తెలంగాణ కొరకు పనిజేసే ఏ వేదికైన, ఏ పార్టీ అయినా దానిమీద నాకు విశ్వాసం వుంది గనుక కలిసి పనిజేస్తం. ఐతే ఏమైంది చెన్నారెడ్డి అప్పుడు రెండు మూడేండ్లు అయింది, ఇంద్రారెడ్డప్పుడు రెండేండ్లయింది. సరే ఇవి వచ్చాయి జనసభ వచ్చింది. అవన్నీగూడ వన్ ఆర్ టూ ఇయర్స్‌లోనే పోయినయ్. కని మేం పనిజేసినం. తెరాస వచ్చినంక పదేండ్ల నుంచి వున్నదది. మేం అసోసియేట్ అయి పనిజేస్తున్నం సమితితో. తెరాసతో అసోసియేట్ అయి పనిజేయడం వేరు, తెరాస సభ్యులు గావడం వేరు. తెరాస విషయంలో కేసీఆర్ విషయంలో నాకు రెండు పార్శ్వాలు. ఒకటేందంటె తెలంగాణ యాక్టివిటీ, తెలంగాణ సమస్యను, తెలంగాణ ప్రజల్లోకి తెలంగాణ భాషను దీసుకపోవడం అనేది ఒక యాస్పెక్ట్. అందులో కేసీఆర్‌తో చాలా ఇంప్రెస్ అయ్యాను. నా ఇంట్రస్ట్ అంతవరకే. తెలంగాణ పొలిటికల్ యాక్టివిటీతో నాకు సంబంధం లేదు.

రాజకీయ పార్టీగ అన్ని రాజకీయ పార్టీలు ఎట్లనొ అట్లాగె వుంటుంది. యేదో ఐడియల్‌గ వుంటుంది అనుకోవటం అది సాధ్యమయ్యే పనిగాదు. పొలిటికల్ యాక్టివిటీ లేనిది గాదు. ఇక్కడేమిటంటే పొలిటికల్ యాక్టివిటీ లేంది ముందుకు బోలేం. మేం జీవితమంత జేసిన, ఒక దగ్గరబోయి ఆగినం. ఎందుకంటే పొలిటికల్ యాక్టివిటీ మేం జేయలేం గనుక. పొలిటికల్ యాక్టివిటీకి భావజాల వ్యాప్తి గావాలి. ఆ భావజాల వ్యాప్తిలోపల్నే మేం కార్య కర్తలుగ పనిజేసినం. దాని పొలిటికల్ యాక్టివిటీకి కాంగ్రెసోల్లకి హెల్ప్ జేసినం, చిన్నారెడ్డికి జేసినం అన్నిటికి జేసినం. అన్ని వేదికలు గూడ నా యాభై ఏండ్ల అనుభవంలో కొంత దూరంబోయి ఆగినయ్. ఇది ముందుకు బోయింది. పొరపాట్లు జరగొచ్చు, లోపాలుండొచ్చు అన్ని వుండొచ్చు గాని నిలబడ్డది. ఐతే తప్పకుండ వాల్లకు నేను సలహాలివ్వడం, సంప్ర దింపులుండొచ్చు. అది ఇచ్చే ప్రతి సలహా పాటించాలి అనేది అనుకోవడం అత్యాశ. సలహాలిస్తం, మనం ఇచ్చే ప్రతి సలహా కరెక్ట్ కానక్కర్లేదు. వాల్ల ఆచరణయోగ్యం కాక పోవచ్చు.

మొత్తం మీద ఏమిటంటె.. చర్చించడం లోపల వాల్ల పాలసీ విధానాలలో మా పాత్ర కొంత వుంటది. మేం చెప్పిందే వాల్లు వినాలంటె ఇగ వాల్లెందుకు? అది గాదు గద! ఇపుడు వాల్లకు చెప్పేటిది చెప్తం. రాజకీయావసరాలను బట్టి జేసుకుంటరు. ఇదే మయిందంటే వాల్లకు సలహాలివ్వడం, చాల సన్నిహితంగ వున్న. వ్యక్తిగతంగ కేసీఆర్ చాల రెస్పెక్ట్ ఇస్తడు. కనుక ఇపుడేమయింది పోయి పోయి నన్ను.. ఐడియలాగ్‌కు తెలుగు పదం ఏందంటె 'సిద్ధాంతకర్త' అని ఎవరో మీడియావాల్లు ట్రాన్స్‌లెట్ జేసింద్రు అది మరి యెవ్వరు జేసింద్రో నాకు తెలవదు.

నాకు దెలియదు, ఆనెస్ట్‌గ! అసలు ఫస్టఫాల్ సిద్ధాంతకర్త అని నేను అనుకోను. కనుక దాని గురించి పెద్దగ ఆలోచించలె. చాల సార్లు జెప్పిన, పబ్లిక్ మీటింగ్‌లల్ల జెప్పిన నేను సిద్ధాంతకర్తను గాదయ్యా అంటె పోవడం లేదు, వాట్ కెన్ ఐ డూ! పోయి పోయి తెరాస సిద్ధాంతకర్తను జేసింద్రు చివరకు. (పెద్దగ నవ్వు) ఏం చేయాలి నేను.

# ఎంత చిన్నగ మొదలైందో జూడు

ఒకటి.. నిజంగ కేసీఆర్‌కు నాకు పరిచయం 2000 కంటె ముందు లేనేలేదు. 2000 వరకు నేను జూడ్నే లేదు. నేను జెప్తి గద 96 నుంచి 2000 వరకు మేం మా పని జేసుకుంటు పోయినం. ఇంక అప్పటికి తెరాస రాలేదు. ఏం జరిగిందంటే.. అసలు ఇపుడు నడుస్తున్న ఉద్యమం ఎట్ల మొదలైంది, అంటె రివైవల్, పునరుద్ధరణ ఎట్ల జరిగింది? సరే 1952, 68 అవన్ని నడిసినయ్ గాని బ్రేక్స్ వచ్చినయ్ గద! ఈ పునరుద్ధరణ ఎప్పుడు జరిగింది. 27 అక్టోబర్ 1996 రోజు నిజామాబాద్‌లో కొంత మంది అడ్వకేట్స్ నాదగ్గరకి వచ్చిండ్రు. అంతకంటె ముందొచ్చిండ్రు. 27 అక్టోబర్ రోజు మీటింగ్ ఒకటి బెట్టిండ్రు వాళ్లక్కడ. మీరు రావాలె సార్, మాకు జెప్పాలె అంటె.. ఎందుకయ్యా మీకు ఇంట్రెస్ట్ అన్న. లేదు సార్ చాలా మంది మీరైతే మాకన్నీ జెప్పగలుగుతరు అన్నరు. అంటె నేను కొంత మంది ఫ్రెండ్స్ కలిసి నిజామాబాద్ పోతిమి. ఇరవై మంది యంగ్ లాయర్స్. దినమంత కూర్చుని జెప్పిన. స్టార్టింగ్ పాయింట్ ఎంత చిన్నగ మొదలైందో జూడు. ఎందుకో అది స్ప్రెడ్ అయింది. అది తెలుసుకోవాలె, చాలా.. స్ప్రెడ్ అయింది.

దానికితోడు ఏమైందంటే 'తెలంగాణ ప్రజా సమితి' అని ఒక పాత పార్టీ వున్నది, భూపతి కృష్ణమూర్తి తెలుసు గద! పాపం దాన్ని బట్టుకుని గూర్చున్నడాయన.. పెద్దమనిషి. ఊరికె అట్ల కాపాడుతున్నడాయన. ఆయన ఏమన్నడంటే వరంగల్‌లో సదస్సు బెడదాం. ఫస్ట్ నవంబర్, ప్రతిసారీ ఫస్ట్ నవంబర్ ఆయన పెడుతుంటడు. 1996 ఫస్ట్ నవంబర్ నాడు పెడదాం, కొంచెంపెద్ద ఎత్తున జేద్దామంటె.. నేను, కాళోజి నారాయణరావు, జస్టిస్ మాధవరెడ్డి ముగ్గురం మాట్లాడతమని జెప్పినం. అది ఫస్ట్ నవంబర్ 1996 రోజు. ఐతె వరంగల్‌లో చిన్న హాల్లో, ఓ రెండొందల మంది కూర్చునె హాల్లో మీటింగ్ బెట్టినం. మీటింగ్ రోజు లోకల్ పేపర్లో ఏదో చిన్నమ్యాటర్. మీటింగ్‌కి ఐదువేల మంది వచ్చిండ్రు. ఎక్స్‌పెక్ట్ చేయలే మేం. మాకే ఆశ్చర్యమేసింది. నిండిపోయింది బయటంత, హాలంత! నేను, జస్టిస్ మాధవరెడ్డి, కాళోజి నారాయణరావు ఇంక చాల మంది పాత వాల్లు వచ్చి మాట్లాడుతున్నరు. దినమంత నడిచింది. ఆ రోజు వుపన్యాసాలన్నీ మొత్తం ప్రెస్‌లో బాగా హైలెట్ అయినయ్. దానిమీద తెల్లారి చంద్రబాబు నాయుడు రియాక్షన్, ఇదేం మీటింగ్ అని! మూలం జెప్తున్న, పునరుద్ధరణ ఎట్లజరిగింది అని. చంద్రబాబు నాయుడు ఒక స్టేట్‌మెంట్. వేర్పాటువాదం సహించను, తెలంగాణకు అన్యాయమంటూ జరుగుతే సవరించే ప్రయత్నం చేస్తం గాని, వేర్పాటువాదం వస్తే ఉక్కు పాదంతో అణచివేస్తాను

అని ఆయన మాటలు. నా పుస్తకంలో రాసిన.. ఉక్కుపాదంతో అణచివేస్తాను అని. దాంతోని కొంత ప్రొవోక్ అయింది. ఇగ వరుసగ మీటింగులు మొదలుపెట్టినం. హైదరాబాద్, అక్కడ, ఇక్కడ! చంద్రబాబునాయుడు ఆ స్టేట్‌మెంట్‌తోని చాల మంది అలర్ట్ అయ్యింన్రు. మరి ముందుకు బోవాలె గదా ఏం జేయాలి? అపుడు అదే సందర్భంలో ఏమైంది అంటె.. నేను జెప్పేది 1996 నవంబర్ సంగతి. నా ఉపన్యాసాలు విన్నవాల్లు, పేపర్లు జూసి కొంత మంది వచ్చి ఇంక ఎక్కువ మీరు వుపన్యాసాలివ్వాలె, పుస్తకాలు రాయాలె.. వెనుకట రాసిన గాని కొత్తగ రాయనీకి మల్ల గ్యాప్ వచ్చింది.

# నేను ఎక్స్‌పెక్ట్ జేయలె

మల్లెపల్లి లక్ష్మయ్య తెలుసుగద. వాళ్ల వెంకటరాజం మెమోరియల్ ట్రస్ట్ తరఫున ప్రతి సంవత్సరం వొక లెక్చర్ ఇప్పిస్తడు ఆయన. మల్లెపల్లి లక్ష్మయ్య వచ్చి సార్! ఈ సంవత్సరం మీరివ్వాలె అని అడిగితె మంచిది అని జెప్పిన. తెలంగాణ మీద మీరివ్వండి మీరివ్వండి కావాలంటె మీరు టెక్స్ట్ రాసిస్తే అంటె.. టెక్స్ట్ రాసిచ్చిన నేను. జనవరి 14 ఆ ప్రాంతంలో. లెక్చర్ రాసిచ్చిన ఆయన ప్రింట్ జేయించుకున్నడు. 'తెలంగాణలో ఏం జరుగుతోంది' టైటిల్. ఆ టైటిల్ గూడ ఆయనె బెట్టిండు. ఆ పుస్తకానికి చాల ప్రాచుర్యం వచ్చింది! నేను ఎక్స్‌పెక్ట్ జేయలె. ఎన్నో ఎడిషన్స్ వచ్చినయ్ చిన్న పుస్తకం. అది జరిగిన తర్వాత మెల్లగ ఇవి వచ్చినయ్.. ఏవి? జనశక్తి వాళ్లది, పిడబ్ల్యుజి వాళ్లది, ఇంద్రారెడ్డి చాల వచ్చినయ్. కని మేం ఐక్యవేదిక నాన్ పొలిటికల్ ముగ్గురం నల్గురం యేర్పాటు జేసుకున్నది.

# ఇదేం గుసగుస గాదు

ఇగ రాయడం, చేయడం, ఉపన్యాలివ్వడం. ఏం జరిగిందంటె.. అప్పుడు 1998 వచ్చింది. 98లో ఏం జరిగిందంటె ఆదిలాబాద్‌లో కలరా ఇన్సిడెంట్. చంద్రబాబునాయుడు కాలం. ట్రైబల్స్, కలరా ట్రీట్‌మెంట్ లేక చనిపోవడం. మేమంతా వరంగల్ నుంచి ఫ్యాక్ట్ ఫైండింగ్ గ్రూప్ బోయి స్టడీ జేసి రిపోర్ట్స్ ఇవ్వడం జరిగింది. ఆ రిపోర్ట్స్ అన్నీ గూడ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో రిపోర్ట్ అయినయ్.

యుకె, యుఎస్ఎలో అపుడు ఏం జరిగింది? నేను నా పర్సనల్ పనిమీద అమెరికా పోయివుండింటి. పోతే కొంత మంది స్టూడెంట్స్, ఫ్రెండ్స్ వాల్లంత సార్ మీరు వస్తున్నరు గదా! ఏంది ఈ కలరా సంగతి ఏంది? మీరు రిపోర్ట్ రాసింన్రు గదా? పేపర్లో వచ్చింది. మాకు జెప్పాలె సార్ అన్నరు. నేను న్యూయార్క్‌లో దిగంగనె వొక మీటింగ్ బెట్టింన్రు. ఆ రోజు కేవలం కలరా గురించి జెప్పిన. దాంట్లో అప్పుడేంది.. అంతకు ముందు చంద్రబాబు నాయుడు అది విజన్ 20-20 ఇదెంత పెద్ద స్వర్గతుల్యమైందో జెపుతు ఆయన అట్ల అంటడు, ఇట్ల అంటడు మొత్తం ఆయన ఏం జేస్తున్నడు, ఏం జరుగుతుందో జెప్పిన. తర్వాత.. అయితే ఆ రోజు ప్రధానంగ జెప్పింది నేను కలరా గురించె, గాని తెలంగాణ ఇష్యూ వచ్చింది. అయ్యేటప్పటికి చాలా మంది ఇంత ఘోరంగ వుందా సార్, ఇట్ల గాదు మీరు మల్లొకసారి రావాలె చాలామందిని పిలుస్తం అంటె, నేను రెణ్ణెల్లు బోయుంటిని.

జనవరి 1999లో న్యూయార్క్‌లో మీటింగ్‌బెట్టి చుట్టుపక్కల రాష్ట్రాల్లో వున్నటువంటి చాలా మంది తెలంగాణవాల్లను పిలిపిచ్చి ఒక మీటింగ్ బెట్టింన్రు. ఒకరోజంత నాతోని మాట్లాడిచ్చింన్రు. ఒకరోజు మొత్తం తెలంగాణ గురించె క్వశ్చన్స్, ఆన్సర్స్. వాల్ల ఇంట్రస్ట్! మరి మేం ఏం జేయాలె సార్, ఏంది అంటె.. ఏముంటది మీరు ఇంట్రస్ట్ జాయించాల అని జెప్పిన.

అపుడు వాల్లు 'తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం' అని ఒక సంస్థను స్థాపించింన్రు. అమెరికాలో అది చాలా స్ప్రెడ్ అయ్యింది టిడిఎఫ్. అది ఇక్కడ బాగా ప్రచారం వొచ్చింది. ఇండియాలో కూడ బాగా ప్రచారం వొచ్చింది. అయిన తర్వాత ఏందంటె.. ఇట్ల గాదు సార్! మీరు మొత్తం అమెరికాలో చాలా స్టేట్స్‌లో తిరగండి అన్నరు. 2000లో నన్ను బిలిపించుకొని పది సిటీస్‌లో లెక్చర్ టూర్ మొదలుపెట్టించింన్రు నాతోటి. నాతోపాటు జనార్ధనరావు వచ్చిండు అపుడు. తెలుసుగద జనార్ధనరావు? టెన్ సిటీస్‌లో రెణ్ణెల్లు

విస్తృతమైనటువంటి ప్రచారం వచ్చింది. అపుడేం జరిగింది? అదే సమయంలో ఏం జరిగిందంటె.. తెలంగాణ కాంగ్రెస్ వాల్లందరు 41 మంది ఎమ్మెల్యేలు సోనియాగాంధీకో రిప్రజెంటేషన్ ఇచ్చింద్రు. ఆమేదో ఒక కమిటీ వేసింది. అదే ప్రణబ్‌ముఖర్జీ కమిటీ. ఎవరన్నా వచ్చి మీరు మీ వాదన వినిపించండి అని జెప్పింద్రు. ఆ కమిటీలో మన్మోహన్ సింగ్ గూడ వుండె అపుడు. మన్మోహన్‌సింగ్‌కు నాకు పాత పరిచయం ఒకటుంది అది వేరు విషయం. మరి ఎవరన్న వచ్చి వినిపించాలి అంటె అపుడు రాజశేఖరరెడ్డి అనుమతి తోనే బోయింద్రు గదా వీల్లు! ఎవరు వినిపించాలె, ఎవరు వినిపించాలె అని తర్జనభర్జన జేసుకొని, జయశంకర్ అయితే మంచిగుంటది అని నా దగ్గరికి పొన్నాల లక్ష్మయ్యను పంపింద్రు.. ఇంటికి, వరంగల్‌కు. పరిచయమే బాగా. మరి నేనేం కాంగ్రెసోన్ని గాదు, ఎమ్మెల్యేను గాదు, నేనెట్ల జెప్పాల్నయ్యా అంటె, లేదుసార్ మీరైతె బాగా జెప్తరు అన్నడు. మంచిది తెలంగాణ గురించి నీ మాటగ నా నోట జెప్పిస్తే తప్పకుండ వస్త అన్న.

17 అక్టోబర్ 2000 రోజున ఢిల్లీ, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆఫీస్‌లో ప్రణబ్‌ముఖర్జీ కమిటీ ముందు నేను రెండున్నర గంటల సేపు వాదించిన అఫీషియల్‌గ. ఇదేంటి.. ఇదేం గుసగుసగాదు. తెలంగాణ నుండి రెండువందల మంది సీనియర్ లీడర్స్, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు, కాబోయె వాల్లు, అయిన వాల్లు, ఆల్ సీనియర్స్! టూ అండ్ హాఫ్ అవర్స్ వాదించిన. గివె.. ఇవే సమస్యలు.

# నేను ఇంప్రెస్ అయ్యింది ఏందంటె

ప్రణబ్‌ముఖర్జీ కమిటీ మీటింగ్ జరిగిన తర్వాత.. అపుడు కేసీఆర్ వచ్చిండు మిమ్మల్ని గలవాలె సార్, తెలంగాణ గురించి మాట్లాడాలె అని. కేసీఆర్ తెలుగుదేశంలో డిప్యూటీ స్పీకర్ గదా? నా గురించి తెలుసుకున్న తర్వాత, విన్న తర్వాత.. మీ గురించి కాన్‌స్టెంట్‌గ వింటున్నం, చాలా మంది జెప్పిండ్రు, మిమ్మల్ని గలుసుకోవచ్చా అంటె.. ఒకరోజు గలిసినం. ఫస్ట్ డేనె దాదాపు డే అంత గూర్చున్నం. ఆయన అడుగుడు, నేను జెప్పుడు! నేను ఇంప్రెస్ అయ్యింది ఏందంటె, ఆయన లోతుకు బోయి అడిగేది. మిగతా వాల్లు ఎవరైన లోతుకు బోయేవాల్లు గాదు. విశ్లేషించి, దాన్ని ఇట్ల ఎందుకు గాదు, అట్ల ఎందుకు గాదు, క్రిటికల్‌గ.. మనం జెప్పిందె వినడంగాదు క్రిటికల్‌గ చర్చించేటోడు. అది నేను చాల ఇంప్రెస్ అయిన! ఎందుకంటె మనిషికి విషయ అవగాహన వుంటె గనుక ఆ క్వశ్చన్స్ వస్తయ్ లేకపోతే రావు. పోతె జూస్తుంటె ఆయన భాష.. ఆయన తెలంగాణ ప్రజల భాషలో చెప్పేటువంటి ఆ లక్షణాలు కనబడ్డయ్ నాకు. విషయ అవగాహన వుండి తెలంగాణ ప్రజల్లో తెలంగాణ ప్రజల భాషలో నుడికారంలో తీసుకపోయేటువంటి వ్యక్తిని మొదటిసారి జూసిన నేను, నా 50, 60ఏండ్ల అనుభవంలో. నన్ను ఇంప్రెస్ జేసింది అదే. విషయం అడ్డగోలుగ మాట్లాడడు ఆయన. అన్‌లెస్ హి స్టడీస్. ఆయన ఇట్ల గూడ అంటడు.. అకడమీషన్ మీరిట్ల జెప్తే, నేను పార్టీగ ఇట్ల జెప్పాల్సి వస్తది. ఇపుడు, అకడమీషన్ జెప్పే పద్ధతులతో జెప్తం. పార్టీ విషయంలో ఇపుడు నేను జెప్పేది ఆయన జెప్పడం తేడా వుంటది. సార్ మీరు జెప్తే అట్ల జెప్తరు, నేను జెప్తే ఇట్ల జెప్పాల్సి వస్తది అంటడు. దేర్ వజ్ లాజిక్ ఇన్ దట్.

అయితే ఏమిటి? మేం అకడమిక్‌గ జెప్పేది, ఆయనకు ముడిపదార్థం అయినపుడు దానికి లెజిటమసి వస్తుంది. పొలిటికల్‌గ మేం పోలేం. పొలిటికల్ పరిభాష మాకు రాదు. మేం జెప్పేదాంట్లో సబ్‌స్టెన్స్ వుంటుంది. ఆ సబ్‌స్టెన్స్‌ను పొలిటికల్ భాషగ మల్చాలి. కనుక ఒక అవుట్‌లెట్ దొరికింది. ఇంతకు ముందు చెన్నారెడ్డి, అందరికి జేసిన గాని ఈయనలో వున్న ప్రత్యేకత నాకెక్కడ గూడ కనబడలేదు. కనుక ఏందంటె ఒక ఇన్‌స్ట్రుమెంట్ గావాలె, ఒక సాధనం తెలంగాణ భావజాల వ్యాప్తికి. రాజకీయ ప్రక్రియద్వారా తేవాలను కున్నడు. ఆయన ఇదే అన్నడు. సార్ మీ రెంతో కష్టపడ్డరు, లైఫంత కష్టపడ్డరు, పొలిటికల్ ప్రాసెస్ లేంది కాదిది. పొలిటికల్ ప్రాసెస్ కావల్సిందే. మరి ఇట్స్ ఎ ఫ్యాక్ట్. లైఫంత

జేసిన ఏం గాలెదు గద. గవే విషయాలు కొత్తగ ఏం లేదు గద? ఒక దగ్గర ఆగినం. మా పరిమితులవి. కనక ఆయనలో తెలంగాణ సమస్య గురించి అర్థం జేసుకొనేటువంటి ఆ పట్టుదల, తపన, ఆర్టిక్యులేషన్ అంటె, విశ్లేషణ నన్ను చాల ఇంప్రెస్ జేసినయ్. ఇంకె వరిలో జూడలె నేను, అంటె ఆ స్థాయిలో. పొలిటికల్ ప్రాసెస్ అంటె పట్టించుకోలె, ఎందుకు పట్టించుకోలె అంటె పొలిటికల్ ప్రాసెస్ అనేది వేరు విషయం. ఇది లేంది అది లేదు, అది లేంది ఇది లేదు. అది నాతోగాదు కనక ఆ ప్రాసెస్‌లో రిఫైన్ జేయడానికి ఈయన నాకు ఉపయోగపడతాడనె దాంతోటి ఆయనతోటి అసోసియేట్ అయిన.

రెండవది పొలిటికల్ నిర్ణయాలల్లో టిక్కెట్లు ఎవరికి ఇవ్వాలె, ఎవరికి వద్దు విషయాల్లో నేను ఎన్నడు ఆసక్తి చూపలె, నాకైతే ఆసక్తే లేదు. ఎవరైన గని గంతే. వచ్చినోడు, రానోడు నా దృష్టిలో అందరు ఒకటె. జెప్తున్న గద! కనుక అందులో నేను జేసేది ఏం వుండదు. కొంత మంది మంచిగున్నరు, లిమిటెడ్ నెంబర్ వున్నరు అంతె. బై అండ్ లార్జ్. మరి ఎక్స్‌పెక్ట్ గూడ జేయలేం. మరి అదిగూడ గావాల్సిందె గద పొలిటికల్ ప్రాసెస్‌లో ఆ సరుకు గావాల్సిందె, లేంది నడవదు. కనక బ్యాలెన్స్ గనబడ్డది నాకు. కనకనే పదేండ్లు నిలిచింది ఇది. నా తృప్తి ఏందంటె, పదేండ్లు నిలిచింది. పొరపాట్లయినయ్, ఒడిదుడుకులొచ్చినయ్, విమర్శలొచ్చినయ్ అయినా నిలిచున్నది. రెండవది నా మీద ఒక అభియోగం.. కేసీఆర్‌నే ఎందుకు బట్టుకొని వున్నవు? అంటె నాకు ప్రత్యామ్నాయము ఏమిటి? నాకు ప్రత్యామ్నాయము కనబడటంలె, చూపించండి? ప్రత్యామ్నాయాల కొరకు చాల ప్రయత్నాలయినయ్, ఏది నిలవలె. నేను జెప్పిన పాజిటివ్‌గ బోండి అని. కేసీఆర్‌కు ప్రత్నామ్నాయంగ దేవేందర్‌గౌడ్ జేసిన ప్రయత్నం జూసింర్రు గద. నేను జెప్తి గద ఆరోజే స్పష్టంగ జెప్పిన.

కేసీఆర్‌ను కరెక్ట్ జేయాల్నంటె.. ఆల్టర్నేటివ్ ఎమర్జ్ గాలేదు. అదొక్కటే గాదు చాలవచ్చినయ్. ఎంతమంది రాలేదయ్యా విప్లవ పార్టీలతో వచ్చినవాళ్ళు ఏం జేసింర్రు. చెప్తున్న. బిలీవ్ జేయలేదు. ఆల్టర్‌నేటివ్ అనుకోలె, స్ట్రైనైన్ అనుకున్న. నేను జెప్పింది ఏందంటె అన్ని శక్తులు గలిస్తే బలపడతయ్. ఇపుడు దేవేందర్‌గౌడ్ విషయం.. ఆ రోజే జెప్పిన దేవేందర్‌గౌడ్ చాల పాత కాలం నుంచి, నేను జెప్పిన్నె అమెరికాలో మేం కలిసింది గూడ జెప్పిన అదే గద. ఆ బ్యాగ్రౌండ్ దెలవాలె నీకు. దేవేందర్‌గౌడ్‌తో నేను ఎందుకు అంత.. పౌరస్పందన వేదిక అని శంకరన్‌ది వొకటుండేది. నేనుగూడ అండ్ల వుంటిగద. ఆ డిస్కషన్‌లప్పుడు చంద్రబాబునాయుడి దగ్గరికి చాలా సార్లుపోయినం మేం అపుడు.

అంద్ల శంకరన్ వుండె, పొత్తూరి వెంకటేశరరావు వుండె, కన్నాబిరాన్ వుండె, హరగోపాల్ వుండె, సరే నేను. నేనెప్పుడు తెలంగాణ గురించే.. ఎక్కువ సబ్జెక్టు తెలంగాణ గురించె. జూన్ 2000లో ఒకరోజు ఒక మీటింగ్ అయింది ఏది? పౌరస్పందన వేదిక మీటింగ్ ఆయనతోని. మేం అందరం బోయినం. పోతే ఆయన కాస్త ఆలస్యంగ వచ్చి సారీ ఆలస్యంగ వచ్చాను, అట్ల ఇట్ల జెప్పి ఒక అబ్జర్వేషన్.. లేదండి యిప్పుడంత మన రాష్ట్రం చాల ప్రగతిపథంలో వుంది. ఇపుడు తెలంగాణ డెవలప్‌మెంట్ టేకాఫ్ స్టేజ్‌కొచ్చింది అని మొదలుపెట్టిండు. అంటె నేనన్న ముఖ్యమంత్రి గారు! మీరు ఎకనామిక్స్ జదువుకున్నరు, నేను గూడ కొద్దిగ ఎకనామిక్స్ జదువుకున్న. టేకాఫ్ స్టేజ్ అంటే పైకి ఎగిరేదా? అంటే అవును సార్ మీకు దెలవనిది ఏముంది?

అంటే మనం కిందికి బోతున్నం అని నేనన్న. (పెద్దగా నవ్వు) ఖంగుదిన్నడు. ఏమండి అట్ల అంటున్నరు అంటే నేను జెప్పిన మీ విజన్ ఇట్ల అయింది, ఇట్ల అయింది అని లెక్కలు బాగ చెప్పిన. స్టాటిస్టిక్స్‌ది ఏముందండి ఎవరికి తోచినట్టు వారు ఇంటర్‌ప్రెట్ జేస్తరు అంటే నేనన్న ఇంటర్‌ప్రెట్ జేయడంలేదు, మీ గవర్నమెంట్ జేసే స్టాటిస్టిక్స్ మీకు ఒప్ప జెప్తున్న. నేనేం యాడ్ జేయలేదు, మీరు ఇచ్చినయె మీకు వొప్ప జెప్తున్నఅన్న. నా దగ్గర రెడీ లేదు గాబట్టి ఇది మీకిస్తున్న అని జెప్పిన. లేలే మీరు రాసిపంపండి, అంటె మంచిది అన్న. అందులో దేవేందర్‌గౌడ్ వుండె, కడియం శ్రీహరి వుండె, యనమల రామకృష్ణుడు వుండె, చీఫ్ సెక్రటరీ మాధవరావు వుండె, డిజిపి దొర వుండె చాల మందివుండె, పెద్ద మీటింగ్.

ఎవ్వరు కుయ్,కయ్ అన్లే గని, ఎందుకో దొరకు కొద్దిగ తేలు కరిసినట్టయింది, డిజిపికి. ఏవండి మీరు జెప్పే ఫిగర్స్ అన్నీ అబ్సర్డ్, నిజంగనె తెలంగాణ అంత బ్యాక్‌న వుంటె ఈపాటికి విప్లవం వచ్చేది అన్నడు. అంటె నేనన్న ముఖ్యమంత్రితో ఏది అబ్సర్డ్ అండి మీ ఫిగర్సా అబ్సర్డ్? మీ ఫిగర్సే మీకు జెప్తున్న గద. నాఫిగర్స్ గాదు గద! ఆయన ఏమం టున్నడు.. తెలంగాణ నిజంగనె వెనుకబడి వుంటె ఈపాటికి విప్లవం వచ్చేదంటున్నడు. మా బాధేందంటె తెలంగాణ డెవలప్ గాలేదు, విప్లవం రాలేదు అని. మీ వల్ల డెవలప్ గాలేదు, ఆయన వల్ల విప్లవం రాలేదు అన్న నేను (పెద్దగా నవ్వు) యాక్చువల్‌గ నా పుస్తకంలో రాసిన ఇవన్నీ నేను. ఆ.. అట్ల గాదండి, మీరు రాయండి అంటే నేను రాసి పంపిస్త అన్న. తెల్లవారె లెటర్ రాసిండు. డిటైల్డ్‌గ అన్నీ రాసిపంపించండి అని. ఆ లెటర్ గూడ పబ్లిష్ జేసిన పుస్తకంలో. తర్వాత నా అమెరికా లెక్చర్ టూర్‌కు పోయిన.

పోయినపుడు స్టేట్ గవర్నమెంట్ తరఫున దేవేందర్‌గౌడ్ వచ్చిండు. ఇన్సిడెంట్ చెప్తున్న. అక్కడ నాతోటి లెక్చర్స్ పెట్టించ్చింద్రు. అట్లాంటాలోని 'ఆటా' కాన్ఫరెన్స్, పెద్ద మీటింగ్ అవుతోంది. అక్కడోల్లు నోటిఫైడ్ వచ్చినోల్లు వస్తరు. పెట్టి నేను, జనార్థనరావు మాట్లాడినం. మాతోటి మెల్లగ హాల్లోకి వచ్చిండు. ఎవరు గుర్తుపట్టలేదు, నేను చెప్పిన స్టేజి మీద కూచో బెట్టిన. నేను అన్నీ మాట్లాడిన తర్వాత దేవేందర్‌గౌడ్ మాట్లాడుకుంటూ సార్ జెప్పిన యన్నీ అండ్ల కొత్తేమీ లేదు, అంత ఫ్యాక్ట్సే. ఇంకేమన్నడంటె, ఒక జీపు తీసుకొని ఆంధ్ర ఏరియాలో ఒకరోజు తిరిగితే, తెలంగాణ దుస్థితి, ఇవన్నీ కనబడతయ్ కండ్లకు కట్టినటు అంటే అందరు చప్పట్లు. దీనికి మెయిన్ కారకులు కాంగ్రెస్ గవర్నమెంట్, దాన్ని రెక్టిఫై జేసే ప్రయత్నం జేస్తం అట్ల ఇట్ల అంటె ఓ.. అన్నరు వాల్లు.

మీటింగ్ అయినంక నాతోటి సార్ మీరిట్ల మాట్లాడుతుండాలె, మా హ్యాండ్స్ స్ట్రైటెన్ అయితయ్. మేం చేయించుతం, మీరిట్ల మాట్లాడుతుండాలె అన్నడు. దేవేందర్‌గౌడ్ మీ చేతులు స్ట్రైటెన్‌కు మేం నోరుపారేసుకోవాల్నా, మీకు దెలవయా అయన్నీ? ఇట్లనె అన్న నేను. అట్లగాదుసార్ మాకుండె పరిధులు మాకుంటయ్‌గద అంటె.. చెయ్యండి, ఆలోచిం చండి మంచిది, సంతోషం అన్న. అప్పటి నుంచి చాలా కాలంగ ఈ తెలంగాణ గురించి ఏ విషయం గావాలన్న నన్ను అడిడేది, చెప్పేది నేను.

# స్టైనైన్ అవుద్ది అనుకున్న

సరె నడుమ ఈయన గురించి కేసీఆర్.. కేసీఆర్‌తోటి పార్టీలో కలవమని జెప్తున్నామయ్యా నేను. కలుస్తే నీ సంగతి ఏంది జెప్పమంటున్నం. కేసీఆర్‌తోటి కలువుమని నేనెప్పుడు జెప్పలేదు. నేనే జేరలేదు. మందికెట్ల జెప్త నేను. చేర్తె నాకభ్యంతరం లేదు, చేరకపోయినా మీరు చెయ్యండి, కని ఈ పోటా పోటీ విమర్శించుకోడం వద్దు అని జెప్పిన. ఇగ చాలా కాలం ఆయన కన్సల్ట్ జేస్తే ఏం జేయలేదు. ఈయన బయటికి వచ్చేముందు ఇండికేషన్ ఇచ్చిండు. ఇచ్చినపుడు కేసీఆర్ మీద డిస్కషన్ జేయలె. వస్తున్నపుడు వెల్‌కమ్ జేయాలె. కేసీఆర్‌తోటి అన్న వెల్‌కమ్ జేయాలె అని. ఆయన అనౌన్స్ జేయగానె కేసీఆర్ వెల్‌కమ్ జేసిండు.

నా ముందే టెలిఫోన్‌లో దేవేందరన్నా! నువ్వొచ్చి పార్టీ ప్రెసిడెంట్ తీసుకో, నేను జయశంకర్ సార్ మాదిరి స్వచ్ఛందంగ పనిజేస్త అన్నడు. సిన్సియరా, సీరియసా అది వేరు విషయం. పబ్లిక్‌గ జెప్పిండు, నువ్వొచ్చి పార్టీ పదవి దీసుకో, నేను కార్యకర్తగ సార్‌తో పాటు పనిజేస్త అని. అయిన తర్వాత నేను విద్యాసాగర్‌రావుగారు కలిసి ఏం జరిగిందో జెప్తి గద. ఆయన స్టార్టింగ్ నెగెటివ్ స్ట్రాటజీ టిఆర్ఎస్‌ను ఖతం జేయడమె ఎజెండగ బెట్టుకున్నడు ఇంకేం లేదు. ఇగ దూరం వెల్లిపోయిన నేను. నేను స్టైనైన్ అయిద్ది అనుకున్న. రెండుమూడు కారణాలు. ఒకటేంటంటె కేసీఆర్ మీద వున్న విమర్శ తగ్గొచ్చు, ఒక సామాజికవర్గంలో ఒక ఇంపార్టెంట్ సెక్షన్ మనిషొస్తుండు అనుకున్నం. మాలాంటి వాల్లం మధ్యవర్తిత్వంతోటి సెట్ అవుదమనుకుంటె ఆయన అసలు వచ్చుడే నెగెటివ్ దాంతోటి వచ్చిండు. నేను ప్రత్యామ్నాయం అనుకోలేదు, స్టైనైన్ అవుద్ది అనుకున్న.

తర్వాత ఏమిటి.. రకరకాలు వచ్చినయ్ గద. ప్రత్యామ్నాయం అంటె తిట్టుడే గాని, ప్రత్యామ్నాయం ఎక్కడుందయ్యా? చెయ్యండి మీరు జేస్తే ఎవరొద్దన్నరు. పోతే జయశంకర్ అక్కడనుంచి పోతే అక్కడ కుప్పకూలేది ఏం లేదు. బయటికొస్తే పెరిగేదేం లేదు. జయ శంకర్ చాతనయినంత చేస్తుండయ్యా. నేను జేసిన్నని మిమ్ముల్ని జెయ్యమంటున్ననా? జెయ్యమనలేదు గద. మీరు మంచిగ జేస్తె మీతోనేవస్త. నేను జనసభతో కలిసి పనిజేయలె? జనసభతో పనిజేసి ఎంత నలిగిపోయిన్నో చాలా మందికి తెలియదు. చాల నలిగిపోయిన నేను. ఎందుకు జేశా? కాజ్ కోసం జేశా. ఎన్ని లొసుగులున్న, ఎన్ని పొరపాట్లు జరిగినా,

ఏం జరిగినా నా దృష్టిలో తెలంగాణ వుద్యమాన్ని ఇంత సుదీర్ఘ కాలం నిలబెట్టినటువంటి వ్యక్తి కేసిఆర్ అనడంలో సందేహం లేదు. ప్రత్యామ్నాయం ఎమర్జ్ గాలేదు. అది డిజప్పాయింట్‌మెంట్. పెద్ద డిజప్పాయింట్‌మెంట్. తెలంగాణలో ఎవరైనా పొలిటికల్ పార్టీ పెట్టినపుడు తన కమ్యూనిటీని ఓన్ జేసుకోవాలి, తప్పక కలుపుకొని పోవాలె. రెండూ జేయలె ఆయన!

# నాకు చేతనైంది చేస్తనయ్యా

ఇపుడు ఇక్కడ కేసీఆర్ విషయం వచ్చినపుడు విమర్శ ఏదొస్తుందో వాస్తవాలు జూద్దాం. రామారావుగాని, హరీష్‌రావుగానీ, కవిత గాని ఎంత సమర్థులు! ఆయన పిల్లలు గావడమె హ్యాండీక్యాపా? చెప్తున్న. మిగతావాల్లని ఎమర్జ్ అవడాన్ని ఆపింర్రా ఎవరన్నా. నేనిదే అంట, మిగతావాల్లని ఎమర్జ్ అవడాన్ని ఆపింర్రా? రాజేందర్ ఎమర్జ్ అయ్యిండు, ఎవరాపింర్రు? ఒక బిసి ఎన్ని హ్యాండీకాప్సున్నా ఎమర్జ్ అయ్యిండు, ఒప్పుకున్నరు. సమానంగ ఎమర్జ్ అయ్యిండు. ఎంతమంది, 25 మంది ఎమ్మెల్యేలు అయ్యింర్రు, ఎంపి లయ్యింర్రు. ఎవరు ఎమర్జ్ అయింర్రయ్యా? ఎవరాపుతరు. ఇపుడు ఈ పిల్లలు స్టడీ విషయానికి వస్తే, ఏ డౌటున్న నా దగ్గర కూర్చోని మాట్లాడుతరు, తెలుసుకోవాలని. నేననేది అదే! తెలుసుకొని చాలా బ్రహ్మాండంగ మాట్లాడుతరు. వాల్లను నేనెట్ల ఎంకరేజ్ జెయ్యకుండ వుంట? ఇపుడు వాల్లు వెలమలా, కేసీఆర్ పిల్లలా ముఖ్యంగాదది. అరె సార్ ఏమిటి దొరలతో వున్నడు? అంటరు. దొరలతో వున్న నేను దొరనా? నేను దొరనా నయ్యా? మల్ల నాకు రెస్పెక్ట్ ఎందుకిస్తరు? తెలంగాణ గురించి వాల్లకు చెప్పగలుగుతున్న గనుక. లేకపోతె ఇవ్వరు మరి!

రెండోది ఏమైందంటె, ఈ దేవేందర్‌గౌడ్‌తో ఇంటలెక్చువల్ స్పిరిట్‌తో వున్నవాల్లు సగం మంది నాతో కలిసి పనిజేసినవాల్లే. నేనేం జేస్త! డిఫరెన్స్ వచ్చినా దూరం వుంట నేను విమర్శించను. ఎవ్వరిని విమర్శ జేయను. ఎందుకు విమర్శ జేయనంటె.. వాటీజ్ ది పర్పస్? ఎవరికి దోచింది వాల్లు జేస్తరు. కాలం నిర్ణయిస్తది, ఎవరి పాత్ర ఏంది కాలం నిర్ణయిస్తది. నన్నెవ్వరు విమర్శించిన గాని, ప్రతి విమర్శ జేయను నేను. ఎందుకంటె నాకు చేతనైంది చేస్తనయ్య. తప్పైతె తప్పు, ఒప్పైతె ఒప్పు. నేను జేయడం వల్లనె కొంపలు మునుగుతయా? లేకపోతె నేను జేయడం వల్లనె బంగలాలు వస్తయా? నాకు తోచిన విధంగ జేస్తన్న. ఏముంది నాకు, గుర్తింపు ఎందుకొచ్చింది. నాకు తోచిన విధంగ జేస్తున్న గనుక గుర్తింపు వున్నది. గుర్తింపైతె వున్నది గదా, నాకు వేరే ఏం లేదు గదా? నాకదే, నా బలం అదే. కేసీఆర్ నుంచి బయటికి రా బయ్ అంటరు. నేను లోపలుంటె గదా బయటికి వచ్చేది. బయటనే వున్నగద, లోపల ఎక్కడున్న! (పెద్దగా నవ్వు)

## నా అడ్వాంటేజ్ గదే!

మూడు భాషలు తెలిసి వుండటం తెలంగాణ కాంటెక్స్ట్‌లో చాలా అవసరం. తెలంగాణ ఈ లింగ్విస్టిక్ బ్యాక్ గ్రౌండ్ కల్చర్‌లోపల. ఇక్కడ ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ మూడు భాషలొచ్చినోల్లున్నరు. నా అడ్వాంటేజ్ గదే. అద్భుతమైన మేధావులున్నరు. నా అనుభవంఅదే. నేనెక్కడ బోయిన ఆ ప్రజలతో కమ్యూనికేట్ జేస్త. ముస్లిమ్స్ గ్యాదర్ జేసిన మీటింగ్‌లో మేం మాట్లాడినట్టు, ఏ ఆంధ్రోళ్లైన మాట్లాడగలుగతరా? ఒకటి.. భాషతో పాటు మా బ్యాక్ గ్రౌండ్, కమిట్‌మెంట్. పర్సన్ టు పర్సన్ మాట్లాడినప్పుడు ఆ కల్చరల్ లెవల్ లోపల ఆ కాన్ఫిడెన్స్ రావడానికి భాష బాగా పనిజేస్తది.

చాలా చదువుతడు ఆయన, చాల విపరీతంగ జదువుతాడాయన (కేసీఆర్). చాలామంది ఆయన బెడ్ రూంలో కెల్లి పన్నెండు గంటల దాక రాడు అంటరు. ఆయన మార్నింగ్ లేచి పేపర్లన్నీ జదవందె బయటికి రాడు. నాకు ప్రత్యేకంగ తెలుసుగద. మొత్తం న్యూస్ ఛానెల్స్ జూసి, పేపర్లు జదివి, బుక్స్ జదివి, అన్నీ తయారు జేసి, స్నానం జేసి, లంచ్ వరకు బయటికొస్తడు. అందరేంది? తాగుతడు, పొద్దుబోయేవరకు తాగుతడు, పడుకొంటడు పొద్దుగాల లేవడని జనరల్‌గ అపవాదు వుంది ఆయన మీద. పర్సనల్ హ్యాబిట్స్.. తాగంది, జేయంది ఎవడు వుండడు గాని ఎగ్జాజరేషన్ ఎక్కువ. ఎందుకని ఎగ్జాజరేషన్ అయిందంటె.. నేను తెలిసి జెప్తున్న గద. ఈయన కంటె ఎక్కువ తాగేటోల్లని జూసిన నేను. ఈయన పబ్లిక్‌గ తాగుతడు వాల్లు, రహస్యంగ తాగుతరు గంతే తేడా. తేడా గంతె నేను జెప్తున్న గద!

ఇపుడు ఇక్కడ్నే చాల మందికి ఏమైందంటె.. ఆయన ఫ్యూడల్ అనే అంటరు గద. బ్యాగ్‌గ్రౌండ్ ఫ్యూడలే గద! ఆయన భోజన సమయానికి ఎవరున్నా, డ్రైవరా? లేక పోతె ఇంకా ఎవరైనా సరే కూర్చొని తినాల్సిందే, ఆయన తాగే సమయానికి ఎవడొచ్చినా ఆయన ఆఫర్ చేయాల్సిందే! ఎంతపెద్ద కాంట్రడిక్షన్ ఇది. లీడర్ని గలవాల్నంటే మూడు డోర్లు దాటిపోవాలె, అట్లగాదు ఓపెన్‌గ ఆఫర్ జేస్తడు. కని యిపుడు బంద్ జేసిండు వేరు విషయం, కని జెప్తున్న. తిండి దగ్గర, డైనింగ్ టేబుల్ మీద ఆయన ఒక్కడు కూర్చొని తినే అలవాటు లేదు. ఆ సమయానికి ఎవరున్న వాల్లు, వీల్లు అనే వివక్ష లేదు.

# స్వభావరీత్యా చాలా లిబరల్ మనిషి

ఉదారంగ హెల్ప్ జేస్తడు, హెల్పింగ్ నేచర్. ఇపుడు పొలిటికల్ పార్టీకి ఫండ్ రెయిజింగ్ అందులో వింతేముంది? ఎవడైన జేయాల్సి వస్తది. కని ఖర్చు బెడతడు. పొలిటికల్‌గ రెయిజ్ జేసి పొలిటికల్‌గనే ఖర్చుబెడతడు ఆయన. ఫండ్ కలెక్షన్ లేకుండ ఇపుడు ఎట్ల నడుస్తదయ్యా పార్టీ! పార్టీలో మల్ల గదే సరుకు గదనయ్యా. కింది నుంచి పైకి పోయి వచ్చేవరకు మధ్యలో పోతనే వుంటది. టిఆర్ఎస్‌ది పొలిటికల్ సంస్కృతి, అది ఏం జేయలేం. డోనర్ దగ్గర నుంచి నాకొచ్చే వరకు మధ్యలో కొంత పోతది, నా దగ్గరి నుంచి కిందికి బోయే వరకు మల్ల మధ్యలో పోతది, దాన్ని ఏం జేయలేం అంటడు ఆయన. సిస్టమ్ అది.

స్వభావరీత్యా చాలా లిబరల్ మనిషి. చాలా లిబరల్ మనిషి ఆయన! ఆ విషయమనే గాదు, మందికి హెల్ప్ జేస్తుంటడు గదా ఆశ్చర్యమేస్తది. ఒకసారి ఒక పిల్లవానికి ఏదో మెడికల్ కేస్ వచ్చింది. బ్రెయిన్ ట్యూమరో ఏదో. పన్నెండు లక్షల ఖర్చు. ఆరోగ్యశ్రీ కింద లక్షే ఇస్తరు. వాల్లు ఏడ్సుకుంట వచ్చిండ్రు. ఐదు నిమిషాలు ఆగిండు. నేను ఏర్పాటు జేస్త అన్నడు. ఆయనకు తెలిసిన పదిమందికి ఫోన్లు జేసిండు, పన్నెండు లక్షలు వచ్చినయ్! చెప్తున్న, నేను విట్నెస్. చివరికి పిల్లవాడు బతకలేదు అది వేరు విషయం. ఒక్కరోజులో పన్నెండు లక్షలు కలెక్ట్ జేసి ఇచ్చిండు అంటే బీద పిల్లవానికి. స్వభావం. వ్యక్తిగతంగ సంపన్నుడు, ఆయనకి పెద్ద అవసరం లేవివి. కని పొలిటికల్‌గ అది సహజం. ఇపుడు ఇంత పెద్ద వుద్యమాన్ని నడిపించడం అంటె ఎన్ని సోర్సెస్ నుంచి రావాల్నయా డబ్బు? ఎక్కడెక్కడి నుంచి రావాలె?

# అది మెయిన్ రీజన్

మా యిద్దరి మధ్య (జయశంకర్, కేసీఆర్) బ్యాలెన్స్ అంటె.. తక్కువ పరిచయం. తర్వాత ఇంటిమేట్ అయ్యిండు, ఇపుడు చాలా ఇంటిమేట్ అయ్యిండు గద నాకు! నా కన్న చిన్నవాడు, ఇరవై ఏండ్లు చిన్నవాడు గదయ్యా. కో ఆర్డినేషన్ అంటె పరస్పర విశ్వాసం, పరస్పర రెస్పెక్ట్ డెవలప్ అయ్యింది. ఎందుకు డెవలప్ అయ్యిందంటే, ఆయన కాంపిటెన్స్ మీద నాకు కంప్లీట్ విశ్వాసం వచ్చింది. పొలిటికల్ యాంబిషన్ లేని నా నిజాయితీ మీద ఆయనకు కాన్ఫిడెన్స్ వచ్చింది. అది మెయిన్ రీజన్, నాకు పొలిటికల్ యాంబిషన్ లేదు. అటువంటి కోరిక వుంటె ఎప్పుడో నేను ఎమ్మెల్యే అవుగావొచ్చు. తర్వాత ఖతం అయిపోదును, ఈ పాటికి ఖతం అయిపోదును నేను. నాన్ పొలిటికల్‌గ నిలిచి వున్న గనక ఆ మోరల్ ఫోర్స్ అనేది ఆయనకు. ఇపుడు నాకు బయట సమాజంలో వుండె యాక్సెప్టెన్స్ ఏందంటే నేను ఇపుడు ప్రైంమినిస్టర్ దగ్గరకు పోయినపుడు వాల్లు నాతో ఎక్కువ ఇంపార్టెన్స్‌తోని మాట్లాడుతరు ఆయన ముందే, చాలా సీరియస్‌గ మాట్లాడుతరు. అదే కాన్ఫిడెన్స్ వాల్లకు.

ఏమైతాందంటె.. పొలిటికల్, ప్యూర్లీ పొలిటికల్ ఆలోచనలకు పొలిటికల్ పవర్, పొలిటికల్ పొజిషన్స్ ఎంతమందికి వస్తయ్? ఏ పార్టీలోనైన ఎంత మందికి వస్తయ్? అంటివి గద యిండ్లకెల్లి పోయినంక, తర్వాత మల్ల ఎవరు ఎదగలేదంటె ఎందుకు ఎదగలేదంటె బేస్ లేదు, ఇష్యూ మీద పట్టులేదు, పొలిటికల్‌గ బేస్ లేదు. ఈయనకు ఇష్యూమీద పట్టున్నది, పొలిటికల్‌గ బేసున్నది. నిలవాలంటె ఏదో ఒకటి కావాలె గద. మా లాంటి వాల్లకు పొలిటికల్ బేస్ లేదు గాని ఇష్యూమీద పట్టున్నది. పోతే పొలిటికల్‌గ బలపడ్డానికి ఇప్పటి వరకు మాకు ఇది గావాలె అని, అటువంటి ఇండికేషనే ఇవ్వలేదు. కనుకనే మా గురించి వాల్లకు ఫుల్ కాన్ఫిడెన్స్ వుంటది. రెస్పెక్ట్ వుంటది. కనుకనే మేం ఖచ్చితంగ కోప్పడ్డా బడతరు. చెప్తున్న! ప్రయివేటుగ మేం కోప్పడ్డా బడతరు. నేనే పొలిటికల్ పొజిషన్ తీసుకుని పార్టీ మెంబర్‌గ వుంటె పార్టీ డిసిప్లిన్ కిందికి వస్తది. ఏం అన్లేం గద!

# కల్చరల్ డైమెన్షన్ వచ్చింది

కళారూపాలు చాలా చాలా చేసినయ్. ఇపుడు నడుస్తున్న ఉద్యమంలో చాలా ఇంపార్టెంట్ డైమెన్షన్ అది. కళా రూపాలకేందంటె.. దానికి తెలంగాణ ఉద్యమం కేవలం దోపిడికి వ్యతిరేకంగ మాత్రమె గాదు. దోపిడంటె నీళ్ల దోపిడి, నిధుల దోపిడి, ఉద్యోగ దోపిడి, దోపిడికే గాదు, సాంస్కృతిక దాడికి గూడ వ్యతిరేకమె. తెలంగాణ సంస్కృతిని, చరిత్రను,ఇక్కడి భాషను, యాసను, నుడికారాన్ని, కట్టును, బొట్టును చిన్నబుచ్చుటం లోపల ఉద్యమానికి కల్చరల్ డైమెన్షన్ వచ్చింది. కనుక తెలంగాణ ఉద్యమానికి ఈ మలిదశలో వచ్చినటువంటి కొత్త పార్శ్వం ఏందంటె.. ఇది సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం. దీనిపైనే నేను జెప్తుంట, విగ్రహాల దగ్గర్నుంచి ఇక్కడదాకా అన్నీ వస్తుంటయ్ గద. ఆ ప్రాసెస్‌లో సాహిత్యం ఎమర్జ్ అయింది. తెలంగాణ యాస, తెలంగాణ నుడికారం పైన వాళ్లు ఏదైతే అవాయిడ్ జేసిండ్రో, దాన్లకెల్లి బుట్టుకొచ్చింది. రూపాలు చాల వచ్చినయ్. బేసిస్ అదన్నమాట. కని తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఈ మలి దశ చాలా ఉపయోగపడ్డది. కనుక సాహిత్యం వచ్చింది.

నన్ను నేను ఏ పొజిషన్‌లో పెట్టుకోలె. అంటె నాకట్ల అనిపిస్తది. నన్ను నేను ఎప్పుడు ఏ సింబల్‌గ జూసుకోలె, నా తత్వం అది. నేను జెప్తున్న ఆనెస్ట్‌గ జెప్తున్న. నేనొక స్వచ్ఛంద కార్యకర్తను. ఎందుకు నిలిచున్న అంటె, కార్యకర్తగనె వున్న గనుక. వేరే అడ్డ దోవలో బోతే వుండేవాన్ని గాదు గద!

ఉద్యమంలో స్టూడెంట్స్ ఇన్వాల్వ్ అయితె, వయొలెన్స్ రావొచ్చని ఇనీషియల్‌గ అభిప్రాయం వుండె. వయొలెన్స్ వస్తది గావొచ్చు, స్టార్టింగ్‌లోనె వయొలెన్స్ వస్తే - మల్లీ వెనుక చెన్నారెడ్డి పిరియడ్‌లో వచ్చిన వయొలెన్స్ వస్తదని - కని ఆలస్యమైంది. కని క్రమక్రమంగా వాళ్లను ఇన్వాల్వ్ జేయాల్సి వచ్చింది. పోతె ఆలస్యంగ వచ్చినా ఎఫెక్టివ్‌గ వచ్చిండ్రు.

ఈ ఆత్మహత్యలు అనివార్యం కావు. అది అనవసరమైనటువంటిది, కేసీఆరే కాదు ఎవరుగూడ దాన్ని సమర్థించరు. అన్నడు గద, చాలాసార్లు అన్నడు. ఇది అనేక వత్తిల్లు.. పిల్లవాల్లు, యూత్ మీద వత్తిల్లకు అనేక కారణాలున్నయ్. కనుక ఎవ్వరు గూడ దాన్ని సమర్థించడం లేదు. కేసీఆర్ చెప్పిండు, చాలా సార్లు చెప్పిండు వద్దని. మేం జెప్పినం, కాని ఇంకా అక్కడక్కడ జరుగుతునె వున్నయ్. పూర్తిగ బంద్‌గాలె.

# తెలంగాణను తప్పకుండ జూస్త!

తెలంగాణ రాకతప్పదు, ఎందుకంటే యిపుడు కంప్లీట్‌గ సొసైటీ మొత్తంగ వర్టికల్‌గ డివైడ్ అయ్యిన్నది. ఈ దశ నాకు నా యాభై, అరవైఏండ్ల అనుభవంలో గూడ లేకుండె. ఇపుడు చాలా తృప్తికరమైన స్టేజికొచ్చింది. తిరుగులేని స్టేజికొచ్చినం, వెనక్కిబోదు. గతంలో వెనక్కి బోయింది గాని ఇపుడు వెనక్కి బోదు. ఎందుకంటె ఇది కేవలం పార్టీలకు, వ్యక్తులకు పరిమితమై లేదు, ఈ రోజు ప్రజల్లోకి బోయింది. మాకు కోరిక అదే వున్నది. ఇది సిసలైన ప్రజా వుద్యమం. ప్రజల ఇన్వాల్‌మెంట్ లేంది మొన్న ఎలక్షన్లో ఆ రిజల్ట్ వస్తాదయ్య! తెరాస మీద కోపం వుండె, కేసీఆర్ మీద వుండె! అయినా గాని ఆ గెలుపు అనేది అంత డబ్బు ఖర్చుబెట్టంగ (అపోజిషన్ పార్టీవాల్లు).. అంటె ప్రజల్లోకి బోయిందది. మా జీవితా శయం గూడ అదే ప్రజల్లోకి బోవాలె. ప్రజల్లోకి బోయిందది, అదే తృప్తిమాకు. దీన్ని ఎవరు ఆపలేరు. అందుకే అక్కడక్కడ మా అవసరం లేకుండ, ఈ పిలగాల్లు నా అవసరం లేకుండ, నాకు పనిలేకుండ జేసింట్రు అని జెప్తున్న నేను. దటీజ్ ఎ వెరీ డిజైరస్ స్టేజ్ ఇన్ ది మూమెంట్!

తెలంగాణను తప్పకుండ జూస్త. నాకైతే ఏం సందేహం లేదు. తర్వాత తెలంగాణ పునర్‌నిర్మాణం అనేది మేజర్ ఎజెండా. ఇపుడు ఒకటి.. తెలంగాణ దేనికొరకు? ఎవని కొరకు? అంటె బిసి సమస్య వస్తది గద! తెలంగాణలో ఆర్థికాభివృద్ధి మోడల్ ఎట్ల వుండాలె అన్నప్పుడు.. అగ్రికల్చర్ ఎట్ల వుండాలె, ఇరిగేషన్ ఎట్ల వుండాలె అనే ప్రణాళిక వుంది. ఇపుడు జెప్పడం గొంతెమ్మ కోరిక లాంటిది. తెలంగాణ రాష్ట్రం యొక్క ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమం ఎట్ల వుండాలె అంటె అగ్రికల్చర్ లెవల్‌లో, ఇరిగేషన్, రూరల్ డెవలప్‌మెంట్‌లో అట్ల అన్ని వస్తయ్. విద్యా విధానం ఎట్లా వుండాలె, వైద్య విధానం ఎట్ల వుండాలె? అన్నీ సాధ్యమైతయ్.

# విడిపోతే సాధ్యం అయిద్ది

వస్తది.. ఇపుడు ఎందుకొస్తదో చెప్త, అక్కడికే వస్తున్న. సామాజిక న్యాయం.. ఇపుడు ఇవన్నీ తెలంగాణ రాష్ట్రంలో సాధ్యం ఎందుకవుతున్నాయని జెప్తున్నమంటె, గత 50, 60 ఏండ్ల నుంచి తెలంగాణలో వచ్చిన ఉద్యమాలు, అప్పటి సాయుధ పోరాటమే గావొచ్చు, నిజాం వ్యతిరేక పోరాటమె గావొచ్చు, నక్సలైట్ ఉద్యమం గావొచ్చు, కుల సంఘాలు గావొచ్చు, తెలంగాణ ఉద్యమం గావొచ్చు.. ఇయన్నిటితో జన చైతన్యం బెరగలేదా! వట్టిగ బోతాదయ్య! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయం అనేది సాధ్యం గాదు, విడిపోతే సాధ్యం అయిద్ది! ఎట్ల అన్నప్పుడు చెప్త విను. 50, 60 ఏండ్ల చరిత్ర లోపల, సరె బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అంటె దానికి ఏంటి కొల మానం? కొలతబద్ద ఏమిటి? నా దృష్టిలో కొలతబద్ద ఆ వర్గాల నుంచి ఎదిగి వచ్చి ముఖ్యమంత్రి గావాలె, తర్వాత ప్రధానమంత్రిగ నిలదొక్కుకోవాలె, జరిగిందా? ఒక్క సంజీవయ్య 18 మాసాలు. ఆయన గాలె, తీసుకొచ్చి కూసోబెట్టిండ్రు. ఆయన ఎక్కువ జేసేవరకు తీసేసిండ్రు! తర్వాత ఎవడన్న అయ్యిండా? కానిస్తరా? కానివ్వరు. ఇపుడు ఏ పార్టీ అయినా దీసుకో కాంగ్రెస్ పార్టీ అంటె మల్ల గదే రాజశేఖరరెడ్డా, విజయభాస్కరరెడ్డి కొడుకులా, లేకపోతె పురందేశ్వరా, జైపాల్‌రెడ్డా.. గీల్లే గదా? టిడిపి అంటె సింగిల్, కమ్యూ నిస్టులు ఏమన్నా తక్కువతిన్నరా? మల్ల గవే కులాలు గదా? బిజెపి గదే గదా? కనుక వుమ్మడి రాష్ట్రంలో సామాజిక న్యాయానికి అవకాశం లేదు. ఎందుకు లేదు అంటె.. ఏవైతే రెండు బలమైన వర్గాలున్నయి, రెడ్డి అండ్ కమ్మ వాల్ల చేతుల్నుంచి బయటికి రాదు.

తెలంగాణ, రాయలసీమ రెడ్లు గలిస్తె పెద్ద ఫర్మిడబుల్ ఫోర్స్ అది. కమ్మాస్ ఎమర్జ్ అయిపోయిండ్రు. విడిపోతే ఏమైద్ది అంటె? ముందు కమ్మ ఫ్యాక్టర్ పోతది. తెలంగాణలో కమ్మ ఫ్యాక్టర్ వుండదు. అంటె బలమైన బలమైన ఫ్యాక్టర్ గాదది. తెలంగాణ రాయలసీమ రెడ్లు కలవకపోతె తెలంగాణ రెడ్లు వీక్. వాల్ల ధనబలంతోని వీల్లు, రాజశేఖరరెడ్లు, విజయభాస్కరెడ్లు జెయ్యబట్టి వీల్లు. పోతే.. రాయలసీమ రెడ్లకన్న తెలంగాణ రెడ్లల్లో కొంత అవగాహన వచ్చింది. మనంతట మనం! రెండవది.. ఇప్పటికి గూడ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతం లోపల పదిరికుప్పంలు, వేంపెంటలు, కారంచేడులు జరుగు తున్నయ్. తెలంగాణలో గావు, అవకాశం లేదు. ఎందుకు జెప్తున్న అంటె ఇక్కడ బలహీన

వర్గాలలో చైతన్యస్థాయి పెరిగింది. పెరగడం ఒక్కరోజులో గాదు, ఈ 50, 60 ఏండ్ల వుద్యమాలు, రేపు రాష్ట్రం వచ్చినంక కూడా రాష్ట్రాన్ని కాపాడేది ఆ చైతన్యమె, వ్యక్తులు గాదు!

సామాజిక న్యాయం అన్నప్పుడు.. నేను అంత న్యారోగ (సంకుచితంగ) జూడను. బడుగు బలహీన వర్గాలు, ఇపుడు తెలంగాణలో ఎందుకు సాధ్యమైతది అంటె, ఈ నేపథ్యం జరిగినపుడె, స్టేట్ యొక్క ధ్యేయమది అయినప్పుడె ఇవన్నీ అయితయ్. ఆ ఎకనామిక్ డెవలప్‌మెంట్ పాలసీస్ ఎట్ల వస్తయయ్యా? జనానికి ఇపుడు జయశంకర్ జెప్తెనో, నువ్వు జెప్తెనో రాదు గద. జనంలో చైతన్యం రావాలె గద. ఆ చైతన్యం వచ్చింది.

## బ్రేక్ చేసిందే నేను

ఏమీ లేదు, అది చాలా మందికి కొన్ని భ్రమలుంటయ్. ఫస్టఫాల్ ప్రిన్సిపల్ దేనికొరకు అనేది అవగాహన రావాలె. కుర్చీలొ గూర్చొని సుఖాలనుభవించడానికి గాదు. ఇనిస్టి ట్యూషన్‌కి సేవజేయడానికి. ఇనిస్టిట్యూషన్‌లో సేవజేయాలంటె ట్రాన్సపరెన్సీ.. ప్రతి విషయంలో ఓపెన్‌గ వుండాలె. పిల్లవాల్లు సమస్యలతో వస్తరయ్యా! మంచివి వుంటయ్, చెడ్డవి వుంటయ్, గొంతెమ్మవి వుంటయ్, వినాలె గదా. ప్రిన్సిపల్ నిజాయితీతో వింటున్నడు, చెప్పే తీరు గూడ నిజాయితీతో వున్నడని విశ్వాసం కలిగిస్తె వింటడు. వాల్లు జెప్పేదాన్లో 90 విషయాలు నేను జేయలె, పదే జేసిన. కానియి కాదని జెప్పిన, అయినయ్ వెంటనె జేసిన. పోతె మా ఫస్ట్ కన్సర్న్ స్టూడెంట్. కాలేజి వున్నది స్టూడెంట్స్ కొరకు. నా కొరకు గాదు, స్టాఫ్ కొరకు గాదు, స్టూడెంట్స్ కొరకు. స్టూడెంట్స్‌కు సర్వీస్ జేయడం లోపల స్టాఫును మలిచిన. నేను స్వయంగ పనిజేసి మలిచిన. ఏం లేదయ్య.. చిత్తశుద్ధితోటి పని జేయడమె, అంతకంటే బ్రహ్మ విద్యేం గాదు. చిత్తశుద్ధితో పనిజేయాలె. ఒకసారి విశ్వాసం వచ్చినంక రెస్పెక్ట్ ఇస్తరు.

చాలా జేసిన, ఒకటి గాదు చాలా! ఒకటేందంటె విసి పరిధిలో వున్నప్పుడు జేసినదాంట్లో ఏందంటె.. నా కాలంలో అయిన రిక్రూట్‌మెంట్‌లో ఆంధ్రప్రాంతం నుంచి ఒక్కన్ని దీసుకోలె అపాయింట్‌మెంట్స్‌లో. నాట్ ఎ సింగిల్ అపాయింట్‌మెంట్. లోన్లీగ వుండిపోయిన అది వేరు విషయం. ఏ ఒక్కర్ని నేను జేరనీయలె. రెండవది కాకతీయ యూనివర్శిటీ స్టార్ట్ అయినాక కొన్ని పిజి సెంటర్స్ వుండె. ఖమ్మంలో, కొత్తగూడెంలో, కరీంనగర్‌లో. వాటిని కాకతీయ కింద రాకుండ ఒక కుట్ర నడిచింది. మొత్తం నాలుగు జిల్లాల తెలంగాణ కాలే జీలను కాకతీయ కిందకు తీసుకొచ్చిన. మూడవది కాకతీయ యూనివర్శిటీలో రూరల్ తెలంగాణ డెవలప్‌మెంట్ గాక, నిధులకు ప్రిఫరెన్స్ ఇవ్వాలె అంటె నిధులిచ్చింద్రు. చాల లిబరల్‌గ ఇచ్చింద్రు. మూడేండ్ల పరిధిలో నేను జేయగలిగింది ఏందంటె రిక్రూట్ మెంట్ ప్రధానం. రిక్రూట్‌మెంట్ అండ్ అడ్మిషన్స్! అడ్మిషన్స్ గూడ లోకల్, నాన్ లోకల్ అని బ్రేక్ జేసింది నేనే. లోకల్ కోటా లేదు, ఓపెన్ కాంపిటేషన్. బ్రేక్ జేసిందే నేనపుడు! లేకపోతె నాన్‌లోకల్ కోటాలోకి అంతా దూరిపోయేది. నాన్ లోకల్ కోటా లేకుండ జేసిన. ఇప్పుడది ఫాలో జేస్తుంద్రు. నాన్‌లోకల్స్‌ను రిక్రూట్ జేయలె. తెలంగాణ బిడ్డలకే వుద్యోగా లిచ్చిన. కాకతీయ యూనివర్శిటీ పరిధి పెంచి నాలుగు జిల్లాలకు జేసిన, కన్సాలిడేట్

జేసిన. యుజిసి, స్టేట్ గవర్నమెంట్ నుంచి, తెలంగాణ బ్యాక్‌వర్డ్ రీజన్ యూనివర్శిటీ అని నిధులు లిబరల్‌గ వచ్చినయ్. అందుకే ఈ రోజుకు ఒక షేప్ వచ్చింది దానికి.

అదే గదనయ్యా! ఇప్పటికి జరుగుతుంటనే వుంటయ్. పొలిటికల్ లీడర్‌షిప్‌లో వున్న లోపాలవి, పొలిటికల్.. ఇపుడు.. నేనపుడు విసిగ వున్నప్పుడు ముఖ్యమంత్రో ఎవరన్న రికమండ్ జేస్తరు గదా? ఆంధ్ర ప్రెషర్ వస్తె కాదని జెప్పిన నేను, తప్పు బట్టుకోలె. చెప్ప గలగాలి, మన పద్ధతి చెప్పగలగాలి. ఎందరు జెప్తరనేది వేరు విషయం. సమస్య ఏందంటె ఎందరు జెప్తరు? ఇప్పుడు అంటివె.. నువ్వు బోతె పిల్లలు ఎందుకు రెస్పెక్ట్ ఇస్తరు అంటె నిజం జెప్త గనుక. నిర్భయంగ జెప్త గనుక. కావల్సొస్తె పదవులు వదులుకొంట గాని కాంప్రమైజ్ గాను నేను. గుర్తింపు అంటె అట్లనె వస్తదయ్య! చేసింది ఏమీ గొప్ప పని గాదు. గొప్ప పనేం గాదు. రెండవది నేను చేసేపనిలో ఓపెన్‌నెస్ వుంటది. గుసగుసలుండవు. దిసీజ్ ది రీజన్. కాకుంటె గాదు, నో అంతే.. అయితే అయితది.

# బిసిలల్ల ఐక్యత లేదు

ఇక్కడ తెలంగాణ ప్రాంతంలో సామాజిక న్యాయానికి వున్న ప్రతిబంధకం బిసిలల్ల ఐక్యత లేదు. పెద్ద ప్రతిబంధకం అది. చాల జెప్తుంటరు. ఎస్‌సిలల్ల వుంది గాని అంత పెద్దదిగాదు.. రెండే వర్గాలు. ఎస్‌టిలల్ల వుందిగాని, బిసిలల్ల వున్నటువంటి అనైక్యత ఇతర దాంట్లో లేదు. ఇపుడు బిసిలల్ల ఏమైంది.. ఒక నాలుగైదు వర్గాల వాళ్లకే ప్రామినెన్స్ కనపడ్తుంది. అట్టడుగున చాలా మంది వున్నరు గద, చాలా మంది! వాళ్లు మేలుకోవాలి. బిసిలల్ల పైకొచ్చిన వాళ్లు వాళ్లని తీసుకపోవాలి వెంట. ఇపుడు పూర్తిగ నా కమ్యూనిటీ, నీ కమ్యూనిటీ అని గాకుండ సమిష్టిగ జూడాలె గద. సమిష్టిగ పోవాలె గద. పోవాలన్నపుడు.. నా కమ్యూనిటీ రావాలె, నీ కమ్యూనిటీ రావాలె అన్నపుడు సమిష్టిగ పోవాలె గద. పోవా లన్నపుడు నాలుగైదు కమ్యూనిటీస్‌కే, బిసిల్లో నాలుగైదు కమ్యూనిటీస్‌కే ప్రామినెన్స్ వుంది పొలిటికల్‌గ. ఎన్నో వర్గాలకు అసలు నామరూపాలు లేవుగదనయ్య. కనుక బిసిలల్లో అవగాహన రావడానికి ఒక ఉద్యమం అవసరం. సమిష్టి ఉద్యమం అవసరం. అది పెద్ద లోపం, చాన పెద్ద లోపం. ఎగ్జాంపుల్ ఇస్త. నేను బిసినే. ఒక కమ్యూనిటీ నాది. పొలిటికల్‌గ జీరోనె గద.

# నా క్యాస్ట్‌గ నేను గర్విస్త

మా ఫాదర్ కార్పెంటర్, మదర్ గోల్డ్ స్మిత్. కని ఇవన్నీ యింటర్ చేంజబులే గద, బేసిక్ కమ్యూనిటీ అదే గద! ఈ కమ్యూనిటీకి పొలిటికల్‌గ ఏమన్న ఉందా? చెప్తున్న. లేదు, అవకాశం లేదు. మల్ల చదువుకున్న వాల్లున్నరు, మంచి కళాకారులున్నరు, పొలి టికల్‌గ ఎందుకు రాలేదు అంటె ఐక్యత లేదు. నేననేది అది! ఇపుడు నాకొచ్చిన గుర్తింపు నా క్యాస్ట్ వల్ల రాలేదు. నా క్యాస్ట్‌గ నేను గర్విస్త, అది వేరు విషయం. వేరే కృషితో వచ్చింది నాకు. కని ఇందులో ఐక్యత తెచ్చే పెద్ద ప్రయత్నంలో నా ఎనర్జీ సరిపోవటం లేదు. నా మెయిన్ ఛానెల్ ఇది గాదు గద! అవి చేసేది చాలా మంది వున్నరు. నేను అటుబోతే ఇవి ఏం జేయలేను. నేను అటు బోతె చేసేదిముండదు. అండ్ల బోతె దానిలో మునిగిపోతాం గాని చేసేది ఏం వుండదు. కనుక నాకు కన్విక్షన్ వున్నదాన్ని పట్టుకొని వున్న నేను. ఐతే ఈ రోజు ఏమిటి? చిత్తశుద్ధితో పనిజేస్తే అటోమాటిక్‌గ సమాజంలో గుర్తింపు వస్తుందనేది నా ఎగ్జాంపుల్. నా కులం వల్ల రాలె, జెప్తున్న.. కులం వల్ల రాలె. చిత్తశుద్ధితో పనిజేయడం వల్ల వచ్చింది. దేవేందర్‌గౌడ్‌కు గూడ అదే జెప్పిన. నువ్వు చిత్త శుద్ధితో పనిజెయ్యి అని.

మైనారిటీ, బిసిలని ఒక కాన్సెప్ట్. ఇపుడు ఎట్ల వుంటదంటె.. బలహీనవర్గాలనే వరకు ఇవన్నీ వస్తయ్. ముస్లిమ్స్ పరిస్థితి గూడ మంచిగ లేదు. ముస్లిమ్స్‌గాని, దళితులుగాని, గిరిజనులు గాని.. అందుకే బలహీన వర్గాలన్నప్పుడు కాంప్రెహెన్సివ్‌గ జూస్తెనె దానికి కాన్సెప్ట్ అయితది. ఆ దృక్పథం రావటం లేదు. ముస్లిమ్స్‌కి.. వాల్లకు ఇన్ సెక్యూరిటీ కాంప్లెక్స్. మమ్మల్ని ఎవరు ఓన్ జేయడం లేదే అనే కాన్సెప్ట్ వాల్లకు వుంటుందన్నమాట. ముస్లిమ్స్‌ని ఓన్ జేసుకోకుండ ముందుకు బోలేం మనం. అదో పెద్ద ఇరిటెంట్ అయితది. టోటల్‌గ వాల్లది ఇపుడు 10, 12 శాతం పాపులేషన్. మీరు ఎంత కాలం వాల్లను దూరం బెడతరు? ఇపుడు.. దే హ్యావ్ బికమ్ పార్ట్ ఆఫ్ ది సొసైటీ. వదులుకోలేం, అబ్జార్బ్ జేసు కోవడమా, దూరం జేసుకోవడమా? దూరం జేస్తే ఫ్రిక్షనే గద యెప్పటికి!

కనుక ఇండియన్ సొసైటీలో నెగ్లెక్టెడ్ సెక్షన్స్‌లో అదొక సెక్షన్. అన్నింట్లో సఫరర్స్ వున్నట్టే అండ్ల గూడ సఫరర్లున్నరు. ఒక్క ఓవైసీని జూసి, ముస్లిమ్స్ అంత అట్లనె అనుకోలేం గద! గ్రామీణ ప్రాంతాల్లో వాల్ల పరిస్థితి ఎంత ఘోరంగ వున్నది. రెండవది.. ఏదో పార్టిషన్ ముందున్న ముస్లిమ్స్, లేదా రజాకార్లతోటి వీల్లని పోల్చటం అన్యాయం.

ఆ జనరేషన్ వేరు, ఆ కథ వేరు, ఆ చరిత్ర వేరు. అదే 600 సంవత్సరాల కిందట బాబర్ ఏదో మసీదు కట్టిండు వీళ్లని తంతామంటె ఎట్ల! చెప్తున్న సొసైటీలో.. సొసైటీ అమాల్గమ్ (కలిసిపోవడం) కావాలె. సొసైటీలో యూనిటీ రావాల్నంటె ఈ ఫ్రిక్షన్స్ బోవాలె గద. తప్పులు జరిగినయ్, తప్పులు రిపీట్‌జేస్తూ పోతావా? సవరించుకుంట పోతావా? సవరించుకోవడానికి మ్యూచువల్ కాన్ఫిడెన్స్ గావాలె. కనుక బలహీన వర్గాలు అనేది నా దృష్టిలో ఒక బ్రాడ్ కాన్సెప్ట్. నిజంగానె బలహీనవర్గాలంటె ఆర్థికంగా, రాజకీయంగ, సామాజికంగ నెగ్లెక్ట్ అయినవాల్లు. ముస్లిమ్సా, దళితులా, బిసిలా అని గాదు, నెగ్లెక్టెడ్ సెక్షన్స్. ఆ సెక్షన్స్ యునైట్ అయిన రోజే నిజమైనటువంటి ప్రజాస్వామ్యం, ఇవి పెద్ద ప్రయత్నాలు.

# తెలంగాణలో ఆ సంస్కారం వున్నది

కల్చరల్ మూవ్‌మెంట్, పొలిటికల్ మూవ్‌మెంట్‌లో అటెమ్ట్ జరగాలె, దె గో టుగెదర్. ఐసొలేషన్ గాదది. ఈ రెండు ఒకటికొకటి ముడిపడ్డయ్ అవి. ఇపుడు తమిళనాడులో ఏం సొసైటీ వుంది అక్కడ. ఒక్కరోజులో వచ్చినాదయ్య. రామస్వామి నాయకర్ నుంచి ఈ రోజు వరకు అక్కడ బలహీన వర్గాలకు రాజ్యాధికారం గుప్పిట్లో వున్నది. ఎట్లొచ్చింది, ఎంత స్ట్రగుల్ వుండొచ్చు? అన్నాడిఎంకె జయలలిత వుండొచ్చు గాని వచ్చిందయితె వాల్లే గద.

చెప్తున్న.. ఎట్లంటె కల్మినేషన్, అట్లాగె కర్నాటకలో గూడ చాల.. దేవరాజ్ చాల జరిగిందక్కడ. ఇపుడు యుపిలో ఏం జరిగింది? బీహార్‌లో ఏం జరిగింది? పరిస్థితులు మంచిగ లేకపోవచ్చు గాని సామాజిక న్యాయం దృష్టితో జూసినపుడు బలపడ్డరు గద! పొలిటికల్‌గ నాశనం గావొచ్చు, కని సామాజికంగనైతె ఈ వర్గాలు ముందుకొచ్చినయ్ గద. ఈ రోజు ములాయం గాని, మాయావతి గాని, లాలూప్రసాద్‌గాని, పాశ్వాన్ గాని.. వాల్లను కాదనలేరు గద. అది ఆ ప్రయత్నం ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో జరగదు. తెలంగాణ వస్తే జరుగుతుంది. మొదట ఫర్మ్ విశ్వాసం అండ్ల. ఇక్కడ సోషల్ యిథాస్ (సంస్కృతి) స్టడీ జేసిన వాడిని గనుక తెలంగాణలో ఆ సంస్కారం వున్నది. ఆంధ్రలో లేదు, తెలంగాణలో ఆ సంస్కారం వున్నది.

# మందుగుండు జేయడం మానుకోను గద

ఇందులో అనుభవాలు, చరిత్ర, చిన్నప్పటి నుంచి.. రజాకార్ మూవ్‌మెంట్, అప్పటి నుంచి జూసిన చరిత్ర నన్ను చిన్నప్పుడె ప్రభావితం జేసింది. ప్రతి సంఘటన! స్టేట్ ఫార్మేషన్ కంటె ముందు, తర్వాత అయిన ఆ దృక్కోణంతో ప్రతి విషయాన్ని చూడడం మొదలుపెట్టిన గనుక అది జీర్ణించుకు పోయింది. ఆ దృక్కోణం పడిపోయింది. తప్పకుండ తెలంగాణ దృక్కోణంతోనె జూస్త నేను. ఇపుడు ఏమిటంటె ఒక విషయం మీద కాన్సన్‌ట్రేషన్ జేసినపుడు అటోమెటిక్‌గ డిటైల్స్‌లోకి పోతనె వుంటం. కనుక నేను పది విషయాల గురించి ఒకేసారి పనిజేయను. ఒకే విషయం గురించి పనిజేస్త. వృత్తిలో వున్నపుడు వృత్తి, తెలంగాణ ఎప్పటికి అంతె. ఇంకోదిక్కు పోలె నేను.

కోపం వస్తది, కోపం వచ్చిన సందర్భాలున్నయ్. కొట్లాడిన సందర్భాలున్నయ్ అన్నీ వున్నయ్, ఎల్లిపోయి ఒక ఏజ్‌లో కొట్లాడిన బానె. పబ్లిక్‌గ కొట్లాడిన నేను. కని అనుభవం, ఏజ్, డక్కామొక్కీలు తిన్న తర్వాత సోమరి అయిపోతం గద. ఆలోచిస్త గని, ఇరవై నాలుగ్గంటలు ఆలోచిస్త గని, అనుకూలంగ పరిణామం వుంటె పెద్ద పొంగిపోను, ప్రతి కూలంగ వుంటె కుంగిపోను. జరిగింది.. ముందేం జేయాలె. మంచైంది దీన్ని కాపాడు కోవాలె ఏం జేయాలె? ఇపుడు చెడు అయింది, కాకుంట ఏం జేయాలె? అట్ల వుంటది నా ధోరణి. అలవాటయిన  ఇన్వాల్‌మెంటయ్యా. ఇష్యూ ముఖ్యమైనపుడు పర్సనల్ విష యాలు పెద్ద ప్రభావితం జేయవు. తిండిలేకుండ, నిద్ర లేకుంట గూడ పనిజేసిన రోజు లున్నయ్ ఇన్వాల్‌మెంట్‌తోని.

ఇపుడు పొలిటికల్ రిటార్ట్ వేరేదిక్కుంటదయ్య. ఇపుడు అకడమిక్ డిస్కోర్స్‌కు, పొలి టికల్ రిటార్ట్‌కు తేడా వుంటది. నీకు జెప్తి గద. అకడమిక్ డిస్కోర్స్‌తోని ముందుకు పోలేం, పొలిటికల్ రిటార్ట్ మాత్రమే అక్కర్లేదు. రెండు కంబైన్ గావాలె. నేను జేసిన ప్రయత్నం అదె. ఇపుడు నేను ఇచ్చిన అకడమిక్ వర్క్ అది మందుగుండు. నేను బేల్చలేను, నీ చేతికియ్యాలె, ఒకసారి తప్పు బేల్చొచ్చు, చెప్తున్న! డైరెక్షన్ తప్పొచ్చు. అయినా మందుగుండు జేయడం మానుకోను గద. ఇది గాదయ్య, ఇట్ల అని జెప్తం! నాలుగుసార్లు తప్పుజేస్తవ్, నువ్ పోతవ్, ఇంకోడు వస్తడు. నేను కంపేర్ జేసేది అది.

# ఒక ఫాదర్ ఫిగర్‌గ ట్రీట్ జేసి

మోనాపలి ఎవరు జేసింద్రు? అదిగాదయ్య ఇతరులు చెయ్యంగ ఎవరన్న ఆపింద్రా! నేను పబ్లిగ్గ చెప్తున్న గద. అంటె ఇపుడు కఠినంగ.. అంటె గ్రిప్. తప్పులు జరగొచ్చయ్య, గ్రిప్. గ్రిప్ ఇపుడు దేంతో వస్తది, జేసే పనిని బట్టి వస్తది. ఇపుడేంటి ఇందులో రకరకాల ఎలిమెంట్స్ వస్తయ్. కొన్ని ఈర్ష్యలుంటయ్. నేనేం తక్కువ అని ఇంట్ల కూర్చొని అంటరు గని  చేసేది ఏం వుండదు. ఈర్ష్య ఏంది.. ఇంత పైకి పోయిండు మనకేం అయ్యింది అని కొందరికి. కులాలు, వ్యక్తిగత అలవాట్లు, ప్రవర్తనలు, మాటల తూటాలు ఇవన్నీ గలిసే వరకు కాంట్రవర్సీస్ వస్తయ్. ఎన్నని సాటిస్‌ఫై జేస్తం? నేను జెప్తి గద.. చిన్న ఇన్సిడెంట్, చిన్న ఇన్సిడెంట్ గురించి ఎన్ని రకాల డిస్‌కషన్స్ అంటె, కేసీఆర్ నాకు పాదాభివందనం జేస్తడు. వద్దని చాల జెప్పిన ఆయనతోటి. ఆయన నన్ను ఒక ఫాదర్ ఫిగర్‌గ ట్రీట్ జేసి.. ఆయన ఇంట్ల ఆయన బర్త్‌డే రోజు మొట్టమొదలు నాకు పాదాభివందనం జేయందె బయటికి రాడు ఆయన. పర్సనల్ విషయాలు ఇవన్నీ. పబ్లిసిటీ గాదు గద ఇది. ఐతే కేవలం పొలిటికల్ ఫ్లాట్‌పాం మీదనె మొక్కితె పొలిటికల్ అయితది. ఇంట్ల పెండ్లి అయినా, శుభకార్యమైనా జేసినట్టయితె అవి పర్సనల్ విశ్వాసాలతయ్. విన్లేదు, సరే పెద్ద వాన్నిగనుక.. ఇగ దాని మీద వాఖ్యానాలు చేయను. కేసీఆర్‌ను జయశంకర్ ఎందుకు విమర్శించడు అంటే ఆయన కాల్లు మొక్కుతే గనుక ఈయన సల్లబడతడు. చెప్తున్న, అంటరయ్య. ఇంకొకరు దొర బిసి కాల్లు మొక్కితే మొక్కనీయరాదు, అని ఇంకోల్లు. ఈ రెండూ వింట. దేనికీ మాట్లాడను. (నవ్వు) అంటే దృక్కోణం, ఒక్కొక్కరి దృక్కోణం ఒక్కొరిది.

## కంటెంపరరీ పాలిటిక్స్‌లో అట్ల లేకుంట బతకలేడు

ఇపుడు మీరన్నరు అందరు.. తాగుతడు అని. అందరికి అలవాట్లు వుంటయ్. ఈయన మీదనె ఎందుకు వచ్చింది? అలవాట్లు అందరికి వుంటయ్ గద! అది చెప్తి గద. పొలిటికల్‌గ క్రిటిసైజ్ జేయడానికి ఏదొక ఆయుధం గావాలె. ఈయన ఓపెన్‌గ తాగుతడు గనుక ఆయుధం అయ్యింది. మిగతా వాల్లందరు తక్కువ దాగుతారయ్య! నేను జూసిన చాలా మంది తాగి తందనాలాడి స్పృహ తప్పి పడిపోయినవాల్లు నైట్ల ఇంట్ల వుంటరు. బయటికి రారు. అలాంటి వాల్లుంటరు. ఈయన అట్ల గాదు డ్రాయింగ్ రూంల కూర్చొని.. అడిగిన నేను, సార్! ఇండ్ల రహస్యం యేమున్నది, గుస గుస ఏముంది. తప్పైతె తప్పె, ఒప్పైతే ఒప్పె. వొకరు గెస్ట్ వచ్చిండ్రు ఆఫర్ జేస్తం. వాల్లు ఇగ ఎట్ల వుంటదంటె, ఈ వచ్చే మనుషుల సరుకు జెప్తున్న నేను! కొంత మందికి, కేసీఆర్ దగ్గర కూర్చొని తాగిన అని చెప్పుకోవాలె బయట! అయితే ఏం జేస్తరు? ఆ గ్లాసు పట్టుకొని బయటికి పోయి మల్లొస్తరు, చెప్తున్న. ఇవి అబ్జర్వ్ జేసి చెప్తున్న. వీడు తాగేటోడు బయటికి ఎందుకు బోవాల్నయ్య! లోపలికి రమ్మంటి, వస్తివి. గ్లాసిచ్చె, అది బట్టుకొని బయటికి బోయి.. బయట వున్నో ల్లందరికి దెలవాలె, కేసిఆర్‌తో కూచోని తాగుతాన్న అని. జెప్తున్న.. రాంగ్ సిగ్నల్స్ అట్ల బోతయ్. కొన్ని సంఘటనల తర్వాత బంద్ జేసిండు అది వేరు విషయం.

క్యారెక్టర్స్. ఇపుడు ఒకటేందంటె దీన్ని కేవలం పొలిటికల్ యాక్టివిటీగ జూసే వాల్లకు ఇంపార్టెంట్ గాదు. అది పొలిటికల్ యాక్టివిటీ అయితది. అన్ని పర్వర్షన్స్ వస్తయ్. వుద్యమం మాత్రమె అనుకొనేవాల్లతోని నిలిచింది ఇది. ఉద్యమం మాత్రమే అనుకొనే వాల్లు చాల మంది వున్నరు. కొందరి పేర్లు బయటికి రావొచ్చు, రాకపోవచ్చు. ఎంతమంది విద్యావంతులు, ఎంతమంది స్కాలర్స్ ఎంతమంది పనిజేయలేదు! సైలెంటుగ జేసింద్రు. నాకు ప్రాచుర్యం వచ్చింది అది వేరు విషయం. పనిజేసిన వాల్లున్నరు. పొలిటికల్‌గ వచ్చేవానికి వాని పొలిటికల్ ఎజెండానె వుంటది. వాని ఉద్యమాన్నె వాని పొలిటికల్ ఎజెండాగా వాడుకోవాలి.

ఒకటేందంటె స్టడీ, బేసిక్ స్టడీ. రెండవది తత్వం! ఆయనది అగ్రెసివ్ నేచర్. తత్వం చాల అగ్రెసివ్. ఇపుడు ఆయన మాలాంటి వాల్లతో ఎంత నమ్రతతో మాట్లాడుతడో పొలిటికల్‌గ అంత అగ్రెసివ్‌గ వుంటడాయన. అది విశేషం. ఒక మనిషిలో రెండు యాస్పెక్ట్స్ జూసిన్నేను. మేం కూర్చొని మాట్లాడితె చాలా నమ్రతతో అట్లగాదు సార్, ఇట్ల గాదు దీన్ని

విభేదిస్తే ఎట్ల? ఇట్ల ఎందుకు గాదు సార్! అంటడు. వేరే వాల్లు విబేధిస్తే యాయ్ నీకేం తెలుసులె ఊకో అంటడు, చెప్తున్న. రెండూ జూస్త నేను. ఎదుటి వాన్ని బట్టి వుంటది ఆయన ప్రవర్తన. అది మంచా, చెడా అనే తత్వం ఆయనది. పొలిటికల్‌గ వెరీ అగ్రెసివ్ మ్యాన్. అట్ల లేకుంట బతకలేడు మరి. కంటెంపరరీ పొలిటిక్స్‌లో అట్ల లేకుంట బతకలేడు. నోటిగదర్‌తో బతికిండు గదయ్యా. మంచిదా, చెడ్డదా అది వేరు విషయం. బతికిండు గద. మరి మేం ఆ పని జేయలేదు. అందుకనే పొలిటికల్‌గ పనికిరాం మేం!

వేరేవాల్లని యెదగనీయడు అంటె, అది మరి ఈ ప్రశ్న వాల్లనే అడగాలి. నేను అదే అడిగిన. ఐతే మీరు జేయండి, లేకపోతె కలవండి, లేకుంటె ఊరుకోండి. ఈ దాగుడు మూతలు ఎందుకు? ఎందుకు అంటె నిజంగ ఈ ఎత్తున వాల్లకు జేయ శాతగాదు. రెండోది, ఇంకోడు జేసి వాడు పైకి బోవద్దు. వాల్ల పేరు జెప్పి మేం పైకి రావాలె. వాల్లిచ్చిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో మేం పైకి రావాలె! లోపం అక్కడున్నది. మీటింగు బెడితె మందిని పంపాలె, పైసలియ్యాలె, జన సమీకరణ జెయ్యాలె, తిట్లు దినాలె వీల్లతోని. ఐతే కలిసి జేయండి, లేకపోతే దూరం వుండండి. మిమ్మల్ని జెయ్యంగ ఆపుతారయ్యా ఎవరన్న, వద్దంటరా?

ఉద్యమంలోకి వస్తున్న వాన్ని ఎట్లాపుతామయ్యా, ఎట్ల క్వశ్చన్ జేస్తవ్? ఎవడేంది ఎట్ల దెలుస్తది! ఈయన బాగనే జేసిండు, ఈయనగూడ మంచిగనే జేసిండు. అయ్యేవరకు యాంబిషన్ బెరిగింది. యాంబిషన్ పెరిగేసరికి ఇవన్ని సమస్యలు.. మామూలు విషయమానయ్యా?

ఒకటేందంటె యాంబిషన్, అనుకున్న దానికంటె ఎక్కువ పైకి పోవాలె, ఆయన కొడుకు మినిస్టర్ అయ్యిండు నేను ఎందుకు గావొద్దు. అల్లుడు మినిస్టర్ అయ్యిండు నేనెందుకు గావొద్దు, చెప్తున్న. పర్సనల్ కోరికలు పొలిటికల్ ఎజెండా. మరి ఎల్లిపోయి చేయగలిగింది ఏమన్న ఉందా అంటె, ఏమీ లేదు. ఊరికె తిట్టడం, విమర్శించడం నడుస్తనె వుంటది అది.

ఒకటేమైందంటె ఇనీషియల్‌గ, తెలంగాణకు తెలంగాణ భూస్వామ్య వర్గాలు అడ్డం వచ్చినయ్. ఫస్ట్ స్టేజిలో చెన్నారెడ్డి పిరియడ్ అప్పుడు. వాల్లకె ఇష్టం లేకుండె. టోటల్‌గ భూస్వామ్య వర్గాలె. అపుడేమయిందంటె పవర్‌ఫుల్ కాంబినేషన్. తెలంగాణ, రాయలసీమ భూస్వామ్య వర్గాలేవైతె వున్నయో, ఆ కులం అయితె చాల పవర్‌ఫుల్ కాంబినేషన్ అయింది. సంజీవరెడ్డి వాల్లు తెలంగాణ వాల్లని బుట్టలో ఏసుకున్నరు. వీల్లకి ఏమైందంటె

వీల్ల ఇంట్రస్ట్లు కాపాడుకోవాలె. పి.వి. నరసింహారావు పెట్టినటువంటి భూసంస్కరణల చక్కర్లకెల్లి బయటపడాల్నంటె, వాల్ల సపోర్టు అవసరం. కనుక ఇక్కడ భూస్వామ్య వర్గాల న్నింటికి ఆ రాయలసీమ పాట్రన్ దొరికింది. అదొకటి. నా అంచనాలో భూస్వామ్య వర్గాలె పెద్ద ప్రతిబంధకం అపుడు వుండె. తర్వాత ఏం జరిగింది ముఖ్యంగ ఎన్టిఆర్ వచ్చిన తర్వాత ఈ కమ్మ బిజినెస్ ఇంట్రెస్ట్ ఇక్కడ బెరిగినపుడు, తెలంగాణ సెకండ్రేట్ లీడర్స్ అందరినీ వాల్ల బుట్టలో ఏసుకున్నరు. ఈ రియల్ ఎస్టేట్ పేరుతో, ఫిలిం ఇండస్ట్రీ పేరుతో, వ్యాపారాల పేరుతో తెలంగాణలో వున్నటువంటి ఆ రెడ్డి వర్గాన్ని గాదని ఈ ఎస్సి, బిసిలను కొంత మందిని బెట్టుకొని సెకండ్రేట్ వాల్లను బుట్టలో ఏసుకొనే వరకు, ఆ బిజినెస్ ఇంట్రెస్ట్ బెరిగిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో హైదరాబాద్లో ఈ మంత్రులందరు అదే గద. అదే ప్రతి బంధకం.

మూడవ దశ వచ్చే వరకు ఏందంటె ఈ కులాల ప్రస్తావన చాల వచ్చింది. అగ్రవర్ణాలతో ఒకసారి, బలహీన వర్గాలతో మరొకసారి ఒక్కొక్క దశలో ఒక్కొక్క ప్రతిబంధకమైంది. కని ఈ రోజు ఏమైంది అంటె సమగ్రత వచ్చింది. భూస్వామ్య వర్గాలల్లో గూడ తెలంగాణ గావాలంటున్నరు, బిజినెస్ వర్గాల వారు గావాలంటున్నరు. సామాజికంగ ఎన్ని చీలికలు వున్నా గావాలంటున్నరు. పెద్ద ప్రాసెస్ ఇది. ఈ రోజు సమగ్రత వచ్చింది. కనుకనే ప్రజల్లోకి బోయింది. దీనికి పెద్ద కొలమానం మొన్న బై ఎలక్షన్స్. తెరాస కొరకేసినారయ్య ఓట్లు? మన తెలంగాణ కొరకేసింద్రు వాల్లు.

# సామాజిక న్యాయం.. నా కాన్సెప్ట్ అదె

ట్రెమెండస్ ఛేంజస్ వుంటయ్. ఒకటి ఆర్థిక పునర్నిర్మాణంలో, బలహీనవర్గాల పాత్ర పెద్దగ వుంటుంది. ముఖ్యంగ వ్యవసాయ రంగం, గ్రామీణ ప్రాంతం. దానికి అనుబంధంగ విద్య, వైద్య రంగాల్లో వున్నటువంటి సంస్కరణలు జేస్తె అటోమాటిక్‌గ ఈ కార్పొరేట్ కల్చర్ బోతుంది. బోవాలెగద! కార్పొరేట్ కల్చర్ బోతె అటోమాటిక్‌గ ఈ వర్గాలకు ఆ ఎలిజిబిలిటి వస్తది. కార్పొరేట్ కల్చర్ వున్నంత కాలం వాల్లు పైకి రాలేరు. ఫస్ట్ ఎజెండా నాలాంటి వాల్లది కార్పొరేట్ కల్చర్ ఖతం గావాలె.

బిసి లీడర్‌షిప్ విషయంలో హండ్రెడ్ పర్సెంట్ కాన్ఫిడెన్స్ లేదుగని, ఎమర్జ్ అవుతున్నరు. జూస్తున్న.. నా అంచనా తప్పే గావొచ్చు. పాతతరంలో ఎవ్వరులేరు. అందరు దొంగలె. జెప్తున్న గద! కొత్తతరంలో మధుయాష్కీని మలుచుకోవచ్చు. మలిస్తె మలిగే అవకాశం వున్నది. ఎగ్జాంపుల్ చెప్తున్న. నా అంచనా తప్పో, రైటో చెప్పలేను గాని, మనిషిలో అవగాహన వుంది. కొత్తవాడు గనుక కొన్ని లిమిటేషన్స్ వున్నయ్. పాతవాల్లు మహా ఘోరం, ఈ కేశవరావులు, హనుమంతరావులు వాల్లంటె నాకు....!

ఇపుడు ఒకటి.. ఏది ఏమైన తెలంగాణ సెంట్రిక్ వుంటది. తెలంగాణ డెవలప్ గావాలె, డెవలప్‌మెంట్ ఫలితాలు సమాజానికి అందాలె. సామాజిక న్యాయం.. నా కాన్సెప్ట్ అదె. తప్పకుండ నాది ఓపెన్ రోల్. దేని కొరకు? తెలంగాణ దేని కొరకు? ఎవరి కొరకు? అప్పుడప్పుడు వీల్లు అడుగుతుంటరు, మీడియా వాల్లు అడుగుతుంటరు గదా! ఇపుడు మీరు ఇవాల ఇట్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి అడగుతున్నరు, తెలంగాణ గవర్నమెంట్ వచ్చినంక ఏం జేస్తరు? అంటె వాల్లు గూడ మేం అనుకున్నట్టు పనిజేయకపోతె ఇట్లనె నిలదీస్తం అపుడు. ఎవడన్న గాని, కాంగ్రెసా, తెరాసా మాకు సంబంధం లేదు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగ పనిజేయకపోతె, ఇట్లనె ఇదే పనిజేస్తం.

ఏముంటదయ్య ఇపుడు.. 2014 లోపల తెలంగాణ ఇస్తె, కాంగ్రెస్ గవర్నమెంటే వస్తది గద. అండ్ల సందేహం లేదు. వాల్లకు గావాల్సిన మెజారిటీలో పది, పదిహేను సీట్లు తక్కువుంటయ్ గావొచ్చు. వాల్లు ఎవరి సపోర్టు దీసుకుంటరు! అనే ప్రశ్న వచ్చినపుడు నా దృష్టిలో తెలంగాణ వచ్చినప్పుడు కాంగ్రెస్ గవర్నమెంటా? టిఆర్ఎస్ గవర్నమెంటా? అన్నది నాకు ముఖ్యం గాదు. సరుకు అదే గదనయ్య. సరుకు అదే గద! ఎట్ల పనిజేస్తరనేది ముఖ్యం. కనుక తెలంగాణ ప్రాంతంలోపల అల్టిమేట్‌గ తెరాస మెర్జ్ అయ్యిద్దా, కోపరేట్ జేస్తదా లేక సంకీర్ణమా? అనేది నా దృష్టిలో ఇంపార్టెంట్ గాదు. పొలిటికల్లీ రెండూ డామినెంట్‌గ వుంటయ్ ఇక్కడ.

# మొత్తం కమ్యూనిటీ డివైడ్ అయ్యింది

ఇపుడు కలిసి వుండడానికి ప్రతిబంధకాలు చాలా అయినయ్. శ్రీకృష్ణ కమిటీ వచ్చిందయ్యా, వాళ్లు ఏదో జెప్తరు. ఈ జరిగిన అన్యాయాలను రెక్టిఫై జేస్తరా కలిసుండాలంటె? ఫస్ట్ క్వశ్చన్ అదే వస్తది గద. ఇట్లనె వుండాలి అని ఎవడు జెప్పడు గద. రెక్టిఫై జేస్తరా? సాధ్యమయ్యే పనా? జరగదది! వీల్లు ఒప్పుకోరు, వాల్లు ఒప్పుకోరు. ఇంక ఫ్రిక్షన్ పెరుగుతది. ఈ రోజు క్యాబినెట్ మంత్రులు ఒక తీరుగ లేరు, ఎమ్మెల్యేలు ఒక దగ్గరలేరు, మొత్తం కమ్యూనిటీ డివైడ్ అయ్యింది. ఈ డివిజన్‌లో రేపు ప్రతిదాన్ని క్వశ్చన్ జేయరయ్యా? నిన్న ఎపిపిఎస్‌సి 190 పోస్టులు, రేపు లక్ష పోస్టుల గురించి అడుగుతరు. ఆ 42% ప్రతి దాంట్లో అడుగుతరు. ఇది ఆగదు గద. వీల్లు గావాలె అంటరు, వాల్లు వద్దంటరు. కనుక నిలిచేది గాదది. ఎందుకంటున్న అంటె ప్రజల్లోకి విపరీతంగ బోయింది. ఇపుడు మాలాంటి వాల్లం ఒక తరం పనిజేసిన తర్వాత, ఇపుడు మేం జెప్పక పోయినా మాట్లాడే తరం తయారయ్యింది. అది పెద్ద బలం ఉద్యమానికి. ఎట్ల మాట్లాడుతున్నరు పిల్లలు, ఎంతెంత నాలెడ్జబుల్‌గ పిల్లలు మాట్లాడుతున్నరు!

స్టూడెంట్స్ విషయంలో అప్పటికీ యిప్పటికి చాల డిఫరెన్స్ వున్నది. కల్చర్ అట్ల వచ్చేసింది. అప్పటి స్టూడెంట్ కమ్యూనిటీకి ఇప్పటికి చాలా తేడా వున్నది. సమకాలీన రాజకీయ పరిణామాల ప్రభావం గూడ పడ్డది వాల్లపైన. నేను స్టూడెంటుగ వున్నప్పటి నుంచి జూస్తున్న గద. నేను స్వయంగ స్టూడెంట్ యాక్టివిస్ట్‌నె గద. తర్వాత నా స్టూడెంట్స్ వచ్చింద్రు గద. ఇపుడిక వాల్ల స్టూడెంట్స్ వచ్చింద్రు గద. ఆ జనరేషన్ల తేడా వున్నది. అది అనివార్యం, ప్రపంచంలో ఎక్కడైన జరుగుతది అది. 1952లో నేను స్టూడెంటుగ బోయిన. స్టూడెంట్ స్టూడెంటే. ఇగ పార్టీ గీర్టీ ఏముండదు. స్టూడెంట్ స్టూడెంటే. అంతే!

అది.. కొంత మందిలో రకరకాల ఎలిమెంట్స్ వచ్చాయ్. కొనేటోల్లు వుంటరు, అమ్మేటోల్లు వుంటరు. ఇవన్నీ జరుగుతయ్ గద. మీడియా వాల్లనే జూయిస్తది. నిజంగ మెజారిటీ మంచిగున్నరు. మీడియా జూయించేది కొద్ది మందినే గద. మీడియా మొత్తం కంట్రోల్ వాల్లదె. ఇపుడు ఏ ఉద్యమం అయినా ఈ పర్వర్షన్స్ తప్పయ్. ఇక్కడ స్ట్రెంత్ ఏమిటి అంటె పబ్లిక్‌లో డీప్‌గ వుంది. ఎక్కడికి బోయిన పబ్లిక్‌లో ఈ విషయం గురించి మంచి అవగాహనతో వున్నరు వాల్లు.

తెలంగాణ వస్తది. దాంట్లో నాకు ఏమీ అనుమానం లేదు. ఇంత పరిపక్వత ఎపుడు రాలె. బుస్సున పొంగింది, పోయింది గాని నిలవలె. పదేండ్లు నిలవలె. పదేండ్లు నిలపడం లోపల కేసీఆర్ పాత్ర చరిత్రలో ఎప్పుడూ గుర్తించాల్సి వస్తది. ఎన్ని పొరపాట్లు జేసినా!

అంటె ఇక్కడ మీడియా పాత్ర, మనకు మీడియా కంట్రోల్‌లో లేదు గద. మీడియాది ఘోరమైన పాత్ర గద. ఇది.. ఎంత అన్యాయంగ జెప్తుంటరయ్య. ఏం జేస్తం కంట్రోల్ లేదు వాల్లకి. అదే 1952లో, 68లో మీడియా లేనేలేదు. మీడియా లేకున్న వుద్యమం నడిచింది.

అట్ల జరగగూడదు. ఇది పెద్ద వయొలెన్స్ అనుకోడం లేదు నేను దీన్ని. ఆత్మహత్యలు రేర్ ఫినామినన్. ఎక్స్‌పెక్ట్ చెయ్యలె. వయొలెన్స్ యిజ్ డిఫరెంట్ ఫ్రమ్ సూసైడ్స్. ఇది వయొలెన్స్ గాదు గద. యూత్‌లో, ఈ జనరేషన్ యూత్‌లో చాల ఫ్రస్ట్రేషన్స్ వున్నయ్. అవగాహన లోపం వున్నది. ఫ్రస్ట్రేషన్స్ వున్నయ్, ఎక్స్‌పెక్టేటేషన్స్ వున్నయ్. ఇవన్ని నాకు గూడ సరిగ అర్థం గావటంలేదు. పిల్లలు ఎందుకిట్ల జేస్తున్నరని. సెల్ఫ్ ఇంబ్యాలెన్, ఇది చాల విచిత్రమైన పరిణామం.

# పిస్టల్ ట్రిగ్గర్ నొక్కినట్టయింది

డిసెంబర్ 9 నాడు స్టేట్‌మెంట్ అకస్మాత్తుగ వచ్చింది గాదు గద. చాల పెద్ద నేపథ్యం వున్నది. ఇది యాభై ఏండ్లుగ నడుస్తున్న సమస్య. కేసీఆర్ నిరాహారదీక్షకు పూనుకోటం అనేది.. అదో ట్రిగ్గర్ తీరుగ అయిందన్నమాట. ఇంతకు ముందులాగ ఇపుడు తెలంగాణ గురించి ఉద్యమం నడుస్తనే వుంటది, తర్వాత ప్రస్తుతం వున్నటువంటి గవర్నమెంట్, మొదటి యుపిఎ గవర్నమెంట్ వాగ్దానం చేయనే చేసింది. కనీస ఉమ్మడి కార్యక్రమం పెట్టిరి. ప్రణబ్ ముఖర్జీ కమిటీ వేసింది. రాజీనామాలు, ఉప ఎన్నికలు అవన్నీ నడుస్తనే వచ్చినయ్. చివరికి విసిగిపోయిన తర్వాత కేసీఆర్ అప్పుడు దీక్షకు పూనుకున్నడు. నిరాహార దీక్షకు పూనుకున్నప్పుడు వచ్చిన రెస్పాన్స్ దేనికి సంకేతం అది? ప్రజల్లో వుండె, అది ట్రిగ్గర్ గావడానికి ఏదో ఒక సంఘటన గావాల్సుండె. కనుక అది సరిగ్గా సమయానికి ట్రిగ్గర్ చేసినట్టయింది. కనక అకస్మాత్తుగ వచ్చింది గాదు, వత్తిడి అని గాదు. కొంత మొదలు వుద్యమం యొక్క నేపథ్యం పాతది, తర్వాత గత పదేండ్ల నుంచి నడుస్తున్నటువంటి ఆ ఇంటెన్సిటీతో కేంద్ర ప్రభుత్వం కమిట్ అయింది. యుపిఎ కమిట్ అయింది. కనుక వాళ్లకు ఆ ఫీలింగ్ వుండె. గవర్నమెంట్ కమిట్ అయిందని వచ్చే ఫీలింగ్ కాదది. పబ్లిక్ రెస్పాన్స్ అన్ని సెక్షన్స్ ఆఫ్ పీపుల్, కేసీఆర్ అంటే ఇష్టం వున్నవాళ్లు, ఇష్టం లేనివాళ్లు అందరు గూడ రెస్పాన్స్ ఇచ్చింద్రు. అంటే వుద్యమం యొక్క బలం అది. కేసీఆర్ దీక్షకు పూనుకోటం, చెప్తిగద అదొక పిస్టల్ ట్రిగ్గర్ నొక్కినట్టయింది. పేలిందది! అకస్మాత్తుగ జరిగింది గాదు అది, ప్రెషర్ గూడ కాదది.

ప్రకటనజేసి వెనక్కి పోవడానికి కారణం ఆంధ్ర ప్రాంత లాబీయింగ్‌లు. ఆంధ్ర ప్రాంత లాబీయింగ్.. మొదట్నుంచి ఆంధ్ర ప్రాంత లాబీయింగే గద అడ్డం వచ్చింది. 1956లో ఫజల్ ఆలీ కమిషన్ తెలంగాణ ఇవ్వాలి అని ఫస్ట్‌టైం సిఫార్స్ జేసినంక గూడ అంతకంటె పెద్ద రికమండేషన్ వుండదు. వెనక్కి ఎవరు బోయింద్రు, ఎట్ల బోయింద్రు? వాల్లు ఆంధ్ర లాబీ వల్ల. అప్పుడూ ఆంధ్రలాబీల వత్తిడే, ఇప్పుడూ ఆంధ్రలాబీల వత్తిడే. నైతికమా, అనైతికమా అంటే అనైతికమే! అప్పుడూ అనైతికమే, ఇప్పుడూ అనైతికమే.

దానికి తెలంగాణవాదులు ఎవరు అంగీకరించలే. అది తప్పుడు ప్రచారం. శ్రీకృష్ణ కమిటీ వేస్తరని ఎవరికి చెప్పలే వాల్లు. ఇపుడు 23 డిసెంబర్ తర్వాత సంప్రదింపుల పేరుతో జనవరి 5న  2010లో ఏదైతే మీటింగ్ పెట్టింద్రో ఆ రోజు మీటింగ్‌లో స్పష్టంగా

నేనుగూడ వుంటి. చెప్పిందేమిటంటే, సంప్రదింపులు గావాల్నంటె ఎవర్ని సంప్రదిస్తరు ఇంక? ఇపుడు డిసెంబర్ 9న ప్రకటన కంటే ఒకరోజు ముందే ఇక్కడ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కూచొని ఏకగ్రీవ తీర్మానం చేసింది ఏవని! కాంగ్రెస్ హైకమాండ్ ఏది నిర్ణయిస్తే అది మాకు శిరోధార్యం అన్నరు. కొద్ది గంటల తర్వాతనే అఖిలపక్షం మీటింగ్ పెట్టింద్రు. అండ్ల తెలుగుదేశం అందరికి కంటే ముందుండె. ఇక పిఆర్‌పి గూడ తెలంగాణే అనే!

కొందరిచ్చింద్రు, కొందరివ్వలేదు. ఒకటేందంటె జనవరి 5న మీటింగ్ రోజు కమిటీ వేస్తమని ఎవరికి జెప్పలెవాల్లు. ఫర్‌దర్ కన్సల్టేషన్స్ గావాలె అంటే ఎవర్ని కన్సల్ట్ చేస్తరని అడిగింది నేనే. ఎవర్ని కన్సల్ట్ జేస్తరంటె పొలిటికల్ పార్టీలని. డిసెంబర్ 9 స్టేట్‌మెంట్‌కంటె ముందు కాంగ్రెస్‌ని అడిగితిరి. మిగతాపార్టీలు అందరు ఎస్ అంటిరి. అంతకు ముందు జాతీయ స్థాయిలో ప్రణబ్‌ముఖర్జీ కమిటీ పెట్టి దేశమంతా రాతపూర్వకంగా తీసుకొంటిరి. ఇంకెవర్ని కన్సల్ట్ చేస్తరు మీరు. ఇగ పోతే కాంగ్రెస్‌పార్టీ ఎస్ అని విభేదించింది, అంటే ఒక సెక్షన్ విభేదించింది, మొత్తంగాదు. తెలుగుదేశంలో గూడ ఒక సెక్షన్ విభేదించింది, మొత్తంగాదు. వాల్లని బిలిచి మాట్లాడుకోండి. ఎస్ అని నో అని ఎందుకన్నరో వాల్లని బిలిచి మాట్లాడుకోండి, కమిటి ఎందుకు? నువ్వే బిలిచి మాట్లాడుకో. నేను జెప్పింది గదే.

పోతే ఇంక గ్రూపు లంటే ఏ గ్రూపులని పిలుస్తరు. జెఎసిలంటరా? వందలున్నయ్, వేలున్నయ్. ఎవరిని బిలిచి మాట్లాడుతరు. కనుక ఫర్‌దర్ కన్‌సల్టేషన్ అనేది అవసరమే లేదు. ఒకవేళ అవసరమనుకొంటే హోంమినిస్టర్ స్వయంగా ఏ పార్టీలైతే మాట తప్పినవో వాల్లని బిలిచి మాట్లాడుకుంటే సరిపోతది. ఆరోజుకొచ్చిన అంగీకారం అది. ఫర్‌దర్ కన్సల్టేషన్స్ అన్నప్పుడు కమిటీ వేస్తం, జడ్జితో వేస్తం అని ఎవడు అన్లే అక్కడ. ఇక్కడ ఫర్‌దర్ కన్సల్టేషన్ గావాల్నంటే మిగతా వాల్లు కాంగ్రెసోడు ఎస్ అన్నడు, వాడువీడు ఎస్ అన్నడు. మేం క్వశ్చన్ చేసినం. ఎవర్ని కన్సల్ట్ చేస్తరు? రాజకీయ ప్రకటన అయిపోయింది గద. రాజకీయ ప్రకటన అయిపోయింది!

రెండు పార్టీలు మాత్రం మాటతప్పినయ్. పార్టీలు మొత్తం గూడ నో అన్లేదు, మాట తప్పినయ్ అంతే. వాల్లని బిలిచి మాట్లాడితే అయిపోతుంది గద. ఆ ప్రాంతం వాల్లని పిలిచి మాట్లాడితే అయిపోతుంది, ఆ పార్టీ ప్రెసిడెంట్స్‌ని బిలిచి మాట్లాడితె అయిపోతది గద, చెప్పింది గది. తర్వాత కమిటి వేసినంక చెప్పాల్నా వద్దా అనే భేదాభిప్రాయం వుండె. చెప్పాల్నా వద్దా అంటే మనం చెప్పేది చెప్పాలె. చెప్పలేదు గద అంటరు, ఆ

వుద్దేశంతో. కమిటి ఫస్ట్ బిలిచింది తెరాసనే. అందులో నేనుగూడ బోయిన. ఫస్ట్ చెప్పిందే అది. కమిటీ సభ్యులను గురించి మేమేం కామెంట్స్ జేయం. కమిటి ఇచ్చిన టర్మ్స్ మాత్రమే మాకు అభ్యంతరం. కమిటి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ అభ్యంతరం వున్నా ఎందు కిస్తున్నం అంటే బై డిఫాల్ట్. మా వాదన ఏమిటి? ఫ్యాక్ట్స్ ఏమిటి అని చెప్పడానికి ఆ సాధన సంపత్తి మా దగ్గర్నే వుంది గనుక, మీకు జెపుదామని వచ్చినం అన్నం. స్పష్టంగ జెప్పినం.

కనుక.. కమిటి కాన్స్టిట్యూషన్ చేస్తామనేది అది కేవలం కేంద్రప్రభుత్వ నిర్ణయం. అఖిలపక్ష నిర్ణయం కాదది. అఖిలపక్షంలో ఫర్దర్ కన్సల్టేషన్స్ గావాలి అంటె మంచిదని కొందరు, ఇంకేం జేస్తరని మనం అన్నం గంతే. కమిటితోటి ఇంతపెద్ద తతంగం జేస్తరని అనుకోలేదు. జనవరి 5న ఎట్ల మీటింగ్ బెట్టినవో, గట్లనే ఇంకో మీటింగ్ బెట్టుకో, ఆ ఇద్దరిని బిలుచుకో. మిగతావాల్లు చెప్తనే వుంటిరి. ఎవరిస్టాండ్ వాల్లు చెప్తనే వుంటిరి. కొత్తగ జెప్పేదేంటి అని. కనుక ఈ కమిటి కాన్స్టిట్యూషన్ అనేది అది గూడ కేంద్రప్రభుత్వం తీసుకొన్నటువంటి నిర్ణయమది. దానికి ప్రెషర్స్ ఏవన్న వచ్చినయా అంటే ఆంధ్ర లాబీ యింగ్ ప్రెషర్స్. ఏమైందంటె, డిసెంబర్ 9 స్టేట్‌మెంట్‌కు వ్యతిరేక ప్రెషర్స్.. గవే ప్రెషర్స్ పనిజేసినయ్.

# ఆంధ్ర లాబీల కుట్రల చరిత్ర

ఆంధ్ర లాబీలోపల, మొదట్లో 1956లో ఆంధ్రలాబీ ఇంట్రస్ట్ ప్రధానంగ గ్రూపులు కట్టడం. ఆరోజు ఆంధ్రరాష్ట్రంలో వున్నటువంటి ఆర్థిక దుస్థితి అది. మద్రాసు నుంచి విడిపోయిన తర్వాత రాష్ట్రం చాల దుస్థితిలో వుండేది. అవన్ని తెలుసుగద. అండ్లకెల్లి బయటపడాలని. ఇపుడు ఫజల్ అలీ కమిషన్ రిపోర్ట్ రాంగనే అప్పటి నాయకులు, ఎవ డెవడో వుండె.. నా పుస్తకాలు చూసినవ్ గద. బ్రహ్మానందరెడ్డి అన్నడు, సంజీవరెడ్డి అన్నడు, గోపాలరెడ్డి అన్నడు, చివరికి టంగుటూరి ప్రకాశం గూడ అన్నడు. అండ్ల ఎక్క డైన గాని తెలుగుభాష, తెలుగు సంస్కృతి, భావ సమైక్యత అనే పదం వున్నదా ఎక్కడన్న? అయ్యో ఇది రాకపోతే మనకు పైసలకు కష్టమైపోతది, రాజధాని లేదు, నీళ్లురావు గవే కతలు గద! కనుక ఆ రోజు ఏంటంటే, ఆ రోజు ఆంధ్రరాష్ట్రంలో వున్నటువంటి ఆర్థిక దుస్థితి, వనరులు లేకపోవడం, రాజధానికి కావాల్సిన వసతులు లేకపోవడం, అవి ప్రధాన కారణాలు. మరి వాటివల్ల కేంద్రప్రభుత్వం ఎందుకు లొంగింది అంటే, ఆ రోజు కేంద్ర ప్రభుత్వం లొంగడానికి కారణం స్వాతంత్ర్యం రాకముందు 1948లో పోలీస్‌యాక్షన్ జరిగి నంత వరకు గూడ, బ్రిటిష్ ఇండియా వల్ల ఆంధ్రప్రాంత రాజకీయ నాయకులకు జాతీయ నాయకులతోటి డైరెక్ట్ సంపర్కాలుండె. డైరెక్ట్ సంపర్కాలుండె వాళ్లకు. తెలంగాణ వాళ్లకు ఆ అవకాశమే రాలేదు గద! తెలంగాణ వాళ్లకు నిజాం వ్యతిరేక పోరాటాలు నడిచినయ్. కని జాతీయ నాయకత్వంతో ఎంత పెద్దవారైనా డైరెక్ట్ సంపర్కాలు లేకుండె. కనక ఆ లాబీ పనిచేసింది. కనుక అప్పుడేంటంటె పొలిటికల్ లాబీ, కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ లాబీ కేంద్రప్రభుత్వాన్ని ఇన్‌ఫ్లుయన్స్ చేయగలిగింది. కేంద్రప్రభుత్వం ఇన్‌ఫ్లుయెన్స్ గావడానికి కారణాలేమిటి? కేంద్రప్రభుత్వం స్వయంగా, నెహ్రూ స్వయంగా తెలంగాణ గావాలన్నడు. ఫజల్అలీ కమిషన్ చెప్పిన తర్వాత కారణాలేమైనయి అంటే, ఆంధ్రప్రాంతపు రాజకీయ నాయకులు చాల సక్సెస్‌ఫుల్‌గ కుల రాజకీయాలు ఆడింద్రు. దానికి తెలంగాణ వాళ్లు స్టకప్ అయ్యింద్రు.

దానికి రెండు కారణాలు. అంటే ఆ రోజు వున్నటువంటి ఆంధ్రప్రాంతపు నాయకుల మాట ఎందుకు చెల్లింది అంటే, కేంద్రప్రభుత్వం ఎందుకు లొంగింది అన్నప్పుడు, ఒకటి రాజకీయ నాయకులకు అక్కడ వున్నవాళ్లతో వున్న సంపర్కం మన వాళ్లకు లేకుండె. రెండోది ఏందంటే, ఒకనాడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లోపల బ్రాహ్మిణ్

వర్గానికి అప్పర్‌హ్యాండ్ వుండె. తెలంగాణ ప్రాంతంలో వున్న ముఖ్యమంత్రి బ్రాహ్మిణ్ వర్గం వాడు. ఐతే ఇక్కడ పవర్‌ఫుల్‌గ వున్నటువంటిది 1948 కంటే ముందు వున్నటువంటి ఆ భూస్వామ్య వర్గం ఏదైతే వుందో, రెడ్డి వర్గం ప్రధానంగ, భూస్వామ్య వర్గం అంటే రెడ్డి వర్గమనే అర్థం ఒక విధంగ. సరె వెలమలు, బ్రాహ్మలు వుండె గాని ప్రధానంగ రెడ్డి వర్గాన్నే భూస్వామ్య వర్గమనేది. నిజంగ రజాకర్లతో చేతులు కలిపి రాజ్యమేలింది వాల్లే.

1948 సెప్టెంబర్ దాకా షేర్వాణిలు, రూమీ టోపిలు పెట్టుకుని తెల్లవారే సరికి ఖద్దరు ధోతులు, గాంధిటోపిలు బెట్టుకున్నరు. వాల్లే కాంగ్రెస్ నాయకులయ్యింన్రు. ఐతే ఈ నాన్ రెడ్డి, బ్రాహ్మిణ్ గ్రూప్ పవర్‌లో వుండె అప్పుడు. బూర్గుల రామకృష్ణారావు వుండె, సిఎం ఆయనే. ఆంధ్రప్రాంతంలోపల కళా వెంకట్రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వీల్లదంతా పవర్‌ఫుల్ గ్రూప్. ఆంధ్రప్రాంతం వాల్లు తెలంగాణ వాల్లని ఏమని భయపెట్టిచ్చినారంటె- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అంటె ఈ రెడ్లే రాజ్యాధికారంలోకి వస్తరు, ఈ బ్రాహ్మిణ్ వర్గం పోతది! ఈ విషయాన్ని ఆ రోజు గోల్కొండ పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి రాసిండు, నేను చెప్పే మాటలు గావు. ఒక రెడ్డి వర్గానికి చెందినటువంటి ఆయన, ఆయన రాసిన పత్రికలోని మాటలే.. వాస్తవాలవన్నీ. కనుక దానికేమిటంటె ఒక ముసుగుపెట్టింన్రు. ఒక టేంటంటె ఫ్యూడల్ వర్గాలు, నిజాం కాలంలో వున్న ఫ్యూడల్ వర్గాలే రాజ్యాధికారంలోకి వస్తే.. అసలు సంగతి ఏందంటే రెడ్లు వస్తరు.. వాల్ల ప్రాముఖ్యం పోతది అని. అలా కుల రాజకీయాలకు అక్కడ్నే నాంది పలికింన్రు. ఇంకోరు అదే చెపుతాంన్రు ఇపుడు.

తర్వాత ఏమైంది, కేంద్రానికి వీల్ల సపోర్టు. నెహ్రూకు ఈ కుల రాజకీయాలు పడేది గాదు. కనుక వీల్లు సక్సెస్‌ఫుల్‌గ గోవింద్ వల్లభ్ పంత్‌ని బట్టుకున్నరు. గోవింద్ వల్లభ్ పంత్ హోం మినిస్టర్, అపుడు చాల పవర్‌ఫుల్ మ్యాన్. నెహ్రూ చాలా గౌరవించినటువంటి పెద్ద నాయకుడాయన. కనుక ఈ ఆంధ్రలాబీ మొత్తం నాన్‌రెడ్డి బ్రాహ్మిణ్‌ల లాబీ. తెలంగాణలో నాన్‌రెడ్డి బ్రాహ్మిణ్‌లను ఇంప్రెస్ చేయడానికి గోవింద్ వల్లభ్ పంత్‌ను బట్టుకున్నరు. అదొక రీజన్. రెండవది ఏమైందంటె.. సాయుధ పోరాటం తర్వాత, నిజంగా సాయుధ పోరాటం నిజాంకు వ్యతిరేకమైతే 1948 సెప్టెంబర్‌తో ఆగిపోవాలె. ఆగలే గద! 1951 దాకా నడిచింది. కనుక ఇంకోటి ఏమైందంటె వొకవేళ ఈ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగ వుంటే, ఈ సాయుధ పోరాటం ఫాలో అవటం వలన తెలంగాణ.. కమ్యూనిస్టుల చేతుల్లోకి పోతది అని ఒక భయం.

ఐతే ఆంధ్రప్రాంతపు కమ్యూనిస్టు వాళ్లకి ఏముందంటె, విశాలాంధ్ర వస్తే వాళ్ల రాజ్య మొస్తదని ఒక భ్రమ వుండె. రెండు నాన్‌రెడ్డి రూలింగ్ సెక్షన్స్‌కు ముఖ్యంగ బ్రాహ్మిణ్ సెక్షన్‌కు ప్రత్యేక తెలంగాణ వస్తె రెడ్ల రాజ్యం వస్తది అనేటువంటిది భ్రమ. కమ్యూనిస్టుల వాళ్లకు విశాలాంధ్ర వస్తే, వాళ్లకు కమ్యూనిస్టు రాజ్యం వస్తదని చెప్పి ఒక ఆశ. వాళ్లకు భయం, వీళ్లకు భ్రమ! చివరికి ఏమైంది రెడ్ల రాజ్యం బోలె, కమ్యూనిస్టు రాజ్యం రాలె. చివరికి జరిగిందిది. కనుక లాబీలు పనిచేసినటువంటి చరిత్ర 1948-50కి ముందు ఇట్ల పనిజేసినయ్. ఒకటి స్వాతంత్ర సమర యుద్ధంలో, సమరంలోపల ఆంధ్రప్రాంతం రాజకీయ నాయకులకున్న వెసులుబాటు తెలంగాణ వాళ్లకు లేకుండె. రెండవది తెలంగాణ ప్రాంతపు నాన్‌రెడ్డి సెక్షన్స్‌ను ఇంటర్వీన్ చేయడానికి కులవాదాన్ని తీసుకొచ్చింద్రు. ఇంకోటి కమ్యూనిస్టులు.. ముఖ్యంగ సాయుధపోరాటం సాకుగ వాడుకున్నరు. ఇవన్నీ ఇట్ల లాబీగ పనిజేసినయ్. కులాల లాబీ పనిచేసింది, ఐడియలాజికల్ లాబీ పనిచేసింది, స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న గ్రూపుల లాబీలన్నీ పనిచేశాయ్. మొత్తం మీద కేంద్రప్రభుత్వాన్ని లొంగదీసుకున్నరు. లాబీయే గద, అదే సంస్కృతి! అదే సంస్కృతి కొనసాగుతుంది నేటికీ.

1970కి వచ్చే వరకు పూర్తిగ మారిందనడంలేదు. కుల రాజకీయాలు అప్పుడు వున్నయ్, 70లోగూడ వచ్చినయ్. 70కి వచ్చేవరకు ఏం జరిగిందంటె, ఇందిరాగాంధి అధికారంలోకి వచ్చింది. అపుడు ఇందిరాగాంధీ పైన చాన పెద్ద ఇన్‌ఫ్లుయన్స్ వుండె. సిపిఐ మీద గూడ వుండె. ముఖ్యంగ డాంగే ఆమెను భయపెట్టిండు, ప్రత్యేక తెలంగాణ అయితే కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరుగుతది అని. అప్పుడప్పుడే నక్సలైట్ వుద్యమం వస్తున్నది. ప్రధానంగ సిపిఐ ఆరోజు ఆమెను ఇన్‌ఫ్లుయన్స్ చేసింది. పోతె ఆ రోజు ఇందిరాగాంధికి తిరుగులేకుండె. ఏమిటి ఆమెకుండె భయాలు అంటె, ఆంధ్రప్రాంతం తెలంగాణ నుంచి విడిపోతే ఆమె కంట్రోల్ పోతుందేమోనని భయం పడ్డది. తెలంగాణ ప్రజల పట్టు ఎందుకంటే, ఇక్కడ లాయల్టీస్ కాంగ్రెస్‌పార్టీకి తెలంగాణలో వున్న లాయల్టీ ఆంధ్రలో లేదు. ఇప్పటికీ అది బలహీనతా? లేకపోతె స్ట్రెన్తా? అంటె అది వేరే విషయం. కని, తెలంగాణ ప్రాంతం ఎప్పటికి కాంగ్రెస్‌కు స్ట్రాంగ్ హోల్డ్. ఒక్క తెలుగుదేశం వచ్చినపుడు వేరుగ జరిగింది. అది వేరే విషయం గని, మొదట్నుంచి తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్‌కు తిరుగులేదు.

పోయి పోయిచివరికి ఏమైంది, ఎన్టీ రామారావు కాలం వచ్చేవరకు పరిస్థితి ఎట్ల మారిందంటే, ఆంధ్రప్రాంతం లోపల మనకంటే ముందు నీళ్లు వాడుకొని సంపన్నులైండ్రు. ఫిల్మ్ ఇండస్ట్రీ వచ్చేసింది, వ్యాపారం వచ్చేసింది. ఒక బలమైన సామాజిక వర్గం, ఎన్టీ రామారావు సామాజిక వర్గం మొత్తం బిజినెస్‌లో, ఫిల్మ్ ఇండస్ట్రీలో డామినేట్ అయి పోయింది. ఒక్కొక్కరు మనీబ్యాగ్స్ కలిసి పోయిండ్రు. దానికి తెలుగు సంస్కృతి, తెలుగు చరిత్ర అని ముసుగువేసి మనీబ్యాగ్స్ లాబీయింగ్ మొదలైంది. అది బలపడిపోయింది. మనీబ్యాగ్స్ లాబీ బలపడ్డ తర్వాత ఏమైందంటె, తెలంగాణ ప్రాంతంలో చిన్న చిన్న వాల్లు వాల్లకు చేరువై ఈ ల్యాండ్ స్పెక్యులేషన్ లోపల, రియల్‌ఎస్టేట్ లోపల వాల్లకు సబార్డినేట్స్‌గ వుండి కొంత సంపాయించుకున్నరు. వాల్లకు లాయల్ అయిపోయిండ్రు.

కని తెలంగాణ ప్రాంతంలో నియోరిచ్ అరిస్టోక్రాటిక్ ఫ్యూడల్స్‌ను పక్కకు పెట్టు. నియోరిచ్ వచ్చిన తర్వాత నియోరిచ్ దేనికి, ఈ ల్యాండ్ రియల్‌ఎస్టేట్ వల్ల ఈ మల్టీ నేషనల్ దాన్లోపల వీల్లకు వచ్చింది కొసరే. రియల్‌ఎస్టేట్‌లో గాని, మల్టీ నేషనల్ కంపెనీల్లో గాని, వ్యాపారంలో గాని, ఫిల్మ్ ఇండస్ట్రీలో గాని వీల్లకు వచ్చింది కొసరే. కని వాల్లకు సబ్ సర్వీయంట్ అయిపోయిండ్రు. కనుక మనీబ్యాగ్స్ లాబీయింగ్ వల్ల తెలంగాణ ప్రాంతంలో వున్నటువంటి పొలిటికల్ లీడర్‌షిప్ అంత దానికి దాసోహమన్నరు. కనుకనే తెలంగాణలో పొలిటికల్‌గ ఎదగలె. ఈ తెలంగాణ ప్రాంతం లోపల ముఖ్యమంత్రి అయితా అని ఎవడు క్లెయిమే జేయలేని పరిస్థితి. కనుక మనీబ్యాగ్స్ లాబీ వచ్చేసింది. ఎన్టీరామారావు వచ్చిన తర్వాత! అది రాజశేఖరరెడ్డి వచ్చేవరకు తారాస్థాయికి చేరింది. కనుక రాజశేఖరరెడ్డి వచ్చేవరకు మనీబ్యాగ్స్ లాబీ స్థిరపడ్డది.

క్యాస్ట్ లాబీలు ఇంకా స్థిరపడి పోయినయ్. అవి ఎంత స్థిరపడిపోయినయంటె, రెడ్డి అయితే చాలు అతను క్రిస్టియనా, కాదా అని చూడలేదు ఎవరు. నిజంగా జూస్తే బ్రహ్మా నందరెడ్డి క్రిస్టియనే, నేదురుమల్లి గూడ అంటరు, మరి నాకు దెలవదు. రాజశేఖరరెడ్డి అదే, కిరణ్‌కుమార్‌రెడ్డి అంటరు నాకు దెలవదు మరి. అంటె ఏమంటె ఆ లేబుల్ అయ్యేవరకు.. దానికి తోడు ఏందంటె, తెలంగాణ ప్రాంతపు రెడ్డి వర్గము, ఆంధ్రప్రాంతపు రెడ్డి వర్గము కలిస్తినె ఆ సామాజిక వర్గానికి పెద్ద బలం. విడిపోతే అంత వుండదు. కనుక తెలంగాణ ప్రాంతంలో రెడ్డి వర్గాన్ని ఆంధ్ర ప్రాంతపు రెడ్డి వర్గం, ముఖ్యంగ రాయలసీమ రెడ్లు కంట్రోల్లో పెట్టుకున్నరు. మనం కలిసి లేకపోతె మీకు అధికారం వుండదు. ఈ అధికారం కేవలం పొలిటికల్ గాదు, ఎకనామికల్. ఈ వ్యాపారాలు ఇవన్ని పెరగాలంటె

ఎకనామికల్ పవర్ గూడ మీకుండాలె. సాధారణంగ ఆ కమ్యూనిటి నుంచి అప్పుడప్పుడు మనకు సమస్యలు, తెలంగాణలో వాటి వల్లనే వస్తున్నయ్.

కనుక ఇపుడు నడుస్తున్నటువంటి లాబీయింగ్ లోపల కులాలున్నయ్, ప్రాంతాలున్నయ్, డబ్బు సంచులున్నయ్. కనుక మొత్తం మీద లాబీ. లాబీల స్వరూపం మారొచ్చు, లాబీలో వుండెవారి కాంబినేషన్ మారొచ్చు, కని లాబీలవె. ఆంధ్రప్రాంతపు లాబీ ఎప్పటికీ ఎందుకు పవర్‌ఫుల్ అంటె, ఎప్పటికైన అడ్వాంటేజే. రాజకీయంగ వాల్లకు స్వాతంత్ర పోరాట చరిత్ర వుంది, ఆర్థికంగ మనకంటె ముందున్నరు. తర్వాత రాష్ట్రం వచ్చినపుడు బాగుపడ్డది వాల్లే. తర్వాత తెలంగాణ ప్రాంతాన్ని, రాజకీయ నాయకత్వాన్ని ఎదగనివ్వలేదు. ప్రధానంగ ఉమ్మడి రాష్ట్రంలో మేజర్ సమస్య ఏందంటె.. తెలంగాణ ప్రాంతపు రాజకీయ నాయకత్వాన్ని వాల్లు ఎదగనివ్వలేదు, ఎదిగినా నాయకత్వాన్ని బతకనివ్వలేదు. కాంగ్రెస్ అదే, తెలుగుదేశం అదే.

# ఒక రహస్యం దాగి వున్నది

ఇక్కడ లెఫ్ట్ ఓరియెంటెడ్ పాలిటిక్స్.. తెలంగాణ ప్రాంతాన్ని ఎక్కువ ప్రభావితం చేయలేదు. ప్రత్యేక రాష్ట్రంగ వుంటె జరిగేది గావొచ్చు. ఉమ్మడి రాష్ట్రంలో జరగలె. ఎందుకు జరగలేదంటె ఆంధ్రప్రాంతపు ఆ.. అదే లెఫ్ట్ పరిభాషలో ఆక్యులర్ సెక్షన్స్ ఏవైతె వున్నయొ వాటి డామినేషన్ పెరిగింది. కోస్తాంధ్ర నుంచి అంత అదేగదనయ్య! రెండోవది ఏమైందంటె ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఫస్ట్ బూర్గుల రామకృష్ణారావు గవర్నమెంట్‌లో ల్యాండ్ రిఫామ్స్ ప్రవేశపెట్టినప్పుడు, ల్యాండ్ రిఫామ్స్ బూర్గుల రామకృష్ణారావు ప్రవేశపెట్టి నప్పుడు దేశం లోపల్నె మొట్టమొదటి సంస్కరణ అది. దాని వెనుక వున్న వుద్దేశం ఏందంటె తెలంగాణ ప్రాంతంలో రెడ్డి భూస్వామ్య వర్గ ప్రాధాన్యత తగ్గించాలనే ఒక రహస్యం దాగి వున్నది. కని అందరు ప్రజాహిత సంస్కరణ అని వెల్‌కమ్ చేసింద్రు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడకపోయి వుండి వుంటె అది బహుశః స్థిరపడి పోయేది. అంటె ఆ రిఫామ్స్ యొక్క లాజికల్ ఎండ్‌కు పోగలిగేవాల్లం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు బ్రేక్ పడ్డది. పి.వి.నరసింహారావు చేసింది అదో కంటితుడుపు చర్య. కనుక ల్యాండ్ రిఫామ్స్ అనేది ప్రత్యేక రాష్ట్రం వుంటె వెంటనే జరిగిపోయేది. జరిగింది అమలయ్యేది. ఈ ఆంధ్రప్రదేశ్ ఇవ్వడం వల్ల బూర్గుల రామకృష్ణారావు ప్రవేశపెట్టిన దానికి బ్రేక్‌పడ్డది. పి.వి.నరసింహారావుది అంత సమగ్రమైనటువంటిది గాదు. చివరికి ఏమైందంటె కాయితాల మీదే మిగిలివున్నది.

# అకస్మాత్తుగ తుంచిపారేయలేం

ఇపుడు ఒకటేందంటె అడ్వాంటేజ్ అయింది, డిస్ అడ్వాంటేజ్ అయింది. (మావోయిస్ట్ యితర గ్రూపుల వల్ల) అడ్వాంటేజ్ ఎట్లయిందంటె, ప్రజల చైతన్య స్థాయి పెరిగింది. ఈ రోజు తెలంగాణ ప్రాంతం లోపల ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగ కొంతైనా పని జరిగింది అంటె వాల్లవల్లనే జరిగింది. లేకపోతె ఫ్యూడల్ వ్యవస్థ ఇప్పటికే మింగేసేది మనల్ని. ఫ్యూడల్స్‌పైన తప్పకుండ ప్రభావం పడింది. జనచైతన్యం బాగా పెరిగింది. తెలంగాణలో నాటి నుంచి నేటి వరకు ఈ ఉద్యమాల వలన తెలంగాణ ప్రాంతంలో చైతన్యస్థాయి పెరిగింది. ఇతర ప్రాంతంలో పెరగలేదు ఈ విషయాల్లో.

కామన్ మ్యాన్స్ వెల్‌ఫేర్ అనేదాంట్లో డామినేషన్ ఆఫ్ రిచర్ సెక్షన్స్, ల్యాండ్ లార్డ్ సెక్షన్స్, ఫ్యూడల్ సెక్షన్స్‌ల లోపల తెలంగాణకు వచ్చిన చైతన్య స్థాయి ఆంధ్రప్రాంతంలో రాలె. వచ్చివుంటె కోస్తాంధ్ర పరిస్థితి అట్ల వుండేది గాదు. కాన్‌సన్‌ట్రేషన్ అంత వుంది అక్కడ. నష్టం ఎక్కడయ్య అంటె వాల్ల మెథడ్స్ వల్ల. వాల్ల ఆచరణలో పెట్టినటువంటి పద్ధతుల వల్ల అనుకున్న ఫలితాలు రాలేదు. దారి తప్పినయ్. ఇక్కడ ఒరిజనల్ యేదైతె ఐడియలిజంతో వచ్చింగ్రో, ఆ ఐడియలిజం లేకుండ పోయింది. పోయె వరకు చిన్నాభిన్నం అయిపోయింది. కనుక లాభమా, నష్టమా అంటె నా దృష్టిలో రెండూ జరిగినయ్. జనచైతన్య స్థాయి పెంచడంలో అపారమైనటువంటి ప్రభావం పడింది. దాన్ని కన్సాలిడేట్ జేసుకొని దాని లాభాలు పొందడానికి ఏదైతే వ్యూహరచనలు చేయవలసి వుండెనో అది అక్కడ విఫలమైంది.

ఒకటి క్యాస్ట్ కంటె ఎక్కువ డామినేషన్.. జెప్తున్న కద వాల్లది మతమే అను, కులమే అను ప్రజలకు కొన్ని ఇన్‌గ్రెయిన్డ్.. ఒక పరంపరలో, తరతరాల పరంపరలో వచ్చినటువంటి కొన్ని పర్‌సెప్షన్స్ వుంటయ్. కొన్ని భావాలుంటయ్. వాటిని తుడిచేయలేం. దానికి పాజిటివ్ డైరెక్షన్ ఇవ్వాలి. గాంధీ జేసిన ప్రయత్నం అదే. గాంధీ సక్సెస్‌ఫుల్ అయ్యిండా కాలేదా అంటే, కనీసం దళితుల పునరుద్ధరణకు గాంధీ వేసిన పునాది కొంత పని జేసింది కద. కని గాంధీ హిందూ రామనామస్మరణ జేసినవాడె. రామ్‌రహీమ్ రెండు అన్నడాయన. అంటె ఎందుకన్నడు, ప్రజల పర్‌సెప్షన్స్‌ను ప్రజలలోంచి తీసేయలేం మనవవి. ఇపుడు పరిస్థితి ఏమిటంటె ఇపుడు కమ్యూనిస్టులంతా నాస్తికులేనా? కాదు గద. కమ్యూనిస్టుల్లో ఆస్తికులున్నరు, కమ్యూనిస్టులు కాని వాల్లల్లో నాస్తికులున్నరు. చాల ఓపెన్‌గ వున్నరు.

కనుక ఏంటంటె కొన్ని విశ్వాసాలుంటయ్. ప్రతి జాతికి, ప్రతి సంస్కృతికి. ఆ జాతిలోనే వచ్చినటువంటి కొన్ని విశ్వాసాలను మనం అకస్మాత్తుగ తుంచిపారేయలేం. వాటిని మలుచుకోవాలె. మలుచుకోవాలె అన్నప్పుడు ఏందంటె.. దేవుడు లేడు, గుడులు వద్దనడం ఒకటి, గుళ్లోకి అందరు పోవాలె అన్నది ఒకటి. అప్రోచ్.. దళితులకు గూడ గుళ్లో ఆ స్థానం వుండాలనే అప్రోచ్ ఒకటి, అసలు గుళ్లే వద్దనేది ఒకటి. గుళ్లే వద్దనేది పనిజేయలె, గుళ్లోకి దళితుల ప్రవేశం పనిజేసింది. స్ట్రాటజీస్ జెప్తున్న!

## ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్యు రెండు ఒకటే

ఇబ్బందులు అంటె.. ఇబ్బంది అనే పదం గూడ కరెక్ట్ అవునో కాదో గని ఒకరకమైనటు వంటి చెప్పుకోలేని పరిస్థితి. ఎగ్జాంపుల్ ఇస్త నేను. జనసభ ఫార్మేషన్ జరిగింది. ఓపెన్గ అసోసియేట్ అయిన గద. నేను ఏది జేసినా ఓపెన్గ జేస్త, గుస గుసలుండవు. కంబ్యాట్ మ్యాన్! మొదట్లో వాల్లక్కడ నన్ను బాధ్యత వహించమంటె కాదని చెప్పిన. ఇగ నేను ఎవరి జెండా ఎప్పుడు  బట్టుకోలేదు. నేను దాన్ని ఒక డెమొక్రాటిక్ మూవ్మెంట్ లోపల ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు పోతున్న తప్పితె, ఏ జెండా బట్టుకొనే అలవాటు లేదు నాటి నుంచి గూడ. అట్ల ఏ వేదిక సభ్యున్ని గాలేదు. మొదట్లో కొంచెం.. తర్వాత అర్థం జేసు కున్నరు. కాళోజి వాల్లు అర్థం జేసుకున్నరు సరె, మాకున్న సంబంధాల వల్ల నన్ను ఇన్వాల్ జేసిండ్రు. మొదలె అనుకున్నం అన్నమాట. ఒకటేందంటె తెలంగాణ రాష్ట్ర సాధన అనేది మన ఎజెండా. మీకు ఏపార్టీ సపోర్టు వున్నది అనేది, అది నిజమా అబద్ధమా అనేది వేరు విషయం. ఇంప్రెషన్ అదే గద. మీరు కాదనొచ్చు, నేను అవుననొచ్చు. ఒక ఇంప్రెషన్ మాత్రం విప్లవ పార్టీ యొక్క బ్యాకింగ్ వుంది. తప్పేం లేదు.

కని మీరు తీసుకొచ్చేది విప్లవ పార్టీ ఎజెండా గాదు, తెలంగాణ ఎజెండా. తెలంగాణ ఎజెండాతో బోయినపుడు ఒక కీలకమైన ఇష్యూ వస్తది. ఏందంటె  డెమొక్రాటిక్ మూవ్ మెంట్లో ఎలక్షన్స్ అనే ఒక ప్రక్రియ వుంటది. మనకు ఇష్టం వున్నా లేకున్న వుంటది. మనం పాల్గొనక్కర్లేదు, జనసభ పేరుతో ఎన్నికల్లో పాల్గొననక్కర్లేదు. కని ఎన్నికలు వద్దు బహిష్కరించాలె అన్న నినాదం మనకు పనికి రాదు. మిమ్మల్ని యెవరన్న పాల్గొనమం టున్నరా? మీరు పాల్గొనకండి. కనుక ఈ నినాదం మనకు సరిపోదు అంటె అందరు మంచిదే అన్నరు. అసలు మనం ఎందుకు మాట్లాడాలె ఎలక్షన్ గురించి. తెలంగాణకు జరిగిన అన్యాయాల గురించే మాట్లాడదాం. యీ ఫ్యూడల్ వ్యవస్థ, దెయిర్ లెగసీ, భూ స్వాములు అన్ని అవే మాట్లాడదాం. ఎన్నికల ద్వారా తెలంగాణ వస్తదని మనం గూడ అనడం లేదు. అననక్కర్లేదు, ఎన్నికల ద్వారా వస్తది అననక్కర్లేదు, ఎన్నికలు వద్దు అననక్కర్లేదు. ఎన్నికల గురించి డిస్కషనే మనకొద్దు, మనకనవసరం అని అందరిని తృప్తి పరుస్త అంటె చివరికి ఏమైంది? ఆ నినాదాన్ని ఏకపక్షంగ ఎత్తుకున్నరు. ఎత్తు కొనేవరకు మాలాంటి వాల్లం ఒక ప్రజాస్వామిక సంస్కృతి అనుకొంటున్నం. అది అవునా, కాదా అది వేరు విషయం. అనుకున్నప్పుడు అనేక క్వశ్చన్స్ యెదురైనపుడు ఈ టైంలో ఆ ప్రశ్నకు మా దగ్గర జవాబు లేదు.

ఇపుడు దీనికి ఏం జెప్తున్నరు, ఎగ్జాంపుల్, ఎన్నికల లోపల ఓటింగ్ జేసేవాళ్ల చేతులు నరుకుతం అంటే, కాళోజి నన్ను వెంట దీసుకపోయి మనమే ముందు ఓటేస్తున్నం ఎవరో వచ్చి చేయి నరకండి అన్నడు ఆయన. కాళోజి అన్నడు, ఎవరో గాదు. ఎందుకన్నడు అంటె! ఆ యాస్పెక్ట్ మరిచిపోగూడదు. ఆయనెంబడి నన్ను దీసుకపోయిండు. అపుడు ఓటర్ లిస్ట్‌లో నా పేరులేకుండె, ఓటేయలె. అది వేరు విషయం. అయితే నేను ఓటు వేయలేదు అంటె అది పిడబ్ల్యుజి కాలా (పిలుపా)? ఓటర్ లిస్టులో పేరు లేదు. అది అజాగ్రత్త. (పెద్దగా నవ్వు) అయితే అది అయ్యే వరకు ఏమైందంటె అరెస్టులు మొదలైనయ్. అరెస్ట్‌లు మొదలయ్యే వరకు కొందరన్నరు సార్ మీరు ఇడిపించాలె. ఈ పోలీసోల్లు చెప్తే జేస్తరు. నా మీద ప్రేమవల్ల గాదు నన్ను ఒబ్లైజ్ జేయించుకోడానికి. ఒకటైంది, రెండైంది, మూడైంది చివరికి పైరవీకారి అయిపోయిన. ఎలక్షన్ బాయ్‌కాట్ కాల్ యివ్వడం, వాడు అరెస్ట్ గావడం, మీరు జెప్పండి మీరు పోయి విడిపియ్యండి అంటె కొంత మంది విన్నరు. విన్నరు అంటె నా మీద ప్రేమగాదు ఏదీ గాదు. నన్ను ఒక విధంగా ఏందంటె ఆబ్లిగేషన్‌లో బడేసుకోవడానికి.

చివరికి ఒకసారి అన్న.. చూడండి ఉద్యమంలోపల, నేను గూడ నన్నెవరైన అరెస్ట్ జేస్తె రిలీజ్ జేయమని అడగను. పైరవీలకు బోను. మీరు గూడ ఎలక్షన్ బాయ్‌కాట్ కాల్ ఇచ్చింది జనసభ కాల్ కాదది. జనసభ కాలైతె మేం అసోసియేట్ కాం. పిడబ్ల్యుజి వున్నదే, వాల్లుజేస్తరెమొ నీకెందుకా లొల్లి. వాల్లు జేస్తనే వున్నరు గద నీకాలొల్లి ఎందుకు? అది విన్లే. అది పోయింది. సరె చివరికి జనసభకేమయిందో మీకు తెలుసు రకరకాలుగ. ఇగ అందులో మొన్న జెప్తిని ఎగ్జాంపుల్ జ్ఞాపకం వుందిగద. అటువంటి కొన్ని పర్సనల్ బిట్టర్ ఎక్స్‌పీరియన్సెస్ గూడ. నేను ఎందుకు బయటికి పబ్లిక్‌లో ఎందుకు జెప్పలేదు అంటె, ఒకటి మూవ్‌మెంట్‌తో నాకు వున్నటువంటి ఇన్వాల్‌మెంట్, రెండవది ఆ పిడబ్ల్యుజి సభ్యున్ని గాదు, సింపతైజర్‌గాన్నిగాదు, గాని వాల్లు జేసిన మూవ్‌మెంట్ వల్ల సామాజిక అవగాహన కలిగింది. ఒక చైతన్యం పెరిగింది అని విశ్వసించే వాల్లల్లో ఒకన్ని గనుక దాన్ని ఇష్యూ జేయలేదు. అయితే ఏం జరిగింది? అది జరుగుతుండేది ఈ స్టేట్‌మెంట్స్ ఇవ్వడం, వాల్లను రిలీజ్ జేయించడం, చివరకు మహబూబ్‌నగర్ యిన్సిడెంట్‌తో నేను కొద్దిగ స్లో డౌన్ అయిన. కాని డిస్‌అసోసియేట్ కాలే. ఇంపార్టెంట్ వుంది. అంటె తప్పకుండా పోయిన, మాట్లాడిన.

అక్కడ నాకు ఇండివిడ్యువల్స్ కంటె ఇష్యూ ముఖ్యం గనుక. నాతోపాటు నా మాదిరిగ ఆలోచించేవాల్లు, నాతో ఏకీభవించేవాల్లు, నాతో చాలా మంది పార్టిసిపెంట్స్ చాలా మంది స్టూడెంట్స్ ఇన్వాల్వ్ అయిండ్రు. చివరికి ఎంత వరకు బోయిందంటె మందాడి సత్యనారాయణరెడ్డి మాతోటి దిరిగేవాడు. ఆయనకు వేదిక లేదు. అప్పుడు ఆయన బిజెపి మనిషి. మందాడి సత్యనారాయణని ఎట్ల దీసుకున్నరు అని అభ్యంతరం వీల్లది. అయితే చివరికి వాల్ల టాప్ వాల్లతోని మాట్లాడిన. చూడయ్యా! తెలంగాణ గురించే మాట్లాడతాండు గదయ్యా, బిజెపి గురించి మాట్లాడితే నేనే పక్కకు బెడత. నేనే పక్కకు గూసోను. తెలంగాణ గురించి ఆ కాంటెక్స్ట్ గనుక. ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్‌యు రెండు ఒకటే అన్నమాట ఆ విష యంలో. ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్‌యు రెండింటిని పక్కపక్కకు కూర్చోపెట్టి మాట్లాడత తెలం గాణ విషయం వస్తె. పార్టీ ఏదైన నాకు సంబంధం లేదు. వీల్లు అక్కర్లె, వాల్లు అక్కర్లె. అట్ల పోయి పోయి చివరికి ఈ పోలీస్ సర్కిల్స్‌లో వాల్లకేమయిందంటె నేను జనసభతోని డిస్అసోసియేట్ అయితే అది ఆగిపోతుందని వాల్లకో ఇంప్రెషన్. అది రైటా, రాంగా తర్వాత. వాల్లకో ఇంప్రెషన్ అయితె వుండె.

ఒకరోజు ఏం జరిగింది? నేను హైదరాబాద్‌లో వున్న. డి.టి. నాయక్ అని అక్కడ ఐజి వుండె, ఫోన్ చేసిండు. కాంటెక్స్ట్‌ఏందంటె వాల్లకో రేంజ్ వుంది కదా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ నాలుగు జిల్లాలున్నయ్ గద. మొత్తం ఆ రేంజ్‌లో వుండె మొత్తం పోలీస్ అఫీషియల్స్‌వి క్యాంపులుంటయ్. వాల్ల ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిధిగా రావాలంటె, మీ పోలీస్ క్యాంప్‌కి నేను ముఖ్య అతిథిని ఏందయ్యా అని అన్న నేను. లేదు సార్ మీరు పెద్ద వాల్లు, అట్ల అంటె ఇక్కడ పెద్ద, చిన్న సమస్యే గాదు, నేనెట్ల ఫిటిన్ అవుతా అన్న. మీ పోలీస్‌ల నేనెట్ల అని అంటె, దేని గురించి మాట్లాడాలి అంటె మీయిష్టం వచ్చిన టాపిక్ మాట్లాడండి అన్నడు. అంటే నేను తెలంగాణ గురించే మాట్లాడత అన్న. మాట్లాడండి అన్నడు. నాకర్థంగాలె. ఈ పోలీసోడు నన్ను పిలిచి మాట్లాడమంటె (నవ్వు) నిజంగనే నాకు అర్థం గాలె. నేను బోయిన. నేను ఇదివరకు జెప్తి గద! ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్‌యు అనే వరకు పోలీసోల్లకి నా కమిట్‌మెంట్ అర్థమై నట్టుంది.

గుసగుస ఏం లేదు గదనయ్యా. పోయిన తర్వాత వరంగల్నే మీటింగ్. వాల్ల ఐజి ఆఫీస్ వుంది గద కాంప్లెక్స్. సార్ మీరు మాట్లాడినంక క్వశ్చన్స్ అనేవరకు, క్వశ్చన్ అవర్ గూడ తప్పకుండ వుంటది. నేను ఎంకరేజ్ జేస్త, ఎక్కడైన ఎంకరైజ్ జేస్త. బిట్టర్‌గ

అపోజ్ జేసేవాల్లు గూడ క్వశ్చన్స్ జేయొచ్చు. డిస్కషన్ గదయ్య ఇది. మాట్లాడి, గంట మాట్లాడి, గంట గంటన్నర వరకు క్వశ్చన్ ఆన్సర్స్ అయినయ్. అవన్ని వైడ్గ పేపర్లో గూడ రిపోర్టింగ్ అయినయ్, అన్ని పేపర్లలో. అన్ని పేపర్లలో కంటె పెద్దగ హిందూ పేపర్లో గూడ బాగ రిపోర్ట్ అయినయ్.

ఇగ లాస్టికి ఏవంటరంటె, సార్! తెలంగాణ గురించి మీకుండె తపన మాకు తెలుసు. మీతో ఏకీభవించినా, ఏకీభవించకపోయినా మీ చిత్తశుద్ధిని ఎవరూ శంకించరు. మీరు చేసే ప్రయత్నం చాలా గొప్పది. కని మీరు ఆ పిడబ్ల్యుజి వాల్లతో కలిసి పనిజేస్తె ఎట్ల సార్? అన్నరు. దీంట్ల పిడబ్ల్యుజి ఎక్కడున్నదయ్య అని నేనన్న. వాల్లు వేసిన ప్రశ్నే గదయ్యా. ఆ జనసభ ఎవరిది అంటె చూడండి జనసభ వెనక పిడబ్ల్యుజి వున్నదా లేదా అన్న సంగతి చర్చనీయాంశం. పిడబ్ల్యుజిని మీరు బ్యాన్ చేసింండ్రు. జనసభను బ్యాన్ జేయలె, బ్యాన్ జేయండి. మీరు బ్యాన్ జేసినంక నేను పోతే అపుడు నేను జేసింది అఫెన్స్ కావొచ్చు. నేను పోవచ్చు, పోకపోవచ్చు.

బ్యాన్ జేసినంక పోతె.. నేనన్న, పిడబ్ల్యుజి బ్యాన్ జేసినంక మేం కలవకుండ వుంటున్నమా? నేనదే అన్న, పోలీస్లతో ఓపెన్గ. మీరు పిడబ్ల్యుజిని బాన్ జేసింండ్రు, మేం కలవడం లేదనుకుంటున్నరు. మీరు కలవలేదనుకొంటె అది మీ ఇగ్నోరెన్స్ అన్న కావాలె, యిన్కాంపిటెన్స్ అన్న కావాలె అన్న (పెద్దగా నవ్వు). మీ నిజాయితీని ఎవరూ శంకించరంటె, చూడండి తెలంగాణ గురించి నాకు ఏ వేదిక అయినా ఒకటే. ఐతె దానికి ఎందుకు బిలిచిండ్రా అని ఆలోచిస్తే, చివరికి ఏందంటె అది హైయెస్ట్ లెవల్లో, అపుడు హోం మినిస్టర్ దేవేందర్గౌడ్ వుండె, దేవందర్గౌడ్, చంద్రబాబు నాయుడుతోని మాట్లాడకుండ ఒక ఐజి నన్ను బిలుస్తడా? ఒక డైలాగ్ తెలంగాణ మ్యాన్ నక్సలైట్స్తో సంబంధం వుందనే ఇంప్రెషన్ రావాలని చూపిస్తున్నడె! ఇంతకు ఏముందయ్యా అంటె! నన్ను వాల్లతో ఏదో విధంగా దూరం జేయాలె. వాల్లు నాకు దగ్గరకు కావడానికి ఎవరు కారకులు కాదు, డిస్టెన్స్కు ఎవరు కారకులు కాదు. మా వ్యవహారశైలి వల్లనే ఈ దూరం, దగ్గర ఏర్పడ్డది గాని, ఇతరుల ఇన్ఫ్లుయన్స్ వల్ల కాదు.

# ఇట్స్ ఎ యూనివర్సల్ ఫ్యాక్ట్

ఒకటేంటంటె ఏ ఉద్యమంలో గూడ ఏ రాజకీయ నాయకుడు వచ్చినా, రాజకీయ వుద్దేశాలు లేకుండ వస్తరనుకోడం భ్రమ. ఏ పార్టీ అయిన గని, రాజకీయ నాయకునికి రాజకీయ ఉద్దేశం లేకుండా ఉద్యమంలో ప్రవేశించే అవకాశమే వుండదు. ఇట్స్ ఎ యూనివర్సల్ ఫ్యాక్ట్. ప్రజల ఆకాంక్షలతో అవి కోఇన్‌సైడ్ అయినపుడు క్లిక్ అయితయ్. ప్రజల ఆకాంక్షలతో రాజకీయ నాయకుడు లేకుంటె క్లిక్ కావు. ఎందుకు కాదంటె మా లాంటివాల్లం పొలిటికల్‌గ జేయలేకపోయినం. జీవితమంత గడిపినం గద, గుమ్మందాక బోయినం, గుమ్మం దాటలె. ఎందుకంటే దాటలేం మేం. మేం అంటె మనం దాటలేం.

ప్రజల చైతన్యాన్ని పెంపొందింపజేస్తాం, ఇది జేస్తాం, ఇష్యూ హైలెట్ జేస్తాం. ఇష్యూ సజీవంగ ఉంచుతం గని పొలిటికల్ యాక్టివిటీ లేకుండనె రాష్ట్రం వస్తుందంటె అది వేరు విషయం గని, పొలిటికల్ యాక్టివిటీ లెంది రాదు అనేది ఒక వాస్తవం. పొలిటికల్ యాక్టివిటీకి పొలిటికల్ నాయకులే రావాలె, ఆకాశం మీంచి ఎవరు రారు. జయశంకర్‌లు, కోదండరాంలు సరిపోరు. ఎంత మంచి వాల్లయిన సరిపోరు. మాలాంటి వాల్లం ఎన్నికల్లో పోటీజేస్తె గెలుస్తం గావొచ్చు, రెండోసారి గెలవం మల్ల. ఈ సంస్కృతిలో ఇమడం మేం. గనుకనే దూరం వున్నం, కనుకనే ఈ మాత్రం గుర్తింపు వుంది అనుకుంటున్నం. లేకపోతె చెన్నారెడ్డి రావడానికి కారణం ఏమిటి? చెన్నారెడ్డి ప్రజాసమితి పెట్టలేదు!

చారిత్రక వాస్తవం ఏందంటె చెన్నారెడ్డి రాకముందె ప్రజాసమతి వచ్చింది. ఆయన రాకముందె ఉద్యమం వచ్చింది. కని దారి దొరుకుతలెకుండె. ఈ వయొలెన్స్, కాల్పులు, చావడమె గాని దారిదొరుకుతలేకుండె ముందుకు పోవడానికి. చాలా మందికి చెన్నారెడ్డి మీద అనుమానం, మాకు గూడ వుండె. కని చెన్నారెడ్డి రావడంతోని ఒక్కసారి ఊపందు కున్నది. చెన్నారెడ్డి రావడం వల్ల జరిగిన లాభం ఏమిటి, నష్టం ఏమిటి? అంటె చెన్నా రెడ్డి రావడం వల్ల తెలంగాణ ఉద్యమానికి ఒక పునాది ఏర్పడ్డది. ఆ స్థాయికి పోకపోతె.. ఈ రోజు ఎంత చెడ్డా 1968-69 ప్రాతిపదిక కాదని ఎవడు అనలేడు. చెన్నారెడ్డి స్వార్థం కొరకే జేసిండా అంటె, అనుకొందాం. కని మొదలు పెట్టింది చెన్నారెడ్డి గాదు. ఆ ఊపు వచ్చేది గాదు. రెండవది అది విఫలం గావడానికి కేవలం చెన్నారెడ్డిని మాత్రమే బ్లేమ్ జేయను నేను. చెన్నారెడ్డి గూడ ఒక కారణం. చెన్నారెడ్డి అలోన్ వజ్ నాట్ రెస్పాన్సిబుల్. ఆరోజు తెలంగాణ ప్రజా సమితి పేరుతో ఎన్నికైన మొత్తం ఎంపిలు రెస్పాన్సిబుల్.

ఇంక ఇద్దరు బతికేవున్నరు. వెంకటస్వామి, ఎం. సత్యనారాయణరావు. ఈల్లు మూకుమ్మడిగ పోయి సరెండర్ అయిపోయిండ్రు.. చెప్పక, జేయక. మేం ప్రత్యక్షంగా దానికి విట్నెస్ గద! రెండవది ఆరోజు ఇందిరాగాంధీ ప్రభావం మొత్తం దేశం మీద ఎట్ల వుండెనంటె.. ఆ ఎలక్షన్‌లో, మొత్తం దేశంలో కాంగ్రెస్ గెలిచింది తెలంగాణలోనె. మొత్తం దేశంలో! ఈ కాంగ్రెస్ వాల్లకి ఏమిటి, అమ్మో! అమ్మగారి పెత్తనం ఎట్ల అని ఓ.. మూకుమ్మడిగా! చెన్నారెడ్డి గ్గూడ తెల్వదు. ఆ రోజుల్లో చాల క్లోజ్‌గ పనిజేసినం ఆయనతోని. చంద్రశేఖర రావుతో ఎట్ల జేస్తున్ననో, అప్పుడు నేను, తోట ఆనందరావు కలిసి అట్లనె జేసినం.

అయితె నన్ను, ఆనందరావుని కంటెస్ట్ జేయమని అడిగిండు చెన్నారెడ్డి. మేం కాదని జెప్పినం. చెన్నారెడ్డి ఐసొలెట్ అయ్యిండు. చెన్నారెడ్డికి ఏముండె అంటె చెన్నారెడ్డిని ఐసొలేట్ జెయాలని వాల్ల ప్లాన్. చెన్నారెడ్డిని ఐసొలెట్ జెయ్యాలని వాల్లె గాదు, యిక్కడున్న పి.వి. నరసింహారావు, చొక్కారావు వాల్ల ప్లాన్ గూడ అదె. వాల్ల ప్రాముఖ్యత పోతదని. ఐసొలేట్ గావడమా, పవర్‌లో వున్న పార్టీ ఒడిలో వుండడమా..? ప్రాక్టికల్ పొలిటిషియన్! వాల్లు సరెండర్ గావడమెందుకు, నేనే దీసుకపోయి కలుపుతా అనేటువంటి ప్లాన్‌తోటి పోయిండు ఆయన. కనుక తప్పే. చెన్నారెడ్డి జేసింది రైట్ అనడం లేదు నేను. చెన్నారెడ్డికి విధిలేకుండ అయిపోయింది. చెన్నారెడ్డి స్వార్థపరుడె, అన్నీ.. ఒప్పుకుంటం. కని ఆ రోజున్న సిట్యుయేషన్ లోపల చెన్నారెడ్డి అలోన్ వజ్ నాట్ రెస్పాన్సిబుల్. చెన్నారెడ్డి వజ్ కంపెల్డ్ టు డు దట్ అండ్ హి హ్యాపిలీ డిడిట్.

ఎవడన్న అడిగిండా? ఎవడడగలె. మాలాంటి వాల్లు చూస్తు చూస్తు పక్షుల తీరుగ అయినం. ఏం జేస్తం. ఎందుకంటె రాజకీయంగ మనం ఏం చేయలెం గనుక. వాల్లందరి గెలుపు కొరకు మేం మా ఉద్యోగాలు పోతయిని తెలిసినా లెక్కజేయకుండ తిరిగినం. ఎలక్షన్ అయ్యే వరకు, అదీ చెన్నారెడ్డి విషయంలో. ఇంద్రారెడ్డి వచ్చే వరకు ఏందంటె.. ఇంద్రారెడ్డి రాకముందు చాల సెన్సిటైజేషన్ నడిచింది. చాల అంటె చాల నడిచింది. ఇంద్రారెడ్డి నాకు స్టూడెంట్.. స్వయాన సిటి కాలేజీల. నాకు రోజూ ఫోన్. అప్పటికె ఈ డిబేట్ మొదలయ్యింది. 1994 నుంచి చర్చ మొదలైంది తెలంగాణ మీద. తెలంగాణ ఏదైతె ఐక్య వేదిక పేరుతో కేశవరావ్ జాదవ్, నేను, మాధవరెడ్డి, భూపతి కృష్ణమూర్తి.. చర్చ మొదలైంది. పోతె మొదట్నించి మేం పాతకాలపోల్లం. నేను, కాళోజి, జస్టిస్ మాధవరెడ్డి కలసి పనిచేసేవాల్లం. ఎక్కడ పోయిన ఇంపార్టెంట్ మీటింగ్స్‌కి మేం అడ్రస్ జేసేవాల్లం. మా ముగ్గురిది ఒక కాంబినేషన్ వుండె ఆ రోజుల్లో. ఐతె ఓ రోజు ఇంద్రారెడ్డి

జస్టిస్ మాధవరెడ్డిని, నన్ను, కాళోజీని కలిసి రావాలని కాళోజీ దగ్గర పోతె.. తెలంగాణ గురించి ఎవడు జేసిన వద్దంటామయ్య, ఎవరైన జెయాలి, మంచిగ జెయాలె అంటె, నా దగ్గర కొచ్చిండ్రు. సంతోషమేనయ్య జెస్తె మంచిదేనయ్య. నీలాంటి యువకులొస్తె మంచిదె  నిలబడాలయ్య అంటె ఆ తప్పక నిలబడత దాంట్లో ఎట్లాంటి సందేహం లేదని లాంచ్ జేసిండు. లాంచ్ జేసిండంటె ఒక పార్టీ బెట్టి ఆ పార్టీకి అండ్ల నాకేదో పొజిషన్, మాధవరెడ్డికి.. ఆయనే ఎనౌన్స్ జేసేసిండు. నేనప్పుడు విశాఖపట్నంలో ఏదో పర్యటనలో వుండె. పేపర్లో చూసిన, పరేషాన్! ఈ పార్టీ యెక్కడిది? యీ పొజిషన్ యేంది? అని జస్టిస్ మాధవరెడ్డికి ఫోన్ జేసిన. ఈ పోరడు తొందరపడ్డడయ్య అంటె ఐ డిజోన్ ఇట్. నేను డిజోన్ జేయాల్సి వస్తది, డిజోన్ జేస్తె ఆ పోరనికి ఏమౌతుంది. మల్ల అతనితో వాళ్ల బ్లెస్సింగ్స్‌తోని నేను పార్టీ పెడుతున్న అని. పెట్టిన తర్వాత పార్టీ ఎక్కడ ఏ మీటింగ్ బెట్టిన పికప్పయ్యే దాక. ముగ్గురం నేను, కాళోజీ, మాధవరెడ్డి పోయేది, పికప్పయింది.

ఇంద్రారెడ్డి దొరికిండు మాకొక ఇన్‌స్ట్రుమెంట్. కని చూస్తే ఏంటి పాతకాలం ముగ్గురం నా కంటె పెద్దోల్లు, నాకంటె పెద్దోల్లు. పోతె, కాళోజీకున్న ఇమేజ్.. జస్టిస్ మాధవరెడ్డికి గూడ. తెలంగాణ విషయంలో చాల పెద్ద ఇమేజే. వ్యక్తిగతంగ వేరే వుండొచ్చు, కని తెలంగాణ విషయంలో చాల కమిట్‌మెంట్‌తో పనిజేసినం. మేం ముగ్గురం బోతె అది ఫర్మిడబుల్ కాంబినేషన్ అయ్యేది ఆ రోజుల్లో. ఆ పిలగానికి ఏందంటె.. వాపును జూసి బలుపు అనుకున్నడు. పాపులారిటీ.. దారితప్పిండు, ఇగ ఫాస్ట్‌గ పోవడం మొదలు బెట్టిండు. అదే రోజుల్లో ఏమైందంటె వార్త పత్రికలో రామచంద్రమూర్తిగారు ఎడిటర్ వుండె. మేం రాసినయన్ని పబ్లిష్ జేసిండు. అప్పుడు వరుసగ.. ఆర్టికల్స్ నావి వరుసగ వచ్చేది. చాలా రోజుల వరకు సీరిస్ ఆఫ్ ఆర్టికల్స్ వచ్చేది. దాంతో చాలా మంది అన్నరు గద ఒక యంగ్ బాయ్ వచ్చిండు, నేను చెప్పడం నా స్టూడెంట్ అని చెప్పుకొనేది, సార్ స్టూడెంటే గద. పోతె ఈ బ్యాగ్రౌండ్.. లెఫ్ట్ బ్యాగ్రౌండ్‌తోని వచ్చిండు గద పిల్లవాడు అని అనుకొన్నం. అయ్యే వరకు ఏమైంది?

అతనేమనుకొన్నడంటె ఇగ తనంతట తను ఎదిగిపోయిండు అనుకొని, ఇండిపెండెంట్‌గ యాక్టివిటీజ్ జేయడం మొదలుబెట్టి కొలాప్స్ అయ్యిండు. అయి చివరకు కాంగ్రెస్‌లో జేరిండు.. జూస్తివి గద. కనుక ఇంద్రారెడ్డిది ఏమైందంటె, చెన్నారెడ్డి ఆల్రెడి ఎస్టాబ్లిష్డ్ లీడర్, ఓసెట్ బ్యాక్‌లో వుండె. బాగ రైపెన్ అట్మాస్ఫియర్ దొరికింది. ఈ ఇంద్రారెడ్డికి

అంత  రైపెన్ అట్మాస్ఫియర్ దొరకలె. రైపైన ముగ్గురు మనుషులు దొరికిండ్రు గని రైపెన్ అట్మాస్ఫియర్ రాలె. వచ్చేవరకు, కొంత పికప్ అయ్యే వరకు, వార్తా పత్రికలో మొట్టమొదటిసారి వచ్చేవరకు కాస్త ఆయన అతిగా అంచనా వేసుకున్నడు, తగ్గిపోయిండు. ఇగ దాని తర్వాత ఒకదశలో జానారెడ్డి గూడ వుండె. తక్కువ పిరియడె. కనుక రాజకీయ నాయకుడు చెన్నారెడ్డిగాని, ఇంద్రారెడ్డిగాని, జానారెడ్డి గాని, తర్వాత చంద్రశేఖర్‌రావు గాని ఇండివిడ్యువల్ పొలిటికల్ ఎజెండా లేకుండా వస్తారనుకోడం భ్రమ. వాళ్ల ఎజెండా ఇష్యూతో కోఇన్‌సైడ్ గావాలె.

మాలాంటి వాళ్లకు తోచింది ఏందంటె, ఈ ఎజెండాతో కోఇన్‌సైడ్ అయి ఒక నాయకుడు వస్తున్నడు. ఇంత మందితో చూసిన మహానుభావులు, నాలాంటి లేక నా తరంవాళ్లు, నా తీరుగ కొంత మంది ఏందంటె.. చెన్నారెడ్డికి, ఇంద్రారెడ్డికి.. ఇంద్రారెడ్డితో కంపేర్ జేయలేం. చెన్నారెడ్డి మీద చంద్రశేఖరరావును పోల్చినపుడు.. జానారెడ్డి, ఇంద్రారెడ్డి ఇట్ల వచ్చి ఇట్ల పోయిండ్రు గాని, ఐడెంటిఫై అయింది మాత్రం వాళ్లే. ఇంద్రారెడ్డి పేరు చాలమందికి తెలవను గూడ దెలవదు. మనకు దెలుసు గాని చాలా మందికి దెలవదు.

# ఏకైక నాయకుడు ఈనాటికీ

చెన్నారెడ్డికి, చంద్రశేఖరరావుకు ముఖ్యంగా ఏందంటె, ఇష్యూను సమగ్రంగ అర్థం జేసుకోటంలో చెన్నారెడ్డి అంత శ్రద్ధ జూయించే వాడుగాదు. మాతో యెవ్వరు బెట్టు కుంట రయ్యా.. ఇవన్ని లొల్లి బెట్టాలె గని ఈ లెక్కలు ఎవడికి గావాలె.. అట్ల పెద్దగ వినే టోడు గాదు, అయిన గాని నేను జెప్పేది జెప్పేది. వుండె, అట్ల వుండె.. ఆయనకా స్టేచర్ వుండె. ఈయన అట్ల గాదు, విషయ పరిజ్ఞానం లేంది మాట్లాడొద్దు. క్రిటికల్‌గ ఆలోచించాలె. నాతోని యాడాది గూసున్నడాయన నేర్చుకోడానికి. టిడిపిలో వున్నప్పుడు యాడాది గూసు న్నడు. ఎందుకు గూసోవాలె నా యెంబడి? గిట్ల.. ఇట్నే గూసునేది ప్రతిదానికి క్వశ్చన్, క్రాస్ క్వశ్చన్ జేస్తుండె.

రెండవది సమస్యను అర్థం జేసుకొని ప్రజల నుడికారంతో, ప్రజల భాషతో ప్రజల్లోకి ముందుకు దీసుకపోయినటువంటి.. నా దృష్టిలో ఏకైక నాయకుడు ఈనాటికీ. నాన్ పొలిటికల్ దాంట్లో ఆ స్కిల్, ఏది! ప్రజల భాషలో పోయి మాట్లాడె స్కిల్ నాకు ఒక్క కోదండరాంలో కనబడుతది. నాలో లేదు ఆ స్కిల్. నేను ప్రజల భాషలో మాట్లాడలేను, మాట్లాడుత గాని ఆ నుడికారం రాదు. ఇపుడు నేర్చుకొంటె ఆర్టిఫిషియల్ అయితది. నా పద్ధతిలో నేను జెపుత. అంతెగాని నిజంగ ప్రజల నుడికారంలో పోగలిగినటుంటి రాజకీయ నాయకుల్లో ఏకైక నాయకుడు ఈనాటికీ చంద్రశేఖరరావు వొక్కడె. నాన్ పొలిటికల్‌గ వచ్చేదాంట్లో కోదండరామె. అ విట్.. ఇపుడు ఏందంటె ఆ యాక్సెంటె.. బాగున్నారె అన్న! అంటరు, బాగున్నవ సార్! అని నేనంట. తేడా కపబడుతది కదా. నేను కొత్తగ అది అంటె ఆర్టి ఫీషియల్ అయితది.

## ఈ వాగ్గేయకారులు పెద్ద కాంట్రిబ్యూషన్

ఇపుడు.. ఒకటి కమిట్‌మెంట్, రెండోది కాంపిటెన్స్. రెండు కోయిన్‌సైడ్ కాకపోవచ్చు. కాన్‌ఫ్లిక్ట్ గూడ వుండొచ్చు. నా అభిప్రాయం చెప్తున్న. నేను నా అభిప్రాయం చెప్తున్న. రచయితలు అన్నప్పుడు.. నా దృష్టిలో ఈ వాగ్గేయకారులు పెద్ద కాంట్రిబ్యూషన్. ప్రెజెంట్ మూవ్‌మెంట్‌లో చాల పెద్ద కాంట్రిబ్యూషన్. అందులో అందెశ్రీ, గోరటి వెంకన్న, గూడ అంజయ్య, దేశపతి.. దేశపతిది ఒక కల్ట్. వీల్లది జానపద కల్ట్. అపారమైనటువంటి కళ అది. అయితె ఇక్కడ.. నేను పబ్లిక్‌గనె చెప్పినగద! ఏందంటె నాటి వాగ్గేయకారులకు- అన్నమాచార్యగాని, లేకపోతె త్యాగరాజు ఆ వాగ్గేయకారులకు, ఈ వాగ్గేయకారులకు తేడా ఏంటంటె, వాల్లు దేవుని గురించి రాసింద్రు. దేవుని మహిమల గురించి రాసింద్రు. వీల్లు మనుషుల వెతల గురించి రాసింద్రు. దేవుని గురించి రాయలె.

దేవుని మహిమల గురించి రాసినవారు, దేవుడు వున్నడో లేడో.. విశ్వాసాలకు సంబంధించింది. దేవుని మహిమలు విశ్వాసాలకు సంబంధించినవి. మనుషులు, వెతలు వాస్తవాలు. జీవితంలో వుండె వాస్తవాలు. జీవితంలో వుండె వాస్తవాల గురించి రాస్తున్నరు. ముఖ్యంగ తెలంగాణ ప్రజా జీవిత వాస్తవాలను వీల్లు రాసింద్రు, ప్రజలకు అందిస్తున్నరు. కనుక ప్రజల్లోకి బోయింది. నేను పబ్లిక్‌గ చెప్తున్న. నేనిచ్చే వందల ఉపన్యాసాలు గూడ .. వాల్ల ఒక్క పాట సాలు! అవి వాల్ల ఒక్క పాటకు సమానం. నేనిచ్చే ఉపన్యాసం వింటరు, పోతరు. పాటలు జ్ఞాపకం వుంచుకొని పాడతరు. ఈరోజు పాటలు ఎట్ల పాడుతరయ్యా చదువు రాని వాల్లు! కని మేజర్, చాల పెద్ద కాంట్రిబ్యూషన్! అంటె జన సామాన్యం లోపలికి, సామాన్య ప్రజానీకం లోపలకి తెలంగాణ భావన పోవడానికి.

ఈ తరం తెలంగాణ వాగ్గేయకారులు.. చాల పెద్ద పాత్ర వాల్లది. ఇందులో రెండు కల్ట్స్ వున్నయ్. దేశపతి చెప్పేది ఒక కల్ట్, వీల్లు చెప్పేది ఒక కల్ట్. రెండు పనిజేస్తున్నయ్. రిఫైన్ అని అనలేను. అదొక సాంప్రదాయం, ఇదొక సాంప్రదాయం. అదొక ఆడియన్స్‌కి, ఇదొక ఆడియన్స్‌కి. ఆడియన్స్ వేరు వేరు వుంటరు గద. గ్రామీణ ఆడియన్స్‌కి పోయేది ఇది. గ్రామీణ ఆడియన్స్‌తో పాటు చదువుకొన్న సెక్షన్స్‌కి పోయేది అది. నుడికారం వేరు, పరిభాష వేరు గద. కనుక రచయితల్లో గూడ వీల్ల కాంట్రిబ్యూషన్. చాల గొప్ప కాంట్రిబ్యూషన్.

# అదొక క్వాలిటీ ఆఫ్ మైండ్

ఇగపోతె విద్యావంతులు, మేధావులు అనే పదం నేను డెలిబరేట్‌గ వాడను. ఎందుకు వాడనంటె మేధావి అని ఇతరులు జెప్పాలె, మనం జెప్పుకోగూడదు. వాటి మీద చాల జోక్స్‌గూడ వేస్తుంట నేను. ఎవరో వచ్చి సార్! మేధావులు ఇట్ల ఎట్ల సార్ అంటె, కరక్టే కద అని నేనంటె, నేనంటున్నను.. నన్ను నేను మేధావి అనుకోవటం లేదు. ఫస్ట్ థింగ్ అది. చదువుకున్న ప్రతివాడు మేధావే గానక్కర్లేదు, ప్రతి మేధావి చదువుకోనక్కర్లేదు. అదొక క్వాలిటీ ఆఫ్ మైండ్. కనక ఆ పదానికి ఇగ నేను 'విద్యావంతులు' అను ఒప్పుకుంట. చాల పెద్ద పాత్ర ఆల్ సెక్షన్స్‌ది. యూనివర్సిటీ టీచర్స్ తీసుకొంటె చాల మంది పని జేస్తున్నరు. కని బాగ క్లిక్ అయినవాల్లల్లో క్లిక్ గావడమంటె, అన్ కాంప్రమైజింగ్ టోటల్ కన్సాల్‌లో.. ఈ దశ ఉద్యమంలో మొట్టమొదలు వొచ్చింది జనార్దనరావు, తర్వాత దశలో వొచ్చింది కోదండరాం.

యూనివర్శిటీ టీచర్స్ అందరు పనిజేస్తుంర్రు కాదనడం లేదు. కని ఈ లెవల్ ఆఫ్ అండర్ స్టాండింగ్ ఆఫ్ ది ప్రాబ్లమ్ ఒకటి, ఇన్వాల్‌మెంట్ ఒకటి. నిర్భయంగ.. ఇపుడు మా తరం వాల్లం మేం యూనివర్శిటీ టీచర్స్ ఎట్ల పనిజేసినమొ, నేను గని, ఆనందరావు తోట గాని, మా తరం అంతరించిపోతుంది. అపుడున్న స్టామినా ఇపుడు లేదు. యాక్టివ్ టీచర్స్‌మి గూడ గాదు. అదె లెవల్లో ఈరోజు విస్తరించింది. ఆ రోజు చాల మంది, చాల మందిలో ఎదిగిన వాల్లు కొద్ది మంది వున్నరు వాల్లు. జర్నలిస్టులు వచ్చింర్రు. ఎంత పెద్ద సంఖ్యలో వచ్చింర్రయ్య జర్నలిస్టులు! అడ్వకేట్స్ వచ్చింర్రు. దీనివల్ల ఏమైందంటె ఇది గ్రాస్‌రూట్స్‌కు పోయింది ఉద్యమం. జనసామాన్యంలో కర్షకుల్లోపల, కార్మికుల్లోపల, దినసరి కూలీల్లోపల, చదువురాని ఆడోల్లల్లో గూడ పోయింది అంటె, ఇన్ని సెక్షన్స్ ఇన్వాల్ కావడం వల్ల పోయింది. ఒక సెక్షన్‌తో అయ్యే పనికాదిది. కనుక నాటికి నేటికి తేడా ఏందంటె, ఆ రోజు సమస్య గురించి అర్థం చేసుకొని చెప్పేవాల్ల సంఖ్య పరిమితంగ వుండె. విస్తృతి గూడ తక్కువనే వుండె ఇప్పటికంటె. ఈ రోజు చెప్పేవాల్ల సంఖ్య పెరిగింది. విస్తృతి పెరిగింది. ఈ రోజు ప్రతివాడు మాట్లాడుతున్నడు. మాలాంటోడు ఉపన్యాసాలిచ్చె అవసరం లేదు ఈ రోజు.

# ఉద్యమాల్లో ఐక్యత వుండాలి

ఒకటి అంటె నేను తొలిదశలోపల, నేను నా ఉద్యమ జీవితం అనేదానికి రకరకాల స్టేజెస్ వున్నయ్. స్టూడెంట్ యాక్టివిస్ట్గ వుంటి, టీచర్ యాక్టివిస్ట్గ వుంటి, తెలంగాణ యాక్టివిస్ట్గ వుంటి. అన్నిటిలో అంతర్లీనం తెలంగాణ సమస్యే గావొచ్చు అది వేరు విషయంలె గాని, నేను టీచర్ యాక్టివిస్ట్గ వున్నప్పుడు ఒక ట్రేడ్యూనియన్ యాక్టివిటి అది. ట్రేడ్ యూనియన్ అన్లేను గాని ఒక రకంగ ట్రేడ్ యూనియన్ యాక్టివిటీయె.

అపుడు నేను చాల అధ్యయనం చేసిన అన్నమాట. చేసినపుడు ఒక బ్రిటిష్ ట్రేడ్ యూనియస్ట్ అయి వుండి, తత్త్వవేత్త అనండి ముఖ్యంగ ఆయన అధ్యాపక సంగ్రామం గురించి చెప్పినటువంటి ప్రబోధాలలో నేను, మాతరం వాల్లం బాగ ఇన్ఫ్లుయన్స్ అయినం. చెప్పింది చిన్నమాటె గాని, దాంట్లో చాల గొప్పగ అర్థముంది. టీచర్స్ మూవ్మెంట్స్ దారి తప్పుతుంటయ్, చీలికలొస్తుంటయ్, అయితె ఆయన చిన్న వార్నింగ్.. ఆయన మాటలె "ఇఫ్ వుయ్ డు నాట్ హ్యాంగ్ ఆన్ టు గెదర్ వుయ్ విల్ బి హ్యాంగ్డ్ సెపరేట్లీ" మనం కలిసికట్టుగ లేకపొతె విడి విడిగ ఉరి స్తంభాలకు యెక్కాల్సి వస్తది. రొనాల్డ్ రోస్. ఆ మాటలు నన్నే గాదు, మా తరం వాల్లని బాగ ఇన్ఫ్లుయన్స్ జేసినయ్.

కనుకనే ఐక్యత.. వుద్యమాల్లో ఐక్యత అనేది వుండాలి. అంటె ఈ సిద్ధాంత రాద్ధాంతాలు అడ్డం రావొద్దు. ఆశయ ధ్యేయం - ఐడియాలజీ గాదు - అబ్జెక్టివ్ ఐడియాలజీ ఎవరిది వాల్లకి వుంటదయ్య. నాది నీకుంటదా, నీది నాకుంటదా. ఎవరిది వాల్లకే వుంటది. ఐడియాలజీ కంటె ఎక్కువ వాట్స్ ది ఐడియల్, దీనికి ధ్యేయమేమిటి, గమ్యం ఏమిటి? అందుకె ఆర్ఎస్ఎస్ వాడు తెలంగాణ గావాలంటున్నడు, ఆర్ఎస్యు వాడూ గావాలంటున్నడు. వాల్ల ఐడియాలజీ వేరు. నేను జూసింది వాల్ల ధ్యేయం గని.. ఐక్యత అన్నప్పుడు ఈ రెండు గూడ ఐక్యం గావాలె, యెందుకంటె చెప్తున్న, స్పిరిట్ చెప్తున్న!

ఇంకొకటి ఇంగ్లిష్లో ఒక సేయింగ్ వుంది, ఇది ప్రెస్లో ఎక్కువ వాడతరు. ఇంటర్నల్ కాంట్రడిక్షన్స్! ఇపుడు తెలంగాణ సమస్యకు తెలంగాణ వాల్లే కారకులు అన్న ఒక వాదన వుంది గద. వాస్తవమె గద! అంటె ఒక రూలర్ అంటె ఒక రాజు చెప్పినట్టు కొంత మంది ట్రేడ్యూనియన్ లీడర్లు, సంఘాలు నడిపేవాల్లు, ఒక ప్రజాఉద్యమం నడిపేవాల్లు ఒక ఇంటర్నల్ కాంట్రాడిక్షన్కు భయపడి.. వొక సేయింగ్ యేందంటె 'అన్స్క్రూపులస్ ఎనిమీ అండ్ డిపెండబుల్ ఫాలోయర్'. అన్స్క్రూపులస్ ఎనిమీ అంటె ఏ నీతి, నియమం

లేనటువంటి శత్రువు. నా వెంట వచ్చే సైన్యం డిపెండబుల్ గాదు. 'ఓ గాడ్ సేవ్ మి ఫ్రమ్ మై ఫ్రెండ్స్. ఐ కెన్ టేక్ కేర్ ఆఫ్ మై ఎనిమీస్ మై సెల్ఫ్'. అంటె ఓ దేవుడా నా స్నేహితుల నుంచి కాపాడు, శత్రువు సంగతి నేనే చూసుకుంట! తెలంగాణ సంగతి ఎగ్జాక్ట్లీ అదె, మనం ఆంధ్రోల్లతోని కొట్లాడుతున్నం గాని తెలంగాణ వాల్ల సంగతి ఏంది? ఐతె ఇటువంటి ఎగ్జాంపుల్స్, ఇటువంటి సేయింగ్స్, ఆ పెద్దవాల్ల మాటలు, అట్ల ఆ విధంగ ప్రభావితమైనటువంటి జనరేషన్ మాది.

## ఎందుకు నడుస్తది అంటె ప్రజల్లోకి బోయిందది

ఒకటి ఒక టీచర్స్ అనే గాదు, తెలంగాణ వాదాన్ని అందరు అందుకున్నరు. లేకపోతె ఈ స్టేజికి వచ్చేది గాదు. వాదాన్ని అందుకోటం వేరు, వాదంతో ఐడెంటిఫై అయి పనిజేయడం వేరు. పనిజేయడం అనేది ముఖ్యంగ ఈ ఉద్యోగాలు జేసేవాల్లకు సాహసం గావాలె. ఈ జాబ్‌బోతె ఎట్ల అని భయం వుండొద్దు. ఎవర్ని శంకించనక్కర్లేదు, ఎంతమంది జేయగలుగతరయ్య. జీవనోపాధి కోల్పోవడమనేది అంత ఈజీ గాదు, ఇపుడు నా కొలీగ్సే చాలా మంది నాకంటె ఎక్కువ కమిట్‌మెంట్ వున్నోల్లే, కాని సాహసం జేయలేకపోతున్నరు. పరిమితులు.. చదువుకొన్న వాల్లల్లో ముఖ్యంగ, అధ్యాపక వర్గంలోపల తెలంగాణ గురించి మంచి అవగాహన వున్నది, చాలా వుంది. ప్రత్యక్షంగా దిగి పనిజేయడానికి పరిమితులున్నయ్. రెండవది, కొంత మందికి ఉద్యోగం రాంగనె రాజకీయ ఆకాంక్షలు బెరుగుతయ్, పొలిటికల్ యాంబిషన్.. ఎన్నికలనగానె నేనెందుకు రావొద్దు అని వచ్చేస్తుంది, వెంటనే వచ్చేస్తుంది. చెప్తున్న గద ఇపుడు ఒక టాక్ వుంది ఎన్నికల లోపల మేధావి వర్గానికి సముచిత స్థానం అని.

నేను ఫస్ట్ క్వశ్చన్, ఈ మేధావులు ఎవరయ్యా? ఎవరీ మేధావులు పంతులు పనిజేస్తె మేధావేనా? యూనివర్శిటీలో నాలుగు లెక్చర్లిచ్చి, రెండు వ్యాసాలు రాసి, మూడు వుపన్యాసాలిస్తె మేధావేనా? చూస్తున్నవ్ గద! నాకున్న చాల పెద్ద నా అనుభవంలో, నన్ను చాల ఇరకాటంలో పడేసిన అంశం అది. రాంగనె మొట్టమొదలు టిక్కెట్టు కావాలె, ఎన్నికలొస్తున్నయ్. మరి ఎన్నికల రాజకీయాల లోపల ఇన్‌డివిజ్యువల్ అయితాంది, హద్దులు దాటిపోతున్నయ్. టిక్కెట్టిస్తె మంచి పార్టీ, మంచి నాయకుడు, ఇయ్యకపోతె చెడ్డోడు. ఒకసారి చాల చాల సీనియర్‌గ సీనియర్ ప్రొఫెసర్స్‌లో గూడ ఇది రావడము, వాల్ల ఫ్రస్టేషన్‌కు గురికావడము, రాకపోతె ఇతరులను నిందించడము జరుగుతున్నది, చూస్తున్నవ్ గద చెప్తున్న! పేర్లు జెప్పను. ఆ ట్రెండ్ వల్లనె ఏమైందంటె, చదువుకున్న వాల్లల్లో ఐక్యత లేదు అనేటువంటి ఒక ఇంప్రెషన్ కలుగుతున్నది. చదువుకున్న వాల్లల్లో తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల ఐక్యత పూర్తిగ వుంది, ఒకటి వాల్లు బాహాటంగ రావడానికి కొందరికి పరిమితులున్నయ్. బాహాటంగ వచ్చేవాల్లకు ఆకాంక్షలున్నయ్. తీరని కోరికలున్నయ్, తీరలేని కోరికలున్నయ్(పెద్దగా నవ్వు)

అవును తెలంగాణ అనివార్యమే, ఇపుడు అదే అన్న, రేపు అదే అంట నేను. ఇవన్ని సెట్‌బ్యాక్స్ యెన్ని రాలె. ఎందుకు రాదు. 1969, 70 చూసిన ఎన్నికల తర్వాత సెట్‌బ్యాక్స్

లెక్క కాదిది. ఇదేమొ ప్రజల్లో నాటుక పోయిందయ్య ఇది. ఇది ఇంత ప్రగాఢంగ, ఇంత డీప్‌గ, ఇంత వైడ్‌గ, ఇంత ఇంటెన్స్‌గ అపుడు లేకుండె, బలమది. ఎగ్జాంపులిస్త 1968-69లోపల ఒక వారంరోజులు నేను పబ్లిక్‌గ కనబడకపొతె ఏమైంది, ఏమైంది అని వుండె. ఎందుకంటె మాట్లాడెటోడు లేకుండె. ఈ రోజు జయశంకర్ ఆర్నెల్లు కన బడకపోయినా ఉద్యమంకు ఏం తేడా లేదు, అంతె బలంగ నడుస్తున్నది గద. ఎందుకు నడుస్తది అంటె ప్రజల్లోకి బోయిందది. ఈ రోజులు నేను పబ్లిక్‌గ కనపడకపోతె యేమైంది.. యేమైంది అని  జయశంకర్ ఉపన్యాసాలు అవసరం లేదు. క్షేత్రంలో పనిగావాలె.. క్షేత్రంలో పనిజేయడం మొదలైంది. క్షేత్రంలో పనిజేయడానికి ఈ రోజు నేను సరిపోను. నాతో చాతకాదు, ఆ రోజు అట్ల లేకుండె పరిస్థితి. ఎంత పెద్ద మార్పు ఇది. ప్రతి పిల్లవాడు మాట్లాడుతున్నడయ్య, ప్రతి స్టూడెంట్ మాట్లాడుతున్నడు. ఒకసారి పిల్లలు మాట్లాడుతుంటె ఆశ్చర్యమేస్తది వాల్లు మాట్లాడె పద్ధతి. ఇట్లనె డిస్కషన్ జేస్తరు, అట్ల గాదు సార్ అంటరు, ఐ ఫీల్ వెరీ హ్యాపీ. అట్ల గాదు అని జెప్పినపుడు ఆలోచించాలి, ఆలోచించి జెప్తున్నడు. ఇపుడు వాడు జెప్పింది తప్పే గావొచ్చు కాని, వాడు ఆలోచించి ఆ ధైర్యం జేస్తున్నడు.

బలిదానాలు రెండు రకాలుగున్నయ్. ఒకటి స్టేటే చంపుతుంది. 1952,1969 నుండి గూడ స్టేట్ వల్ల జస్తున్నరు. అది వాంఛనీయం గాదు, అది గాదు, ఇది గాదు. కని ప్రజా వుద్యమాల్లో ప్రపంచంలో ఎక్కడ గూడ అవి జరక్కుండ జరగలె. బలిదానాలు లేకుండ ఏ ఉద్యమం ముందుకు బోలె.

## నువ్వు పిరికివానిగ వుండొద్దు

నాన్‌వయొలెంట్, ఇపుడు లాస్ట్ 10 ఇయర్స్ నాన్‌వయొలెంటె గదనయ్య. వచ్చే దంత స్టేట్ ఇంటర్‌వెన్షన్‌తో వస్తున్నది. స్టేట్ ఇంటర్‌వెన్షన్‌తో, ఉస్మానియా యూనివర్శిటీ స్టేట్ ఇంటర్‌వెన్షన్‌తో గాదా నిన్న జరిగిన ఫైటింగ్ ఏంది? పిల్లవాళ్లు ఏంజేయలేదు గద. ఈ స్టేట్ ఇంటర్‌వెన్షన్ నుంచె డెలిబరేట్‌గ అంటె, ఉద్యమాలను మలినం జేయడానికి, వుద్యమాలకు చెడ్డపేరు తేవడానికి స్టేట్ స్వయంగ జేస్తది. మొత్తం యంత్రాంగం వాళ్ల చేతుల్లో వున్నది. నిన్న ముఖ్యమంత్రి, డిజిపి, చీఫ్ సెక్రటరీ ఎవరయ్య వాళ్లందరు? ఒక విదేశీ పాలనలోపల పరాయి వాళ్లు వచ్చి పాలించిన పరిస్థితే గద ఇది. తెలంగాణ వాళ్లు ఒక్కల్లు లేకపోయనాయె, ఏ నిర్ణయం తీసుకుంటరు.

1969 ఉద్యమంలో వయొలెన్స్ రావడానికి గూడ ఈ కవ్వింపు చర్యలే. ఒరిజనల్‌గ స్టూడెంట్స్ మొదలుపెట్టలె వయొలెన్స్‌ను. రిటాలియేషన్‌లో వొచ్చేసింది. అసలు ట్రిగ్గర్ అయింది ఏందంటె, అపుడు వయొలెన్స్ రావడానికి ప్రధానకారణం, మెయిన్ రీజన్ ఏందంటె? ఉద్యమ తొలిదశలో తెలంగాణ వాళ్లు కొంత మంది తిరుపతిపోయి తిరిగొస్తున్నరు. విజయవాడ దగ్గర కొంత మందిని దింపి గుండ్లు కొట్టి పంపించిండ్రు. విజయవాడలో దింపి ఇక్కడొచ్చేసరికి భగ్గుమనె. వయొలెన్స్ వచ్చింది. కవ్వింపు చర్య అట్నుంచి వచ్చింది పోలీసులతోని వచ్చింది. కనక ఈ కవ్వింపు చర్యలు ఇతర వర్గాలు గాని, లేక పోతె అణచివేత చర్యలు గాని చేపట్టినపుడు వయొలెన్స్ ఇనెవిటబుల్ అవుతుంది. మొత్తం ప్రపంచ చరిత్రలో టోటల్లీ నువ్వు గాంధీయన్ మార్గంలో పోవాల్నంటె, అప్పటి పరిస్థితులు ఇపుడు లేవు. గాంధీజి స్వయంగ ఒకసారి అన్నడు. గాంధీజీ అన్న మాటలె "ఐ ప్రిఫర్ నాన్ వయొలెన్స్ టు వయొలెన్స్" అంటె నేను హింసకంటె అహింసకు ప్రాధాన్యమిస్తాను. బట్ ఐ ప్రిఫర్ వయొలెన్స్ టు కవార్డిస్, పిరికితనం కంటె వయొలెన్స్ వున్నా ఫరవాలేదు అని అంటె, గాంధీజీ వయొలెన్స్‌ను ప్రపోజ్ జేసినట్లు గాదుగద. పిరికితనం ప్రదర్శించి సరెండర్ కావడమా! ధైర్యాన్ని జూపించి వయొలెన్స్ అయినా గురి కావడమా? అంటె గాంధీజీ వయొలెన్స్ ప్రబోధించింది గాదు, ఆయన జెప్పింది ఏందంటె భరించరాని పరిస్థితి వచ్చినపుడు నువ్వు పిరికివానిగా వుండొద్దు. వయొలెన్స్ వచ్చినా ఫరవాలేదు, నువ్వు పిరికితనంగ వుండొద్దు అని చెప్పిండు. ఎగ్జాట్లీ ఈనాడు వచ్చిన పరిస్థితి ఇది. మనం పిరికి పందలుగ వుందామా? వయొలెన్స్ వచ్చినా ఓర్చుకుందామా?

## మన సదువుకున్న వాల్లకన్న బెటర్

ప్రయత్నం చేయగూడదని గాదు.. వీల్లకు వసతులు ఏవి. వనరులెన్ని వున్నయ్? నేను ఎంత కాలం నుంచో రాస్తున్న, నేను రాసింది ఎట్ల బోవాలె కిందికి. నాకున్న వసతి ఏమిటి చెప్తున్న, ప్రింట్ జేసినవి జేసినం, వెయ్యి కాపీలు, పదివేలు, లక్ష కాపీలు జేసినం ఎగ్జాంపుల్స్ వున్నయ్. లక్ష కాపీలు, లక్ష మందికే పోతయి గద. నేను ఎన్ని పుస్తకాలు రాసినా ప్రింట్ జేయించలేం. డిస్ట్రిబ్యూట్ జేయలెం, ఎవడికో ఇస్తం, పబ్లిష్ జేయిస్తరు, చాల మంది పాపం వాల్లు చారిటబుల్ జేసి తీసుకపోయినా గాని పరిమితమె గద అది.

నాకున్న పరిమితి ఏమిటి అంటె? నేను రాయగలుగత గాని, పబ్లిక్‌లోకి తీసుకపోలేను. పబ్లిక్‌లోకి తీసుకపోయేటువంటి ఆర్గనైజేషన్‌లో రాసేటోడు లేడు. రాసేటోడికి, తీసుక పోయేటోడికి కో ఆర్డినేషన్ లేదు, చెప్తున్న. దీనికి ఎంత పెద్ద నెట్ వర్క్ గావాల్నంటె ఒక సింగిల్ జెండా కింద, సింగిల్ ఆర్గనైజేషన్‌లో వుంటె అది సాధ్యమయితది. అది ఎక్కడి ఎన్ని దుకాణాలు? నేను రాసింది నీకు నచ్చదాయె, నువ్వు రాసింది నాకు నచ్చదాయె. నేను రాస్తె పేరు రావొద్దాయె, నువ్వు రాస్తె పేరురావాలాయె ఇగ ఇది. ఇట్ల వున్నయ్ గద, ఇన్ని వున్నయ్ గద. ఇన్ని పరిమితులు అయినా దూరం పోయింది. ఇగ రెండవది మీడియా, మనకు మీడియా సహకరిస్తె ఏది అక్కర్లేదు. మీడియా కంప్లీట్‌గ నెగిటివ్ రోలె గద. మనకు మీడియా లేకనె పాయె, ఉన్న మీడియా హొస్టైలేనాయె.

అవగాహన వచ్చింది గాని వివరాలు తెలవయి. లేకపోతె పల్లెటూల్లలో ఇంత ఎంత వస్తదయ్యా. మొత్తం మొన్నటి బై ఎలక్షన్ రిజల్ట్ ఎట్ల వచ్చింది. ఇపుడు మాకు రావాలసిన నీల్లు రాక మా పొలాలు ఎండిపోయినయ్ అని అందరికి తెలిసిందె. నీల్లు ఎన్ని టిఎంసిలు రావాలె, ఎన్ని బోయినయ్ గా లెక్కలు మనం జెప్పినం గాని దాని సారాంశం బోయింది. మా పోరనికి వచ్చే వుద్యోగం వాడు కొట్టుక పోయిండు, కాని వానికి జీవొ 610 దెలవదు, ముల్కీ రూల్స్ దెలవదు, సారాంశం బోయింది గద.

నిజమె అప్పుడు అప్పటి పరిస్థితి లోపల ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకమైనటు వంటి ఎన్నిచోట్ల అయిందది. హైదరాబాద్ పరిమితం తెలంగాణకె. తెలంగాణలో నల్లగొండ, వరంగల్ గంత అదె. చెప్తున్న, దాని ఇంపాక్ట్ పడ్డది గాని స్ప్రెడ్ తక్కువనె గద. ఇపుడు గూడ ఇంపాక్ట్ పడ్డది. ప్రతివాడు చెప్పగలుగుతున్నడు. అప్పుడప్పుడు ఏమి సదువు రాని ఆడవాల్లు, స్ట్రీట్ వెండర్స్ వాల్లు మాట్లాడుతుంటె నిజంగా వాల్లను జూస్తె సంతోషమైతది,

ఈర్ష్య కలుగుతది. మన సదువుకున్న వాల్లకన్న బెటర్ అని. అంత వాల్లకి క్రక్స్ ఆఫ్ ది ప్రాబ్లమ్ తెలిసింది. ఇపుడు ఒకసారి అపుడప్పుడు పోతుండె గద విలేజస్‌కు ఈ మధ్య బంద్ అయింది. హెల్త్ ప్రాబ్లమ్స్ తోటి. ఊకె కూచోని మాట్లాడుతుంటి. జస్ట్ నో హౌ దె రియాక్ట్. వాల్ల స్పందన ఎట్ల వుంటది అని అంటె ఎంత సింపుల్‌గ చెబుతరంటె, అర్థమయి చెబుతాంండ్రా దెలవదు, మొత్తానికి సెన్సిటైజ్ అయ్యింండ్రు.

ఎందుకమ్మ తెలంగాణ అంటే? ఏం సార్! తెలంగాణ వస్తె మా పొలాలకు నీల్లొస్తయ్, మా పోరగానికి కొలువొస్తది వారికా భావన కలిగింది. వస్తదా, రాదా కాదు! వానికా భావన కలిగింది మనకు ఉద్యోగాలు రావాలంటె తెలంగాణ కావాలె, నీల్లంటె తెలంగాణ కావాలె, ఏమి సార్ నోరు విప్పితె తంతాండ్లు వీల్లు, నక్సలైట్ అని కొడుతాంండ్రు ఇగ ఎంత కాలం అని? వానికా ఫీలింగ్ వచ్చేసింది. సదువుకొన్నోడు గాదు. కనక సెన్సిటైజేషన్ అనేది వొక దీర్ఘ ప్రక్రియ. తెలంగాణలో నిరాటంకంగ జరుగుతున్నది గదె. ఉద్యమాలు ఎన్నిసార్లు వచ్చినయ్, ఎన్నికలు ఎన్నిసార్లు వచ్చినయ్. సెన్సిటైజేషన్, భావజాల వ్యాప్తి నిరంతరం కొనసాగుతున్నది.

# అది మాకే కనువిప్పయింది

1969 - 1970 తర్వాత, ఇప్పటిదాక, 1972 నుంచి 1994 వరకు రివైవల్ వల్ల నేను స్వయంగ ఎన్ని వ్యాసాలు రాసిన, ఎన్ని మీటింగ్‌లు కండెక్ట్ జేసిన్నో నాకు దెలుసు. నేను, కాళోజి, మాధవరెడ్డి కలిసి ఎన్ని పబ్లిక్ మీటింగ్‌లు జరిపినమో మాకు దెలుసు. జరగలేదని గాదు, పేపర్లు రాయలె, ఎవ్వడు రాయడు. ఇపుడు ఫస్ట్ నవంబర్ 1996లో వరంగల్‌లో భూపతి కృష్ణమూర్తి పెట్టిన దానికి మల్ల మేమే. నేను, కాళోజి, మాధవరెడ్డి వీల్లే. అది మాకే కనువిప్పయింది. ఒక చిన్న పాంప్లెట్ తీసింగ్రు, ఒక చిన్న హాలు, ఒక రెండొందల మంది పట్టే హాలు, మూడు నాలుగు వేల మంది వచ్చింగ్రు. హాలు సరిపోలె, తిండికి యేర్పాటు జేస్తె సరిపోలె, ఏం అక్కర్లేదు అన్నరు, కూర్చున్నరు. బయట రెండు మైకులు పెట్టేస్తె బయటనె కూర్చున్నరు. ఆ రోజు ఈటీవీ, టివి9 అందరు వచ్చింగ్రు. చాల పెద్ద మీటింగ్ అది. ఒక్క 'హిందూ' పేపరు తప్ప ఎవడు రాయలె. ఏ చానల్ గూడ దీసుక పోయింది గాని పబ్లిష్ జేయలె, బ్యాన్. 'హిందూ' చాల ప్రామినెంట్‌గ రాసింది. దానిపైన చంద్రబాబు రియాక్ట్ అయి తెలంగాణ ఉద్యమం, మల్ల వేర్పాటు వాదం వస్తాంది, దాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తా అంటె దానిమీద కవ్వింపు జరిగి ఇంక బిగిన్ అవుతం దీంతో అని మొదలుపెట్టినం అన్నమాట. అంటె టెస్ట్ జేసుకున్నం మమ్మల్ని మేం. వుద్యమంలో బలమున్నదా? మాకు ప్రజల్లో వున్నది, లేకుంటె గంతమంది ఎందుకొస్తరు, వాల్లు గంత తిండి, నీల్లు లేక ఎందుకుంటరు, తర్వాత చంద్రబాబు నాయుడు రియాక్షన్ తర్వాత మల్ల మేము రియాక్ట్ అయితె, ఎందుకు రెస్పాండ్ అయితరు? ఇగ మొదలుబెట్టినం తిరుగుడు. ఎక్కడ తెలంగాణ, ఎండ్లకెల్లి వచ్చింది తెలంగాణ, ఎవరికి అర్థమయితది పిచ్చోల్లు గావొచ్చు. తిరిగినం, ఎందుకు తిరిగినం? మాకా నమ్మకం కలిగింది ప్రజల్లో వున్నది, అదొక నివురుగప్పిన నిప్పులా వున్నది. అయితే దాదాపు మేము, దాదాపు తెరాస వచ్చే వరకు దగ్గర దగ్గర ఎనిమిదేండ్లు వరుసగ నడిపినం. జనసభ, ఐక్యవేదిక, ఈ ఇంటలెక్చువల్స్.. మేము చెప్పేది విని చివరికి అమెరికా నుంచి మాకు ఇన్విటేషన్లు.. చెప్పండి అని. విదేశాలలో వున్న తెలంగాణ వాల్లు గూడ పిలిచించుకొని చెప్పించుకుంగ్రు అంటె ఇంత డీప్‌గ వుంది, మనమే వెనుకబడిపోయినం అన్న ఫీలింగ్ మాకొచ్చింది. అర్థం జేసుకోడం లోపల క్లిక్ అయిందది. క్లిక్ గావడం మా ఘనత కాదు, క్లిక్ గావడం వుద్యమం ఘనత. ఇష్యూలో వున్న బలం అది.

# ఇది యాచక అప్రోచ్

ఇపుడు ప్రతి వ్యక్తిని అదె ఫోర్స్ దృష్టితో జూస్తె తప్పు. రెండు యాస్పెక్ట్స్. కోదండరాం రెడ్డిని అగ్రవర్ణంవాడు అనడం చాల అన్యాయమైనటువంటి మాట. ఆయన కోదండరెడ్డి పేరు ఇపుడు దీసేయలె ఎప్పుడో దీసేసిండు. తెలంగాణ వుద్యమం రాకముందే దీసేసిండు. రెండవది ఎదిగిండు, కోదండరాం తీరుగ ఇతరులు ఎదగడం ఎవరన్న ఆపింర్రా. కోదండ రాంని జుట్టుపట్టి పైకి లాగలె. జనార్దనరావుని ఎవరు జుట్టుపెట్టి లాగలె, ఏదో స్పార్క్కైండు ఎదిగిండు. ఇతర సామాజిక వర్గాల నుంచి వుండె అకడమిషన్స్ ఎదగడం ఎవరన్న ఆపింర్రా, ఆపగలుగుతరా?

రెండవది బలహీన వర్గాలని వున్నరు, దళితులె గావొచ్చు, బిసిలె గావొచ్చు. మాకే మిస్తరు, మాకేమిస్తరు అనేది అప్రోచ్ నేను పబ్లిక్‌గ చెప్పిన. ఇది యాచక అప్రోచ్. ఎవరిచ్చేదేందయ్య అడుక్కుంటమా? అడుక్కుంటె ఇచ్చేదుంటదా? అది నువ్వు దెచ్చు కోవాల్నయ్య, నువ్వు జంపాయించుకోవాలె. ఈ రోజు జెప్త ఎగ్జాంపుల్ ఈ రోజు కోదండరాం అగ్రకులం వాడు కావడం వల్ల రాలె. తెలంగాణ కమిట్‌మెంట్ వల్ల వచ్చింది. నేను బల హీనవర్గాల వాడినని నాకది అడ్డం రాలేదు, నాకు అడ్డంరాలె అది. ఈ రోజు నాకు గుర్తిం పుకు నేను బిచ్చం ఎత్తుకున్నన? చెప్పున్న. వచ్చిందయ్య, పనిజేసిన వచ్చింది.

నువ్వు జేసే పనిని బట్టి వుంటది గాని, యాచించి తీసుకోటం గాదు, కొట్లాడి తీసుకోవాలె. ఇండ్ల మా భాగమెంత అని గాదు, నువ్వు భాగమిచ్చే స్థితిలో వుండాలె. ఎవడన్న ఆపినారయ్య. రెండోది బలహీనవర్గాల్లో ఐక్యత ఎక్కడ పొడైందయ్య. బిట్టర్ ఎక్స్‌పీరియ న్సెస్, పెద్ద పెద్ద బిట్టర్ ఎక్స్‌పిరియన్సెస్, అందుకె దూరం వున్న. చాల పెద్ద వాల్లు చాల మంచి పేరున్న వాల్లె. కొండా లక్ష్మణ్ వున్నడు, ఆయన అప్రోచ్ ఏందంటె అండ్లకెల్లి బయటికి రాలేడాయన. పెద్దమనిషి, శాక్రిఫైజ్ జేసిండు, రెస్పక్టబుల్ మ్యాన్ చాల గౌరవిస్త గని ఆ ఫ్రేం వర్క్ అనేది అసలక్కడి నుండి బయటికి రాలేడు.

సరె దేవేందర్‌గౌడ్‌తో కంపైర్ జేయడం తప్పుగని, దేవేందర్‌గౌడ్ ఎక్కడ ఆయన ఎక్కడ గని, దేవేందర్‌గౌడ్ ఎంత పెద్ద డిజపాయింట్‌మెంటయ్య. దేవేందర్‌గౌడ్‌కి నేను ఓపెన్ సపోర్ట్ ఇచ్చినయ్య, యాజ్ దిస్ రిస్క్ ఆఫ్ బీయింగ్ మిస్‌అండర్ స్టుడ్. నా మీద ఓ కథలు అల్లింర్రు, చూసింర్రు కద ఎన్ని కథలు చెప్పింర్రు. అయిన గని నేను చెప్తే ఆయన ఎజెండా, తెరాసను ఖతం జేయాలన్నది ఆయన ఎజెండ. తెరాసను ఖతం

జేయాలంటె నువ్వు ముందు ఎదగాలె, నువ్వు బలపడాలె, అంతకంటె మంచిగుంటె అదే పోతది, నువ్వు జంపనక్కర్లే అదే జస్తది. నువ్వు ఎదగవు, వాన్ని బతకనివ్వను అంటె ఎట్ల. ఆర్నెల్లల్లో తిరిగి తిరిగి చివరికి ఏమైంది? నువ్వు పొలిటికల్‌గ ఈ రోజు ఇన్‌సిగ్నిఫికెంట్. కనుక ఈ బలహీన వర్గాల్లోపల అనైక్యత ఏదైతె వుందో.. అదిగూడ పెద్ద అడ్డంకె.

కని మన సొసైటీలో బాగ పాతుకపోయినటువంటి ఆ భావన ఏదైతె వుందో అదె దారి తీస్తుంటది. మంచైనా, చెడ్డైన గదే కనబడతుంటది. ఇపుడు ఒకటి ఈ కులాల ప్రస్తావన వచ్చినపుడు వరవరరావుకు బ్రాహ్మణవాదం అంట గడితె ఎట్లుంటది, చెప్తున్న. ఇపుడు ఇంకోటి రియాక్షన్స్ ఎట్ల వుంటయంటె నవ్వాల్నా, ఏడవాల్నా అర్థం గాదు.

ఇదె కోదండరాం గురించి చాల వచ్చినప్పుడు ఏదో సందర్భంలో అన్న నేను. నన్నే మిమ్మల్ని ఎందుకు జేయలేదు అని అంటె, అయితనన్ననయ్యా నేను కాదలచుకొంటె ఎవరు ఆపరు నన్ను. నేను గాదు ఒక టెంపరమెంటల్లీ ఎన్నడు గూడ ఇటువంటి ఒక ఆఫీస్ బేరర్ పొజిషన్‌లో వుండను అన్న, గిప్పుడు గీ ఏజ్‌లో ఇంకెమొస్తనయ్యా నేను. కోదండరాం యొక్క సెలక్షన్ లోపల నా సమ్మతి, నా పాత్ర చాల వున్నది. చాల సమర్థుడు. అయనకి అవగాహన వుంది అంటె, దానికి ఏదో పత్రికలోపల 'కోదండరాం తప్ప మిగతా వాల్లంతా అసమర్థులె అన్న జయశంకర్' బలహీనవర్గాలను కించపరచిన జయశంకర్ హెడ్డింగ్. నేను అన్నది ఏంది? వాల్లు రాసింది ఏంది? ఏం జేస్తం జెప్పు. ఇటువంటివి జూసి ఏడవాల్నా, నవ్వాల్నా. అది జూసి వస్తరు, పిచ్చి రాతలు రాస్తె.. నన్నెడిగితె ఎట్లనయ్యా.(పెద్దగ నవ్వు)

# విడిపోతె అవకాశం వున్నది

ఇపుడు తెలంగాణ రాష్ట్రం వచ్చినా, రాకపోయినా చెప్తున్న, బిసి మూవ్‌మెంట్ బలహీన వర్గాలకు రాజ్యాధికారం లోపల భాగస్వామ్యము, వాల్లకు ఆర్థిక న్యాయము, సామాజిక న్యాయమనేది ఈ సమస్యలు కేవలం తెలంగాణ సమస్య గాదిది. మొత్తం రాష్ట్ర సమస్య, దేశ సమస్య. తెలంగాణకె పరిమితం జేస్తె బయటపడలేం మనం. న్యాయం గావాలె, ఈ వర్గాలకు న్యాయం గావాలి, చైతన్యం రావాలి, అన్ని గావాలె అండ్ల ఏమి ఇది లేదు. వుమ్మడి రాష్ట్రంలో సాధ్యం కాదు, కాలె. గతంలో చెప్పిన్నో లేదో గని సాధ్యంగాలె, సాధ్యం కాదు. ఇపుడు గత చరిత్ర, యాభైఏండ్ల చరిత్ర మన వుమ్మడి రాష్ట్రం లోపల ఏమిటి కొల మానం బలహీనవర్గాలకు? రాజ్యాధికారంలో న్యాయబద్ధమైనటువంటి భాగస్వామ్యం ఏంది నిర్వచనం. కొలమానం ఏంది. చాల వుంటయ్ కొలబద్దలు, 150 వుంటయ్. ఒక కొలబద్ద ఏమిటంటె, ఈ వర్గాల నుంచి తమంతట తాము ఎదిగి, ఒకరు పుష్ జేస్తె కనుక ఇంతకు ముందు రాగలిగినటువంటి, ముఖ్యమంత్రిగా గలిగినటువంటి స్టేచర్ రావాలె, ఆ బలం రావాలె. వచ్చిందా ఉమ్మడి రాష్ట్రంలో?

ఒక్క దామోదర సంజీవయ్య దప్ప ఏ బలహీన వర్గాల వారు మొత్తం రాష్ట్రం మీద వచ్చింద్రా. దామోదర ఎదగిరాలె, ఎత్తుకొచ్చి కూర్చోబెట్టింద్రు. ఒక్కడుగు ముందేస్తె, నాలు గడుగులు వెనక్కి లాగేసింద్రు. ఒక కాలు బ్రహ్మానందరెడ్డి, ఒక కాలు సంజీవరెడ్డి లాగేస్తె కుప్పకూలిపోయిండు. మల్ల ఇంకెవరు రాలేకపోయింద్రు. ఈరోజున్నటువంటి రాష్ట్రంలో వున్న రాజకీయ ముఖచిత్రం జూస్తె, పార్టీల ముఖచిత్రం జూస్తె సమీప భవిష్యత్తులో ఎవరన్న వచ్చే అవకాశం వుందా? ఏ పార్టీ అయినా తీసుకో. కాంగ్రెస్ జూస్తనె వున్నం గద, రాజశేఖరరెడ్డా, జైపాల్‌రెడ్డా, కిరణ్‌కుమార్‌రెడ్డా, జానారెడ్డా గివె గద పేర్లు ఏ ప్రాంతం వాడైన. తెలుగుదేశం వస్తె ఒకటె సామాజిక వర్గం. ఇంకోటి లేనేలేదు. కమ్యూనిస్టు పార్టీల్లో అంతకంటె ఘోరంగ వుంది.

ఇగ బిజెపిది ఎట్ల వుంటదంటె! నేను అప్పుడప్పుడు జోక్‌గ చెప్తుంట. గుళ్లల్లో మూల విరాట్, ఉత్సవ విగ్రహాలని రెండుంటయ్. ఉత్సవ విగ్రహాలు బజారులో దిప్పడానికి. మూలవిరాట్టు నైవేద్యాలకు. నైవేద్యం మూల విరాట్టుకు పరదావేసె పెడ్తరు. ఉత్సవ విగ్రహాలకు నైవేద్యం అందదు. (పెద్దగ నవ్వు) తెలంగాణ ప్రాంతపు బిజెపి నాయకులు ఉత్సవ విగ్రహాలు. మూల విరాట్టులు వెంకయ్యనాయుడు, రామారావులు. కనుక ఆ

ముఖ్యమంత్రి అనే పదవి మూలవిరాట్టులకు పోతది గాని ఉత్సవవిగ్రహాలకు రాదు. చెప్పేదేందంటె, వీల్లకెవరికి రాదు. దత్తాత్రేయకిస్తరా? బంగారు లక్ష్మణ్‌ని రానిచ్చింండ్రా? ఏవో అభాండాలు, అభాండాలంటె బంగారు లక్ష్మణ్‌కంటె పెద్ద ఘోరాలు జేసినటువంటి చంద్రబాబునాయుడు వుంటడు గని, బంగారులక్ష్మణ్ జేసినది నిజమా, అబద్ధమా? తర్వాత సంగతి అంతపెద్ద నేరమేమీ గాదది. దాన్ని ఎంత మ్యాగ్నిఫై చేసింండ్రు.

చిరంజీవి పార్టీ అంటె చిరంజీవె ముఖ్యమంత్రి గావాలె. కనక సమీప భవిష్యత్తులో వుమ్మడి రాష్ట్రంలో బలహీనవర్గాల వాల్లకు నేను చెప్పినటువంటి నిర్వచనం ప్రకారం రాజ్యాధికారం వచ్చే అవకాశం వుందా అంటె లేదు. విడిపోతె అవకాశం వున్నది. ఎందు కున్నది అవకాశం అంటె? మల్ల అదె రాజకీయ ముఖచిత్రం, ఇక్కడి నేపథ్యం. ఒకటేం దంటె.. తెలంగాణ ప్రాంతంలోపల ఇక్కడి బలహీన వర్గాల్లోపల వున్నటువంటి చైతన్య స్థాయి, ఇతర ప్రాంతాల కంటె ఎక్కువున్నది. కారణం ఒక్కరోజులో రాలె. చాలా దూరంబోతె సమ్మక్క, సారలక్కలనుకొందాం. కని తర్వాత వచ్చినటువంటి సాయుధపోరాటం, నక్సలైట్ వుద్యమం, కులసంఘాలు, తెలంగాణ ఉద్యమం ఇవన్నిటి ఉద్యమాల ఫలితంగ తెలంగాణ ప్రాంత బలహీనవర్గాల్లో చైతన్యస్థాయి పెరిగింది.

దీనికి ఎగ్జాంపుల్ ఏమిటి? కొలమానం, దీనికి ఎవిడెన్స్ ఏమిటి అంటె.. ఇప్పటికి గూడ ఆంధ్రప్రాంతంలో కారంచేడులు, పదిరి కుప్పంలు, వేంపెంటలున్నయ్. తెలంగాణలో లేవు, వుండయి గూడ. ఇప్పటికి అక్కడున్నయ్, ఇప్పటికి బూత్‌లకు బోయి ఓట్లు వేయనీయరు. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. రెండవది అగ్రవర్ణాల్లోపల అగ్రవర్ణాలు అంటె ఈ రోజు రాష్ట్రాన్ని పాలించేది రెండే కమ్మ అండ్ రెడ్డి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయితే ఒక వర్గం అటొమాటిక్‌గ డిసప్పియర్ అయిపోతది. మిగిలేది ఒకటె, ఈ ఒకటి గూడ రాయలసీమ ఆ వర్గంతో కలిస్తినె ఆ వర్గం బలం, లేకుంటె లేదు. తెలంగాణ ప్రాంత చైతన్యస్థాయిని తట్టుకోలేరు వాల్లు.

రెండవది, తెలంగాణ ప్రాంతపు అగ్రవర్ణం ముఖ్యంగ రెడ్లల్లో కొంత రియలైజేషన్ వచ్చింది. బలహీనవర్గాలను చాలాకాలం దూరంపెట్టె పరిస్థితి లేదని, అదే రాయలసీమ రెడ్లల్లో బలహీనవర్గాలనే మాటే వినడానికి సిద్ధంగాలేరు వాల్లు. ఈ రెండు ప్రాంతాల్లో వుండేవాల్లు గలిస్తె పెద్ద ఫర్మిడబుల్ ఫోర్స్ అది. విడిపోతె గాదు, కనుక తెలంగాణ విడిపోయినపుడు ఒక సామాజికవర్గం ఏదైతె గుత్తాధిపత్యం నడిపిస్తున్నదో అది ఎలిమినేట్ అయితుంది. రెండవదానికి ఆ రియలైజేషన్‌లో కొంత ప్రజాస్వామిక కల్చర్ వచ్చే అవకాశం

వుంది గనుక, తెలంగాణ రాష్ట్రం అంటూ వస్తె ఎవరి దయ అవసరం లేదు, ప్రజల చైతన్యమె కాపాడతది. వాడిస్తడా, వీడిస్తడా గాదు, వీడు తెచ్చుకోగలుగుతడు. ఎప్పుడైన బలహీన వర్గాలకు అధికారం గావాలంటె తెచ్చుకోవాలె, ఎవడో ఇస్తె వచ్చేది గాదు. ఆ తెచ్చుకునేటువంటి స్టామినా తెలంగాణ ప్రాంతంలో వచ్చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆ స్టామినాను పనిజేయనీయరు. ప్రత్యేక రాష్ట్రంలో ఇవాల కాకపోతె రేపో, రేపు కాకపోతె ఎల్లుండో అది ఎమర్జ్ అయితది. కనుక నిజంగ బలహీనవర్గాల సామాజిక న్యాయం ఏ పేరు పెట్టిన గాని తెలంగాణ ప్రాంతంలో దానికి ఫర్‌టైల్ ల్యాండ్ వున్నది ఇపుడు. అది చాల పరిపక్వమై వుందన్నమాట. కనుక ఆ ప్రజలయొక్క చైతన్యము, వాళ్ల యొక్క అవగాహన అదే ఇస్తది గాని, యాచిస్తె వచ్చేది కాదిది. తెలంగాణలో సాధించుకోగలుగుతం.

# కమ్యూనిటీ చరిత్ర చెప్తున్న

నాకు దెలవదు గాని నమ్మగలుగుత. నాకు ఈ విషయం దెలవదు గాని నమ్ముత తప్పకుండ నమ్ముత, ఎందుకంటె జరిగే వుంటది. అందుకె అన్నగద 'ఓ గాడ్ సేవ్ మి ఫ్రం మై ఫ్రెండ్స్' అని ఇదె కంటెక్స్ట్. ప్రతితరం ఎక్స్‌పీరియన్స్ అదె, అండ్ల ఆశ్చర్య పడాల్సింది ఏమీ లేదు. జరిగె వుంటుంది. ఇపుడు ఆ కల్చర్, ఆ కల్ట్ చెప్తున్న, మనవల్ల మనకి వుండె కల్చర్, నా రీసెంట్ అనుభవం చెప్తున్న ఎగ్జాట్లీ ఐడెంటికల్ కాకపోవచ్చు కని కంపేర్ గావొచ్చు. ఏదో ఎలక్షన్లో ఒక ఎక్స్‌పీరియన్స్ చెప్త.

ఒక ఎగ్జాంపుల్ నేను స్వయంగ ఇన్వాల్వ్ అయిన ఒక సంఘటన జెప్తున్న. ఇపుడు నా సోషల్ బ్యాక్‌గ్రౌండ్ తెలుసుగద! ఇండ్ల ఐదు పంచదాయిని అని ఐదు వుంటయ్. ఈ ఐదు దాయిలలో వున్నటువంటి అనైక్యత మొత్తం బిసి కమ్యూనిటికి అదొక ప్రతిబింబం అది. (పెద్దగ నవ్వు) చెప్తున్న మా ఫాదర్ లైఫంత ఈ విశ్వకర్మ సంఘాల పేరుతోని లైఫంత గడిపి, చివరికి ఫ్రస్ట్రేట్ అయ్యి వదిలేసిండు. ఇందులో వుండె అనైక్యత కనుక నేను వచ్చేవరకు ఈ విశ్వకర్మ సంఘాలకు పెద్ద ఇన్వాల్‌మెంట్ నాకు లేకపోవడం, రెండవది నాకు తీరిక లేకపోవడం, వీల్లను దగ్గర తేవడం లైఫంత స్పెండ్ జేసిన నాకు సాధ్యం కాలేదు మా ఫాదర్‌కి, ఇప్పటికి అదె పరిస్థితి, ఇవెన్ టు డె. ఒక పద్యం వున్నది పూర్తిగ జ్ఞాపకం లేదు గాని విచ్ ఈజ్ ట్రూ నీకు తెలవాలని చెప్తున్న. ఆ కమ్యూనిటీ చరిత్ర చెప్తున్న. అది మా ఫాదర్ ఊర్కె విన్పిస్తె వినేవాన్ని నేను.

"ఉరగముల అధికనిదురై

కరులకు మాంద్యము

విశ్వకర్మలకు నిరంతర స్వజాతి విరోధము" ఇంకొక నాలుగో లైను వుంది, ఇది కందుకూరి రుద్రకవి అని (విశ్వకర్మ కవి) ఆయన రాసిండు. పూర్తి పద్యం జ్ఞాపకం లేదు. అది ఎగ్జాట్లీ ఇప్పటికి అదె వున్నది. ఏదో పుస్తకంలో వున్నది అది. సరె ఏమున్న గని పిలుస్తుంటరు, పోతుంటం, కనీసం ఒక దగ్గర దీసుకొద్దాం అనేదాంతోటి. వన్ ఆఫ్ ది ఎలక్షన్స్ లోపల మధుసూదనాచారి కాండిడేట్. ఈ మొత్తం రాష్ట్ర చరిత్రలో అసెంబ్లీకి ఎన్నికైంది ఒకేఒక్కసారి మధుసూదనాచారి ఎప్పుడు? తెలుగుదేశం పార్టీలో. ఆంధ్ర నుంచి గాని, తెలంగాణ నుంచి ఈనాటికి అసెంబ్లీకి ఎన్నికైన వాడు లేడు, ఇప్పటి వరకు ఈ ఐదు కులాల నుంచి. ఎమ్మెల్సీ ఒకరిద్దరైండ్రు. అది వేరు విషయంగాని.

ఇగ మధుసూదనాచారి నన్ను దీసకపోతే కొంత మందిని కూర్చోబెట్టిండ్రు. నేను మాట్లాడతుంటె ఈ పంచదాయినిలో యే దాయి ఈయనది? కర్రపనా, బంగారం పనా,

ఇత్తడిపనా, ఇనుపపనా, రాల్లపనా, రప్పలపనా అండ్లకు దిగింది చర్చ. అవును సార్ ఈయన బంగారం పనిజేసేటాయన. పనంటె ఆ వర్ణం. ఈయనైతె మాకేం జేస్తాడుసార్ అన్నరు. నాతో ఒకడు నన్నే. నాదే వర్ణం అంటె మా మదర్ తరఫున గోల్డ్ స్మిత్, మా ఫాదర్ తరఫున కార్పెంటర్. మా ఫ్యామిలీలో అందరున్నరు. బ్రదర్స్, సిస్టర్స్ నాలుగు వర్ణాల వారు. చాలా మంది జేసుకోరు చెప్తున్న. ఇండ్ల గోల్డ్స్మిత్ అందరికంటె గొప్ప అని, అందరికంటె తక్కువ కమ్మరి పని అని గివన్ని చాల వున్నయ్ ఐదారు. అయితె యేం చేయలేము. అయితె అందులో యేం చదువుకోని వాల్లున్నరు, నాదేందంటె జెప్పేది చదువుకోను రాని వారికి అర్థం జేసుకోరు, జెప్పొచ్చు. చదువుకొన్న వాల్లల్లోవున్నరు. అయితె ఈ ప్రశ్న ఒకడు వేసిండు నన్ను. నన్నుగొట్టి సూడడానికి. నేనన్న నీకు గాదు, ఎవ్వరికి ఏం జేయడు. చెయ్యొద్దు అని అన్న. ఇపుడు ఆయన్ను ఎన్నుకుంటమా లేదా అన్నది ఇంక బీజం నాటె దశల్నె వున్నది.

ఎన్నిక కాకముందె మీరు గిన్ని బెడితె మీరు ఏమి ఎన్నుకుంటరు, ఎన్నికైనాక ఆయనేం జేస్తడు. ఒక్క మీ ఓటుతోని గెలుస్తడా. మీ ఓట్లెన్ని, అవి పడేటియి ఎన్ని. అండ్ల మీలో అన్ని పార్టీలతో చాలా మంది రెడ్లతో, వెలమలతో అసోసియేట్ అయినవాల్లు, పల్లెటూల్లలో వుండటం దానివల్ల అసోసియేట్ అయ్యుంటరు గద. పటేల్లు, పట్వార్లు, దొరలతో అండ్లకెల్లి బయటికి వస్తరా మీరు, చేయడు. అవును సార్ ఆల్లని పట్టుకొంటె మాకు పన్లు అయితయ్, ఈయన్ని పట్టుకుంటె మాకు పన్లయితయా? అన్నరు. గెలవలె చివరికి. అంటె వీల్లవల్లని గాదు చెప్తున్న, వీల్ల వల్ల అని గాదు, ఒక్క కులంల్నె గింత వున్నంక యాభై కులాల్లో ఎట్ల వుంటది. అసాధ్యం కాదు గానీ దెబ్బలు తినాలె, బాగ తిన్నరు, ఇంక తినాలె. లేక పోతె ఏంది మొన్న స్టేట్ క్యాబినెట్ ఇంత చైతన్యం వున్నంకనే వచ్చింది గద. స్టేట్ క్యాబినెట్ కాంపొజిషన్ ఎట్ల వున్నదయ్య. ఎవడన్న మాట్లాడతాండా. తెలంగాణ ప్రాంతపు బిసి, ఎస్సి, ఎస్టి సరె ఎస్సిలకంటె వాల్ల కోటా వచ్చింది. బిసిలల్ల మూకుమ్మడిగా మా కోటా ఏంది అని ఎవడన్న అడిగిండ? ఒక్కడు రానోడు అడగలె, వచ్చినోడు అడగలె. వచ్చినోడికి వున్నది పోద్దని భయం, రానోడికి రాదన్న భయం. ఇంత ఘోరమైన క్యాబినెట్ ఎప్పుడు జూడలేదు. సామాజిక వర్గాల ప్రాతినిధ్యాన్ని బట్టి జూస్తె, ఇంత ఘోరమైన క్యాబినెట్ ఎప్పుడు జూడలె. అంటె చెప్పేదిమిటంటె ఐక్యత రానంత వరకు విడివిడిగ పోరాడితె కష్టం. నాచురల్గ బలంలో వున్నవాల్లు, డబ్బున్నవాల్లు, బలం వున్నది, డబ్బున్నది, ప్యాట్రనైజ్ వున్నది. తెలంగాణ వస్తె తగ్గుతది అది.

# ఉమ్మడి రాష్ట్రంలో ఇంపాజిబుల్

అగ్రవర్ణాలకు చెందిన ముఖ్యమంత్రుల్లో కారణాలేమైన అండ్ల స్వార్థం వున్నా, సిన్సి యారిటీ లేకపోయినా పి.వి నరసింహారావును చెప్పొచ్చు. పి.వి. నరసింహారావు ఏదో బలహీనవర్గాల ఉద్ధరణ కొరకు జేయలె. ఇతర వర్గాలను, వాటికి కౌంటర్‌గ జేసే వుద్దేశంతో బిసిలకు చాల పెద్ద ప్రాముఖ్యత ఇచ్చిండు. ఎన్.టి. రామారావు, ఒక దశవరకె రానిచ్చిండు, పైకి రానీయలె. ఎన్‌టి. రామారావు గ్రామీణ సెటప్‌లోపల, రూరల్ ఎడ్మినిస్ట్రేషన్ లోపల ఏ సామాజిక వర్గం పాతుకు పోయిందో, దాన్ని ఖతం జేసేందుకు చేసిండు. కని గుమ్మం దాకనె రానిచ్చిండు, లోపలికి రానీయలె. అందుకె కారణమేమైన, ఉద్దేశం ఏమైనగని ప్రస్ఫుటంగ కనబడ్డది, మొట్టమొదటి సారి పి.వి. నరసింహారావు గారి లోపల. పి.వి. నర సింహారావుకు దాంట్లో ఎన్.టి. రామారావుకంటె స్వార్థం తక్కువుండె. పూర్తిగ నిస్వార్థం అనడం లేదు, కంపారిటివ్‌లీ పి.వి. నరసింహారావు కాలంలోపల్నె కొంత మేలు జరిగింది. ఎందుకు జరగిందంటె, ఆయన వున్నదె పద్దెనిమిది మాసాలు.

ఇగ తర్వాత వరుసగ మల్లి యాంటీ ఫోర్సెస్సే వచ్చినయ్. ఎన్‌టి. రామారావు చాలా కాలమే వున్నప్పటికి ఆయన ప్రధాన ఉద్దేశం గ్రామీణ వ్యవస్థలోపల ఈ పటేల్, పట్వారీలలో వున్న సామాజిక వర్గాన్ని కట్‌జేసే ఉద్దేశంతో జేసిండు పైన చాలంజ్ అయిద్దని. ఆ ప్రాసెస్‌లో ఏం జేసింగ్రు రెడ్లు బోయి, కమ్మలొచ్చింగ్రు. బిసిలు రాలె, బిసిలు ఒక దశకు వచ్చింగ్రు అంతె. ఐతె ఆ పునాది ఏర్పడ్డది, కొంత వరకు ఈరోజు కొంతైన వున్న దంటె ఈ రెండు కారణాలవల్ల మిగతా అందరు గూడ యాంటీయె. ఎకనామిక్ పవర్, ఆర్థిక బలం. కమ్మాస్‌కి వున్న ఆర్థిక పవర్ ఎవరికున్నదయ్యా. ఎంత రిచ్ కమ్యూనిటీ అది. ఎంత కంట్రోల్డ్ ఎకానమీ వాల్లది. ఈరోజు ఎకానమీ ఎంతపెద్ద కంట్రోల్ వాల్లది. ఎకానమీ కంట్రోల్ ఐ మెబి రాంగ్ ఐ థింక్ దట్ రెడ్లని దాటిపోయింగ్రు వాల్లు. సంఖ్య తక్కువ గావొచ్చు గాని యిన్ టర్మ్స్ ఆఫ్ వాల్యూ ఆఫ్ దేయిర్ అసెట్స్ చాల ఎక్కు వున్నయ్.

ఉమ్మడి రాష్ట్రంలో ఇంపాజిబుల్. తెలంగాణ వస్తె ఫస్టఫాల్ ఆ కమ్మ ఎంత రిచ్ అయినా, ఇక్కడ న్యూమరికల్‌గ తక్కువ గద. పవర్‌ఫుల్ పాకెట్స్ లేవు గద ఇక్కడ. ఏదో కొద్దిగ ఖమ్మంలో కొద్దిగ వున్నరు. ఖమ్మంలో వున్న సెటిల్ అయిన కమ్మాస్ అంత ప్రమాదకరమైన వాల్లు కాదు. అక్కడ ఓల్డ్ సెట్లర్ కమ్మాస్‌కు, కొత్త కమ్మాస్‌కు వైరుధ్యం వున్నది అక్కడ. మా ప్రాముఖ్యత లేకుండ జేసింగ్రని భావన వుందట వాల్లల్లో. నిజా మాబాద్‌లో వన్ ఆర్ టు పాకెట్స్ వున్నరు అంతె, ఎక్కడున్నరయ్యా వాల్లు.

ఒకటి తెలంగాణ పట్ల వాళ్ల (సిపిఎం)స్టాండ్, ఎవరు లైక్ జేయరు, టిఆర్ఎస్, ఎవరు లైక్ జేయరు. రెండవది తెలంగాణ ప్రాంతపు లీడర్‌షిప్‌ను ఎమర్జ్ కానిచ్చింద్రా వాల్లు, సిపిఎంలో అదే కమ్మ, ఆంధ్ర కమ్మ లాబీయె గద. సిపిఐ కొంతలో కొంత బెటర్ ఇంక. సిపిఎం పార్టీ అంటె అచ్చం కమ్మపార్టీయె అది. ఆంధ్ర, కోస్తాంధ్ర లాబీ పార్టీయె అది. కనుక తెలంగాణతో ఐడెంటిఫికేషన్ లేదు వాల్లకు. పూర్తి క్యాస్ట్ ఓరియెంటెడ్. ఇపుడు వాల్లకి ఈరోజు ఏం లేదుగద. ఒన్ ఆర్ టూ సీట్లోల్లే గద వాల్లు. తెలంగాణ వస్తె అదిగూడ రాదు. అన్‌లెస్ దె జాయిన్ విత్ సిపిఐ ఆర్ సమ్ బడీ. సాయుధపోరాటం వార సత్వం సిపిఐ, సిపిఎం దెనాయె. సిపిఎం వాల్లు హైదరాబాద్‌లో రెండు మేజర్ భవనాలు కట్టింద్రు. ఒకదానికి సుందరయ్య పేరు, ఒకదానికి బసవపున్నయ్య పేరు.

అంటె తెలంగాణ సాయుధపోరాట యోధుల్లో ఎవ్వడు అక్కర్రాడా? అంతపెద్ద ఎస్టేట్‌లు. సిపిఐ వాల్లు కనీసం మగ్దూమ్ పేరు పెట్టింద్రు. ఇగ వాల్లకేమున్నది, వాల్లని ఇగ్నోర్ జేయకపోతె వచ్చేదేమున్నదయ్య. దేనికి పట్టించుకోవాలె, తెలంగాణకు సపోర్ట్ జేయరు. వీకర్ సెక్షన్స్‌కు అసలు అందులో వాల్లకు ప్లేసే లేదు. ఉద్యమం పేరుతో రోడ్లెక్కించి, జెండాలు బట్టుకొని లారీలు తినడానికే వాడుకొంటున్నరు గని, వీల్లకి తెలంగాణ ప్రాంతంలో సిపిఎం నాయకత్వంలో స్టేట్ లెవల్లో వున్న ఒక పేరు జెప్పు. నేషనల్ లెవల్లో ఫర్‌గెటిట్, స్టేట్‌లెవల్లో గుర్తింపు వున్నటువంటి ఒక నాయకున్ని ఎదగనిచ్చింద్రా వాల్లు. లేరా? నిబద్ధత గలవాల్లున్నరు. కని ఏం జేయలేరు వాల్లు.

గూర్ఖాలాండ్‌ది చాలా చిన్న ఫ్యాక్టర్. ఆంధ్రప్రదేశ్ లోపల కమ్యూనిస్టుపార్టీ అంటె కమ్మపార్టీ. అని ఎవరో గాదు, మా ప్రైవేట్ డిస్‌కషన్‌లో బర్దనే అన్నడు. పబ్లిక్‌గ జెపుతలేడు గాని బర్దనె అన్నడు. మీ పార్టీ ఏం తక్కువ లేదు అంటె, మా పార్టీగూడ అంతేలేండి అన్నడాయన. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ బేసికల్లీ కమ్మపార్టీ సార్ అన్నడాయన. సిపిఐలో పువ్వాడ నాగేశ్వరరావు ఏందది. ఏ బూర్జువా కంటె తక్కువున్నడాయన. పార్టీకి జేసింది ఏంది, ప్రాంతానికి జేసింది ఏంది? వాల్లు ఇపుడు తెలంగాణ ప్రాంతానికి అన్యాయాలు జరుగుతున్నయని యాబై ఏండ్ల నుంచి మొత్తుకుంటె, ఎన్నడన్న నోరు విప్పింద్రా వాల్లు? పోట్లాట తర్వాత సంగతి. విధిలేక ఇపుడు సిపిఐ, సిపిఎం మీద అప్పర్ హ్యాండ్ దెచ్చుకోడానికి సిపిఐ సపోర్టు జేసింది. అండ్ల కొందరు తెలంగాణలో కొంచెం ఎదిగినోల్లు వున్నరు గనుక. ఆంధ్ర ఇంట్రెస్ట్ అంతకంటె ఏం లేదు. గూర్ఖాలాండ్ చాలా మైనర్ ఇష్యూయె తెలంగాణ కాంటెక్స్ట్‌లో. నేషనల్ కాంటెక్స్ట్‌లో. ఇంపార్టెంట్, తెలంగాణ కాంటెక్స్ట్‌లో, ఇట్ ఇజ్ నాట్ ఎ ఫ్యాక్టర్ యెటాల్.

# రైట్ ఫ్రం స్టూడెంట్ డేస్ నుంచి యిప్పటి వరకు

రెండు అనుకున్న. ఒకటి ఏందంటె శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికలోని కొన్ని విషయాలు పుస్తక రూపంలో తేవాలనుకున్న నేను. ఎందుకంటె ఆ నివేదికలో ఆ ప్రస్తావన వుండి వుంటె రిపోర్టు ఇట్ల వుండేది కాదు. కని ఈ ఆరోగ్యం చెడిపోవడం వలన ఐదారు నెలల కిందనే అనుకున్న, తేలేకపోయిన. ఇంగ్లిష్‌లో తెద్దామని ప్రతిపాదన ఒకటి వుండె. చూద్దాం కమింగ్ డెవలప్‌మెంట్స్ ఎట్ల వున్నయొ. అది వస్తదా రాదా చూద్దాం డిపెండ్స్ అపాన్ ద నీడ్స్ అప్ కమింగ్ డేస్. రెండోది నా జ్ఞాపకాలు రాయాలని చాలా మంది మిత్రులు, అటో బయోగ్రఫీ రాయాలంటరు గాని, ఆటో బయోగ్రఫి చాల సెకండ్రీగా వుంటుంది అందులో. నేను మొత్తం స్టూడెంట్ డేస్ నుంచి ఇప్పటి దాకా ఏఏ ఉద్యమాలతోని జీవితాన్ని పెనవేసుకున్నా, అన్నింట్లో అంతర్లీనంగ తెలంగాణ సమస్య వుంటుంది. ఇగ దాంతో రాయాలని చాలా మంది మిత్రులు చాలా కాలం నుంచి అంటున్నరు. ఆరోగ్యం సహకరిస్తె అది ఒకటి రాద్దామనుకొంటున్న.

చాలా విషయాలు గ్రంథస్తం కానివి, పర్సనల్ అనుభవాలు తెలంగాణ సమస్యతో లింక్ అయిన అనుభవాలు. అప్పుడప్పుడు మాట్లాడుతుంటె వింటరు కొంతమంది, ఇవన్ని వివరించి రాయాలె సార్ అంటరు. రైట్ ఫ్రం స్టూడెంట్ డేస్ నుంచి యిప్పటి వరకు. ఇష్యూ అంటె అందులో మూడు దశలు వచ్చినయ్. స్టూడెంటుగ, ఎంప్లాయ్‌గ, రిటైర్డ్ పర్సన్‌గ మూడు దశలు వున్నయ్ గద. స్టూడెంట్ డేస్ అన్నప్పుడు తెలంగాణ యాక్టివిస్ట్‌గ వున్నప్పుడు తెలంగాణ ఎట్ల వచ్చింది? ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందె ఎందుకు నాలో బీజాలు నాటుకున్నయ్? కొన్ని సంఘటనలు, ఉద్యమాల చరిత్ర అది ఎందుకు బలపడింది, అనేవి కొన్ని సంఘటనలు. రిటైర్ అయిన తర్వాత కేవలం తెలంగాణె అయిపోయింది. స్టూడెంట్‌గ వున్నప్పుడు స్టూడెంట్ యాక్టివిటీస్ వుండె, తెలంగాణ వుండె. టీచర్‌గ వున్నప్పుడు టీచర్స్ యూనియన్‌లో చాలా యింపార్టెంట్ ఆఫీస్ బేరర్‌గ వుంటి దాదాపు నా సర్వీసులో సగభాగం టీచర్స్ రిప్రజెంటేటివ్‌గనె పనిజేసిన. ఒకవైపు వృత్తి సమస్యలుండె, ఉద్యోగ సమస్యలుండె, అందులో మల్లి అంతర్లీనంగ తెలంగాణ సమస్య వుండె, అదొక దశ. రిటైర్ అయినంక సింగిల్ పాయింట్ పోగ్రాం. కొంతకాలం 'పౌరస్పందన వేదిక' పేరుతో అది గూడ తెలంగాణ, దాంట్లో గూడ తెలంగాణ రిలేటెడే నా పాత్ర శంకరన్ కమిటీలో. ఇగ తర్వాత కంప్లీట్ తెలంగాణ దప్ప ఇంకో యావకేషనే పెట్టుకోలె.

# 65 ఏండ్ల కిందటి సంఘటన అది

ఆ సంఘటనకు ఈ రోజు ఇంత ప్రాముఖ్యత వుందనుకోలె ఆ రోజున. సంఘటన జ్ఞాపకం వుంది. వచ్చినంక రిమైండ్ జేస్తున్న నేను, అది నేను జెప్పేది. నేను నాలుగో తరగతి విద్యార్థిగ వున్నప్పుడు జరిగినటువంటి సంఘటన తెలంగాణ రిలేటెడ్, తెలంగాణ సంస్కృతికి సంబంధించిన సంఘటన అని నాకా రోజు దెలవదు. ఆ సంఘటన జ్ఞాపకం వుండడానికి చాలా కారణాలున్నయ్. వుండి వుండి దాదాపు ఒక 65 ఏండ్ల కిందటి సం ఘటన అది. ఈ రోజు అనలైజ్ జేస్తె లింక్ అవుతున్నది. తెలంగాణ సంస్కృతి ఏమిటి? ఏమిటంటె అక్కడ పాయింట్ ఫ్యూడల్ వ్యవస్థలో నిజాం కాలం గద.

1944-45 సంగతి నేను జెప్పేది. ఫ్యూడల్ వ్యవస్థలో ఫ్రీడం లేకుండేదని, అందరికి దెలుసు. ఆ రోజున్నంత మాత్రం ఫ్రీడం గూడ మాకీరోజు లేదు అని. ఎగ్జాంపుల్స్ ఇస్త. నీకు జెప్పలేదనుకుంట ఈ విషయం. వరంగల్‌లో మర్కజి స్కూల్ అని ఒకటుండేది. నీకు ఐడియా వుందో లేదో, అదో ప్రైమరీస్కూల్ నేను జదువు కున్నప్పుడు. చాలా టి.వి ఇంటర్వ్యూలలో గూడ చెప్పిన. పబ్లిక్ స్పీచ్‌లల్లో గూడ జెప్పిన. అది నిజాంకి వ్యతిరేకంగ పోరాటం, స్వాతంత్ర్య పోరాటం నడుస్తున్నది. మా ఫాదర్ గూడ నిజాంకి వ్యతిరేకంగ పోరాడిన ఆ తరం. హయగ్రీవాచారి, మా ఫాదర్ కంటెంపరరీస్, ఫ్రెండ్స్ వుండె యిది నడుస్తున్న రోజుల్లో. నేను నాలుగో తరగతిలో వున్నప్పుడు ఉర్దూ మీడియంలో రషీదుల్ హాసన్ అని హెడ్మాస్టరు వుండె. ఆ రోజుల్లో ఏందంటె స్కూల్లో ఏ స్కూలైన ప్రేయర్ ముందు అన్ని తరగతుల వారు వరుసగ నిలబడతరు. ఉర్దూలో ప్రేయర్ వుండేది. ప్రేయర్ సారాంశం ఏమిటంటె, ఆ ప్రేయర్ ఇప్పుడు జదివినా రిలవెంటె గని అర్థం జేసుకోరు ఎవరు. ప్రేయరేంటి ఈ రాష్ట్రం, ఈ రాష్ట్ర ప్రజలు ఆచంద్ర తారార్కం సుభిక్షంగ వుండుగాక. మా పాలకులు ప్రజాహిత కార్యక్రమాలు...

ఉర్దూలో నిజాం అనే పదం లేదు, లేకపోతె చంద్రబాబునాయుడు అనే పదంలేదు (పెద్దగ నవ్వు) చెప్తున్న. అయిన తర్వాత అందరు వరసగ పోతు పోతు హెడ్మాస్టరు ముం దుండె, పోతు సలామో, ఆదాబో, నమస్కారమో పెట్టి పోయేటోల్లం. ఒకరోజు నేను వందేమాతరం అన్న. నాకు వందేమాతరం పదం అర్థం తెలవదు కని అనేసిన. వందే మాతరం నిషిద్ధ పదం ఆ రోజుల్లో. అన్నోల్లని చాల మందిని చంపేసిండ్రు. నిజాం వ్యతి రేకంగ స్వాతంత్ర్య పోరాటంలో అది అన్నవాల్లకు పనిష్మెంట్ వుండె. నిజాం కాలంలో

అది అన్నవాళ్లని చాల మందిని చంపింద్రు గూడ. నేను వందేమాతరం అన్న. మా హెడ్‌మాస్టర్ ఆపిండు నన్ను. రూమ్‌కి పట్టుకపోయిండు. ఉర్దూలో, అంత వుర్దూలో సంభాషణ. ఏవన్నవని అనె. భయపడుడు మొదలుబెట్టిన. మంచిది, చాలా ప్రేమతోని ఏవన్నవో చెప్పు అన్నడు 'వందేమాతరం' అన్న. దాని అర్థమేంది అన్నడు. నాకు దెల్వదు అన్న. మరి ఎందుకన్నవ్ అన్నడు. నేను అనడానికి కారణమేందంటె స్వాతంత్ర్య పోరాట రోజులు గద. మేం పోరగాల్లలాగ వుంటిమి. చిన్న పిల్లగాల్లం. మా ఫాదరు, హయగ్రీవాచారి కలుసుకొన్నప్పుడు వందేమాతరం అని గ్రీట్ చేసుకునేటోల్లు. నాకు వందేమాతరం అంటె ఇవాల రేపు హాయ్ అంటరు గద అట్ల అనుకున్న నేను. నాకర్థమైంది అప్పుడంతె. మా పెద్దవాల్లు కలిస్తె ఇట్ల అనుకొంటరు అని అంటె, రేపు మీ ఫాదర్‌ని తీసుకొని రా అని చెప్పిండు.

చెప్తున్న! ఆయన ఆ పర్సనాలిటీ గురించి చెప్పడానికి చెప్తున్న అన్నమాట. పోయి మా ఫాదర్‌కి చెప్తె ఇగ ఏదో కొంప మునిగింది అనుకొని నన్ను దీసుకొని హయగ్రీవాచారి ఇంటికి పోతె పోదాంలె, ఇద్దరం కలిసి పోదాంలె అన్నడు. మా ఫాదర్ ఏమన్నడంటె ఆయన పేరెంట్‌ని రమ్మన్నడు గద. దీన్ని మల్లి పొలిటిసైజ్ జేయొద్దు. నేనే బోయి వస్త ఏమంటడో చూద్దాం అన్నడు. స్కూల్లకెల్లి దీసేస్తారనేటువంటి ఇంప్రెషనే వుండె అప్పుడు. తెల్లారి మా ఫాదర్ నన్ను దీసుకొని వస్తె, మా హెడ్‌మాస్టర్ మర్యాదగా మా ఫాదర్‌ని కూర్చోబెట్టి నేను పక్కన నిలబడ్డ. ఆయన జెప్పిండు. నీ కొడుకు ఇట్ల అన్నడు, నాకేం అభ్యంతరం లేదు. ఆయన అన్నమాట, ఇదొక ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్. పిల్లవాల్లకు స్వేచ్ఛగ మాట్లాడితె ఏ శిక్ష వేస్తాం. కనుక నాకు తప్పు అనిపించలె. బయట మాట్లాడితె మాత్రం ప్రమాదం వుంటది. నేను గాక వేరేహెడ్మాస్టరు వున్నా ప్రమాదం వుంటది. జాగ్రత్తగ వుండటం మంచిది అని పంపించిండు.

అంటె ఏందంటె ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అనె ఒక విలువ, ఈ రోజు వైస్ చాన్సలర్‌కు కూడ లేదు. చెప్తున్న! ఒక ప్రైమరీ స్కూలు హెడ్‌మాస్టర్ ఫ్యూడల్ వ్యవస్థ, స్వాతంత్ర్యానికి పూర్వం నిషేధింపబడిన పదం పలికితే తన్నుడో, సంపుడో జరిగే విషయం లోపల అంత మెచ్యూర్‌గ ఆయన బిహేవ్ జేసిండు. అయితే ఆ సంఘటన జ్ఞాపకం ఎందుకున్నదంటె వుండకపోవు. మా ఫాదర్ దానిపైన పదేండ్లు సాధించిండు నన్ను దానిపైన (నవ్వు).

పోలీస్‌యాక్షన్ అయి నేను ఇంటర్‌మీడియట్‌కి వచ్చేదాక అయితె ఏందంటె ఆయన సాధించడమంటె వెనుకటి వాల్లు గద. ఈ పోరగానికి తెలివి లేదు ఎట్ల బతుకుతడు. గిట్ల జేస్తె ఎట్ల అని. నేను పెద్దోన్ని అయినంక గూడ అట్లనె అంటుండె. అరె ఇట్ల అన్నన, ఇట్ల అన్నన అని అనలైజ్ జేసుకుంట పోయిన. నాకు ఆలోచించె ఫ్రేం వర్క్ వచ్చేనాటికి అది ఈ సంఘటన జరిగింది అంతె దెలుసు నాకది. తర్వాత ఏందంటె నిజాం కాలపు వ్యవస్థ గురించి చర్చ జరుగుతున్నపుడు నేను చాల ఎగ్జాంపుల్స్ ఇచ్చిన, చాల మంది విమర్శించిండ్రు. నేను ఆ తరానికి చెందిన వాన్ని. అంటె ఆ తరాన్ని చూసిన వాన్ని. ఆ తరానికి వ్యతిరేకంగ పోరాడిన తరం వాన్ని నేను. అయితె చరిత్రలోపల ఏ తరంలోపల పూర్తిగ మంచి వుండదు, పూర్తిగ చెడుండదు.

మంచి, చెడు రెండు వుంటయ్. కనుక నిజాం కాలంలో వున్న మంచి పనులు ఏమిటి అని లిస్ట్ జేసి చెప్తుంటె, ఇగో ఈయన నిజాంకు వత్తాసు పలుకుతాండు అని దెలుసు గద. ఓ పెద్ద కథ. నేను మానుకోలె. ఈ సంఘటన నన్ను నిజాం కాలంలో వున్నటువంటి మంచి పనులేమన్న వున్నయా? అని స్టడీ జేయడానికి పురికొల్పింది. దానికి నన్ను బాగ ప్రోత్సహించింది కాళోజి. చదువాలె దీన్ని అని. దాని వల్ల నాకు ఏం జరిగిందంటె నిజాం వ్యవస్థకు, ఇప్పటి వ్యవస్థకు వున్నటువంటి తేడా ఏమిటి? అని అధ్యయనం జేసేటివంటి నాకొక ఇంపెటస్ తరపున దొరికింది.

కాళోజి తర్వాత జెప్పగలగడానికి నా తరమే బతికున్నది. మీరు విన్నయి జెప్తరు, మేము కన్నయి జెప్తము. అంటె మాది సెకండ్ హ్యాండ్ యిన్‌ఫర్‌మేషన్ గాదు, ఫస్ట్ హ్యాండ్ యిన్‌ఫర్‌మేషన్ మాది. కని మేము నిజాంకు వత్తాసు పలకడం కాదు. ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చినమ్ అని జెప్పడానికి. దాన్ని దీసుకొచ్చి ఎట్ల లింకులు జేసినంటె నేను 1996 లోపల మేం తెలంగాణ వాదాన్ని భూపతి కృష్ణమూర్తి జెప్పేవాడు. అప్పుడు మాకు చాల ఇండైరెక్ట్‌గ ఎమ్మెల్యే, ప్రణయ భాస్కర్ చాల సపోర్ట్ ఇచ్చేది. ఆయనే రేజ్ జేసిండు. రూలింగ్ పార్టీలో తెలంగాణ పదం ఉచ్చరించవద్దని చంద్రబాబునాయుడు అన్నడు తెలుసు గద. నేను లింక్ జేసి జెప్పేది ఏం అంటె ఒక ఫ్యూడల్ వ్యవస్థలో మత ఛాందసుడు అనే పేరున్నటువంటి ఒక రాజు కాలంలో, ఒక ముస్లిం హెడ్ ఆఫ్ ది ఇనిస్టిట్యూషన్‌లో, మేం వందేమాతరం అనే పదాన్ని వాడి బతకగలిగినం.

ఈనాటి ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు అసెంబ్లీలో తెలంగాణ పదం అని బతకలేకపోతున్నరు అని లింక్ జెప్పేది, ఇది అనుభవంతో

వచ్చేది. లింక్ జేయాల్నంటె ఆలోచించాలె అని జెప్పి నిజాం కాలంనాటి కొన్ని సంఘటనలు జెప్తుండేది. చివరి వరకు నిజాంకు వ్యతిరేకంగ పోరాడిన వాడు కాళోజి, మేమంతా ఆయన శిష్యులమె గద. ఎగ్జైల్‌లో వుండి (అజ్ఞాతంలో వుండి) నగర బహిష్కృతుడై నిజాంకు వ్యతిరేకంగ పోరాడినోడు. జైలుకు బోయినోడు. సరె స్వాతంత్ర్యం వచ్చింది, పోలీస్ యాక్షన్ అయింది, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డది, నిజాం చనిపోయిండు. నిజాం ఫ్యూనరల్‌కు బోయిండు కాళోజి. శవయాత్రకు బోయిండు. చాల మందికి కోపం వచ్చింది, అర్థం గాలేదు. నాగ్గూడ అర్థం కాలె. కని పెద్దమనిషి అకారణంగ పోడు అనుకొని చాల మంది అఫెండ్ అయి మనమే పోయి అడుగుదామనుకొని నేను బోయిన. ఆయన అన్న మాటలు 'నేను పోరాడింది వ్యక్తికి వ్యతిరేకంగ గాదు, వ్యవస్థకు వ్యతిరేకంగ ఫస్ట్' అన్నడు.

రెండవది 'ఈనాటి పాలకుల కంటె వాడే నయం వుండె' అన్నడు. కాళోజి మాట్లాడినవె. ఎందుకు నయం వుండె అంటె మూడు ఎగ్జాంపుల్స్ వున్నయ్. అయితె నిజాం కాలపు పరిస్థితులను ఆంధ్రప్రదేశ్‌లో బేరీజు వేసి నాటి పాలకులు, నేటి పాలకుల యొక్క ప్రవర్తన తెలంగాణ వెతల గురించి జెప్పడానికి నాకు స్టార్టింగ్ పాయింట్ మా మర్కజి స్కూలు యిన్సిడెంట్‌తో మొదలైంది. ఫస్ట్ హ్యాండ్ ఎక్స్‌పిరియన్స్ గనుక నేను రాయగలుగుత. చాల హండ్రెడ్స్ ఆఫ్ ఇన్సిడెంట్స్ వున్నయి గని కొన్ని ముఖ్యమైన ఇన్సిడెంట్స్ ఇవి.

# మన్మోహన్‌సింగ్‌కు నాకు ఏర్పడ్డ పరిచయం

ఇప్పటికి పాతికేండ్లు. ఎట్టెట్ల అయిందో జెప్త నేను. ఆయన ఇకనామిక్స్ ప్రొఫెసర్, నేను ఇకనామిక్స్ జదువుకున్న టీచర్నో, స్టూడెంట్నో వాటెవర్. కాబట్టి ఇకనామిక్స్ సెమినార్‌లు, సింపోజియమ్‌లు అయితయ్ అటెండ్ జేసేవాల్లం. అయితె ఉట్టి ముఖ పరిచయమె. ఇగ అపుడు మేం యంగ్‌గ వుంటిమి గద. మేం రాసే పేపర్లో గూడ ఆయన చదివితె మెప్పు పొందేవాల్లం. ముఖపరిచయం ఏర్పడ్డది అంతె. ఆయన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ అయినపుడు అప్పటికి రీసెర్చ్ ప్రాజెక్స్ మీద స్టూడెంట్స్ వాల్లు వీల్లు కొన్ని ప్రపోజల్స్ పంపిస్తే అది మిడ్ ఎయిటీస్‌లో, 1985 ఆ ప్రాంతంలో. ఆయన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్. పోతె ఫండ్స్ గావాలె గద. వీల్లకి ఈ పోరగాల్లకి సార్! మీకు పరిచయం వుంది గద మీరు సిఫార్సు జేయరా అట్ల ఇట్ల అంటె ఒక నాలుగైదు జెప్తే, ఒకటి రెండు అయినయ్. ఒకటి రెండు ప్రాజెక్టులు సక్సెస్‌ఫుల్ అయితె వాటికి కొంచెం పేరొస్తె ఆయన మెచ్చుకున్నడు. మీరు ఇట్ల ఎంకరేజ్ జేయాలె అంటె, మీరు ఫండింగ్ గిట్ల ఇస్తెగద ఎంకరేజ్ జేయాలంటె అన్న.

తర్వాత ఏమైంది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ అయిపోయిన తర్వాత 1988-89 ప్రాంతంలో యుజిసి చైర్మన్ అయ్యిండు ఆయన. యుజిసి అంటె దెలుసు గద. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్. అప్పుడు నేను సిఫెల్‌కు రిజిస్ట్రార్‌ను. డైరెక్ట్ యుజిసి కింద మా ఇన్స్టిట్యూషన్. కనుక ఆయన సిఫెల్‌కు రావడం, నేను ఆయన దగ్గరకు పోవడమనేది దాదాపు నెలకొకసారి జరిగేది. పోతె నాపైన వున్నటువంటి పరిచయమో, ప్రేమో, అభిమానం వల్ల అనేక కమిటీలల్లో ఆయన నన్ను వేసేది. జాతీయ స్థాయిలో అనేక కమిటీల్లో నన్ను వేస్తె ఐయామ్ హ్యాపీ సార్! సాటిస్‌ఫైడ్ అన్న. నేను 91లో గూడ రిజిస్ట్రార్‌గ వుంటి. 91లో ఆయన ఫైనాన్స్ మినిస్టర్ అయిండు. పివి. నరసింహారావు ప్రధానమంత్రి. దాదాపు ఆయన ఫైనాన్స్ మినిస్టర్ అయిన కొద్ది నెలలకె నేను కాకతీయ వైస్‌ఛాన్సలర్ అయిన. నేను బోయిన తర్వాత కాకతీయ యూని వర్శిటీలో ఒక కాన్వోకేషన్ పెట్టాల్సి వచ్చింది. కాన్వోకేషన్ జేస్తే, కొద్దిగ పెద్దోల్లని పిలవాలని వుంటది గద. పెద్దోల్లని అంటె మన్మోహన్‌సింగ్ పెద్దోడు గద. వస్తడా రాడా? అయినా పరిచయం వుంది గద!?

ముందు నేనేం జెసిన అంటె వాల్ల పి.ఎ.కు ఫోన్ జేసిన, పి.ఎ.కు ఫోన్ జేస్తె నేను కనుక్కోని జెప్త అన్నడు. ఆయన దగ్గర నుంచె ఫోన్ వచ్చింది తర్వాత. పిఎ ఏమన్నడు

ఫైనాన్స్ మినిస్టర్ వాంట్స్ టు టాక్ టు యు అంటె ఫోన్ మాట్లాడిన. ఆ హౌ ఆర్ యు జయశంకర్ హౌ ఆర్ యు, ఐ యామ్ హ్యాపీ యు హ్యావ్ బికమ్ ఎ వైస్ చాన్స్‌లర్ అంటె థ్యాంక్యు సార్, సర్ వన్ రిక్వెస్ట్ అంటె, టెల్ మి డు యు వాంట్ ఎనీ ఫండింగ్ అంటె ఐ యామ్ నాట్ ఆస్కింగ్ యు ఫర్ ఫండింగ్ అన్న. సర్! ఐ హ్యావ్ టేకెన్ చార్జ్ రీసెంట్లీ, కాన్వోకేషన్ ఇజ్ గోయింగ్ టు బి. ఐ రిక్వెస్ట్ యు టు బి ద చీఫ్ గెస్ట్ టు అడ్రస్ ద కాన్వోకేషన్. ఐ వాంట్ టు కమ్ అండ్ రిక్వెస్ట్ యు టు గివ్ యాన్ అపాయింట్‌మెంట్. ఐ యామ్ కమింగ్ డోన్ట్ టేక్ ది ట్రబుల్ ఆఫ్ కమింగ్ హియర్. యు విల్ గెట్ యిట్ ఆఫ్టర్ వన్ వీక్ అన్నడు టెలిఫోన్ మీద, ఆశ్చర్యమేసింది నాకు. కన్‌ఫర్మేషన్ లెటర్ వచ్చింది. కాన్వోకేషన్ అడ్రస్ ముందే ప్రింట్ చేయాల్నంటె పంపిచ్చిండు అది ఆగస్టు 92, నేను 91 డిసెంబర్‌ల వైస్‌చాన్సలర్ అయిన. ఫస్ట్ ఇకనామిక్ రిఫార్మ్ మీద ఆయన ఫస్ట్‌తీసుకున్న కాన్వోకేషన్ అడ్రస్.

మన్మోహన్‌సింగ్‌ను నేను దీసుకొచ్చిన అంటె వీల్లందరు గుడ్లప్పగించి చూసిండ్రు గద. కాకతీయ యూనివర్శిటీకి మన్మోహన్‌సింగ్ రావడమేమిటి, వచ్చిండు. నేను పోయి గూడ బిలవలె ఆయన్ని, వచ్చిండు. యిగ అప్పటికి కాకతీయ యూనిర్శిటీ ఫండింగ్ దానికి దీనికి పోయినప్పుడు ఆయన నాకు అపాయింట్‌మెంట్ చాల ఫ్రీగ ఇచ్చేటోడు. చాల నిరభ్యంతరంగ మాట్లాడేటోడు, చేసెటోడు. అది అయిపోయింది. పి.వి నరసింహారావు గవర్నమెంట్ బోయింది. నా వైస్‌ఛాన్సలర్ టర్మ్‌గూడ అయిపోయింది.

నేను తెలంగాణ ఉద్యమంలో మల్ల ఉదృతంగ దిగిన. అపుడు ఆయన రాజ్యసభ సభ్యునిగ వుండె, ఏది పి.వి. నరసింహారావు కేబినెట్ అయింతర్వాత, వేరే పార్టీల గవర్న మెంట్లు వుండెగద అపుడు. ఆ పిరియడ్‌లో ఏం జరిగింది తెలంగాణలో 41 మంది ఎమ్మె ల్యేలు మాకు ప్రత్యేక రాష్ట్రం గావాలె అనేటువంటి ఒక రిప్రజెంటేషన్ ఇస్తె రాజ శేఖరరెడ్డివాల్లు అంతా కూర్చొని రాస్తె, సోనియాగాంధీ ఒక కమిటీ వేసింది, ఆ కమిటీ మల్ల గదె ప్రణబ్‌ముఖర్జీ చైర్మన్ అండ్ల, మన్మోహన్‌సింగ్ గూడ మెంబర్. మీ తరఫున ఎవరన్న వచ్చి వాదించండి అని జెప్తే వాల్లు కూర్చొని డిస్కస్ జేసి ఎవరు బోవాలి అని పొన్నాల లక్ష్మయ్యను నా దగ్గరకి పంపించి మీరొచ్చి మా తరఫున వాదించాలి అన్నరు. అంటె లక్ష్మయ్య! మరి నేను కాంగ్రెసోన్ని గాను, ఎమ్మెల్యేను గాను, ఎట్ల రావా ల్నయ్యా అంటె, లేదుసార్! మేం అందరం అనుకున్నం మీరు అయితె మంచిగ చెప్తరు అక్కడ అంటె తెలంగాణ విషయం మీ మాటగా, నానోట అంటె నేను ఇదె అన్న.

తప్పకుండ వస్త అని, నా యెంబడి జనార్దన్‌రావును తీసుకపోయి ఎఐసిసి ఆఫీసులో అఫీషియల్‌గ పెద్ద హాల్, తెలంగాణ ప్రాంతపు హేమాహేమీలందరు మాజీ నాయకులు, అప్పటి నాయకులు, ముందు కాబోయె నాయకులు ఆందరు కేంద్రమంత్రుల నుంచి పంచాయితీ సర్పంచ్‌ల వరకు ఒక 250 మంది కూర్చున్నం. టు అండ్ ఆఫ్ అవర్స్ వాదించిన నేను. అప్పుడు ప్రణబ్‌ముఖర్జీ వజ్ ఎ మెంబర్ ఆఫ్ ద కమిటీ. దాని తర్వాత ఆయన తెలంగాణ ఇష్యూ మీద కొంత ఆసక్తి చూపిచ్చిండు. తర్వాత వేరె కలిసినపుడు మల్ల మాట్లాడినం.

అయిపోయిన తర్వాత కాలం గడిచింది. నేను ఏది రాసినా తెలంగాణ గురించి ఇంగ్లిష్ ప్రతి ఆయనకు పంపించేది. అక్నాలజ్డ్ జేసేది ఆయన గొప్పదనం అది. చదివేదట ప్రామ్ట్‌గ చదివేదట. యుపిఎ గవర్నమెంట్ వచ్చింది. యుపిఎ గవర్నమెంట్ వచ్చిన నాటికి వాటి పరిస్థితి ఏముండెనంటె నాకు రాజ్యసభ సీటు, డిస్కస్ వుండె గద వీల్లకు ఇస్తమనె వాల్ల (కాంగ్రెస్) ప్రామిస్ గూడ. దాదాపు అయిపోయినట్టె అయి పోయిన దశే వుండె. చివరికి సిపిఎం వాల్లు మాక్కావాలని పట్టుబట్టింద్రు. అప్పటికే చంద్రశేఖరరావు యూనియన్ మినిస్టర్ అయ్యిండు. నేను ఢిల్లీల్నె వుంటి, ఆయన పదవి జేసినపుడు అక్కడ్నే వుంటి. ఒకరోజు ఏదో రాజ్యసభ సీట్ల పంపిణీ గురించి డిస్కషన్ వుంటది, రావాలని చంద్రశేఖరరావుకు గూడ పిలుపు వచ్చింది, అప్పటికె సిపిఎం వాల్లు పట్టు బడుతున్నరు వాల్లకు గావాలె అని. చంద్రశేఖరరావు ఎట్ల ఒప్పుకోవాలె సార్ అంటె నేను జెప్పిన తెలంగాణకు ఉపయోగపడితె, తెలంగాణ కాజ్‌కు ఉపయోగపడితె వదులుకోండి అన్న.

నేను రాజ్యసభ మెంబర్ని గావడం అంత ముఖ్యం గాదు, తెలంగాణ రావడం ముఖ్యం గద. సరె పోయినం, పోయిన తర్వాత సోనియాగాంధీ వుండె, ప్రణబముఖర్జీ వుండె మన్మోహన్‌సింగ్‌ను వాల్లు రిక్వెస్ట్ జేసింది ఎట్ల అని? అంతకుముందె ఈయనె షిప్పింగ్ పోర్ట్ పోలియో పదవి వదులుకున్నడు. యిది రెండవది అంటె నేను ఎవరికో ప్రొఫెషనల్ పొలిటిషన్‌కు గావాలని నేను అడగడం లేదు. ఒక అకడమిషన్, ఒక ఇంటలెక్చువల్ కొరకు అడుగుతున్న అంటె హు యిజ్ హి అని అన్నడు, మన్‌మోహన్‌సింగ్. నేను అనుకోలె ఆయన. నా పేరు జెప్తే ఆయన ఒక్కసారె జయశంకర్ ఇజ్ హి జయశంకర్ ఫైన్, నైస్ ఛాయిస్ అన్నడు. అయిన తర్వాత అన్‌పార్చునేట్లీ సిపిఎం వజ్ విత్ దిస్ కంపెనీ(యుపిఏ)

అంటె సోనియాగాంధీ వంక జూసుకుంటూ హి ఈజ్ ఎ అకాడమిస్ట్ వియ్ కెన్ మేక్ హిమ్ ప్లానింగ్ కమిషన్ మెంబర్. లోపల డిస్‌కషన్ అది. అయిన తర్వాత బయటికి

వచ్చేవరకు మీడియా వాల్లంత జయశంకర్‌కు వస్తాందా, పోతాందా పెద్ద చర్చ వుండెగద. రాంగనె ఈ గొట్టాలు పట్టుకొని చంద్రశేఖర్‌గారు ఏమైంది జయశంకర్‌కు అనె. ఈయనది ఏందంటె ఈయన కొంచెం అక్కడ ట్యాక్టిస్‌గ బిహేవ్ జేసిండు. జయశంకర్‌కు అంతకంటె మంచిది వస్తాంది అన్నడు. ఏంది అంటె ప్లానింగ్ కమిషన్ మెంబరయితాండు అని జెప్పె. వెంటనే రాజశేఖరరెడ్డి మేల్కొన్నడు, చెప్తున్న! ఆ మాట బయటికి రావల్సింది లేకుండె లోపల కాన్ఫిడెన్షల్ డిస్‌కషన్ గద కన్‌ఫాం జేద్దాం అని. రాజ్యసభ వొదులుకున్నవా? జయశంకర్‌కు రాకుంట జేసినవా? ఉన్నది గద ఒక స్టిగ్మా. ఈయన అత్యుత్సాహంతో ప్లానింగ్ కమిషన్ అంటె ఈక్వల్ మినిస్టర్ ర్యాంక్ వుంటది అది.

ప్రెస్‌లో భౌ భౌ అనె. నేషనల్ ప్రెస్ అందరు కంగ్రాచ్యులేషన్ లెటర్స్, నాకు అర్థం గాలె. ఏందో నాకు దెలవదు, ఆయన ఇంటికి వచ్చేలోపలె స్క్రోలింగ్. యియ్యాల రేపు మీడియా అదె గద ప్రైంమినిస్టర్ దగ్గర నుంచి గెస్ట్ హౌస్ వచ్చేసరికి లోపలే స్క్రోల్స్ వస్తా న్నయ్. ప్లానింగ్ కమిషన్ నుంచి టెలిఫోన్లు నాకు. ఐవజ్ ఎంబరాస్డ్. అయిన తర్వాత ఏందంటె దాన్ని సక్సెస్‌ఫుల్‌గ స్కర్టల్ జేయడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి యుగంధర్ పేరును ప్రపోజ్ జేసిండు రాజశేఖరరెడ్డి అనంతపురం ఆయన్ని. ఆయన పెద్ద మనిషే, మంచివాడె, ఆయన గూడ మన్మోహన్ సింగ్‌కు ఫ్రెండె. మొత్తానికి రాజశేఖరరెడ్డి కాకుండ జేసిండు, ఏం బట్టించుకోలె. అది అయిపోయింది. మన్మోహన్‌సింగ్ సంబంధం అడిగినవ్ గనుక చెప్తున్న ఇదంత కథ. ప్రపంచానికి దెలవవు, నేను జెప్పుకోను ఇవన్ని, చిల్లర గుంటయ్. అది యెప్పుడు జరిగింది మే 2004. మే, జూన్. మే అయిపోయింది, జూన్ అయి పోయింది, జూలై అయిపోయింది. జూలైలో చంద్రశేఖర రావుకు చాల హేడేస్ వచ్చి యుపిఎ లోపల చాల ఇంపార్టెంట్ ప్లేస్. ప్రైంమినిస్టర్, సోనియాగాంధీలతో ఓ చాల ఈయన. ఏందంటె వాల్లందరికి వొక డిన్నర్ ఇద్దామని ప్రతిపాదన.

సాధారణంగ వొక కేబినేట్ మినిస్టర్ డిన్నరిస్తె, ప్రైమ్‌మినిస్టర్ పార్టీలకు వచ్చె ఆచారం లేదు. నాకు మన్మోహన్‌సింగ్‌కు వుండె పరిచయం కేసిఆర్‌కు తెలుసు కనుక సార్ మన మిద్దరం బోయి ఇన్‌వైట్ జేద్దాం మన్మోహన్‌సింగ్‌ను. మీరు వస్తె ఆయన కాదనడు. ఎప్పుడు బోయినా, మన్మోహన్‌సింగ్ హౌ ఆర్ యు జయశంకర్! అని ముందు నన్ను పలకరిస్తడు. కేసిఆర్‌తో పోయినా ముందు నన్నే పలకరిస్తడు ఆయన. పాత సంబంధం అది. చాల సింపుల్ మనిషి ఆయన. ఇన్‌వైట్ జేద్దాం మనమిద్దరం పోదాం అంటె పోయినం. అసలు ఇంక మేంబోయిన పర్పస్‌గూడ జెప్పలె. పోయినం కూచున్నం. ఆయన

కదె, రాజ్యసభ మిస్ అయింది, ప్లానింగ్ కమిషన్ మిస్ అయింది అని ఆయనకు మన సులో వున్నట్టున్నది. జయశంకర్ ఐ వాంట్ యూజ్ యువర్ సర్వీసెస్ అన్నడు. అంటె ఏమంట నేను! దటీజ్ యువర్ ప్రిరాగేటివ్ అన్న. అంటె యేమంటం? మీ సేవలు వాడుకోదలుచుకొన్నం అంటె మీ ఇష్టం, అది మీ విచక్షణాధికారం. సింపుల్ ఆన్సర్ అంతె. అంతకుమించి ఆయనేం జెప్పలేదు, నేనేం జెప్పలేదు.

అది జూలైలో జరిగింది. క్యాజువల్ అనుకున్న నేనది. జూలై చివరివారంలో డిన్న రైంది. అందరు వచ్చింఁడ్రు, సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, మొత్తం క్యాబినెట్ యుపిఏ ప్రధాని, వో హంగామా లొల్లి లొల్లి. సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో హిందూలో ఒక న్యూస్ ఐటమ్ వచ్చింది. ఆ న్యూస్ ఐటమ్ ఏందంటె గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రైమ్‌మినిస్టర్ ఆధ్వర్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ఫర్ రూరల్ ఆర్గనైజేషన్'అసంఘటిత క్షేత్రంలో మీరు విన్నరు గద. కమిషన్ వేసింఁడ్రు, దాంట్లో అర్జున్‌సింగ్ చైర్మన్. ఫస్ట్ మెంబర్ జయశంకర్, మిగతా మెంబర్స్, సెక్రటరీ నియామకం తర్వాత జరుగుతుంది. దీనికి ఇన్నేండ్ల టర్మ్, యివన్నీ వచ్చినయ్. అది జూడనుగూడ జూడలె.

కాకతీయ యూనివర్శిటీలోఒక ప్రొఫెసర్ జూసి ఓ పరిగెత్తుకుంట వచ్చింఁడ్రు. నిజంగా ఆమె లేడీ, చూయించె దాక నాకు దెలవను గూడ దెలవదు. లేదు సార్ మాతో దాస్తాంఁడ్రు అంటె, నాకు దెలవదమ్మ అంటె ఇదేందో నాకు తెలవదు, అస్సలు దెలవదు. దాచేదేముం టది నాగ్గూడ అర్థం గాలె ఇది ఎట్లయింది అని. ప్రైంమినిస్టర్ ఆధ్వర్యంలో ఆయనే గద మీ సేవలు వాడుకోదలచుకొన్నాం అంటె అయ్యుంటది అని నేను అనుకొన్న. కని నాకేం కమ్యూనికేషన్ రాలె, సెప్టెంబర్ బోయింది నాకేం కమ్యూనికేషన్ లేదు. అక్టోబర్ బోయింది కమ్యూనికేషన్ లేదు. నవంబర్ వచ్చింది కమ్యూనికేషన్ లేదు. నవంబర్‌లో ఏదో ఉ స్మానియా యూనివర్శిటీ లెక్చర్‌కి బిలిస్తె నేను వచ్చిన. వస్తె నాకు టెలిఫోను కమిషన్ చైర్మన్ నుంచి. ఏవండి మీ కన్సెంట్ బంపలేదు అంటె, దేనికి కన్సెంట్ అని నేనన్న. మీకు తెలవదా? అంటె నాకు కమ్యునికేషన్ లేదు అన్న. ఇప్పటికైన మీ కన్సెంట్ పంపరా అంటె అదేందో దెలవకుండ కన్సెంట్ ఎట్ల ఇస్త. అదేంటో తెలవాలి గద. అన్‌లెస్ అయినా నా కమిట్‌మెంట్‌కు అడ్డం రావొద్దు గదా అది అంటె, లేలే అట్లేంలేదు. నేనే వస్తున్న హైదరాబాద్‌కు ముఖతా కల్సి మాట్లాడుకుందాం అంటె, రాండి అన్న. వెంటనే ఆయన ఆ నోటిఫికేషన్ కాపీ కొరియర్ ద్వారా పంపించిండు.

ఆయన 15 నవంబర్‌కు 2004లో హైదరాబాద్‌లో మీటింగ్‌కు వచ్చిండు. ప్రొఫెసర్ హనుమంతరావుగారిది ఏదో ఫంక్షన్ వుంటె వచ్చిండు. వచ్చేసరికి నేను, హనుమంతరావు గారు, అర్జున్‌సేన్ గుప్త అని చైర్మన్ ఆయన. ఆయన పెద్ద ఇకానమిస్ట్. ఇందిరాగాంధీకి ఆయన అడ్వైజర్‌గ వుండె. హరగోపాల్‌తో గూర్చొని డిస్కస్ జేసినమన్నమాట మేమందరం. కన్సెంట్ ఇవ్వాలి అంటె మరి నా తెలంగాణ యాక్టివిటీకి అడ్డం వస్తె? అది ప్లానింగ్ కమిషన్ లాంటిది. ప్యూర్లీ అకడమిక్ అది. ఇపుడు మనకేమున్నా అంతా ఇకానమిస్ట్‌లె ఇంకెవరుండరు. నా తర్వాత ఇంక ఇద్దరు మెంబర్లు అయ్యింగ్రు, సెక్రటరీ అయ్యిండు, నాకు పత్తాలేదు, అందరు జాయిన్ అయ్యింగ్రు, నేనే జాయిన్ గాలె. పేపరు జూసి ఏందని ఎవర్ని అడగలేదు. అది వచ్చి జూసిన తర్వాత నాకేంది అంటే అట్ల గాదు హను మంతరావుగారు ఏందంటె, ఆయన ప్లానింగ్ కమిషన్‌లో వుండె గద ఎంప్లాయ్‌గ. అకడమిక్ యాక్టివిటీకి ఎపుడు ఎవరు అడ్డం రారు, మన్మోహన్‌సింగ్‌కు మీరు దెలుసు గద. ఆయన మీ బ్యాక్‌గ్రౌండ్ దెలిసే మిమ్మల్ని నామినెట్ జేసిండు గద, ఇపుడు మీరు ఆయనకు మీతో వుండె సంబంధం, పరిచయం మీమీద వుండె దానివల్ల చేసిండు గద ఆయన్నే అడుగు పోయి అన్నరు.

అయితె నాకు లెటర్ ఎందుకు రాలేదు? అంటె మన్మోహన్‌సింగ్ నామినెట్ జేసి ఆయన చేయితో రాసి జయశంకర్ ఫార్మర్ వైస్ ఛాన్సలర్ వరంగల్ యూనివర్శిటీ అని రాసిండు. అదెక్కడ వరంగల్ యూనివర్శిటీ ఎక్కడ లేదు గద. ఎక్కడెక్కడో దిరిగి వాపస్ పోయిందట గది. అయితె కమిషన్ అయినంక ఒక మీటింగ్ అయింది నేను లేకుండనె. అయితె మన్మోహన్‌సింగ్, జయశంకర్ రాలేదా అంటె, రాలేదు అంటె, ఎందుకు రాలేదు అని ఆయన కొద్దిగ చికాకు పడ్డడట.

ఆయనకు ముట్టిందా, లేదా? అని అప్పుడు యుజిసికి పోయి అడ్రస్ దీసుకొని, అది మొదలె జేస్తె అయిపోయేదిగద. తీసుకొని వాల్లు లెటర్ పంపిన తర్వాత నేను కొంత మంది ఫ్రెండ్స్‌ని కన్సల్ట్ జేసిన. పెద్దవాల్లని కన్సల్ట్ జేసిన. నా తెలంగాణ యాక్టివిటీకి అడ్డం రాకపోతె, ఢిల్లీలో ఈ క్రూషియల్ టైంలో వుంటె వెసులుబాటు, లేకపొతె ఎవరి దగ్గరన్న వుండాలె. ఒక వెసులుబాటు వుంటది. చాలా ప్రయారిటీస్ వుంటయి గాని నేను వాడుకోలేదు. కొంత కాలం జూద్దాం ఐదేండ్ల టర్మ్ అది. నచ్చితె పనిజేద్దాం లేకుంటె లేదు. అనుకొని ప్రైమినిస్టర్‌ని కలుద్దామని అనుకొన్న.

పోతె ఫస్ట్ డిసెంబర్‌లో కలుద్దామని అపాయింట్‌మెంట్ దీసుకుంటె ఫస్ట్ డిసెంబర్ రోజె కమిషన్ మీటింగ్ పెట్టింగ్రు, అయితె అంతకుముందె డేట్ ఫిక్స్ అయింది. దానికి

ప్రైమ్‌మినిస్టర్ వస్తున్నడు. ఇట్ల ప్రైమ్‌మినిస్టరె యిక్కడికి వస్తాండు గద అంటె ప్రైమ్ మినిస్టర్ వచ్చిండు, నన్ను జూడగానె జయశంకర్ ఐయామ్ హ్యాపీ కమాన్ జాయిన్ అన్నడు. జాయిన్ అయిన. నేను బోయింది ఆయనతో మాట్లాడుతా అనుకొంటె ఏమనొస్తది. ఏమనలేదు. ఆయన చైర్మన్ ఏం జేసిండంటె ఫస్ట్ మీటింగ్ అయింది. జయశంకర్ అజ్యూమ్డ్ ఆఫీస్ అని రాష్ట్రపతి భవన్ నుంచి మెసేజ్. ఇగ ఎవరికి జెప్పుకోవాలె నేను. ఇగ దీంతర్వాత ప్రైమ్‌మినిస్టర్‌ని కలిసిన నేను. గలిస్తె ఆయన చూడు నీ యాక్టివిటీకి ఏం అడ్డం రాదు. ఒక్కటె, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాని దిట్టినపుడు గట్టిగ దిట్టకు అన్నడాయన (పెద్దగ నవ్వు) ఆయన జెప్పిన మాటలు చెప్తున్న నేను.

దాంతోని నేను ఏం జేసిన అంటె, ఇది ఐదేండ్లు వుండె ప్రసక్తి వుండదు. నా యాక్టివిటీకి అడ్డం రావొద్దు. ఇక్కడ వుండె ప్రెజర్స్‌ని వాడుకోవాలె తెలంగాణ కొరకు. కనక వాల్లు అఫీషియల్ క్వార్టర్స్ ఇస్తె తీసుకోలె. పెద్ద బంగ్ల, సర్వెంట్స్ యిస్తే ఎవడు మేనేజ్ జేయాలె. ఒంటరిగాన్ని, గెస్ట్ హౌస్‌లో వున్న. సర్వేంట్స్ దీసుకోలె, క్వార్టర్ దీసుకోలె, ఒక్క కారు మాత్రం తీసుకున్న వాల్లిచ్చింది. ఏం జేసిన ఆ పిరియడ్‌లో. ప్రైమ్‌మినిస్టర్‌తో డైరెక్ట్ ర్యాపో లేదు నాకప్పుడు. కమిషన్ చైర్మన్ ఆయనే కనుక ప్రతి సారి కలిసేది, కలిసినపుడు ఒక్కటే తెలంగాణ ప్రస్తావన వచ్చేది.

దాని వల్ల యుపిఎ చైర్‌పర్సన్‌తో సంబంధం ఏర్పడింది. ఈ కన్సెషన్స్ పేరుతో వివిధ రాజకీయ పార్టీలతో డిస్‌కషన్స్. అపుడు నేను లేకపోతె ఆ కాయితాలు వచ్చేటియి కావవి. అహోరాత్రాలు పనిజేసిన. అన్ని పొలిటికల్ పార్టీలతోని వాల్లకి ఉత్తరాలు రాసింది నేనే, దానికి జవాబులు రాసింది నైంటీ పర్సంట్ నేనే. నేను ఒకవేళ అక్కడ లేకపోతె నాకా వెసులుబాటు దొరికేది కాదుకద. ఇగ నామీద జయశంకర్ అమ్ముడు పోయిండు, పదవికి పోయిండు, ఇంక ఏమొస్తడు ఆయన. ప్లానింగ్ కమీషన్‌కు పోయిండు. కథలు బాగ తెలుసు గద మీకు. నేను దేనికి స్పందించలె. అన్ని పార్టీలతో సంప్రదింపులు అయిన తర్వాత బిజెపి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ అయిన తర్వాత, కమిషన్‌కు సంబంధించిన పని తప్పకుండ జేసిన. కమిషన్ పని మధ్యలో చైర్మన్ యేదో రద్దైందంటె యాక్టింగ్ చైర్మన్‌గ పనిజేయాల్సి వచ్చింది. రెండుమూడు రిపోర్ట్స్ తయారు జేయాల్సి వచ్చింది. ప్రైంమినిస్టర్ వల్ల జరిగినయ్ అన్ని. నేషనల్ ఎగ్జిక్యూటివ్ బిజెపి తీర్మానం అయినంక యిగ నా పని ఇక్కడ అయిపోయింది, పోతా అన్న. ప్రైమ్‌మినిస్టర్‌ను కలిసి రిజైన్ చేస్తున్న యాక్సెప్ట్ చేయండి అన్న.

నేను తట్టుకోలేక పోతున్న ఈ ఏజ్‌లో, తెలంగాణే నాకు 24 గంటల పని. ఫ్రీక్వెంట్‌గ హైదరాబాద్‌కు పోవాలె, ఈ కమిషన్ పేరుతో అఫిషియల్ టిక్కెట్లు పెట్టుకొని పోతె విమర్శలు వస్తయ్, మీకు విమర్శ వస్తది. వాల్లు అఫిషియల్‌గ పెట్టుకొని వస్తరు నేనైతె బెట్టుకోలేను గద. యేదో అని ఈ ప్రాజెక్టు పోయిన తర్వాత అట్ల మూడు నాలుగు నెలలు డ్రాగాన్ జేసిండు. ఇగ లాస్ట్‌కి ఆయన వదిలిపెట్టిండు. వదిలిపెట్టిన రోజు కర్టెసీ కాల్ తీసుకుంటె హాఫెన్ అవర్ స్పెండ్ జేసిండు. ప్రైంమినిస్టర్ ఆఫ్ ది కంట్రీ ఒక ఆర్డినరీ సిటిజన్‌తో తెలంగాణ గురించె వివరంగ, ఆయన మంచోడు గాని ఆయన చేతిలో ఏం లేకుండె. ఆయన చేతిలో ఏం లేదు.

తర్వాత ఎప్పుడు బోయిన గాని, రిజైన్ జేసినంక చాలా సార్లు గలిసిన. అదే ఆప్యాయత, అదే చనువు, అదే మర్యాద చూపిస్తడాయన. రాజశేఖరరెడ్డి పెట్టే అడ్డంకులు నాతో స్పష్టంగ జెప్పేటోడు, నేను ఇవన్ని పబ్లిక్‌గ ఎట్ల జెప్పగలుగుత. పొలిటికల్ లీడర్ని అయితె ఇవన్ని జెప్పుకోవచ్చు. నాకు ఆయనకు వున్నటువంటి పాతికేండ్ల పరిచయం యొక్క సారాంశం ఇది. నేను ఈ రోజు బోయి నాకిది గావాలంటె వెంటనే ఇస్తరు చెప్తున్న. కని దేనికి. నువ్వు గమనించినవో లేదో నామీద ఏ విమర్శ వచ్చినా నేను దేనికి స్పందించను యెందుకంటె స్పందిస్తె గివన్ని జెప్పాలె. గివన్ని జెప్తె నమ్మరు, నిజంగ నమ్మలేదు. ఒకర్ని నమ్మించె అవసరం లేదు నాకు. నమ్మకపోతె విచారం లేదు.

ఇపుడు కాళోజి  గారితో కాళోజి పర్సనాలిటీ నేను జెప్పనక్కర్లేదు. నిష్కర్షగ మాట్లాడె మనిషి ఆయన. తెలంగాణ ఉద్యమంలో చంద్రశేఖరరావు చెప్పే వాస్తవాలు నేను జెప్పేటియె. నేను జెప్పినదాన్ని ఏ ముఖ్యమంత్రి ఖండించలె, ఏ ప్రధానమంత్రి ఖండించలె. అవే మాటలు చంద్రశేఖరరావు చెప్పే వరకు ఖండిస్తున్నరు. కొత్తగ చెప్పుకున్న ఖండిస్తున్నరు. నేను, చంద్రశేఖరరావు కాళోజి ఇంటికి బోయి మాట్లాడుతుంటె ఈ ప్రస్తావన వచ్చింది. చంద్రశేఖర్‌రావు అన్నడు నేను ఏం జెప్పిన కాళన్న, సార్ జెప్పినయె జెప్త గద. నన్ను తిడుతాండ్రు వీల్లు అంటె కాళోజి ఇగో శేఖర్! జయశంకర్ అబద్ధం జెప్పిన నిజమే అనుకొంటరు, నువ్వు నిజం జెప్పిన అబద్ధమె అనుకొంటరు. (పెద్దగా నవ్వు) ఆయన ఓపెన్‌గ వుంటడు. చెప్తున్న! పీపుల్స్ పర్‌సెప్షన్ లేదబ్బ, ఇపుడు జెప్తున్న గద కేసిఆర్ వెంటే ఎందుకున్న? నేను పిచ్చోన్నా? ఆయనకుండెటువంటి మంచి చెడులు నాకు దెలిసినంత ఎవరికి దెలవదు. ఆయన కుటుంబసభ్యులకు గూడ దెలవక పోవచ్చు. పాజిటివ్ యాస్పెక్ట్స్ నాకు తెలుసు. బట్ వెరీజ్ ది ఆల్టర్‌నేటివ్. దీనికి కారణమేంటంటె ప్రతి వాల్లకు వ్యక్తిగత ఆకాంక్షలు బెరిగినయ్. ఈ డిఫరెంట్ డైరెక్షన్స్ అందరికి బోయినయ్.

## శ్రీకృష్ణ కతలు

ఇపుడు ఒక ఎగ్జాంపుల్ ఇస్త మీకు, వాల్లు గ్రోత్ రేట్ అని మాట్లాడిండ్రు. ఈ గ్రోత్ రేట్ యిచ్చిన లిస్టలల్లో వొకదగ్గరేముందంటె? గ్రోత్ రేటంటే మహబూబ్‌నగర్ 78 శాతం, గుంటూరు 41 శాతం అని ఇచ్చిండ్రు. అంటె మహబూబ్‌నగర్, గుంటూరు కంటె ఎక్కువ అభివృద్ధి చెందిందని కనబడుతుంది అండ్ల. ఏం లెక్క అది? ఆ లెక్కేవిటంటే యిపుడు మహబూబ్‌నగర్‌లో ఒక్క ఎకరం బోయి వంద ఎకరాలు వచ్చినయ్ సాగుకు. హండ్రెడ్ పర్సెంట్. ఒక్క ఎకరం బోయి 1000 ఎకరాలు వచ్చింది. అంటే థౌజెండ్ పర్సెంట్ గ్రోత్. గుంటూరులో పది లక్షలు బోయి ఇరవై లక్షలు అయినయ్. ఇక్కడ తెలంగాణలో థౌజెండ్ పర్సెంట్ గ్రోత్. అక్కడ హండ్రెడ్ పర్సెంట్ గ్రోత్. కని వాస్తవానికి అక్కడ ఇరవై లక్షలు, ఇక్కడ పదివేలు. వివరించి బాగ, మనం ఇచ్చిన రిపోర్ట్‌లోగూడ గదే. అంటే ఏంటి లగడ పాటి ఇచ్చిన రిపోర్ట్ పొట్టబట్టుకుని నవ్వాలె గంతె, లగడపాటి అంటే గవర్నమెంట్ ఇచ్చిన రిపోర్ట్. నేనన్న వాస్తవానికి రండి మహబూబ్‌నగర్ గ్రోత్ రేట్ ఎక్కువున్నది గద.

ఈ రోజు గ్రోత్ రేట్ అంటె మొత్తం రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ వెనకబడ్డ జిల్లా. దానికి గ్రోత్‌రేట్ 78 పర్సెంట్. తెలంగాణలో ఎక్కువ అభివృద్ధి అని చెపితే అది ఎంత డిస్టార్షన్. ఇంటర్‌ప్రిటేషన్ అనేది పాక్షికం. గ్రోత్ రేట్ అనేది పాక్షికం. గ్రోత్ రేట్ అనేది పాక్షికమే. యాక్చువల్స్ ఏంది? యాక్చువల్‌గ ఏందంటే గుంటూరు జిల్లాలో వున్న నీళ్ల వసతి వున్న భూమి మొత్తం తెలంగాణలో లేదు. కని పాక్షికంగ వున్నటువంటి ఒక్క యాస్పెక్ట్ తీసుకొని తెలంగాణ ఎక్కువ అభివృద్ధి చెందిందంటే ఎట్ల? మేమేమన్నం గ్రోత్ రేట్ తీసుకోండి, యాక్చువల్స్ తీసుకోండి. గ్రోత్‌రేట్, యాక్చువల్స్ తీసుకోలే వాడు. ఇవన్ని చెప్పి చెప్పి విసిగిపోయిన. మీటింగ్‌లో చెపితే వాల్లు చాల మంచిగుంది అని మల్లొకటి నోట్ పంపమంటే మల్లొకటి పంపితిమి. మీకు ఐడియా వుండివుంటది. ఇది దేనికి చేసిండ్రు? ఈ ఎక్సర్‌సైజ్ అంతా, మనం చెప్పిందంతా వాడు బుట్టదాఖలే చేసిండు. కనీసం యిట్లుంటదని గూడ చెప్పలేదు వాడు. మరి చెపితేగూడ విన్లేదయ్యే. ఇగో ఇట్ల వుంది. ఒక వాదన వుందని గూడ చెప్పలేదు వాడు. ఇపుడు ఒకటేందంటే సమ్మరీకి పోతే వాడిచ్చిన ఆరు ప్రత్యామ్నాయాల్లో లోపట, నాలుగు ఆచరణయోగ్యం కాదని వాడే అన్నడు! ఇగ మిగిలినయ్ రెండు. సపరేట్ తెలంగాణ, సమైక్యాంధ్ర. అసలు మీ అబ్జర్వేషన్ అవే గద. మిమ్మల్ని రాయలతెలంగాణ గురించి ఎవడన్న చెప్పమన్నడా? మీరే రెయిజ్ చేసిండ్రు అది కాదన్నరు.

ఇగ అన్నిటికంటే పెద్ద జోక్ ఏందంటే!? మహబూబ్‌నగర్, నల్లగొండ కలిపి గ్రేటర్ హైదరాబాద్ అని అంటే, ఎవడన్న అడిగిండా అది? నల్లగొండ, మహబూబ్‌నగర్ మొత్తం హైదరాబాద్‌ల కలపమని ఆంధ్రోడు గూడ అడగలేదు. వీడే లేపిండు, తీసి అది గూడ కాదన్నడు. నువ్వే సృష్టించి, నువ్వే ఆచరణ కాదంటే, మరి ఎవరి కొరకు చేసినవ్? ఆ సమస్యంతా పెంచడానికే గద. సరే ఇంక పెద్ద ఇది ఏందంటె? గ్రేటర్ హైదరాబాద్ అంటే మహబూబ్‌నగర్, నల్లగొండ ఎందుకు, కర్నూలు, గుంటూరు గూడ కలపరాదు మరి. కృష్ణ అవతల, ఇవతల కలపరాదు. అది కుట్ర ఏందంటే కృష్ణానది మీద తెలంగాణకు ఏ మాత్రం అంగుళం గూడ హక్కులేకుండ చేయడం. అసలు కారణం అది. అంటే ఏ లాబీయింగ్‌కు లొంగినట్టు నువ్వు!? కాబట్టి ఇదంతా సీమాంధ్ర లాబీయింగ్ అని మనం చెప్పడానికి ఏందంటే, రాయపాటి సాంబశివరావు అవి రాకుంట ఎట్ల ఆపాల్నో మాకు తెలుసును అన్నడు. వేరే వాడు అన్నడు, తర్వాత లగడపాటి ఏవన్నడు? ఇగ ఇది రాదనే అన్నడు వాడు. కావూరి అదే అన్నడు. రిపోర్ట్ రాకముందే. తర్వాత గ్రోత్ రేట్ ఎక్కువ వుంది, ఇదే అభివృద్ధి చెందింది లగడపాటి చెప్పింది అదే గద.

దానికి తోడు బహిరంగంగా సుబ్బిరామిరెడ్డి పార్టీలకు పోతిరి (శ్రీకృష్ణ కమిటీ)మీరు. యాభై సార్లుగాదు, వందసార్లు పోతామంటిరి. ఇవన్నీ అసలు, మీ విశ్వసనీయతనే క్వశ్చన్ చేస్తున్నయ్ గద? పోతే వాళ్లిద్దరు అకడమిషన్స్, పొలిటిషన్స్ కంటే ఘోరంగ బిహేవ్ చేసింద్రు. కనుక ఈ రిపోర్ట్ అల్టిమేట్‌గ తిరిగి తిరిగి చెప్పిందేంటంటే నాలుగు లేనిపోని కథలు మీరే చెప్పి, ఇగ మిగిలినయ్ రెండేందంటే సమైక్యాంధ్ర, లేకపోతే ప్రత్యేక తెలంగాణ అని మీరే అంటిరి. సమైక్యాంధ్ర కావాల్నంటే మల్ల సేఫ్‌గార్డ్స్, కాన్‌స్టూషన్స్ అని మీరే అంటిరి. అవేమన్న పనిచేసినయా? పెద్ద మనుషుల ఒప్పందం, అఖిలపక్ష ఒప్పందం, ఐదు సూత్రాలు, ఎనిమిది సూత్రాలు, ఆరు సూత్రాలు, గిర్‌గ్లాని కమిషన్లు, సుప్రీంకోర్టు జడ్జ్‌మెంట్లు ఏవన్నా పనిచేసినయా? ఇగ మరి ఎట్ల? ఎవడు చేయాలి దాన్ని? ఎప్పుడు గావాలి అవన్ని?

కనుక ఇదంతా ఏమిటంటే వాళ్లిచ్చిన స్టాటిస్టిక్స్ అంతా గవర్నమెంట్ ఇచ్చిన ఏకపక్షం. ఈ గ్రోత్‌రేట్ గూడ చెప్పిన, గ్రోత్‌రేట్ ఒక ఏకపక్ష యాస్పెక్ట్ అది. ఒక్కపూట తిండి తిననోడికి ఒకపూట తింటె, వాడికి బాగ కడుపు నిండుతది గద. కని మూడుపూటల అజీర్ణంతో తీనేవాడికి అది లెక్కకు రాదు. కనుక గ్రోత్ రేట్ అనేది యిట్ ఇజ్ యాన్ ఇన్‌కంప్లీట్ అండ్ పార్షియల్ ప్రెజెంటేషన్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అన్నమాట. గ్రోత్‌రేట్ గూడ

చెప్పండి, యాక్చువల్స్ గూడ చెప్పండి అని మనం అన్నం. ఇగ నా ఆదాయం రూపాయి పోయి వందైతే హండ్రెట్ పర్సెంట్ అంటివి. వానికి యాభైవేలు పోయి లక్ష అయితే ఫిఫ్టీ పర్సెంట్ అంటివి. కొత్తేమి లేదు.

ఒకటేందంటె కమిటీ గూడ ఇంత ఘోరమైన రిపోర్ట్ ఇస్తదని ఎప్పుడు అనుకోలేదు. అండ్ల ఫాక్చువల్ ఎర్రర్స్ చాల వున్నయ్. ముఖ్యమంత్రి విషయంలో తెలంగాణ నుంచి వెంగళరావుని తెలంగాణ మనిషిగ లెక్కబెడితిరి. కాదో అని మొత్తుకుంటిమి. సచ్చి పోయినోన్ని అవమాన పరిస్తిరి. నేను తెలంగాణ వాన్ని గాదని వాడే చెప్పుకొనె. నువ్వు వాన్ని ఇండ్ల జమ కడితివి. ఫ్యాక్చువల్ ఎర్రర్స్ చెప్తున్న నేను. ఇట్ల చాలా వున్నయ్. ఫ్యాక్చువల్ ఎర్రర్స్. నేను చెప్పేది మచ్చుకు జెప్తున్న చాలా వున్నయ్. నేను తయారు చేస్తున్న మొత్తం గని. ఇపుడు ఇమీడియట్‌గ రాయాల్నంటే కొద్దిగ ఎనలైజ్ చేసి రాయాలను కుంటున్న. డిబేట్ కానీయండి, డిబేట్ అయిన తర్వాత, ఇవాల్టితోటి తేలేది గాదు గద ఇది. చూస్తున్న అన్నీ అంత పెద్ద ప్యాడింగ్ మెటీరియల్. ఉన్నది లాస్ట్ చాప్టర్‌లో, ఆ చాప్టర్‌లో మూడింట రెండొంతులు మల్ల వేస్టే. ఏమి రిపోర్టయ్య అది. ఆ రిపోర్ట్ చేయడానికి ఇంత రీసెర్చ్ అక్కర్లేదు. ఇన్ని ప్రయాణాలక్కర్లేదు.

ఇండ్ల ఏమైందంటే శ్రీకృష్ణ కమిటీ మంచోడో, చెడ్డోడో తర్వాత సంగతి, ఆయన ఢిల్లీలో ఒక్కరోజు గూడ వుండలె. ఆయన బాంబే నుంచి పనిచేసిండు. మల్ల ఈ అకడమిషన్స్ ఏందంటే ఇద్దరు ఎవరు? ఈ సాయిబు తర్వాత లేడీ యిద్దరు తిరిగింద్రు, తిరిగింద్రు మల్ల అది కమిటీలో వాల్లయితే, చెపితే కాదనో, వాల్లదే అంటాంద్రు మల్ల. ఇపుడు ముస్లిమ్స్ గురించి ఎంత ఘోరమైన స్టేట్‌మెంట్ అది. అంటే ఎంఐఎం చెప్పింది చెప్పినవ్ అంతే. రవీంద్రకౌర్ గూడ మీటింగ్‌లో వున్నప్పుడు తెలంగాణ వాల్లకు స్టాండర్డ్స్ తక్కువున్నయ్ ఎందుకు? ఉద్యోగాలు వస్తయా? అంటే బాగ ఉతికినం అక్కడ. మల్ల గదే రాసింద్రు. ఇగ పోతే లా యూనివర్శిటీ ఆయన ఏం పట్టించుకోలేదు. కనుక చేసింది మొత్తం దుగ్గల్. ఇగ ఆ దుగ్గల్‌ని ఈ పార్టీలకు బోయి, దీనికి బోయి ఇట్ల చేసింద్రు

(*ఈ వివరణ నేను జయశంకర్ సార్‌తో మాట్లాడుతున్నప్పుడు, మధ్యలో దేశపతి శ్రీనివాస్ ఫోన్ వచ్చింది. కమిటీ రిపోర్ట్ వచ్చిన రోజు సాయంత్రం ఆ రిపోర్ట్ గురించి సార్ ఫోన్‌లో ఇచ్చిన వివరణ సారాంశం -సంపాదకుడు*)

# మాది ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం

మా పూర్వీకుల గ్రామం అక్కంపేట అని ఒకప్పుడు కుగ్రామమే. వరంగల్‌కు 16, 17కిలో మీటర్ల దూరంలో వుంటుంది. అక్కడ మా తాతగారు పుట్టింద్రు. వారి పేరు వెంకట బుచ్చయ్య. ఆయన్ను, ఆయన తండ్రి నాలుగో తరగతి వరకు చదివిపించిండు. దాంతో ఆయనకప్పుడు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం దొరికింది. కనుక మా వంశంలో మా తాతగారితో ప్రభుత్వ ఉద్యోగం మొదలైంది. ఆయనకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు బిడ్డలు పుట్టింద్రు. మా నాయన రెండవ కొడుకు. ఇద్దరు కొడుకులను చదివించిండు. పెద్దకొడుకు, ఆ రోజుల్లో 7వ తరగతి వరకు చదివితె, ఆయనకేదో గవర్నమెంట్ జాబ్ వచ్చింది. కని ఆయన గవర్నమెంట్ జాబ్‌లో చేరిన కొద్ది రోజులకే చనిపోయిండు. మా నాయన దాదాపు ఇంటర్‌మీడియట్ దాటి డిగ్రీ వరకు వచ్చిండు. పూర్తి గాలె, డిగ్రీ వరకు వచ్చిండు. ఒకవేళ ఆయన అప్పుడు ఉద్యోగంలో జేరుంటె ఏ కలెక్టర్ ర్యాంకో వచ్చేది గావొచ్చు. అయితె ఆ రోజుల్లో విశ్వాసాల ప్రకారం గవర్నమెంట్ జాబ్ మనకు అచ్చి రాలేదని మా నాయన్ని ఉద్యోగం చెయొద్దని చెప్పినాడు.

అయితె చివరికి ఏమైంది. మాకు పూర్వీకుల పురి కొంత విలేజ్‌లో వుండేది. కనుక మా నాయనగారితో ఉద్యోగం చెయొద్దని చెప్పింద్రు కనుక అప్పటికే హన్మకొండలో ఇల్లు కట్టడం అయింది, మా తాతలకాలంలో. విలేజ్‌లో వున్న భూములను వ్యవసాయం జేయించుకుంటూ బతకొచ్చని జెప్తే, మా నాయనగారు పిల్లలందర్ని హన్మకొండ లోపల్నే వుంచి చదివించేది. ఇగ ఆయన వరంగల్‌లో వుండి వ్యవసాయం చేయించేది. స్వయంగా చేసేటువంటి ఆ నైపుణ్యం ఆయనకు రాలేదు. చదువుకోవడం వల్ల ఆ రోజుల్లో కొన్ని ఇన్హీబిషన్స్ గూడ వుండేవిగద. కనుక ఇట్ల ఏమైందంటె, మమ్ములందర్ని చదివించి పెద్దవాల్లను చేసే వరకు దాదాపు ఆ విలేజ్‌లో ఆస్తి అంతా హరించుకుపోయింది.

ఇగ పోతె మా అమ్మది ఖమ్మం. ఖమ్మంలో పుట్టింది, అప్పుడు ఖమ్మం వరంగల్ జిల్లాలో భాగమె. వారికి ఆరుగురు సంతానం. ముగ్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. అందరికంటె పెద్దవాడు మా అన్నయ్య. అతను ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యిండు. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. వాల్ల వాల్ల శక్త్యానుసారం వాల్లు సెటిల్ అయిపోయి ఎవరి జీవితాలు వారు బతుకుతున్నరు. రెండు మా అక్క. ఆమెకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. వాల్లు గూడ సెటిల్ అయిపోయింద్రు.

నేను మధ్యముడ్ని, మూడోవాన్ని. నా తర్వాత ఇద్దరు చెల్లెండ్లు. మా పెద్ద చెల్లెను కరీంనగర్‌కు ఇస్తే, ఆయన ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్ అయిపోయిండు. ఆ చెల్లెకు ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు, వాల్లు గూడ సెటిల్ అయిపోయింద్రు. ఇంకో చెల్లె వరంగల్‌లోనె. వాల్లు అక్కడే వున్నరు, మా బావగారు గూడ వరంగల్లే. వాల్లకు ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు. వాల్లు గూడ సెటిల్ అయిపోయింద్రు. మా తమ్ముడు బిఎస్‌సి అగ్రికల్చర్ చేసిన తర్వాత స్కాలర్‌షిప్ దొరికితె అమెరికాకు పోయిండు. ఇగ అక్కన్నే చదువుకున్నడు. అక్కడ్నే సెటిల్ అయిపోయిండు. అతనికి ఒక కొడుకు, ఒక బిడ్డ.

ఇగ నా సంగతికి వస్తె, నా స్కూల్ ఎడ్యుకేషన్ అంతా వరంగల్‌లోనె జరిగింది. స్కూల్ ఎడ్యుకేషన్ గాదు, ఇంటర్ మీడియట్ వరకు. ఆ స్థానిక స్కూల్లో అప్పుడు ఇంటర్‌మీడియట్ అనేది యూనివర్శిటీ ఎడ్యుకేషన్‌లో భాగంగా వుండేది. అప్పుడు వరంగల్‌లో ఒకే ఒక ఇంటర్‌మీడియట్ కాలేజి వుండేది. నేను చదివిన ప్రైమరీ స్కూలేమో మర్కజి స్కూలు అంటరు దాన్ని. అప్పుడు దానికి గొప్ప హెడ్మాస్టర్లు వుండేది. నన్ను బాగ ప్రభావితం చేసిన స్కూలది. మిడిల్ స్కూలు అక్కన్నే. హైస్కూలు ఇపుడు ప్రస్తుతం జూనియర్ కాలేజి అంటరె, దాన్నప్పుడు కాలేజియట్ హైస్కూలనేది. హైస్కూలు పదో తరగతి దాక చదువుకున్న. ఇంటర్‌మీడియట్ గూడ వరంగల్‌లోనె. అంతవరకు ఉర్దూ మీడియమె. తెలుగెక్కడ? అసలు మాకు లేనేలేదు. చదువుకోలేదు. ఇంట్ల మాట్లాడుకోటమె. లిపి అంటె ఇంట్లో అక్షరాభ్యాసం చేసేది కనుక ఏదో వచ్చీ రానట్టువుండేది. పోతె మా నాయనగారికి సంస్కృతం, తెలుగులో చాల గొప్ప ప్రవేశం వుండేది. ఆ ప్రభావం గూడ మాకు పడింది. కని బోధనా భాష ఉర్దే, అఫీషియల్ లాంగ్వేజ్ ఉర్దే. ఇంటికెవలన్న పెద్దవాల్లు వస్తె ఉర్దూలో మాట్లాడితె ఇవాల రేపు ఇంగ్లిష్‌లో మాట్లాడినంత గౌరవ ప్రదమన్నమాట. ఓ మావాడు భాష మాట్లాడతడంటె (ఉర్దూ) భాష అంటె అఫీషియల్ లాంగ్వేజ్ మాట్లాడతడు. చాల మంచిగ మాట్లాడతంటె, ఇంగ్లిష్, ఉర్దూ చాలా ధారాళంగ మా వాడు ఆర్‌పార్ మాట్లాడతడంటె పెద్ద గొప్పన్నమాట.

అట్ల ఉర్దూమీడియం లోపల్నె నా విద్యాభ్యాసం అంత జరిగింది. ఇంటర్‌మీడియట్ నేను సెకండ్ ఇయర్‌లో వున్నప్పుడు పరీక్షల కాలంలో నాకొక యాక్సిడెంట్ అయింది. యాక్సిడెంట్ అంటె ఇంట్లో వెనుక దొడ్లో దొంగలు బడ్డరు. పరీక్షలప్పుడు వెనుకదొడ్లో చదివేది గద. పొద్దున అట్ల డోర్ ఓపెన్ చేసిన వాడు ఇంట్లకి వస్తున్నడు. వాని చేతిలో కత్తి వుండె పొడిచిండు నన్ను. దాంతో నేను స్పృహదప్పి పడిపోయిన. పరీక్ష దప్పింది.

కనుక మల్లీ ఇంకోసారి ఇంటర్‌మీడియట్‌లో చేరి చదవాల్సి వచ్చింది. ఇంటర్‌మీడియట్ పూర్తి అయింది. ఒకటి వరంగల్‌లో డిగ్రీ లేదు అప్పటికి, 1953 సంగతి నేను చెప్పేది. డిగ్రీ అంటె హైదరాబాద్‌కు రావాలె. కుటుంబ పరిస్థితులు అప్పటికి నన్ను హైదరాబాద్ పంపించటానికి అనుకూలంగ లేకుండె. ఎందుకంటె పెద్ద కుటుంబం, అందరి పెండ్లిల్లు గాలె. ఒక్క మా అన్నయ్య పెండ్లి బహుశ అప్పటికి అయింది. ఆడపిల్లల పెండ్లిల్లు, మగ పిల్లల చదువులు, కుటుంబ పోషణ ఉమ్మడి కుటుంబం అంటె, యిగ దానివల్ల ఏమైంది? దాంతో పాటు మా ఫాదర్ నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొనేది. దానివల్ల కొంత అంతరాయం. వ్యవసాయం కొంత నష్టమొచ్చేది.

# ఎ పొట్టా పాగల్ హెూగయా క్యా?

కనుక ఆ విధంగా ఏం జరిగింది నాకు 1953ల ఇంటర్‌మీడియట్ చదువుతున్నప్పుడె డిగ్రీకిబోయే అవకాశం లేదుగద. ఇక్కడ్నె లేదాయె. కనుక మేం ఏం చేసినం అంటె, స్టూడెంట్స్ అంత వరంగల్‌లో డిగ్రీకాలేజి గావాలె అని ఒక ఉద్యమం తీసినం. అప్పుడే (పెద్దగా నవ్వుతూ) నిజంగా ఒక విధంగ ఉద్యమ లైఫ్‌లో అదొక మెట్టు. దానికి ఒక ప్రత్యేకత వున్నది. ఎందుకు చెపుతున్నంటె ఈ రోజు వెనక్కిబోయి జ్ఞాపకం చేస్తె ఒక్కొక్క సంఘటనకు ఒక నేపథ్యం, ఒక ప్రత్యేకత సంతరించుకొన్నది. అయితె అప్పుడు మా లెక్చరర్స్ గూడ మాకు చెప్పేవాల్లు. వరంగల్‌లో డిగ్రీ కాలేజీ గావాలె అని మమ్మల్ని ఎంకరేజ్ చేసేవాల్లు. ఉద్యమం పెద్ద ఊరేగింపు. చిన్న సంఖ్యే గద. వంద మందితో ఊరేగింపు అంటె ఈ రోజు పదివేల మంది ఊరేగింపు అన్నట్టు. వరంగల్ డిగ్రీ కాలేజీ గావాల్నంటె నా నోటి నుంచి వరంగల్‌కి యూనివర్శిటీ గావాల్నని వచ్చింది ఉర్దూలో. అందరు నవ్విండ్రు. పోయి మా లెక్చరర్స్‌కి చెప్పిండ్రు. అయితె మా లెక్చరర్ నన్ను బాగా లైక్ జేసే లెక్చరర్ ఉర్దూలో ఒకమాట అన్నడు. అంత ఉర్దూయె గద అప్పుడు. ఎ పొట్టా పాగల్ హెూగయా క్యా? అని. అంటె ఈ పోరనికి పిచ్చి లేచిందా అన్నట్టు. (నవ్వు) సరె డిగ్రీ కాలేజి రాలె. పదేండ్ల తర్వాత వచ్చింది గాని అది లింక్ ఎట్ల చేస్తున్నంటె ముప్పై ఏండ్ల తర్వాత యూనివర్శిటీ వచ్చింది. ఆ పిచ్చి పోరగాడె దానికి వైస్ ఛాన్సలర్ అయ్యిండు(పెద్దనవ్వు)

## లాఠీ చార్జిలో దెబ్బలు తిన్నవాల్లల్లో నేను ఒకన్ని

అయితె 1952 ఆగస్టులోపల్నే ఫస్ట్ తెలంగాణ వుద్యమం మొదలైంది. నేను ఇంటర్‌మీడియట్ రెండోసారి చేరినంక, పరీక్ష తప్పి రెండోసారి చేరినంక, ఆ ఉద్యమం ఏదీ పోలిస్ యాక్షన్ తర్వాత, తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రప్రాంతం నుంచి అంటె మద్రాసు నుంచి వచ్చినటువంటి ఉద్యోగస్తులు, ఆఫీసర్లు, తెలంగాణను చాలా అవహేళన చేసుకుంటూ మాట్లాడేది. ఆగస్టు 1952లో అప్పటికే నా ఇంటర్‌మీడియట్ కాలేజి (వరంగల్)లో ఇంగ్లిష్, తెలుగు లాంగ్వేజ్ జెప్పేవాల్లంత ఆంధ్ర నుంచి వచ్చేసింద్రు. సబ్జెక్టు చెప్పేవాల్లంత యిక్కడ్నేమో ఉర్దూలోనె చెప్పాలె గద! సబ్జెక్టు చెప్పేవాల్లంత ఉర్దూ మీడియం, లాంగ్వేజ్ చెప్పేవాల్లంత ఆంధ్ర నుంచి వచ్చింద్రు. వాల్లందరు గూడ ఏందంటె విశాలాంధ్ర గావాలె, అట్ల విశాలాంధ్ర గావాలె అనేది. దానికి తోడు ఇపుడు ఏ గెస్ట్‌లను బిలిచినా వరంగల్‌లో ఆంధ్ర నుంచి బిలుచుకొచ్చేది.

ఒకసారి ఒక పెద్ద పబ్లిక్ మీటింగ్ బెట్టి వాల్లు అయ్యదేవర కాళేశ్వరరావు అని వొక పెద్ద లీడరుండె అప్పుడు, విజయవాడ నుంచి పిలిపిచ్చి మీటింగ్ పెట్టించింద్రు. అయితె మీటింగ్ బెట్టింద్రు. అప్పటికి ఏందంటె పోలీస్ యాక్షన్ తర్వాత మిలటరీ యాక్షన్ సివిల్ అడ్మినిస్ట్రేషన్ రూల్ అయిపోయి, డెమొక్రటిక్ గవర్నమెంట్ వచ్చింది. అంటె బూర్గుల రామకృష్ణారావు గవర్నమెంట్ వచ్చేసింది అప్పటికి. ఆయన వీల్లందర్ని రాజకీయ నాయకుల్ని, ఉద్యోగస్తుల్ని, స్టూడెంట్స్‌ని మొత్తం బిలిపిచ్చి మీటింగ్ బెట్టింద్రు.

ఆయన ఉపన్యాసం మొదలు పెట్టిండు. అదె మీరుంటె మీరు అభివృద్ధి చెందలేరు, మీకు తెలుగు రాదు, మీకు నాగరికత దెలవాలె అని పెట్టిండు డెరగేటివ్‌గ, అంటె మీకు ఏం రాదు, మీరు దద్దమ్మలు. మిమ్మల్ని సంస్కరించాలి, అంటె మాతో గలవాలె అని మొదలుబెడితె అల్లరి జేసినం బాగ. బాగ అల్లరి జేసినం. మీటింగ్ అంత అల్లరి అయితుంటె పోలీస్‌లను బిలిపిచ్చింద్రు. అప్పుడు కలెక్టర్లు, పోలీసులంత అక్కడ్నించి వచ్చినోల్లె వున్నరు. లాఠీ చార్జి అయింది. లాఠీ చార్జిలో దెబ్బలు తిన్నవాల్లల్లో నేను ఒకన్ని. అప్పుడు దెబ్బతిని, ఇప్పటికి బతికున్నవాల్లల్లో నాకు తెలిసినంతలో ఇద్దరమె వున్నం. నేను ఒకన్ని. సత్యనారాయణ, మినిస్టర్ వుండు చూడు తెలుగుదేశంల. అంటె మిగతావాల్లు వున్నరో లేదో చెప్పటం కష్టమె గాని ఇప్పటికి సజీవంగ వున్నవాల్లం మేమిద్దరమె అన్నమాట.

అప్పటికె మొత్తం తెలంగాణ జిల్లాల్లోపల అక్కడినించి వచ్చిన ఎన్జీవోలు, ఆఫీసర్లు, టీచర్లు, అందరికి ఇదే ధోరణిలో వుంటె అప్పటికె తుక తుక అంటుండె మొత్తం తెలంగాణ. ఇదేదో ఘోరమైందని దీనికి వూరుకోవద్దని. మొత్తం తెలంగాణ గురించి మీటింగ్ బెట్టేవరకు

సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో పెట్టాలని అంతా ప్లాన్ జేసుకొని, అందరం హైదరాబాద్‌లో సిటీ కాలేజిలో అఫ్జల్‌గంజ్ యేరియాలో మీటింగ్ బెట్టుకొని "నాన్ ముల్కీ గో బ్యాక్" అని మేం స్లోగన్స్ అప్పుడు. "ఇడ్లీ సాంబార్ గో బ్యాక్" ఇడ్లీ సాంబార్ అంటె మాద్రాసుతో అప్పుడుండె గద. "గోంగూర పచ్చడి గో బ్యాక్" అన్న స్లోగన్స్ రాసేది బ్రష్‌పెట్టుకొని జాజుతోని. దీన్ని బిగిన్ జేసింది మోస్ట్‌లీ స్టూడెంట్స్ అండ్ ఎన్జీవోస్. దానికి ట్రిగ్గర్ ఏంది? వరంగల్ యిన్సిడెంట్. ట్రిగ్గర్ అయింది ఇగ లాభం లేదు అనుకొని. సరె వెనుక యిక్కడి టీచర్స్ వుండిరి. కని ఆ రోజు కమ్యూనికేషన్స్ లేవు, మీడియా లేదు, అయితె స్ప్రెడ్ అయింది. బాగ స్ప్రెడ్ అయింది.

అందరం బయలుదేరి 5 సెప్టెంబర్‌న మీటింగ్‌కు రావాల్సిండె ఇక్కడ. మేం వరంగల్ ఆ స్టూడెంట్స్, అల్లరి చేస్తే పెద్ద ప్రైవేటు బస్సు బొగ్గుతోని నడిచేది ఆ రోజుల్లో, ఒకటి అద్దెకు దీసుకొని బయలుదేరినం. మేం భోనగిరి వచ్చేవరకు బస్సు జెడిపోయింది. అయ్యే వరకు మేం హైదరాబాద్ జేరలేకపోయినం అంటె ఆ మీటింగ్ సమయానికి. అయితె ఆ మీటింగ్ జరిగింది, అల్లరి అయింది. పోలీస్ కాల్పులు అయినయ్, ఫస్ట్‌డె ఐదుగురు, సెకండ్ డే ఇద్దరు మొత్తం ఏడుగురు స్టూడెంట్స్ చచ్చిపోయింద్రు. ఫస్ట్‌టైం తెలంగాణ కోసం అంటె తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విశాలాంధ్రకు వ్యతిరేకంగ, ఉద్యమం జేసినపుడు ఫస్ట్ ఫైరింగ్‌లో స్టూడెంట్స్ బలైపోయింద్రు. ఒకవేళ చేరుంటె మేం గూడ బహూశా అమర వీరులవుదుం. సరె ఆ అదృష్టం దక్కలె మాకు. ఎవరి అదృష్టమో, ఎవరి దురదృష్టమో ఇంక బతికున్నం. అట్ల జరిగిపోయింది. తర్వాత ఇంటర్‌మీడియట్ అయిపోయింది.

# బతకలేకపోతె బిచ్చమెత్తుకొనైన

డిగ్రీకి చాల కోరిక వుంది గాని, మా పేరెంట్సే ఎంతో కష్టపడి నన్ను డిగ్రీకి పంపిచ్చింన్రు. 1954లో ఇక్కడ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజిల బిఎ వుండె. ఇప్పుడు లేదు గాని అప్పుడు వుండేది. బి.ఎ జదువుతున్న రోజుల లోపల్నే ఫజల్ అలీ కమిషన్ వచ్చింది. ఇగ అప్పటికె రాజకీయ నాయకులు, అప్పటి లీడర్స్ కొండా వెంకట రంగారెడ్డి, చెన్నారెడ్డి, జె.వి నర్సింగరావు వుండె.

పొలిటికల్ లీడర్స్, మాకు కాలేజిలో చెప్పే ప్రొఫెసర్లు, మేమంతా గూడ ఫజల్ అలీ కమిషన్ ముందు చెప్పాలనుకొంది ఏందంటె? స్టూడెంట్స్ బృందం గూడ పోవాలె అని నిర్ణయిస్తె మేము రాసినం వాల్లకు, పర్మిషన్ ఇచ్చింన్రు. అయితె ఐదుగురు రావాలె అని చెప్పింన్రు. ఐదుగురిలో నేనుగూడ ఒకన్ని. ఉస్మానియా యూనివర్శిటీ స్టూడెంట్స్ ఎవరూ ఇపుడు బతికిలేరు. నాకు జ్ఞాపకం వున్నంత వరకు ఒకాయన గోపాలరావు అని ఒకాయనుండె, భాస్కరరెడ్డి అని ఇంకోక ఆయన వుండె, ఇంకొక ముస్లిం ఫ్రెండ్ వుండె పేరు మర్చిపోతున్న. ఒక రిప్రజెంటేషన్ రాసుకొని ఇగ మమ్మిల్ని బాగ బ్రీఫ్ చేసింన్రు . మా టీచర్లు, కొంత మంది పొలిటికల్ లీడర్లు, మమ్మల్ని బాగ ప్రిపేర్ చేసింన్రు ఇట్ల చెప్పాలె, అట్ల చెప్పాలె అని.

ఫజల్ఆలీ కమిషన్‌ను పోయి కలిసినం. చాల జాగ్రత్తగ విన్నరు. అయిన తర్వాత అప్పటికి ఉర్దూ మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంకు వచ్చినం. కని మాకు చదవడం ఇబ్బందిగ వుండె, చెప్పడం రాకబోయేది. కనుక ఇంగ్లిష్, ఉర్దూ ఏదైన రాయొచ్చని చెప్పేది. ఒకే పేపరు సగం ఇంగ్లిష్, సగం ఉర్దూగూడ రాసేటువంటి వెసులుబాటు గూడ వుండేది. కని మా స్టాండర్డ్స్ ఏం తక్కువ లేదు. చెప్తున్న గద.

ఇప్పటికి బతికున్నం అంటె అదె. చెప్పేవాల్లు అట్లనె వుండిరి, గొప్ప గొప్ప స్కాలర్స్ చెప్పేవాల్లు. చాల గొప్ప స్కాలర్స్. ఫజల్అలీ అన్నీ విన్నంక నవ్వుకుంట అడిగిండు వుర్దూలో. చూడండి పిల్లలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం మీకిస్తె బతకగలుగుతరా? అన్నడు నవ్వుతునె. మంచిగ బతకగలుగుతం. బతకలేకపోతె బిచ్చమెత్తుకొనైన బతుకుతం. వాల్ల దగ్గరికి మాత్రం బోం అన్నం. (చెప్పుకుంట ఎమోషనల్‌గ ఫీలైన జయశంకర్ సార్‌ఏడ్చింన్రు)

ఫజల్అలీ బాగ నవ్విండు, పంపించిండు. ఎంతగ ఆయన కుచ్చి కుచ్చి ప్రశ్నలు వేసిండో అంత మంచి నివేదిక ఇచ్చిండు. మేం చెప్పడం వల్ల గాదు, తెలంగాణ ఇవ్వాలె

అని చెప్పిండు. అంతటితో మావంతు పాత్ర అయిపోయింది. ఫజల్‌అలీ జెప్పిన గాని విలీనం మాత్రం జరిగింది.

నేను బిఎ పూర్తి చేసేవరకు, బిఎలో చేరినపుడు హైదరాబాద్ రాష్ట్రమె, బిఎ పూర్తయిన నాటికి అంటె 1956 మార్చి నాటికి గూడ హైదరాబాద్ రాష్ట్రమె. అంటె తెలంగాణ రాష్ట్రమె. ఆ 1956 లోపల్నె రికమెండేషన్స్, ప్రత్యేక రాష్ట్రమంటె, తెలంగాణ వస్తది గద అనుకొన్నం మేం.

## నా లైఫ్ యాంబిషన్ ఎకనామిక్స్‌లో లెక్చరర్ గావాలె

బిఎ అయిపోయింది. ఎంఎ జదవాలె, ఎంఎలో సీటు వచ్చింది కని కుటుంబ పరిస్థితులు అనుకూలించలె. చెల్లెల్ల పెండ్లిల్లు, తమ్ముని చదువు. కనుక ఏం జేయాలె, ఉద్యోగం జేయాలె, ఉద్యోగం అంటె ఏ ఉద్యోగం జేయాలె, అంటె ఈజీగ వచ్చేది. నేను ఏమనుకున్న అంటె టీచర్ ఉద్యోగం జేస్తె టీచర్లకు ప్రైవేటుగ ఎంఎ రాసే వెసులుబాటు వుంది. చాల యూనివర్శిటీలలో వుండేది. నాకు కోరిక ఎంఎ జదువుకోవాలె, ఎకనామిక్స్ జదువుకోవాలె, నా లైఫంత యాంబిషన్ ఎకనామిక్స్‌లో లెక్చరర్ గావాలె.మా ఫాదర్ సపోర్టు జేసేది గద. ఆయన గూడ స్వతంత్ర్య సమరయోధుడె గద. ఆయన సపోర్టు లేకుంటె నేను ఇంత దూరం బోయేవాన్ని గాదు. అప్పుడు చాల పెద్ద కఠోర డిసిప్లేన్ ఆయన్ది. ఐరన్ డిసిప్లిన్ అంటరే అట్ల. మా మదర్ ఏమో చాల సుకుమారమైనటువంటి ఆప్యాయతలు గల వ్యక్తి. అది బ్యాలెన్స్ అయిపోయేది.

ఏంజేయాలి ఉద్యోగం? టీచర్‌గ జేయాల్నంటె ఏం జేయాలె, డైరెక్టు బోతె జాబ్ వచ్చేది. బిఇడి జేసి పోతె మంచిగుంటది అనేటువంటి ఆలోచన. అప్పుడు ప్రతి సంవత్సరం హైదరాబాద్ గవర్నమెంట్‌లో ఒక అడ్వటైజ్‌మెంట్ వచ్చేది. అప్పుడు బిఇడి అంటె హైదరాబాద్‌లో 50 సీట్లు, వరంగల్‌లో 50సీట్లు మొత్తం తెలంగాణకు. 50లో 45 సీట్లు సర్వీసులో వున్న టీచర్స్‌కు. ట్రైనింగ్ కాకుండ ట్రైనింగ్‌లో వున్న టీచర్స్‌కు. 5 సీట్లు ఫ్రెషర్స్‌కు. ఐదు సీట్లు ఇక్కడ, 5 సీట్లు అక్కడ.

అడ్వటైజ్‌మెంట్ ఏమని వచ్చేది అంటె అప్పటి ఆనవాయితీ అది. బిఇడి చేసిన వాల్లకు బిఇడి పాసైపోతె వెంటనె పర్మినెంట్ జాబ్ ఇస్తం. స్కూల్ అసిస్టెంట్ అని. ఫలానా స్కేల్ అంటె 154 టు 275 అని స్కేల్ అన్నమాట. అప్పుడు 154 బేసిక్ పేస్కేల్ అంటె ఈ రోజు 15000లకు సమానం అది. పర్మినెంట్ జాబ్ లైతె బేసిక్ స్కేల్. ఆంధ్రప్రాంతంలో అదె పొజిషన్‌కు 85 టు 175. ఆంధ్రరాష్ట్రంలో. వరంగల్ బోతె బిఇడిలో సీటు వచ్చింది. బిఇడిలో నేను జేరింది జూన్ 1956లో. బిఇడి ఖతం అయింది 1957 మార్చిలో. మధ్యలో ఆంధ్రప్రదేశ్ అయింది. 56 నవంబర్‌లో అది అయిపోయింది. సరె ఇప్పటంత అవగాహన ఆ కుతూహలం అప్పట్నించె వచ్చిందన్న మాట, లేకపోతె ఫజల్అలీ కమిషన్ ముందు ఎట్ల బోతం, విశాలాంధ్ర వద్దని ఎట్ల ఎజిటేట్ జేస్తం. అవన్ని కుటుంబంలో మా ఫాదర్ స్వయంగ స్వతంత్ర్య సమరయోధుడు కావటం చేత ఆ బీజం నాటబడింది.

## స్టేట్ ఫాం గాంగనె ఇమీడియట్ రియాక్షన్

ఐతె రిజల్ట్స్ వచ్చినయ్ అపాయింట్‌మెంట్ రాలె. మేం పాసైన పదిమందిమి ఆఫీసుకు వచ్చినం. విద్యాశాఖ డైరక్టరేట్‌కి. అప్పటికే తెలంగాణలో ఆందరు సెకండ్, థర్డ్ పొజిషన్‌లో ఆంధ్రవాల్లు పైకి వచ్చెసింద్రు. ఎవర్ని గలవాలె అంటె అపాయింట్‌మెంట్‌కు సంబంధించిన డిప్యూటి డైరెక్టర్‌ని గలవాలె, అంటె పోయి కలిసినం. ఆయన పేరు సి.బి రావు. ఆయన పేరు ఎందుకు జ్ఞాపకం వుందంటె, ఈ వుద్యమక్రమంలో మంచికో చెడుకో కొన్ని మర్చి పోలేను నేను. మేం బోయి అడిగినం అతన్ని. నీకు ఎవరిస్తనన్నరు జాబ్ అన్నడు. అప్పుడు దక్కన్ క్రానికల్ ఒకటే పేపర్, అడ్వటైజ్‌మెంట్ తీసి పక్కన పెడితె ఆయన పక పక నవ్వి హైదరాబాద్ గవర్నమెంట్స్‌ది గద అది. మీరు ఆ గవర్నమెంట్‌ని వెల్లి అడగండి మమ్మల్ని ఎందుకు అడుగుతరు? అన్నడు. ఆ మాట చెప్పడానికి చెప్తున్న, అంటె ఎట్ల బిగిన్ అయింది! చూడు స్టేట్ ఫాం గాంగనె ఇమీడియట్ రియాక్షన్. ఏం జేస్తం పిల్లవాల్లం గద. ఏం తోచలేదు.

అప్పుడు హైదరాబాద్ స్టేట్ టీచర్స్ యూనియన్ అనేది చాల మంచి, పెద్ద ప్రెస్టీజస్ ఆర్గనైజేషన్ వుండె. దానికి వి.పి రాఘవాచారిగారని ఒక పెద్ద లీడరుండె. ఎమ్మెల్సీగ చేసిండు, టీచర్స్ మూవ్‌మెంట్‌కు ఆయన పెద్ద మూల స్తంభం లాంటివాడు. దేశంలోపల్నె మల్లి. ఆయన దగ్గరకుబోతె ఏం జేద్దాం జయశంకర్! ఇవన్ని ఆయన చెప్పటం మేం పోవడం ఊకె పదే పదే కలిసిన కొద్ది రోజుల తర్వాత, అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది నాకు. నాతోపాటు వాల్లకు గూడ వచ్చింది. ఏమిటంటె ప్యూర్లీ టెంపరరీ అపాయింట్‌మెంట్. కెన్ బి టెర్మినేటెడ్ ఎనీ టైం వితౌట్ గివింగ్ ఎనీ రీజన్ దేర్ ఫర్. స్కేల్ ఆఫ్ పే రూపీస్ 85 టు 175. ఆంధ్ర స్కేల్. తెలంగాణ స్కేల్ ఏమో పెద్ద స్కేల్, దానికి డబుల్ వున్నది.

నాకు వరంగల్‌లో ఏ స్కూల్లో జదివిన్నో, అదె స్కూల్లో అపాయింట్‌మెంట్ యిచ్చింద్రు. అది ఒక లీవ్ వేకేన్సీల. ఆ లీవ్ వెకెన్సీ ఏందంటె నా టీచర్ ట్రైనింగ్‌కి పోయిండు. నాతో చదివిన టీచర్ డివి సుబ్బారావు గారు, ఆయన ఇప్పటికి సజీవంగనె వున్నరు,పెద్దమనిషి. ఆయన లీవ్ వేకేన్సీలో నాకు అపాయింట్‌మెంట్ యిచ్చింద్రు. మల్లి అడిగిన ఈ స్కేల్ ఏంటి? అని మల్ల గదె మాట. హైదరాబాద్ గవర్నమెంట్‌ని అడగాలె వెటకారంతో!? నవ్విండు ఆ ఆంధ్రా ఆఫీసర్. ఆ నవ్వు, ఎగ్జాట్లీ రాజశేఖరరెడ్డి నవ్వు మాదిరి వుండేది. పోల్చుకుంటం గద. ఆ స్మృతులు, పాత స్మృతులు. సమ్మర్‌లో దీసేసింద్రు. మల్లబోయి

అడిగిన. ఇది ఎన్నోవసారి అంటె, చూడండి ఆంధ్రరాష్ట్రంలో పదేండ్లు ఇట్ల టర్మినేట్ జేసినంక, అప్పుడు ఆలోచిస్తం పర్మినెంట్ చేయడానికి, అంత వరకు గాదు అన్నడు. ఇష్టం వుంటె జేయండి లేకపోతె పోండి అన్నడు. ఆ విధంగ నేను టీచర్స్ ఉద్యమంలోకి దిగిన. టీచర్స్ యొక్క సర్వీస్ కమిషన్స్, టీచర్స్ యొక్క జీతభత్యాలు, దాంతో పాటు తెలంగాణ మిళితమై వుండేది. అంటె ఉద్యమంలోపల ఎట్ల మిళితమై వుండెదంటె, తెలంగాణ ఇష్యూ, ప్రొఫెషనల్ లైఫ్ మిళితమై వుండేదన్నమాట. అట్ల నేను తొమ్మిదేండ్ల పై చిలుకు టీచర్‌గ పనిచేసిన. ఎన్నో చోట్ల పనిచేసిన.

ఆ రోజుల్లో ఎక్కడికి ట్రాన్సఫర్ అయితె అక్కడికి పోయేది. స్కూలు టీచర్‌గ పనిచేసిన ప్లేస్‌లు ఎక్కడెక్కడ వున్నయంటె ఆ కార్నర్ బోతె మధిర, ఇటొస్తె జహీరాబాద్, అటు బోతె ఆదిలాబాద్, ఇటు వరంగల్ చెప్తున్న ఎక్కడేస్తె అక్కడకు బోయేది, పనిచేసేది. ఆ రోజుల్లో పద్ధతి ఏందంటె ఏ ఒక్క ప్లేస్‌లో గూడ మూడేండ్ల కంటె ఎక్కువ వుండొద్దు. ఇప్పుడేమో నేటివ్ డిస్ట్రిక్ట్, లోకల్, నాన్ లోకల్, మండలం, ఇంటి ముందే గద ఇవాల రేపు. నేను పనిజేసినపుడు ఎక్కడ బోతె అక్కడ పనిచేసిన, ఎక్కడ బోతె అక్కడ వంట జేసుకొని తినేది, సెలవల్లో ఇంటికొచ్చేది. నిరంతరం తెలంగాణ గురించి మాత్రం అధ్యయనం చేసేది.

అట్ల పనిచేసుకొంటూ నేను ఎంఎ పరీక్ష ఇస్తాననే సరికి ఉస్మానియా యూనివర్శిటీ వాల్లు పరీక్షను బంద్ చేసింద్రు, ప్రయివేట్ కోర్సు. అంతకు ముందు వుండేది. సరె ఆ కారణాలు వేరుండె. కనుక నేను బనారస్ హిందీ యూనివర్శిటీకి పోయిన, పరీక్ష పాసైన. అప్పటికి మల్టీ పర్పస్ స్కీం వచ్చింది. మల్టీ పర్పస్ స్కీంలో ఎంఎ పాసైన వాల్లకు హైయర్ గ్రేడ్ రావాలె ప్రమోషన్, ఇవ్వలె. మీరు టెంపరరీ టీచర్స్ మీకు ఎట్ల వస్తది? అన్నరు. తర్వాత దెలిసింది ఏందంటే ఆంధ్రల ఇచ్చింద్రని. కనుక ఏం జేసిన అంటె ఇక్కడ కొత్త స్పెషలైజేషన్‌తో మరొక ఎంఎ జేద్దామని నేను అలిఘడ్‌కి బోయిన. రెండు ఎంఎలు జేసిన నేను ప్రైవేటుగ.

ఉద్యోగం జేసుకొంటూ నాకొచ్చిన జీతంలో కుటుంబానికి చేదోడు వాదోడుగ వుంటూ, నా ఎడ్యుకేషన్ ఇంప్రూవ్ జేసుకొంటూ, ఉద్యమాలపై నాకు తోచింది చేసుకుంటూ, ఎవరి చేతుల పైసలుండయ్ కనుక నేనే ఖర్చు పెట్టేది, ఆ విధంగా రెండు ఎంఎలు జేసిన. అయినా ఇవ్వలె ప్రమోషన్. తర్వాత దెలిసింది ఆంధ్ర ఏరియాలో టెంపరరీ వాల్లకు గూడ ప్రమోషన్లు ఇస్తుంద్రని. మల్ల బోయిన చూడు ఇందులో పర్సనల్ ప్రమోషన్

ఇన్వాల్వ్ అయింది. అందులో తెలంగాణ ఇన్వాల్ అయింది. ఆంధ్ర టెంపరరీ టీచర్లకు ప్రమోషన్ ఇచ్చి వరంగల్ వేసింఁడని తెలిసింది.

లేకపోతె ఎట్ల దెలిసేది ఆ రోజుల్లో. మల్ల రిప్రజెంటేషన్ ఇచ్చిన. అప్పటికె టీచర్స్ యూనియన్‌లో చాల యాక్టివిటీ, స్టేట్ టీచర్స్ యూనియన్‌లో చాల యాక్టివ్‌గ అయి పోయిన ఉద్యమాల్లోపల. టీచర్స్ సర్వీస్ కండిషన్ మొత్తంలో ఎంప్లాయిస్ కండిషన్ నా ఒక్కందే ఒక మచ్చు తునక. టీచర్స్, లెక్చరర్లు, ఎన్జీవోలు, ఎంప్లాయిస్ అందరికి గదె పరిస్థితి. నేను జెప్పే ఎగ్జాంపుల్ నా ఒక్కన్ది గాదు. ఎగ్జాంపుల్ ఇస్తున్న. మొత్తం ఆల్ ఎంప్లాయిస్ ఆఫ్ తెలంగాణలో గదె పరిస్థితి. ప్రమోషన్లు ఇవ్వరు, అపాయింట్‌మెంట్లు ఇవ్వరు, పర్మినెంట్లు జేయరు, అన్నిటికి వాల్ల ఇష్టం వచ్చినట్టు అడ్డగోలుగ నింపేసుకుంటూ బోయేది.

# చాలా విషయాల్లో విజయం సాధించిన

అప్పుడే మొదలైందది. యిగ కొట్లాట మొదలుపెడితె మల్లి గదే ఆఫీసర్సు వున్నంక ఎట్ల కొట్లాడతం? అని, ప్రమోషన్ ఇస్తం, ఆదిలాబాద్ ఇస్తె పోతవా? అన్నరు. నేనన్న అండమాన్స్‌కి ఇచ్చిన పోత అన్న. అవును అంటరు, మల్ల టీచర్స్‌ని బట్టుకొచ్చి ట్రాన్ఫర్ గావాలంటరు అన్నడు. నేను గిదె అన్న అప్పటికె పోరాటంలో దిగినోన్ని గనుక చూడండి మీరు ఎక్కడికి వేస్తె అక్కడకి పోవడం నా బాధ్యత. నాకు అనుకూలమైనటువంటి ప్లేస్ మెంట్ ట్రాన్ఫర్ కోరుకోవడం అనేది నా అర్హత, నా హక్కు. మీ అధికారాన్ని నేను ప్రశ్నించ లేదు, ప్రశ్నించను. నా హక్కును గూడ మీరు కాలరాయొద్దు. ఏదో వెటకారంగ నవ్వి పంపించేసి, సరిగ్గా నాకు లెక్చరర్‌గ ప్రమోషన్‌తో ఆదిలాబాద్‌కు ఏసిండు, పోయిన. పనిచేసిన. తర్వాత ఏమైంది. స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నుంచి కాలేజి టీచర్స్ అసో సియేషన్‌కి వచ్చిన. అండ్ల జేరిన. అక్కడ రెండు సమస్యలు. ఒకటి టెంపరరీ టీచర్ల, లెక్చరర్ల, స్టేట్ సమస్య అది. టెంపరరీ టీచర్స్, రెండోది తెలంగాణ సమస్య రెండూ చాల ఇంటర్ లింక్డ్, చాల ఇంటిమెట్లీ అదొక రేర్ అవకాశం నాకు. కొంత ఇన్వాల్వ్‌మెంట్, ఇమోషనల్ అన్నీ గలిసి రెండూ పార్లల్‌గ నడిచినయ్.

అయితె నా బ్యాక్‌గ్రౌండ్ దెలిసిన వాల్లు నన్ను 1970లో అప్పటికే 1969 -70 తెలంగాణ మూమెంట్ వచ్చింది. అండ్ల పాల్గొన్న యాక్టివ్‌గ. చాల యాక్టివ్‌గ పాల్గొన్న. యూనివర్శిటీ కాలేజి టీచర్స్ కన్వెన్షన్స్ పెట్టి, సెమినార్లు పెట్టి, పుస్తకాలు రాసి, నేను రాసిన పుస్తకాలు ఇందిరాగాంధీ దృష్టికి పోయి మమ్మల్ని పిలిపించుకొని మాట్లాడే స్టేజ్‌కి పోయింది. ఆ స్టేజ్‌లో ఏమైందంటె కాలేజి టీచర్స్ మొత్తం స్టేట్ సమస్య ఒకటుండె. టెంపరరీ ఇష్యూ వుండె. టెన్ ఇయర్స్ జేయందె అపాయింట్‌మెంట్ ఇవ్వరు, మొత్తం రాష్ట్రానికి వర్తించేది. మొత్తం గవర్నమెంట్ కాలేజి టీచర్స్ ఆంధ్రప్రదేశ్ వాల్లు మొత్తం ఏమనుకున్నరంటె? ఈ సర్వీస్ ప్రాబ్లమ్స్ డీల్ జేయాల్నంటె మనకు ఒక మంచి ఆఫీస్ బేరర్ కావాలి అనుకొని, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజి టీచర్స్ అసోసియేషన్‌కు నన్ను ప్రెసిడెంట్‌గ తర్వాత సెక్రటరీగ ఎన్నుకున్నరు. నేను తెలంగాణ వుద్యమంలో వున్న. ఆంధ్రప్రదేశ్ టీచర్స్, కాలేజ్ టీచర్స్ ఉద్యమంలో వున్న. అంతటితో ఆగలె. అఖిలభారత యూనివర్శిటీ కాలేజ్ టీచర్స్ దాంట్లో గూడ నాకు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌షిప్ ఇచ్చేసి, నువ్వు కొట్లాడాలె అంటె నేను కొట్లాడిన. ఆంధ్రప్రదేశ్‌లో వుండె అందరు కాలేజ్

టీచర్స్ యొక్క సర్వీసెస్ క్రమబద్ధీకరించాలె, మంచి పే స్కేల్ ఇవ్వాలె, సర్వీస్ రక్షణ వుండాలె మొత్తం గవె సమస్యలు. చాలా విషయాల్లో విజయం సాధించిన.

అదె సమయంలో తెలంగాణ వాళ్లకు అన్యాయం గావొద్దు. రెండూ ప్యారలల్. ఆంధ్ర వాళ్లు అప్రిషియేట్ జేసేది. ఎందుకంటె నేను చేసిన పనివల్ల అంతకు ముందు ప్రాబ్లమ్స్ సాల్వ్ అయినయ్. తెలంగాణ సమస్య విషయంలో వాళ్లకు ఎప్పుడు విబేధాలు రాలె. చివరికి ఏందంటె 1974 దాక వుంటిని నేను నాలుగేండ్లు. 1974లో అప్పటికి ఏందంటె ఈ జై ఆంధ్రా ఉద్యమం రావడం దాని వల్ల ఆంధ్ర, తెలంగాణగ రెండు చీలిపోయినయ్ అన్నమాట. అయినా మల్ల కలిసి పనిజేసేది. ఇది ఎందుకు జెపుతున్న అంటె నా ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎట్ల టీచర్స్ మూమెంట్ అండ్ తెలంగాణ మూమెంట్ రెండింట్లో సమాంతరంగ పనిజేసినా, క్లాష్ రాలె. ఇప్పటికి మా జనరేషన్ ఆంధ్రవాళ్లు జ్ఞాపకం జేసుకుంటరు.

అయిపోయింది, హైదరాబాద్‌కు ట్రాన్సఫర్ అయింది. నాకు గవర్నమెంట్ కాలేజ్ ఎడ్యుకేషన్‌లో, ఆర్ట్స్ కాలేజ్‌లో పనిజేసే రెండు కాలేజ్‌ల క్వాలిఫికేషన్ వుండె. అక్కడ పనిజేస్తున్న. ఇగ ఎప్పటికి నాది తెలంగాణ మూవ్‌మెంట్‌తో ఒకటి, టీచర్స్ మూవ్‌మెంట్‌తో ఇగ అధికారులకు, పాలక వర్గాలకు ఏది? బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి వున్న కాలంల, పి.వి. నరసింహారావు ఎడ్యుకేషన్ ముఖ్యమంత్రి వున్న కాలంల పి.వి నరసింహారావు ఆయన అప్పుడు ప్రో ఆంధ్రప్రదేశ్ గద. ఆఫీసర్స్ నన్ను బాగ లైక్ జేసేది. ఆంధ్రల గాని, తెలంగాణలో గాని. ఈ పొలిటీషియన్స్‌కు కొంచెం అదేందంటే ఈ మొత్తం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అంతా నా వెంటె వుండెదని.

# గవర్నమెంట్‌కి ప్రెస్టేజ్ ఇష్యూ అయింది

అయితె ఏం జరిగిందంటె ఒకసారి 1970-71 ప్రాంతంలో నన్ను అకస్మాత్తుగ ఖమ్మం ఆర్ట్స్ కాలేజ్‌కి ట్రాన్స్‌ఫర్ జేసింద్రు. దానికి రీజన్ జెప్త. దానికి ఒక సిగ్నిఫికెన్స్, ట్రాన్ఫర్ సిగ్నిఫికెన్స్ జెప్తున్న. ఎందుకు జరిగింది, ఎట్ల జరిగింది, అది ఎట్ల కాన్సిల్ అయింది అది చెప్పటానికి. ఎందుకు జేసింద్రు అంటె నా ప్లేస్‌లో ఒకర్ని, ఒకాయన యు.కె నుంచి తిరిగొచ్చిండు. టీచర్ ట్రైనింగ్ జేసి. ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలె. ఆయన క్వాలిఫికేషన్ కేవలం, కాలేజ్ ఎడ్యుకేషన్‌లో పనిజేసే క్వాలిఫికేషనే వుంది, ఆర్ట్స్ కాలేజ్‌ల పనిజేసేది లేదు. అయన పి.వి. నరసింహారావు దగ్గర బంధువు. పి.వి. నరసింహారావు ఎడ్యుకేషన్ మినిస్టర్. నన్ను ట్రాన్స్‌ఫర్ జేసింద్రు. ఆఫీసర్ దగ్గర బోతె సింపతి, ఏం జేయాల జయశంకర్ అని. నిజంగ పి.వి నరసింహారావు నన్ను దీసేయమని చెప్పివుండడు. చెప్పుండకపోవచ్చు, కని జరిగిందది.

చివరికి ఏమైందంటె ఆ రోజుల్లో ఒక గవర్నమెంట్ జివో వుండెది. రికగ్నైజ్డ్ సర్వీసెస్ అసోసియేషన్ యొక్క రిప్రజెంటేటివ్ ఎవరైతె వుంటరో, అఫీస్ బేరర్స్ వారు ఆఫీసులో వున్నంత కాలం వారిని ట్రాన్స్‌ఫర్ జేయొద్దు అని ఒక రూల్. ఒక ప్లేస్ లో కనీసం మూడేండ్లు పనిజేయన్దే అతన్ని ట్రాన్స్‌ఫర్ జేయొద్దు. కని ఆదిలాబాద్ నుంచి వచ్చి ఏడాది గాలె. ఏడాది అయింది బహుశ అటు ఇటు. నేను రికగ్నైజ్డ్ సర్వీసెస్ అసోసియేన్ అధ్యక్షున్ని, స్టేట్ లెవల్ అధ్యక్షున్ని. ఆఫీసర్స్ కాన్సిల్ చేయలేకపోతున్నరు ఎందుకంటె ఎడ్యుకేషన్ మినిస్టర్ మనిషి. నిజంగ ఎడ్యుకేషన్ మినిస్టర్ చెప్పిండా, జెప్పలేదా ఈనాటికి దెలవదు నాకు. జెప్పుండకపోవచ్చు, జరిగింది.

ట్రాన్స్‌ఫర్ అయ్యే వరకు మొత్తం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కు కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అందరు గూడ ఇట్ల ట్రాన్స్‌ఫర్ ఏంది మీకు? మీరు ఫైట్ జేస్తన్నరు కనకనే ఇట్ల చేసింద్రు. మేమే జేస్తం అని మొత్తం స్టేట్ వాల్లు. లేదండి మనం ఛాలెంజ్ జేయాలె అంటె, ఏం జేయాల్నంటె కోర్టుకు బోవాలె. కోర్టుకు బోయిన. కోర్టు స్టే ఇచ్చింది. ఇగ వకీళ్లు రాస్తరు, పత్రికల్లో రాస్తరు గద. ఈయన మీద కక్షగట్టింది గవర్నమెంట్, ఎడ్యుకేషన్ మినిస్టర్ సమీప బంధువును జేయడానికి జేసిండు, ఆయన క్వాలిఫికేషన్ ఏది, ఈయనకు డబుల్ క్వాలిఫైడ్. ఓ.. రాస్తరు గద మీరు. పోయిన కోర్టుకు పోతె కోర్టు స్టే ఇచ్చింది.

అయ్యేవరకు ఏమైందంటె, గవర్నమెంట్ ప్రిస్టేజ్ ఇష్యూ అయింది. రాయమన్నరు. నువ్వు విత్ డ్రా జేసుకో అంటె, నా నిర్ణయం గాదు అసోసియేషన్‌దె అన్న. అసోసియేషన్ మనం ఫైట్ జేయాల్సిందె, లొంగిపోతె మన అసోసియేషన్‌ను బతకనీయరు వాల్లు. అంటె ఏమన్నగాని ఫైట్ జేద్దాం అనుకొని, జేస్తె ఇగ గవర్నమెంట్ బెదిరింది. ఏం జేసిం దంటె సిటీ కాలేజ్‌లో వర్క్ లేకపోయినా ఎకనామిక్స్ పోస్ట్ క్రియేట్ జేసి, ప్రిన్సిపల్‌తో రాయించుకొచ్చి, నన్ను అందులో వేస్తామని జెప్పి ఎందుకంటె అతనికి సిటీ కాలేజ్‌ల వేసె క్వాలిఫికేషన్ లేదు, నాకు రెండు కాలేజ్‌ల పనిజేసిన క్వాలిఫికేషన్ వుంది. అవన్ని కోర్టు ముందుకు ఒక అఫిడవిట్ వేసి గవర్నమెంట్ తరపున వాదన. జడ్జి ఆవుల సాంబ శివరావు, గవర్నమెంట్ లాయర్ శివశంకర్, డిఫెండెంట్ పి.వి. నరసింహారావు, కంప్లైనర్ జయశంకర్.

అయితె అప్పుడు ఆయన స్టే వెకెట్ జేసుకొంటూ.. ఒక బెటర్ క్వాలిఫైడ్ మనిషిని మీరు ఇట్ల ఇబ్బంది పాలు జేసింట్రు అన్నడు. స్టే వెకేట్ సబ్జెక్ట్ ఏందంటె జయశంకర్‌ను ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ జేయొద్దు. ఎంతకాలం అన్లే. అప్పుడొచ్చిన జడ్జిమెంట్ అది. గవర్న మెంట్ అండర్ టేకింగ్ ఇచ్చింది. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తరపున రాంచంద్రన్‌గారని ఆంధ్ర అతను చాల గొప్ప మనిషి వుండేది. సింబాలిక్ ఆఫీసర్స్ వాల్లకు లిమిటేషన్స్ వుంటయి గద. అట్ల నేను సిటీ కాలేజ్‌కొచ్చిన.

సిటీ కాలేజ్‌ల పనిజేస్తున్న రోజుల్లో చాలా మంది స్టూడెంట్స్ అండ్ల ఇంద్రారెడ్డి గూడ స్టూడెంటె నాకు. అప్పుడేం జరిగింది ఆ రోజుల్లో ఉస్మానియా యూనివర్శిటీకి పాలక వర్గాలు సెనేట్, అకడమిక్ అని. సెనేట్‌కు ఆ రోజుల్లో ఎన్నికలుండెవి. గ్రాడ్యుయేట్ కాన్ స్ట్యూయెన్సీ ఎన్నికలుండెవి. మొత్తం కాలేజ్ టీచర్స్ గ్రాడ్యుయేట్స్ మొత్తం తరపున మీరు కన్‌టెస్ట్ జేయండి, మాకు యూనివర్శిటీల గూడ అఫ్లియేటెడ్ టీచర్స్ న్యాయం గావడం లేదు అంటె, అప్పుడు అఫ్లియేటెడ్ కాలేజ్ టీచర్స్‌లో ఇన్‌ఫీరియర్ ఫీలింగ్ వుండె. మీరు ఫైటప్ జేయాల్నంటె కంటెస్ట్ జేస్తె టాప్‌లో గెలిపించింట్రు. అప్పుడు మొదట్లో నరోత్తమరెడ్డిగారని విసిగ వుండె, తర్వాత జస్టిస్ జగన్మోహనరెడ్డిగారు విసి. నేను, నాతోపాటు ఇంకో ఫ్రెండ్ ఆనందరావు తోట ఈ ఇంటి యజమాని లేడాయన, వోకల్‌గ చాలా ఇష్యూస్ మీద పనిచేసినం. వైస్ చాన్సలర్ బాగ లైక్ జేసేది, పైకి ఏమున్న లైక్ జేసేది ఈ పిలగాడు చాల (పిలగాన్నె గద) హుషారు. మేం పెద్ద పెద్దోల్లను గూడ స్పేర్ జేసేటోల్లం గాదు. దుయ్యబట్టేది. ఈ పిలగాడు బాగున్నడు అనేది ఆయనకి ఇంప్రెషన్ కలిగింది.

# సికెయం కాలేజ్ ప్రిన్సిపల్‌గ ఎక్కువ తృప్తి

అప్పుడు ఏం జరిగింది. వరంగల్‌లో సికెఎం కాలేజ్ అని ఒక కాలేజ్ వుండె. అప్పుడు చాల పెద్ద పేరున్న కాలేజ్. చందా కాంతయ్య మెమోరియల్ కాలేజ్. గవర్నమెంట్ ఎయి డెడ్ కాలేజ్. అందులో ఇరు వర్గాలుండెవి. ఎక్స్‌ట్రీమ్ లెఫ్ట్ వరవరరావు, ఎక్స్‌ట్రీమ్ రైట్ విశ్వనాథం. కాకపోతె ఒక కురుక్షేత్రంగ వుండె, కురుక్షేత్రమె. ఇగ వెంగళరావు అప్పుడు సిఎం అయ్యిండు. కాలేజ్ మూసేయాల్నా, గవర్నమెంట్‌కు హ్యాండోవర్ జేయాల్నా, వర వరరావును జైల్లో బెట్టిండ్రు అవన్ని జరిగినయ్ తర్వాత. ఇది మేనేజ్ జేయాల్నంటె ఎవ రన్నా బయటి వాల్లే రావాలె. వరవరరావు లెక్చరర్ అక్కడ, సీనియర్ లెక్చరర్, నెక్స్ట్ టు ది ప్రిన్సిపల్. ఆయనే ప్రిన్సిపల్ గావాలె న్యాయంగ.

అయితె అప్పుడు ఏం జరిగిందంటె గవర్నమెంట్ వాల్లు ఆలోచన్లు మొదలుపెట్టిండ్రు ఎవర్ని పంపాలె అని. అప్పుడు అవన్ని ఉస్మానియా కింద వుండె గద. కాకతీయ రాలె అప్పటికి. వైస్ ఛాన్సలర్‌ని అడిగితె జగన్మోహనరెడ్డిగారు ఈ పిలవాడైతె మంచిగుంటది అని జెప్పిండు. గవర్నమెంట్ అడిగితె అప్పుడు ఎడ్యుకేషన్ మినిస్టర్ ప్రతాపరెడ్డిగారుండిరి, డైరెక్టర్ రామచంద్రారెడ్డిగారుండె. అందరు ఏకగ్రీవంగ నా పేరు జెప్పిండ్రు. చెప్తె నన్ను పెద్ద మేనేజింగ్ కమిటీకి కలెక్టర్ చైర్మన్ అప్పుడు. ఇప్పటికి గూడ. వాల్లు ఆయనకి చెప్తె వాల్లు నన్ను బిలిపిచ్చుకొని మాట్లాడితె చెప్పిన వస్తగాని, నాకు ఫ్రీడం గావాలె, నేను నిష్పక్షపాతంగ పనిజేస్త. నిజాయితీగ పనిజేస్త, చేతగాని రోజు మీరు జెప్పకముందె వెల్లిపోత నేను, చెప్పాలె గద, చెప్పిన.

సరె వాల్లు నన్ను అపాయింట్ జేసిండ్రు. అపాయింట్ జేసిన తర్వాత గవర్నమెంట్ నుంచి నన్ను డిప్యుటేషన్ కింద పంపాలె. వెంగళరావు దగ్గరికి అప్పుడు స్థానికంగ ఇంకొ కాయన ప్రిన్సిపల్ గావాల్నని కోరుకుంటుండె. ఇక అండ్ల నా మీద కొంత మంది ఎమ్మె ల్యేలతో కంప్లైంట్ ఇప్పించిండు. ఈయనకు నక్సలైట్లతో సంబంధాలున్నయ్. ఈయనొస్తె ఈ కాలేజ్ ఇట్ల అయితది, అట్ల అయితది అంటె వెంగళరావుకు నక్సలైట్ అంటె ఆయ నకు పెనుభూతమె గద. ఆయన డౌట్ దిన్నడు. మల్ల వీల్లను అడిగిండు ఏంది ఈయన ఇట్ల అట అంటె, చూడండి ఆయన గవర్నమెంట్‌లో వున్నడు, ఆ సంబంధాలుంటె గవర్నమెంట్‌లో సపోర్టు చేస్తమా మేం. ఆయనొక పద్ధతిలో పనిజేస్తడు. చివరికి నన్ను పంపించిండ్రు. నేను పోయి జాయిన్ అయిన. కాలేజ్ మొత్తం గ్రాంట్ బంద్ అయి డిసి

ప్లెన్ లేక కొంత మంది టీచర్స్.. అప్పటికి ఎమెర్జన్సీ వచ్చింది. వరవరరావు జైల్లో వుండె, ఈ ఆర్ఎస్‌యు వాల్లను జైల్లో పెట్టె స్టేజ్‌లో వుండె. జీతభత్యాలు లేవు. కొంత మంది అప్పుడే రిక్రూట్ అయిన లెక్చరర్స్‌కు మల్లి టర్మినేషన్ జేయాలని, పైసల్లేవ్ తీసేయాలని, ఐదారుగురు పేర్లుండె. వాల్లను తీసేయాలని. ఈ పేర్లకు గూడ కారణముంది తీసేయాలని జెప్పడానికి. ఆ పరిస్థితిలో నేను బోయిన. గవర్నమెంట్ నాకు ఫుల్ సపోర్టు, గవర్నమెంట్ నేను పోంగనె ఫస్ట్ వాల్లు గ్రాంట్స్ రిలీజ్ జేసింగ్రు. వాల్లు ఏమీ ఎక్కువ ఇవ్వలె, ఇవ్వవలసింది ఇచ్చింగ్రు. అంతకు ముందు ఇవ్వవలసింది గూడ ఇవ్వలె. నేను బోయినంక ఇవ్వవలసింది ఇచ్చింగ్రు. కనుక చూసేటోల్లకి జయశంకర్ వచ్చినంక గ్రాంట్స్ వచ్చినయ్ అన్న పేరు వచ్చింది. అయింది జస్ట్ టూ మన్త్స్‌లో, కాలేజ్ మొత్తం కంట్రోల్‌లోకి వచ్చేసింది. ఇగ ఎందుకంటె నేను ఇరవైనాలుగ్గంటలు అదే పనిమీద వుండె. ఎవ్వరు తప్పుజేసినా నిష్పక్షపాతంగ మందలించేది, ఎవ్వరు మంచి చేసినా అప్రిషియేట్ చేసేది.

టీచర్స్, స్టూడెంట్స్ మొత్తం గొడవలతో గతంలో పెద్ద అల్లకల్లోలంగ వున్న కాలేజ్ డిసిప్లెన్డ్‌గ మొదలైంది. అండ్ల జేసిన గొప్పతనం ఏమీ లేదు, చేసే పద్ధతి సరిగ్గ పెట్టుకొన్న గంతె. భయపడలె, ఎవరికి లొంగలె. కొట్టుకొనుడె, కొట్టుకునుడు తన్నుకొనుడె గద ఆ రోజుల్లో. నా లైఫ్‌ను మార్చిందె.. ఆ కాలేజ్. నాకు వైస్ ఛాన్సలర్‌గ తృప్తి కంటె సికెయం కాలేజ్ ప్రిన్సిపల్‌గ ఎక్కువ తృప్తి. ఎందుకంటే అంతకుముందు ప్రిన్సిపల్‌గ పనిజేసిన్న ఎక్కడన్న. లెక్చరర్‌గ వుంటి. ఇగో ఈ జూనియర్ ఎక్కడ్నించో వచ్చిండు, మా నెత్తిన కూసున్నడు అని వుండె, చాల వుండె. నేనేం అడగలేదు, పంపింగ్రు, వద్దంటె పోత.

ఐతె జయశంకర్‌కి నక్సలైట్లకు సంబంధాలున్నయని ప్రచారం పుట్టించింగ్రు గద. దాంతోని ఆ పిల్లల్లోపల టెస్ట్ జేసే ప్రయత్నం జేస్తరు గద. కని నేను చిక్కలె ఎక్కడ. రైటిస్ట్ పిలవాల్లు గూడ ఈయన అటా ఇటా అంటె వాల్లకు చిక్కలె. ఎందుకు చిక్కలె అంటె ఏదైన సమస్యలు వుంటె మాట్లాడెది. చేయగలిగినయ్ చేస్త, చేయలేనియ్ కాదు అని చెప్త. కాదు అన్నవాటిమీద మీరు పట్టుబడితె నేనేం జేయలేను, మీరేం జేయ లేరు. కాలేజ్ నడవాల్నా, వద్దా? కాలేజ్ మూతబడేస్తం అంటున్నరు. జీతాలు బంద్ అయిపోయనయ్, టీచర్ల ఉద్యోగాలు పోతున్నయ్, మీకు సదువుల్లేవు, అని పిల్లవాల్లతోని డైరెక్టు పెట్టుకొనేది. మధ్యవర్తులు, ఈ కొంతమంది టీచర్స్‌ని బెడితె వీల్లా నువ్వు లెఫ్టా, రైటా అంటూ మాట్లాడితె ఇవన్ని రంగులొస్తయ్. నేను డైరెక్ట్ పెట్టుకొనేది. దాంతోని

పిల్లల్లో నాక్కొంచెం పాపులారిటీ పెరిగింది. ఈ సార్ ఏదైన డైరెక్ట్ మాట్లాడతడు, ఖచ్చితంగ చెప్తడు, అయ్యింది అయితది, కానిది కాదని, తిట్టిన బడేది. అయిన తర్వాత ఎమర్జెన్సీ లిఫ్ట్ అయ్యింది. లిఫ్ట్ కాంగనె వీల్లందర్ని రిలీజ్ జేసింగ్రు. వరవరరావుకు నాకు చాల పాత ఫ్రెండ్‌షిప్ వుండె గద. ఐడియలాజికల్‌గ నాకు ఆయనకు చాలా వ్యత్యాసాలుండొచ్చు, కని మేం ఒకర్ని ఒకరు బాగ రెస్పెక్ట్ ఇస్తం, ఇద్దరం స్ట్రెయిట్‌గ వుంటం గనక. అంతకు ముందు వరవరరావు రిలీజ్ అయితె ప్రిన్సిపల్ దాక్కొనేది, పిలవాల్లు ఇగ రకరకాలు (నవ్వు) వుండె. ఆయన సీనియర్ మోస్ట్ లెక్చరర్. ప్రిన్సిపల్ తర్వాత ఆయనె. రిలీజ్ అయి వచ్చిండు. ఆయన్ని చాల మర్యాదతో వెల్‌కమ్ జేసిన, కూచోబెట్టిన, టీ తాగించిన. అందరు గుసగుసలు. ఏంది ఈ సార్, ఏంది ఏదో నేను పెద్ద చేయగూడని పనిజేసినట్టు. నాకు తెలుసు అవన్ని. వరవరరావు.. ఆయన సార్! మీరు నాకు చాల న్యాయం జేస్తరని నమ్మకం వుంది, మీ టైం మీరు తీసుకోండి. నాకు మీరు న్యాయం జేస్తరని నమ్మకం వుందిగాని అని ఎక్కువ తక్కువ ఏం జెప్పలె. అప్పటికి ఆయన తల్లి ఆరోగ్యం బాగలె, ఊరికి పోతున్న, మల్లి వస్తర అంటె రమ్మన్నప్పుడు వస్త అన్నడు. ఎల్లిపోయిండు.

వార్త..వరవరరావు రిలీజ్ అయ్యిండు, కాలేజ్‌కి వచ్చిండు, ప్రిన్సిపల్‌తో మాట్లాడిండు, ఏకాంతంగ మాట్లాడుకున్నరు, ఏ కతలో కతలు. అయిపోయిన తర్వాత అప్పుడు కలెక్టర్ సమర్‌జిత్‌రె అని వుండె. ఇక్కడ సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగ చాల గొప్ప మనిషుండె ఆయన. అయిన తర్వాత సమర్‌జిత్‌రెని అడిగిన.. దేశమంత రిలీజ్ అయ్యింగ్రు, అందరు ఉద్యమాలు బజార్ల డిమాండ్లు, రీయిన్‌స్టేట్ చెయ్యాలని. వాల్లను ఏం చేద్దాం సార్ అంటె నేను అన్న ఒక ప్రిన్సిపుల్ ఎప్పటికైన వీల్లను దీసుకపోక తప్పదు. అడిగించుకొని, కొట్లాడి, రెసిస్ట్ చేసి ఇచ్చినదానికంటె ఇమీడియెట్‌గ ఇచ్చేస్తె, చాల డిగ్నిఫైడ్‌గ వుంటది, గుడ్‌విల్ వుంటది, కోఆపరేషన్ వుంటది. ఐ అగ్రీ విత్ యు బట్ హౌ డు యు డు. ముఖ్యమంత్రి క్లియరెన్స్ లేంది కాదది. అప్పుడు ఆయన జెప్పిండు (కలెక్టర్)నాతోని ముఖ్యమంత్రికి నీపై చాల లైకింగ్ ఏర్పడ్డది. ఆయన అనుమతి లేకుండ కాదు, మీరు బోయి చెప్పండి స్ట్రెయిట్‌గ. తర్వాత చూద్దాం అన్నడు.

నేను చక్కగ హైదరాబాద్‌కొచ్చి ఆ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను, సెక్రటరీని మల్ల కలిస్తె వాల్లకు దెలుసు ముఖ్యమంత్రికి నామీద మంచి అభిప్రాయం, కాలేజ్ గూడ మంచిగ నడుస్తున్నది. రెండు గ్రాంట్లు గూడ వుదారంగ ఇచ్చింగ్రు పాపం ఏ కిరికిరిలేకుండ. ఇవ్వవలసిందె గాని కిరికిరి లేకుండ సతాయించకుండ. కని ఇవాల రేపు ఎన్ని పైరవీలు,

ఎన్ని లంచాలు, ఫోన్లు చెస్తె వచ్చేవి. దాని వల్ల ఏందంటె కాలేజ్ మంచిగ స్టెబిలైజ్ అయిపోయింది. ఈ యుజిసి గ్రాంట్లు వచ్చినయ్. డెవలప్‌మెంట్, బిల్డింగ్స్, లైబ్రరీ, పిల్లవాల్లకు బుక్‌బ్యాంక్‌లు అవన్ని ఫెసిలిటీస్ బాగ పెరిగినయ్. ముఖ్యమంత్రితో అపాయింట్‌మెంట్‌తో కలవాలె, అక్కడ్నించె స్టార్ట్ గావాలె. ముఖ్యమంత్రి సెక్రటరీ ఒగాయన వుండె రావు సాహెబ్ అని. ఆయన దగ్గరబోతె ఒన్ డే లో అపాయింట్‌మెంట్ ఇప్పించిండు. వెంగళరావు దగ్గర అపాయింట్‌మెంట్ అంటె పెద్ద ఇది. వెంగళరావుకు నామీద మంచి అభిప్రాయం లేకుంటె దొరికేది కాదది. ఒన్ డేల అపాయింట్‌మెంట్ ఇప్పించిండు. పోయిన.

ఆ.. ఇట్లా వచ్చారండి ప్రిన్సిపల్‌గారు! సంతోషం మీరు కాలేజ్ బాగ నడుపుతున్నారు. థాంక్యూ సార్ నా డ్యూటీ నేను జేస్తున్న అంటె లేదు సార్ అన్న, ఇటొచ్చావ్ అంటె మీకు దెలుసుగద సార్ ఎమెర్జన్సీ వాల్లు అందరు రిలీజ్ అయ్యింన్రు గద, వరవరరావుగూడ రిలీజ్ అయ్యిండు గద, అంటె తెలుసు అన్నడు. సార్ ఇప్పుడు మొత్తం దేశంలో మొత్తం రాష్ట్రంలో డిటెన్యూస్‌గ వున్నటువంటి ఎంప్లాయిస్ అందరు రీయిన్‌స్టేట్ అడుగుతున్నరు గద. వీల్లు గూడ అడుగతరు, మొదలైతది. ఆ.. ఆల్‌రెడీ మొదలైంది అన్నడు. ఏం జేయమంటరు సార్! మరి అంటె మీ అభిప్రాయం ఏంది అన్నడు. ఎంత డిఫికల్ట్ క్వశ్చన్ అది. అటువంటి సమయాల్లో నేను స్ట్రెయిట్‌గ జెప్పేస్త, గుసగుసలు, ముసముసలుండవ్. ఎందుకంటె పోయిన పని సీరియస్ పని. అయినా కాకున్నా స్ట్రెయిట్‌గ జెప్పాలె. అయితె సంతోషం. కాకుంటె ఇవన్ని నడవవంటె గుడ్ బై అంతె గద. అందుకె ఈ పదవి వుంటదా, పోతదా అన్న ఆలోచన ఎన్నడు రాలె నాకు, భయం ఎన్నడు లేకుండె. యు ఆర్ రైట్ అన్నడు. మంచిదండి అన్నడు! అంటె పొమ్మన్నట్టె గద.

ఇది ఎవరికి జెప్పాలె, ఎవరు జేయాలె, ఎవరు నమ్మాలె. సిస్టమ్‌లో నాకొక వెసులుబాటు లేకపోతె ఎవరు నమ్ముతరయ్య ఇది. వెంగళరావు లాంటివాడు వరవరరావుని రీయిన్‌స్టేట్ చేస్తే మంచిది అని అంటడా? నేను చెప్తె నమ్ముతరా? రాళ్లు బడతయ్ మీద. అయితె నేను సక్కగ మల్ల మా ఆఫీసర్ దగ్గరికొచ్చిన. ఇట్ల చెప్పిండు సార్ అని. డైరెక్టరేట్‌లో సుబ్బరాజుగారని ఒక జాయింట్ డైరెక్టరుండె. ఆంధ్రా అతనే నేనంటె బాగ సపోర్టు జేసేది. ఈ అడ్మినిస్ట్రేటివ్ విషయాలు బాగ ఆరితేరిన మనిషి. జయశంకర్ ఇష్యూ సింపుల్ అయిద్ది. ముఖ్యమంత్రి నీతో అన్నారు, మాకు దాపరికాలుండవ్. నేను జెప్తె వాల్లు నమ్మేది. ఈ రోజుల తీరుగ కాదుగద. వాల్లందరు కాలేజ్ మంచిగ నడుపుతున్న అనె దాంతో ఒక ట్రబుల్ వున్న కాలేజ్‌లో మనకు శాంతి వచ్చింది. డెవలప్ అవుతున్నది.

ఆయన ఏమన్నడంటె వరవరరావును సస్పెండ్ జేసింది మేనేజ్‌మెంట్. వెంగళరావుకు కోపం వుండె, నోటిమాటలతో జెప్పిన గాని సస్పెండ్ జేసింది మేనేజ్‌మెంటే గద. కని రీయిన్‌స్టేట్ మేనేజ్‌మెంట్ జేయాలె, గవర్నమెంట్ చేయదుగద. మేనేజింగ్ చైర్మన్ కమిటీ కలెక్టర్, ఆయన గూడ మంచి మనిషి. గవర్నింగ్ బాడీ మీటింగ్ బెట్టించు. ప్రిన్సిపలే సెక్రటరీ దానికి. ఇప్పటికి గూడ కలెక్టర్ చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ. ఆ కాలేజ్‌కున్న మంచి వెసులుబాటు అది. మేనేజ్‌మెంట్ డెసిషన్ తీసుకోండి. రీయిన్‌స్టేట్ జేయండి. ఊరికె మాకు ఇన్‌ఫర్‌మేషన్ ఇవ్వండి. దాంట్లో నువ్వు కన్‌ఫర్‌మేషన్ రాస్తె రాదది. అన్లే గాని పరిభాష  టెక్నికల్‌గ అదే. మాకు ఇన్‌ఫర్‌మేషన్ ఇవ్వండి తర్వాత జూసుకుందం అన్నడు.

సక్కగ కలెక్టర్ దగ్గరికి బోయిన జరిగింది జెప్పిన. చెప్పి మరి మేనేజింగ్ కమిటీ మీటింగ్ మీరు డేటివ్వండి కన్వీనియెంట్‌గ అంటె, మీటింగ్ ఎందుకు అన్నడాయన. మరి ఏం జేద్దాం అంటె సర్క్యులర్ రిజల్యూషన్ నేను ఫస్ట్ సంతకం బెడత చైర్మన్‌గ. గవర్నమెంట్ రిప్రజెంటేటివ్స్, యూనివర్శిటీ రిప్రజెంటేటివ్స్, వాల్లందరు నీకు పరిచయమె మేనేజింగ్ కమిటీ మొత్తం సభ్యులు వరవరరావును బాగ వ్యతిరేకించే వాల్లు గూడ నువ్వంటె లైక్ జేస్తరు. ప్రతి వాల్ల దగ్గరికి పర్సనల్‌గ బో, చెప్పు, ఎంతమంది సంతకాలు బెడతరో జూద్దాం. మెజారిటీ సభ్యులతో ఈ మీటింగ్‌బెట్టుడు, ఈ డిస్‌కషన్ ఈ లొల్లి ఎందుకు? ఆయనె రిజల్యూషన్ పాస్ జేసి, ఆయనె ఫస్ట్ సంతకం బెట్టి కాయితం నాకిచ్చిండు.

ఇగ అది బెట్టుకొని నేను మొట్టమొదటిసారి బోయింది ఎవరి దగ్గరికి అంటె వరవరరావు అంటె బాగ వ్యతిరేకించె వాల్ల దగ్గరికి బోయిన. జి.ఎస్ మాధవరావు, టి.ఎస్ మూర్తి. జి.ఎస్ మాధవరావు అని చార్టెడ్ ఎకౌంటెంట్ వుండెది ఇప్పటికి గూడ వున్నడు. టి.ఎస్ మూర్తి అని ఇప్పటికి లేడనుకో. ఆ కాలం చాల ప్రముఖ వ్యక్తి గద. నేను మొట్టమొదల జి.ఎస్ మాధవరావు దగ్గరికి బోయిన. నేను ఇవన్ని ఏం జెప్పలె వెంగళరావుతో మాట్లాడిన ఇవన్ని ఏం జెప్పలేదు. ఇగో పరిస్థితి దేశంలో ఇట్ల వున్నది, వాల్లను బజార్లో బడేసి, వాల్లతోని అడిగిచ్చుకొని, ఇచ్చేస్తె మనకు ఇచ్చిన క్రెడిట్ దక్కదు. కలెక్టర్ సంతకం బెట్టిండు. కలెక్టర్ అంటె భయం గద వాల్లకు. లోకల్‌గ బిజినెస్ కమ్యూనిటీ. కాబట్టి కలెక్టర్ ఆయన అడ్వైజ్ ప్రకారం జేస్తున్న అన్న. గవర్నమెంట్ ఒప్పుకుంటదా? అంటె కలెక్టర్ జూసుకుంటడు. ఇపుడు మనమేంది కలెక్టర్ జూసుకుంటడు. అసలు సంగతి ఏం జెప్పలె వాల్లు. కలెక్టర్ జూసుకుంటడు అంటె లేదండి ఆయన మిమ్మల్ని

పనిజేయనీయడు. కాలేజ్ నడవనీయడు, అంటె చూడండి! నేను ఇక్కడికి శాశ్వతంగ వుండడానికి రాలేదు. నేను డిప్యుటేషన్‌లో వచ్చిన. రెండేండ్లో, మూడేండ్లో నడిస్తె పనిజేయిస్త లేకపోతె వెల్లిపోత. వరవరరావు కాలేజ్‌ల పనిజేయనీయడు అంటె ఆయన ఇవాల కాకపోతె రేపైన గాని వస్తడు. నన్ను పనిజేయనీయకపోతె నేను వెల్లిపోత. మల్ల మొదటికె వస్తది కత. మల్ల మీదె రాజ్యం గద. కని నేనున్నంత వరకు మాత్రం ఆయన నాకు కో ఆపరేట్ జేస్తడనేటువంటి విశ్వాసం నాకున్నది. కనుక మనం ఒక ఛాన్స్ ఇవ్వాలె. దాని మీద ఒక గంటసేపు ఆర్గ్యుమెంట్ చేసి పెట్టిండు. అక్కడ్నించి టి.ఎస్ మూర్తి దగ్గరికి బోయిన. నేను ప్రిన్సిపల్, కాలేజీ సెక్రెటరీగ కొట్లాడిన తర్వాత వాల్లను దీసుకుంటె నా ఫంక్షనింగ్ ఎట్ల వుంటదయ్య. ఇది కామన్‌సెన్స్ గద. ఇపుడు కాలేజ్ యొక్క ఫంక్షనింగ్ లోపల నాకేదైతే గ్రిప్ వచ్చిందో అది పోతది గద.

ఇంకో విషయం మర్చిపోయిన.. ఎమర్జెన్సీ వున్నప్పుడు రైటిస్ట్ వాల్ల సెషన్ అడ్డం వచ్చింన్రు. మొదట్లొ లెఫ్టిస్ట్ వాల్లను అరెస్ట్ చేసింన్రు. ఇది అప్పటికి రాడికల్ గ్రూప్ కద. తర్వాత దానికి అపోజిట్ రాడికల్ గ్రూప్, అపోజిట్ ఆర్ఎస్ఎస్ బిజెపి వర్గాలుండె. వాల్లను అరెస్ట్ జేస్తమని వచ్చింన్రు. నేను కలెక్టర్‌తో చెప్పిన. నేనున్నంత కాలం కొత్త అరెస్ట్‌లు కావొద్దు అంటె గవర్నమెంట్‌కి జెప్పేసి కొత్త ప్రిన్సిపల్ వచ్చిండు. ఆయన ప్రిపేర్ ఎట్ల అవుతున్నడు. వద్దంటె ఆపింది గవర్నమెంట్. నేను జెప్పిన ఇపుడు వాల్లున్నరు, వీల్లున్నరు. ఆర్ఎస్ఎస్ వాల్లను అరెస్ట్ జేస్తమంటె నేను వద్దని జెప్పిన. మేనేజ్‌మెంట్‌కి జెప్పిన నేను. వాల్లంత ఆర్ఎస్ఎస్ లీనింగ్‌లో వున్నరు. ఓ చాల హ్యాపీ.

చాల మంచోడు, మన సార్ మంచోడు అని అన్నరు. ఆ రోజు ఆర్ఎస్ఎస్ వాల్లను అరెస్ట్ చేయొద్దని ఎట్ల చెప్పిన్నో, అరెస్ట్ చేస్తె వాల్లు జైలుకు బోయెటోల్లు, వాల్లకి గిదె పరిస్థితి వచ్చేది గద. మరి అదె యార్డ్‌స్టిక్స్ (గజబద్ద)తో మనం ఇతరులను గూడ ట్రీట్ జేయాలె గద. జేయకపోతె నిష్పక్షపాతంగ వున్నమనేడిది ఎట్ల వస్తది మనకు. టి.ఎస్ మూర్తి లేదండి!..మా ఇంట్రెస్ట్ అంతా మీరుండాలె, మీరు మంచిగ పనిజేయాలె, మీకు అడ్డంకులుండొద్దు అంటె, నాకు అడ్డంకులు వుండొద్దు అంటె మరి నా అభిప్రాయాన్ని గూడ మీరు గౌరవించాలె గద. అభిప్రాయం రుద్దడం లేదు. ఉన్న పరిస్థితి ఇది. నేను ఎల్లి పోత ఏమైతది, మల్ల గదె పాతకొస్తది కత. ఏదో పనిజేసిన తృప్తి నాకున్నది, చేస్తున్నన్న సంతోషం మీకున్నది. గవర్నమెంట్‌కు మంచిపేరు. యుజిసి గ్రాంట్సు మంచిగ ఇస్తున్నది. కనుక ఆ టీచర్స్‌లో లెఫ్ట్ వున్నరు, రైట్ వున్నరు, కాంగ్రెసోల్లున్నరు అందరున్నరు ఇగ

మీ ఇష్టమండి అని చెప్పిన. ఇగ తర్వాత సిటీలో వున్న షావుకార్లు, అందరు ఏకగ్రీవంగ సంతకం బెట్టిండ్రు, నేనంటె చాల అభిమానించె వాల్లు. వరవరరావు అంటె 90% వాల్లకు వ్యతిరేకతె. ఒక టెన్ పర్సెంట్ అభిమానించే వాల్లు. షావుకార్లు గూడ లైక్ జేసేవాల్లు. అయిన తర్వాత అపుడు స్టాప్ రిప్రజెంటేటివ్ ఎవరండి అంటె, ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ అని వినే వుంటవ్ నువ్వు! ఆయన ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అయ్యిండు. నేషనల్ ఇందిరాగాంధీ యూనిర్శిటీకి వైస్ ఛాన్సలర్ అయ్యిండు. యుజిసిలో పెద్ద పదవి. అక్కడ స్టాఫ్ రిప్రజెంటేటివ్ ఆయనే. నేను.. ఈ లోపల జరిగింది ఎవ్వడికి జెప్పలె. వరవరరావు నన్ను కలిసి పోయిన తర్వాత ఇదంత జరిగింది, వన్ వీక్‌లో మొత్తం నేను హైదరాబాద్ రావడం, ఎవ్వరికి జెప్పలె నేను. తర్వాత జెప్పిన ఒక్క వి.ఎస్. ప్రసాద్‌కి తర్వాత జెప్పిన.

ఎందుకంటె లీక్ అయితయ్ గద. లీక్ అయ్యిందంటె సిఎంను బజారుకి లాగినవాల్లం అయితమ్. నా వుద్దేశం ఏంది? ఆయన్ను నేను అఫెండ్ జేసిన గాని మల్ల ఇబ్బంది అవుతుంది ఒక దగ్గర. అయిన తర్వాత ఏం జేసిన అంటె, ఒక స్టెనోని బిలిపిచ్చి వరవర రావు గారు రీయిన్‌స్టేట్ ఆర్డర్స్ ఇచ్చేసి, ఆ పిరియడ్‌కు సాలరీ గూడ సస్పెండెడ్ పిరియడ్‌ను డ్యూటీ పిరియడ్‌గ ట్రీట్ జేస్తూ, సాలరీ గూడ ఆర్డర్ టైప్ జేసి, ఇది టైప్ జేసిన వాల్లకు తప్పితె ఇంకొల్లకు దెలవదు. వరవరరావు వాల్ల తల్లిని జూసి మల్లొచ్చిండు. వచ్చినపుడు వట్టిగనె వచ్చిన సార్! మిమ్ముల్ని కలిసిపోదామని వచ్చిన అంటుంటె ఆర్డర్స్ చేతికిచ్చిన. చేసి స్టాఫ్ మీటింగ్ బెట్టిన. కొలీగ్ వచ్చిండు, ఐ వెల్‌కమ్ హిమ్. హి యిజ్ రీయిన్‌స్టేటెడ్. హి యిజ్ సీనియర్ మెంబర్ ఆఫ్ ద స్టాఫ్ వర్క్ టుగెదర్ అని ఇగ అందరికి టీ తాగిచ్చి, అంతకు ముందు వాల్లొస్తె.. పారిపోయేది మొత్తం. నేను మీటింగ్ స్టాఫ్ మీటింగ్ బెట్టిన తర్వాత అందరు.. సార్ ఎట్ల జేసిండిది! ఎవ్వడికి దెలవదు ఇది! ఎట్ల జేసిండిది! మేనేజ్ మెంట్‌కు తెలుసా? వెంగళరావు ఏవంటడో ఇట్ల, నన్నెవరు డైరెక్టు అడగరు. బయట గుసగుసలు, ఆ గుసగుసలు విన్నోల్లు ఎవరో వచ్చి జెప్తరు సార్ గిట్ల అన్నరు, అట్ల అన్నరు, నిజమా, అబద్దమా అన్నుంటయ్ గద. జస్ట్ నవ్వి ఊరుకొనేది. ఏమనేవాన్ని గాదు. సార్‌ది మొండి ధైర్యం అన్నరు.

దానికి తోడు వరవరరావుతో పర్సనల్‌గ మాకు మర్యాదలు గూడ వున్నయ్ గద. అల్‌దీస్ అపార్ట్ ఫ్రమ్ పర్సనల్ లైఫ్‌లో ఫ్రెండ్స్‌మి మేమిద్దరం. ఏం జెప్పలె. తర్వాత రెండు రోజుల తర్వాత నేను హైదరాబాద్‌కు రావాల్సి వచ్చింది. వస్తె ఇన్‌ఛార్జిని ఎవర్ని

జేయాలె, సీనియర్ మోస్ట్ మ్యాన్నే జెయాలె. నేను వరవరరావునె ఇన్‌ఛార్జ్ జేసిన. ఆశ్చర్యం.. ఏందంటె స్టాఫ్‌లో ఎవరైతె ఆర్ఎస్ఎస్ వాల్లని ఆరెస్ట్ గాకుండ ఆపిన్నో, వాల్లకు గూడ కోపమె. వాల్లను గూడ కాపాడితిని సరే, వాల్లకు జ్ఞాపకం వున్న లేకున్న. కొంత మంది కలెక్టర్ దగ్గరికి పోయి కంప్లైంట్. ఏంది సార్! ఇట్ల ఆయన్ని రీయిన్‌స్టేట్ జేసింఁడ్రు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జేసింఁడ్రు ఎట్ల అంటె, కలెక్టర్.. అది నా నిర్ణయం అన్న డాయన, ఫినిష్. ఇగ నడిచింది, నడిచింది, నడుస్తున్న కాలంలో అయితె కాలం గడుస్త బోయింది. పోస్ట్ ఎమెర్జెన్సీలో ఎవరి యాక్టివిటీ లో వాల్లు పడ్డరు గద. లెఫ్ట్ యాక్టి విటీ లెఫ్ట్‌కుంది, రైట్ యాక్టివిటీ రైటుకుంది. కాలేజిల ఇద్దరుండిరి నా దగ్గర. వీల్ల యాక్టివిటీ వీల్లు జేసేది, వాల్ల యాక్టివిటీ వాల్లు జేసేది.

అప్పుడు హయగ్రీవాచారి మినిస్టర్. ఆయనకు జీర్ణం గాలె ఇది. అది నన్ను అడక్కుండ జేసింఁడ్రా, ఎవరు జేసింఁడ్రు అంటె కలెక్టర్.. ఆయన చెప్పిండు హైఎస్ట్ లెవల్లో అప్రూవల్ తీసుకోటం జరిగింది అని. హైఎస్ట్ లెవల్ జెప్తెనె ఇవన్ని, ఆయన గూడ డిటెయిల్స్ జెప్పలేదు ఆయనకస్సలు. వారి బద్ధ విరోధిని నేను. హయగ్రీవాచారి, మా ఫాదర్ ఫ్రెండ్స్. కనుక నాకు ఫ్యామిలీ పరిచయాలుండె. ఆయన అందుకని నన్ను అడగలేదు, ఆయనకు జెప్పలేదు. వాల్లకు కోపం ఏంది, ఈ ప్రిన్సిపల్ ఏమనుకుంటాండు. ఈయనేమన్న వైస్‌ఛాన్సలరా? ఇండిపెండెంట్‌గ పోతాండు, కాలేజ్ ఎట్ల నడుస్తది అట్ల ఇట్ల అని. ఏదీ పట్టించుకోలె. ఎందుకంటె నడపగలుగుతె నడుపుత. లేకపోతె పోత అన్నది నా (నవ్వు) అది. మొండి ధైర్యమా, పట్టుదలనా, విశ్వాసమా వాటెవర్ ఇట్ యిజ్. అది నా స్టైల్ ఆఫ్ వర్క్. ఎక్కడ పనిజేసినా అదె జేసేది.

అయినంక వీల్ల యాక్టివిటీ మొదలైన తర్వాత ఒకసారి నన్ను బిలిపిస్తె పోయి మాట్లాడితె, ఆ జయశంకర్! అన్ని బాగనె వున్నయ్ మరి మల్ల వీల్ల కార్యక్రమాలు మొదలుబెట్టింఁడ్రు గదనయ్య. ఇగ వుంటయ్.. వాల్ల కార్యక్రమాలు బయట వుంటయ్ గద. అంటె ఏమున్నది సార్! దేశమంత వున్నట్టె మన దగ్గర వున్నది. అయితె వరవరరావును రీయిన్‌స్టేట్ జేసినంక గవర్నమెంట్‌కు రిపోర్ట్ పంపిన, ఫర్ ఇన్‌ఫర్‌మేషన్ అని. దాన్ని డైరెక్టరేట్ వాల్లు త్రూ ఎడ్యుకేషన్ మినిస్టర్ సిఎంకు పంపింఁడ్రు. ఆయన దాన్ని అప్రూవ్ జేసుకుంటూ ఇటువంటి ఎన్ని కేసెస్ వున్నా, ఇట్లనె డిసైడ్ జెయ్యాలనె ఆర్డర్స్ ఇస్తె ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని వందల మంది ఎంప్లాయిస్ రీయిన్‌స్టేట్ అయ్యింఁడ్రు. ఇది ఒక చిన్న వ్యక్తి జేసినటువంటి సాహసానికి ఒక పరిణామం. కనుక అందరు రీయిన్‌స్టేట్

అప్పటికి అందరు అయిపోయినంక, ఈయన విష్ వున్న లేకున్న హయగ్రీవాచారి పెద్దగ, మల్ల గదె పనిజేస్తాంద్రయ్య ఏం జేస్తావ్, ఎట్ల జేస్తావ్ అట్ల ఇట్ల అంటె, చూద్దాం సార్! దేశమంత వున్న సమస్య మన దగ్గర వున్నది. కాలేజ్‌కి, మనకు సహకరిస్తె చాలు. కాలేజ్‌కి సహకరిస్తున్నరు. పాఠాలు మంచిగ జెప్తున్నరు. మంచి టీచర్స్, రెస్పెక్టెడ్ టీచర్స్. వీల్లు మంచి టీచర్స్, వాల్లు మంచి టీచర్స్. నేను వాల్లతో పనిజేయిస్తున్న గనుకె కాలేజ్ నడుస్తున్నది. నాకు కాలేజ్‌ల ఏం సమస్యలేదు. రెండవసారి లేదయ్య జయశంకర్! నువ్వు వాల్లకు చెప్పాలె, యాక్టివిటీస్ ఆపమని అంటె, అండ్లకు తల దూర్చిన్నంటె పని జేయలేను నేను అన్న. మూడవసారి కొంచెం ఏం ప్రిన్సిపల్‌వయ్య! లెక్చరర్స్‌ను కంట్రోల్ జేయలేకపోతె ఎట్ల అన్నడు. నాతోపాటు లాల్‌బహదూర్ కాలేజ్ ప్రిన్సిపల్ నా వెంట వుండె ఆ రోజు. నేను రియాక్ట్ అయిన. ఇగ మొండిగ రియాక్ట్ అయిన.

ఆయన్ని అయ్యగారు అనేది, అందరు అయ్యగారు అని బిలిచేది. అయ్యగారు! నా కాలేజ్‌ల పనిజేసె టీచర్లలో నిక్కర్లు ఏసుకొని రోడ్ల మీద డ్రిల్ జేసెటోల్లు వున్నరు, తుపాకులు బట్టుకొని అడవుల్లోకి బోయెటోల్లు వున్నరు, క్లబ్బులకి బోయి జూదాలాడే టోల్లున్నరు, వ్యభిచార గృహాలకు బోయేవాల్లుగూడ వున్నరు. అవన్ని కాలేజ్ బయట మాట. కాలేజ్‌లోపల ఏం జరిగినా కంట్రోల్ జేసె బాధ్యత నాది. బయట ఏం జరిగినా కంట్రోల్ జేసె బాధ్యత మీది, నాది గాదు అన్న. గవర్నమెంట్‌ది గదా ఆ బాధ్యత. ఇగ ఆయనకు నా మీద పట్టరాని కోపం, ఎగిరిండు. ఏం గాలె.. ఆయన సిఎంకు జెప్పే వుంటడు బహుశ. ఏం గాలె. నథింగ్ హ్యాజ్ హ్యాపెండ్. కాలేజ్ బాగ డెవలప్ అయ్యింది.

1976లో కాకతీయ యూనివర్శిటీ వచ్చింది, ఎమర్జెన్సీ తర్వాత. దానికి మొదలు వెంకట్రామయ్యగారు వైస్‌ఛాన్సలర్‌గ వుండిరి. అక్కడ రిజిస్ట్రార్ కొరకు చాల మందిని ట్రై జేసింద్రు. అక్కడ ఇదె లెఫ్ట్ పీక్‌లో వున్న ఉద్యమం, ఆర్ఇసి పెద్ద సెంటర్ గద. ఒక యాడాది లోపల పది పన్నెండు మంది రిజిస్ట్రార్‌లు మారింద్రు. ఒకసారి బాగ క్రైసిస్ వచ్చి వెంకట్రామయ్యగారు ఎక్కడకో వెల్లిపోయింద్రు. ఒక విధంగ హైదరాబాద్ నుంచి బోయి, ఎక్కడకో బోయి తర్వాత ఎక్కడో లీవ్ జెప్పిండు గాని, యూనివర్శిటీలో రిజిస్ట్రార్ లేడు, వైస్ ఛాన్సలర్ లేడు. ఈ యాక్టివిటీస్ పెరిగిపోయినయ్. మాతృ సంస్థ ఆర్ట్స్ కాలేజ్. అండ్లకెల్లి పిజి సెంటర్ పుట్టింది. పిజి సెంటర్ నుంచి యూనివర్శిటీ అయిపోయింది.

అయిన తర్వాత రిజిస్ట్రార్ గావాలె, వైస్ ఛాన్సలర్ లేడు, తర్జన బర్జనలో బడ్డరు. అప్పటికి ఏమైదంటె నాకొక ఇమేజ్ వచ్చింది. సికెఎం కాలేజ్ లాంటి డిఫికల్ట్ కాలేజ్ కంట్రోల్ జేసిండు, కనుక కాకతీయ యూనివర్శిటీలో అదె సమస్య గనుక జయశంకర్‌ను రిజిస్ట్రార్ జెస్తె బాగుంటది అని గవర్నమెంట్ సర్కిల్స్‌లో థింకింగ్. నేను ఎప్పుడు ఆలో చించలె. ఎందుకంటె నేను యూనివర్శిటీ సర్వీస్‌లో లేను. అక్కడ పెద్ద పెద్దోల్లు మేమైత మంటె, మేమైతమని పోటా పోటీగ వుండేది. అప్పుడు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గ ప్రతాప రెడ్డిగారు, ఎడ్యుకేషన్ సెక్రటరీ వెంకట్రామయ్య లేకుండె. ఆయన హెల్త్ రీత్యా ఒక విధంగ అండర్ గ్రౌండే బోయిండు.. అనుకోరాదు. ఆ భాష అనగూడదు గని. అయితె ఆయన ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గ ఎడ్యుకేషన్ సెక్రటరీ. ఆయనకు నేనంటె చాల లైకింగ్ డెవలప్ అయింది.

పిల్లవాల్లని ఈ ఆర్ఎస్‌యు యాక్టివిటీస్, ఆర్ఎస్ఎస్ యాక్టివిటీస్ ఆక్యుపై జేసింది అవే గద. రోజు కొట్లాటలె. అందుకె తట్టుకోలేక వెల్లిపోయిండు. రిజిస్ట్రార్ లేడు. ఈయన వచ్చి చాల మందిని కన్సల్ట్ జేసిండు. ఆయన అనుకున్నడు.. జయశంకర్ అయితె మంచిగుంటది అనుకున్నడు. నాతో జెప్పలె. ఇగ సికెఎం అప్పటికే దాదాపు నాలుగేండ్లు కంప్లీట్ అయ్యింది. ఇగ వద్దామనుకున్న. సెట్ అయిపోయింది. కాలేజ్ మంచిగ డెవలప్ అయ్యింది. నేను వచ్చిన పని అయిపోయింది అనుకున్న. నేను రిక్వెస్ట్ జేసిన, ప్రతాప రెడ్డిగారిని. కోఇన్‌సైడ్ అయింది. నేను మల్ల అన్న.. నా ఉద్యోగం నాకుంది గద. నేను రికగ్నైజ్డ్ యూనివర్శిటీలో జేరాలె గద. నన్ను పంపండి అని అంటె, చూద్దాంలె అన్నడు.

## అసలు కలలో గూడ అనుకోలేదు

అని ఒక రోజు అకస్మాత్తుగ, నేను గవర్నమెంట్ ఆఫీసర్ని గద. గవర్నమెంట్ సికెఎం గూడ గవర్నమెంటె. వాల్లకి అధికారముంది. జయశంకర్‌కు ఆర్డర్ రిలీజ్ జేసిండ్రు. నా సర్వీసెస్ సికెఎం కాలేజ్ నుంచి విత్‌డ్రా జేసుకుంటూ, కాకతీయ యూనివర్శిటీ డెప్యుటేషన్ కమ్ రిజిస్ట్రార్ అపాయింట్‌మెంట్ తీసుకుని, ఆయన ఇన్‌ఛార్జి విసిగ వచ్చి ఆర్డర్ తెచ్చి నన్ను బిలిపించిండు. పిలిచి జయశంకర్! నువ్వు ఇక్కడ రిజిస్ట్రార్ అవుతున్నవ్ అంటె, నేను చాల ఆశ్చర్యపోయిన..! ఆ ఏజ్‌లో నాకు.. అసలు కలలో గూడ అనుకోలేదు నాకి స్తరని. సికెఎంలో బాగ నడిపించిన, లోకల్‌గ వైస్‌ఛాన్సలర్ ఇప్పుడు లేడు. ఇతనైతె బాగుంటది ఇతన్ని అపాయింట్ జెస్తె. కనుక ఒకింత సంతోషం, ఆశ్చర్యం, సంభ్రమం అన్ని. కలెక్టర్‌తో జెప్పిండు, కలెక్టర్ జూనియర్ ఆఫీసర్ గదనయ్య సెక్రటరీకి.

అయితె ఆయన అన్నడు జయశంకర్‌గారికి పదోన్నతి సంతోషమె. మాకు మరి మా కాలేజ్‌గూడ మంచిగ గావాల్నంటె.. జయశంకర్ ఎవర్ని జేయాలి నువ్వు జెప్పు, గవర్న మెంట్‌లో నువ్వు ఎవరి పేరు జెప్తె ఆ పేరు జేస్త అంటె, కొద్దిగ టైమ్ తీసుకొని పేరు జెప్పిన. ఆయన్నె మల్ల నా ప్లేస్‌లో రాధాకృష్ణను ప్రిన్సిపల్ జేసేసి, నన్ను యూనివర్శిటీకి బిలిపించుకొని స్టాఫ్ మీటింగ్ పెట్టిండు, అంత వరకు డిస్‌క్లోజ్. స్టాఫ్ మీటింగ్, ప్రొఫెసర్లు, డీన్‌లు అందరు హేమా హేమీలు, దిగ్గజాలను కూచోబెట్టి, ప్రతాపరెడ్డిగారు మాట్లాడుతూ మనం జయశంకర్‌గారిని..! అనంగనే అయ్యో వారు మాకు దెలవదా అని వాల్లు! ఎందుకు జెప్తున్నడో అర్థంగాదు వాల్లకి. ఏం దెలుసు మీకు అంటె సికెఎం కాలేజ్ ప్రిన్సిపల్‌గ బాగ నడిపిస్తున్నడు అంటె, రేపటి నుంచి ఇక్కడ కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ అని అన్నడు. అందరి గుండెల్లో రాయిబడ్డది వాల్లకు. ప్రతి వాల్లు తను గావాలనుకొంటరు గద. నేను వాల్ల కంటె చాల జూనియర్‌ను, అవుట్ సైడర్‌ను. అంటె నేను లోకల్ అయినా, యూనివర్శిటీకి అవుట్ సైడర్‌ను. అంతెగాదు ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్‌గ నేను ఎక్కువ టైం స్పేర్ జేయలేకపోతున్న. కనుక నాతో చర్చించి నా అనుమతితో వారు వైస్ ఛాన్సలర్ విధులను గూడ ఆయనె నిర్వర్తిస్తాడు, అని జెప్పి జయశంకర్..! ఆల్ ది బెస్ట్ అని విష్ జేసి వెల్లిపోయిండు.

ఇగ హయగ్రీవాచారికి మింగుడు పడలె, హయగ్రీవాచారి, ప్రతాపరెడ్డితోని ఏం జేసిన వయ్యా! ఇట్ల జేసినవ్, అట్ల జేసినవ్, చాల మంది ఎమ్మెల్యేలకు ఇష్టం లేదు. అప్పుడు

ఎమ్మెల్యేలు యూనివర్శిటీ.. జంగారెడ్డి, సమ్మయ్య అని వుండేది. జంగారెడ్డికి అస్సలు ఇష్టం లేదు. ఆయన బిజెపి మనిషాయె. నాకు లెఫ్టిస్ట్ బుద్ధులు వుండె. సమ్మయ్య పైరవీల మనిషి. నేను పైరవీ వినను. వాల్లిద్దరు అపోజ్ జేస్తె.. ప్రతాపరెడ్డిగారన్నరట మీరు డిసెంట్ ఇవ్వండి అని అంటె, ఇగ మేం డిసెంట్ ఇచ్చి ఏం జేస్తం అని వాల్లు గూడ ఎస్ అన్నరు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మీటింగ్ పెడితె అందరూ అప్రూవ్ చేసింగ్రు. అంటె నాకు గవర్నమెంట్ పదవి వాపస్‌గ రాలె, అట్నుంచి అటె డిప్యుటేషన్ అది నేను అప్లై జేయలె, అడగలె, కోరుకోలె, అట్నుంచి అటె.. గవర్నమెంట్ ఎంప్లాయ్‌గ పోయిన. అదిగూడ కాపాడు కోవాలె. సర్వీస్‌లో ప్రమోషన్స్ గద మరి.

హయగ్రీవాచారితో, అందరితో చూడండి! జయశంకర్ గవర్నమెంట్ ఉద్యోగి. ఆయన మీద ఇవన్ని లేబుల్స్ వున్నయ్ మాకు దెలుసు. లేబుల్స్ వరకె గాని ఆయన ఏందో మాకు బాగ దెలుసు. నిజాయితీతో, చాల నిబద్ధతతో పనిజేసె మనిషి గనుక అటువంటిది వుంటె మేమే దీసెస్తామండి, మాకు మీరు జెప్పాల్సిన అవసరం లేదు. ఏదో సర్ది చెప్పిండు ఎవరికి జీర్ణం గాలె. తొలి చార్జి తీసుకొని అప్పుడప్పుడే స్టార్ట్ అయింది గద యూనివర్శిటీ. నేను రిజిస్ట్రార్‌గ చార్జి తీసుకొని ఛైర్‌ల గూర్చున్న. ఫస్ట్ టెలిఫోన్ బెదిరింపు కాల్. నేను వెల్లిపోకపోతె నేను బతకను అని. మంచిది అంటూ ఫోన్ బెట్టేసిన అంతె. తర్వాత అంతకు ముందు రిజిస్ట్రార్ పదవి ఆశిస్తున్న చాల మంది సీనియర్ ప్రొఫెసర్స్ వుండిరి గద, వాల్లు వేరే అడ్మినిస్ట్రేటివ్ పదవి ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ అవన్ని వుంటరు గద. అపుడు కంట్రోలర్‌గ వున్న ఒగాయన ఆయనకేమీ జీర్ణం గాలె. ఫస్ట్ ఆయనె రిజిగ్నేషన్ లెటర్. నేను కంట్రోలర్ పదవికి రాజీనామా జేస్తున్న. జనరల్లీ రిక్వెస్ట్ జేస్తరు గద. నేను ఇవ్వాలె వచ్చిన గద అని. నేను వెంటనే యాక్సెప్ట్ జేసిన. చేసి ఆన్ దిస్ స్పాట్ ఇంకోకాయన టీచర్‌కి ఫోన్ జేసి, మీరు ఇది దీసుకోవాలె అంటె ఆయన వచ్చేసి యస్ అన్నడు. అస్సలు వాల్లది ఒక ప్లాన్ వుండె. చాలా మంది అట్లాగె రిజైన్ జేయాలె అని. దాంతో అయిపోయింది. చెప్తున్న.. ఆ క్రిటికల్ టైమ్‌లో తీసుకొనేటువంటి ఒక సాహసోపేతమైనటు వంటి నిర్ణయం. మంచిగ కంట్రోల్ అయింది, యూనివర్శిటీ బాగ కంట్రోల్ అయింది.

మధ్యలో ప్రొఫెసర్ వెంకట్రామయ్యగారు వచ్చారు. ఆయన టర్మ్ అయిపోయింది. జాఫర్‌నిజాం అనే కొత్త వైస్ ఛాన్సలర్ వచ్చాడు. ఒక మర్యాద, కొత్త వైస్‌ఛాన్సలర్ వస్తె రిజిస్ట్రార్ రాజీనామా జేస్తడు సాధారణంగ. రిజిస్ట్రార్‌ది టెన్ ఇయర్ పోస్ట్ గద. మూడేండ్లకె వుంటది. అందులో డెప్యుటేషన్ వుంటిని. బయటోన్ని గాదు. జాఫర్ గారు రాంగనె,

ఆయనతో మీరు మీ ఇష్టం వున్నటువంటి వ్యక్తిని రిజిస్ట్రార్ జేసుకోండి.. ఆ అధికారం మీకుంది గనుక నేను రాజీనామా జేస్తున్న అన్న. ఆయన నవ్వి జయశంకర్! నువ్వున్నవని వచ్చిన్నయ్య నేను. నువ్వెక్కడికి పోతవ్. అది మీ ఇష్టం. అది మా టీం మంచిగ పనిజేసింది అది నా పిరియడ్‌లో. జాఫర్ నిజాంగారు ఎక్కువ హైదరాబాద్‌ల వుండేది. లోకల్ పనంత నేను జూసుకోవాల్సి వచ్చేది. అయ్యే వరకు ఏమైంది పబ్లిక్‌లో వైస్ ఛాన్సలర్ ఈయనా? ఆయనా?అని. ఎన్ని అధికారాలు ఈయనకు. ఇట్ల జేస్తాండు, అట్ల జేస్తాండు ఇగ ఏదెదో ఓ.. కతల దుమారం. లెఫ్టిస్ట్ యాక్టివిటీ కొంత కంట్రోల్ అయింది. కంట్రోల్ అయింది అంటె నేను ఓపెన్‌గ పనిజేసిన కనుక కంట్రోల్ అయింది. నేను లెఫ్ట్, రైట్ సపోర్ట్ జేయడం కాదు గాని, నేను ఒక పద్ధతి ప్రకారం పనిజేసేది. కరాకండిగ వుండేది.

ఎందుకు కోఆపరేట్ జేస్తరు ఈయనకు. లెఫ్టిస్ట్ గాకపోతె ఇంత కోఆపరేషన్ దొరుకుద్దా? ఏవో అంతర్గతంగ వీల్లకు సంబంధాలున్నయ్.. పేద్ద కథ. లోకల్‌గ వున్న కొంత మంది టీచర్స్, వాల్లు కొంత మంది ఈయన ఎల్లిపోకపోతె రేపు వైస్‌ఛాన్సలర్ అయి కూసుంటడు గావొచ్చు. నేను జెప్పేది 1979-80 సంగతి రిజిస్ట్రార్‌గ వున్న అప్పుడు. ఇగ నాకు వైస్ ఛాన్సలర్ ఏజె రాలె అప్పటికి. ఒక ఎస్పీ వస్తె, ఒకాయనకు బంధువు వుండె, ఆయనతో నా మీద ఈయనకు నక్సలైట్లతో సంబంధాలున్నయ్ అని సిఎంకు కూడ రిపోర్ట్ పంపించిండు. అప్పటికె సిఎం చెన్నారెడ్డి అయ్యిండు. చెన్నారెడ్డికి నేను దెలుసు. చెన్నారెడ్డి ఒకసారి జనగాంకి ఏదో ఫంక్షన్‌కి వస్తె, అపుడు ఉస్మానియా వైస్ ఛాన్సలర్ రాంరెడ్డి, కాకతీయ వైస్ ఛాన్సలర్ జాఫర్‌నిజాం గూడ అక్కడ వుండిరి. చెన్నారెడ్డి జాఫర్ నిజాంతోని ఏంది.. జయశంకర్ గురించి ఇట్ల వింటున్నం. ఇట్ల తయారయిండా జయశంకర్ అంటె, ఏమిటి అంటె ఇట్ల కంప్లైంట్స్ వస్తున్నయ్. ఆయన మరి అంటె, జాఫర్ నిజాం కొంచెం మెతక మనిషి. రాంరెడ్డి వెంటనె చూడండి! జయశంకర్ ఎటువంటి వాడో మేం జెప్పం. మీరు సెకండ్ ఒపీనియన్ దెప్పించుకోండి. జయశంకర్‌ని వాపస్ పొమ్మనడం పెద్ద పనిగాదు, ఆయన పోతడు. కని సెకండ్ ఒపీనియన్ ఈ రిపోర్ట్ పైన మాకు డౌట్స్ వున్నయ్. అయినంక అక్కడ్నే కలెక్టర్ వుండె.

అప్పుడు కలెక్టర్ అంటె ఈయన మన.. తివారి ఇన్‌ఫర్‌మేషన్ కమిషనర్‌గ మొన్న రిటైర్ అయ్యిండే! గవర్నర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆయన అప్పుడు కలెక్టర్ ఆఫ్ వరంగల్ వుండె. ఆయన ఆర్ఎస్ఎస్ సంబంధాలున్న మనిషప్పుడు. ఎ.ఎన్ తివారి, కలెక్టర్ వుండె, ఇక్కడ సెక్రెటరీగ వుండె, కొంతకాలం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్వీస్‌లోకి పోయి

వచ్చిండు. లాస్ట్ టర్మ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌గ ఆయన వచ్చి సర్వేజేసి, ఎస్పీ రాసింది తప్పు అని రిపోర్ట్ ఇచ్చిండు. నిజంగ ఆయన నా మీద వ్యతిరేకంగ రాయాలని ఆయన కుండె. పొలిటికల్ దీని వల్ల చాల హానెస్ట్ రిపోర్ట్ ఇచ్చిండు. చెన్నారెడ్డి దగ్గరికి ఒకసారి హయగ్రీవాచారి వస్తె ఎందుకయ్య! వాల్ల జోలికి పోతవ్, వాల్ల పని వాల్లని జేసుకోనీరాదు. యూనివర్శిటీ గురించి నీకెందుకు? నేను జూసుకుంట గద. వాల్ల పని వాల్లు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ మంచిగ పనిజేస్తున్నరు టీమ్‌వర్క్‌తో, పీస్‌ఫుల్‌గ వున్నది. ఎందుకు అండ్ల మనకు అంటె.

ఆహా! ఎస్పీ గారు.. అంటె ఎస్పీ రాసిండు, కలెక్టర్ రాసిండు, అందరు రాసిండ్రు అంటె, అయితె కలెక్టర్‌తో అంతకుముందె హయగ్రీవాచారి అన్నడట.. జయశంకర్ గురించి ఇట్ల రాయాలె, ఇట్లరాయాలె అని. ఆయన కలెక్టర్ దగ్గర నేను ఏం జెప్పిన, నువ్వు ఏం రాసినవ్ అని అంటె, చూడండి నేను గవర్నమెంట్ ఆఫీసర్ని. జయశంకర్ గూడ గవర్నమెంట్ ఆఫీసరె. గవర్నమెంట్ పంపింది. పొతె జయశంకర్ చాల నిజాయితీగల మనిషి. తప్పుడు రిపోర్ట్ రాయడం నా వృత్తి ధర్మం గాదు అన్నడు.

# అంత రెస్పెక్ట్ వుంది నాకు

ఇగ అయిన తర్వాత ఏమైంది.. నా టర్మ్ దగ్గరికి వచ్చింది. ఎల్లి పోదామని. నేను ఇగ వుండదలచుకోలె. అప్పుడు నేను గవర్నమెంట్‌కు రిక్వెస్ట్ జెస్తె, వాల్లు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎజ్యుకేషనల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ అని.. మన హైదరాబాద్‌లో వుంది. ఇప్పటికీ వుంది. అండ్ల రీసెర్చ్ ఆఫీసర్‌గ ఏసిండ్రు. పీస్‌ఫుల్‌గ పనిజేసుకుంటున్న. అక్కడ కొద్ది మాసాలె పనిజేసిన. ఎందుకంటె.. సిఫెల్‌లో ఒక క్రైసిస్ వచ్చింది. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఇన్‌స్టెబిలిటీ. వాల్లకొక మనిషి గావాలె, వాల్లు నా గురించి విన్నరు. ఈయన పొలిటికల్‌గ ఎవ్వరికి లొంగడు. వాల్లకి పొలిటికల్‌గ లొంగని మనిషి, ఎఫిషియంట్‌గ పనిజేసె మనిషి గావాలె.

ఆ ఇన్స్టిట్యూట్‌లో అడుగుగూడ బెట్టలె అంతవరకు నేను. అండ్ల అడుగుగూడ బెట్టలె నేను. వాల్లకు రిపోర్ట్స్ వచ్చినయ్. ప్రొఫెసర్ రమేష్ మోహన్ అని వైస్ ఛాన్సలర్ వుండె. రాంరెడ్డిగారితో మాట్లాడితె ఎవరన్న మంచి.. ఇట్ల జయశంకర్ అనే వ్యక్తి గురించి వింటున్నం మీకు దెలుసా? అంటె రాంరెడ్డిగారు ఆయన స్కిల్‌ఫుల్‌గ మాట్లాడుతడు. ఒకసారి ఆయన్ని బిలిపించుకొని మాట్లాడదామంటె మరి మాకు తెలవదు అంటె, నేను చెప్త మిమ్మల్ని కలుస్తడు వచ్చి. అయితె ఒక రోజు రాంరెడ్డిగారు నాకు ఫోన్ జేసి ఇట్ల ఆయన అంటాండయ్య! పెద్ద మనిషి ఒకసారి కలువు అంటె, అపాయింట్‌మెంట్ దీసుకొని ఒకరోజు బోయి కలిసిన. సిఫెల్ ఇక్కడె గద. ఇగ అన్ని నా అనుభవాలు, అన్ని అడిగిన తర్వాత ఇట్ల మేం అనుకుంటున్నం అండి! అంటె అవకాశం ఇస్తె.. సరె పనిజేస్త అన్న. అవకాశం ఇస్తె జేస్త. మీకు నచ్చినంత కాలం నాకు నచ్చినంత కాలం పనిజేస్త. మనిద్దరిలో ఎవరికి నచ్చక పోయిన వెల్లిపోత అన్న.

అయితె ఒక పనిజేద్దాం ఒక ఫార్మాలిటీ వుంది, ఒక కమిటీ వుంటది, ఢిల్లీ నుంచి దాని మెంబర్స్ వస్తరు, ఇక్కడ వుండరు. ఆ కమిటీని ముందుగ అటెండ్ చెయ్యండి అంటె మంచిది అని చెప్పిన. పిలిపించుకొని మాట్లాడిండ్రు. చాల డీటెయిల్డ్‌గ డిస్కస్ జేసిన తర్వాత, నన్ను పర్మినెంట్‌గ రిజిస్ట్రార్‌గ అపాయింట్ జేస్తూ ఆర్డర్స్ ఇచ్చిండ్రు. మల్ల డెప్యుటేషన్. ఒక్కసారిగ రిజైన్ జేయలేను గద గవర్నమెంట్‌లో. కనుక ఒక నెల రోజులు టైం దీసుకున్న తర్వాత డెప్యుటేషన్ పోయిన అంటె, కాకతీయ యూనివర్శిటీలో నా మీద లెఫ్టిస్ట్ ముద్ర వేసిన వాల్లందరు.. అనానిమస్ లెటర్స్, మీరు ఎవర్ని తీసు

కుంటున్నరు, ఆయన ఇటువంటోడు, అటువంటోడు, ఎవర్ని లెక్క జేయడు అని. ఆయన కొంచెం ఇదేందా.. పేద్ద కట్టలకు కట్టలు లెటర్స్. రాంరెడ్డి గారితో ఇట్ల అండి అని అంటె, జయశంకర్ గారి గురించి అట్ల వస్తయని నాకు తెలుసు. జయశంకర్నే మల్లీ పిలిచి మాట్లాడండి. అంటె మల్లి వచ్చి ఆయనతోని మాట్లాడిన. ... నేను జెప్పిన చూడండి సార్! మీకు ఏ మాత్రం అనుమానం వున్న ఈ ఆఫర్‌ని రిజెక్ట్ చేస్త.. నేను రాను. మీరు క్యాన్సిల్ జేయడం గాదు, నేనే రాను అని మీకు రాసిస్త. అట్లెట్ల అయ్య! మరి మా ఇన్సిట్యూషన్ ఇంత పెద్ద లెవల్లో జేసినం అంటె, సార్! అది మీ నిర్ణయం. ఒకటేందంటె, నేను ఇక్కడ పనిజేయడానికి మీకిష్టం వుండాలె, నాకు సమ్మతం గావాలె. లేకపోతె పని ఎట్ల జేస్తాం. ఇక్కడ గాదు, ఎక్కడైన ఇదే పనిజేసిన. కనుక నామీద అను మానాలున్నప్పుడు నన్ను దీసుకోవడం గూడ శ్రేయస్కరం మీకు గాదు, నాకు గాదు. నా జాబ్ నాకున్నది. నేను వేరే ఎక్కడికో ఎల్లిపోత అని అంటె, ఆ అట్ల గాదు ఏమీ అనలేక పోతున్నడు. లేదు రావాలె, రావాలె ఇవన్ని అంటెనే గవన్ని జెప్పిన. బ్యాక్‌గ్రౌండ్ అంత జెప్పిన. అదో నేషనల్ ఇన్సిట్యూషన్. లోకల్ సంగతులు వాల్లకి తెలవయ్.

చివరికి నేనొక ఫార్ములా జెప్పిన. చూడండి మీరు పర్మినెంట్ అపాయింట్‌మెంట్ ఇచ్చినా నేను ఒక్క సంవత్సరం కొరకు వస్త. నేను గవర్నమెంట్‌లో వన్ ఇయర్ పర్మిషన్‌తోని వస్త. వన్ ఇయర్ పనిజేసిన తర్వాత మీరు మెచ్చుకొంటె, నాకు నచ్చితె కంటిన్యూ అవుత. లేకపోతె ఎల్లిపోత. కనుక వన్ ఇయర్‌కే వస్త అని నేను అంటె.. హి వజ్ వెరీ హ్యాపీ. వచ్చిన, జాయిన్ అయిన. వన్ ఇయర్‌లో చాల అక్కడ వుండె సమస్యలు, ఇట్లనే స్ట్రెయిట్‌గ పనిజేసేవాల్లం. ఇదొ పెద్ద వింతేమీ గాదు. స్ట్రెయిట్‌గ పనిజేసేది గది అంతె.

అది చాల ప్రెస్టేజ్ ఇష్యూ. అంతర్జాతీయ గుర్తింపు గల ఇన్సిట్యూషన్. వన్ ఇయర్ కాంగనె నన్ను రిలీవ్ జేయండి అని అప్లికేషన్ ఇచ్చిన. నేను వుండాల్న, పోవాల్న అని అడగలేదు. నేను వన్ ఇయర్‌కే వచ్చిన. లీవ్ పిరియడ్ అయిపోయింది, నేను వెల్లిపోతున్న అన్న. నాకు అవకాశం ఇచ్చినందుకు థాంక్స్ సార్! అంటె, ఆయన లేచి కావలించుకొని (సార్ చాలా ఇమోషనల్ అయ్.. మాట్లాడలేకపోయారు కొన్ని క్షణాలు) అప్పటికి ఆయన రిటైర్‌మెంట్ గూడా దగ్గరకు వచ్చింది. జయశంకర్ పోయేది నువ్వు గాదు, నేను. నీకు ఒప్పజెప్పి పోతున్న. మాట. ఇగ అక్కడ్నే పర్మినెంట్‌గ.. పది ఏండ్లు పనిజేసిన. పదేండ్లు ఇద్దరు ముగ్గురు వైస్ ఛాన్సలర్స్ మారిండ్రు. నాకు అపారమైనటువంటి సపోర్టు, గుడ్

విల్. ఎక్కడన్న వైస్ ఛాన్సలర్ కన్న రిజిస్ట్రార్ అంటె అంత రెస్పెక్ట్ వుందా, నాకు ఇచ్చింర్రన్న మాట. అందరు నన్ను ఆ రకంగ జూసింర్రు. స్టాఫ్, టీచర్స్, స్టూడెంట్స్ వైస్ ఛాన్సలర్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా. నేషనల్ ఇనిస్టిట్యూషన్. అప్పుడేమైంది మల్ల కాకతీయ యూనివర్శిటీలో క్రైసిస్. వైస్ ఛాన్సలర్ గావాలె అని. అప్పటికి పదేండ్లు అయింది. మల్ల వరంగల్ పోదామని అనుకోలె. ఇక్కడ పీస్‌ఫుల్‌గ నడుస్తాన్నది, ప్రెస్టేజియస్‌గ. అంతర్జాతీయంగ తిరిగే అవకాశాలు, జాతీయ స్థాయిలో సంబంధాలు, ఆ పిరియడ్‌లో ఎడ్యుకేషన్ మినిస్టర్స్‌గా పి.వి. నరసింహారావు వచ్చిండు, శివశంకర్ వచ్చిండు. అందరి మెప్పులు పొందిన.

# అదే వూళ్లో వైస్ ఛాన్సలర్‌గ

మల్ల కాకతీయలో వైస్ ఛాన్సలర్ గావాలె అని. ఎవరైతె బాగుంటది? ఎవరైతె బాగుం టరు? మల్ల ఒక పెద్ద సర్వే. చాల క్లిష్టమైన పరిస్థితుల్లో వుంది అప్పటికి 1999లో. ఈ పరిస్థితులను చక్క దిద్దడానికి జయశంకర్ అయితెనే బాగుంటది అని ఇంటలిజెన్సీ రిపోర్ట్స్. అప్పుడు నేదురుమల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రి. ఆయనకు సెక్రెటరీ కాకి మాధవరావు. ఒకరోజు కాకి మాధవరావు నాకు ఫోన్ జేసి నా బయోడేటా దెప్పించుకున్నడు. నేను ఎందుకని అడగలేదు, ఆయన జెప్పలేదు. ఆయన వరంగల్ కలెక్టర్‌గ వుండె గద. నాకు బాగ పరిచయం వుండె. నేదురుమల్లి జనార్దనరెడ్డికి గూడ ఇంటలిజెన్స్ వాల్లు రిపోర్ట్స్ ఇచ్చింద్రు. ఈయన అయితె బాగుంటది అని. ఇంతలో ప్రెస్‌లో స్పెక్యులేషన్ మొదలైంది. జయశంకర్ పేరు గూడ కన్సల్టేషన్‌లో వున్నదని. పట్టించుకోలె నేను అయితదో, కాదో. మల్ల వరంగల్ నుంచి రిప్రజెంటేషన్స్. ఈయనకు ఫలానా నక్సలైట్ సంబంధాలు, ఈయన బిసి పక్షపాతి, ఈ.. రకరకాలుగ రిజిస్ట్రార్‌గ చాల కాంట్రవర్సీల ఎల్లిపోయిండు. మల్ల ఎట్ల దీసుకొస్తరు అని.. జనార్థనరెడ్డికి పుట్టెడు రిప్రజెంటేషన్స్.

ఆయన ఇంటలిజెన్సీ రిపోర్ట్స్‌తో చాల విశాలమైన సర్వే జేయించిండు. అప్పుడు ఆంజనేయరెడ్డి అని ఐజి ఇంటలిజెన్సీ. చాల నిజాయితీ గల మనిషి. ఆయన వెనుకట తివారి నా గురించి రాసినటువంటి రిపోర్ట్‌ను దీసుకొని మల్ల సర్వేజేసి, సిఎంకు నీట్ రిపోర్ట్ పంపించిండు. ఈయన ఐతెనే ఆ పరిస్థితులను కంట్రోల్ చేయగలుగుతడు అని. ఐతె ఆ సర్వే కాకతీయ యూనివర్శిటీలో కొంత మంది టీచర్స్, అప్పుడు నన్ను రిజిస్ట్రార్‌గ వున్నప్పుడు ఆపోజ్ జేసినోల్లు.. ఇది బాగుపడాలంటె జయశంకరే రావాలని స్టేట్‌మెంట్ ఇచ్చింద్రు కొందరు. ఇవి వుండె గద, కొంత మందికి ఐడియాలజీ, కొంత మందికి కుల ప్రాబ్లం, కొంతమందికి మత ప్రాబ్లం, 90% ఐతే కొందరు వైస్‌చాన్సలర్ గావాలన్న కోరిక వున్నోల్లు ఈ కాంపెయిన్ మొదలుపెట్టింద్రు.

అయిన తర్వాత ఆయన అకడమిక్‌గ రాంరెడ్డిగారిని, సి. నారాయణరెడ్డి గారిని, చాల మందిని కన్సల్ట్ జేసింద్రు. అందరు చాల చెప్పింద్రు. బాగుంటుందని చెప్పింద్రు. వాల్ల రిపోర్ట్ గూడ వచ్చిన తర్వాత ఆయన నిర్ణయం దీసుకున్నడు. నేను సిఎంని గలవాలె. కలవాలా, వద్దా అంటె, వద్దనె అన్నరు. ఆయన్ని కలవద్దని ఎందుకు జెప్పింద్రంటె, నా గురించి వ్యతిరేకంగ మాట్లాడిన వాల్లందరు, వాల్లకు గావాలని కోరుకున్నోల్లు, ఆయన

జయశంకర్ ఎంత డిగ్నిఫైడ్‌గ బిహేవ్ జేస్తున్నడు. ఏంది వీళ్ల సంగతి, జనార్దనరెడ్డికి గూడ నక్సలైట్ సంబంధాలు.. ఇవన్నీ ఆయనకు గిట్టదు గద. వీళ్లవన్ని అబద్ధాలు అని.. ఒక కాలేజ్ ప్రిన్సిపల్‌గ, రెండు యూనివర్శిటీస్‌కు రిజిస్ట్రార్‌గ పనిజేసిండు. ఆ అవకాశం ఎవరికి రాలె ఈ రాష్ట్రంలో, చాల మందికి రాలేదు. అపాయింట్‌మెంట్ జరిగింది. పోయిన. నన్ను ఫలానా వాల్లు అపోజ్ జేసింద్రు, ఫలానా ఫలానా వాల్లు సపోర్టు జేసింద్రు అన్న విషయాన్ని పక్కకు బెట్టిన. స్ట్రెయిట్‌గ పనిజేసిన. నన్ను విమర్శించిన వాల్లంత నన్ను బాగ సమర్థించేవాల్లుగ తయారు జేసిన. అంటె చివరికి నా ఉద్యోగ ప్రస్థానం ఏందంటె, ఏ వూళ్లో పుట్టిన్నో, అక్కడ్నే స్కూల్ టీచర్‌గ ఉద్యోగం మొదలైంది. అదే వూళ్లో వైస్ ఛాన్సలర్‌గ పదవీ విరమణ జరిగింది. ఈ లోపల తెలంగాణ ప్రాంతంలో సగం జిల్లాలలోపల పనిజేసిన. ఇది నా వ్యక్తిగత జీవిత ప్రస్థానం.

# ఆ స్టైల్ నన్ను కాపాడింది

నేను.. నా మీద ఏ ముద్ర పడ్డ నేను దాన్ని విమర్శించలె, ఖండించలె, సమర్థించలె. ఒకటేంటంటె నేను ప్రొగ్రెసివ్ మనిషిని. ఐడియాలజికల్‌గ వాళ్ల ఫ్రేమ్ వర్క్‌లో పోయె మనిషిని గాను. ఎక్కడ మంచి వుంటె దాన్ని సమర్థిస్తా పబ్లిక్‌గ. ఎక్కడ మంచి లేకుంటె ఒప్పుకోలె. అట్లగె పనిజేసిన నేను. ఉద్యోగమంత అట్లగె పనిజేసిన. నేను లేకున్న వచ్చింది గద అంతకు ముందు. ఐతె ఏమైందంటె ఆ పిరియడ్‌లో ఈ ముద్ర వేయడం వల్ల పబ్లిక్‌గ ఫోకస్ అయింది.

ఒక ఇన్సిడెంట్ జెప్తాను, అది ఎట్ల జరిగింది అని జెప్పడానికి. నేను రిజిస్ట్రార్‌గ వున్నప్పుడు కాలేజ్ స్టూడెంట్స్, వాళ్ల కాలేజ్‌డేకి కె. జి సత్య మూర్తిని చీఫ్ గెస్ట్‌గ బెట్టు కున్నరు. అపుడాయన.. అండర్ గ్రౌండ్ అనుకుంట, అండర్ గ్రౌండే. బ్యాన్ అంటె రిప్రె షన్ వుండె. వాల్లు  గద్దర్‌తో ఒకసారి ప్రోగ్రాం బెట్టిచ్చుకున్నరు అక్కడ. పర్మిషన్ ఇచ్చిన నేను. ఎందుకిచ్చిన అంటె, మరి యూనివర్శిటీలో స్టూడెంట్స్ మీటింగ్ పెట్టుకుంటమంటె ఇవ్వనని ఎట్ల అంటం. వాల్లు అడిగినా, ఆర్‌ఎస్‌ఎస్ వాల్లు అడిగినా ఇస్త నేను. తర్వాత కె.జి సత్యమూర్తిని కాలేజ్ డే చీఫ్ గెస్ట్‌గ అంటె.. పెద్ద కల్లోలం. ఎట్ల అవైడ్ జేయాలి అంటె హైదరాబాద్‌లో జాఫర్‌నిజాంగారు వైస్ ఛాన్సలర్ అప్పుడు. నన్ను హైదరాబాద్ నుంచి బిలిపించుకున్నడు. ఇట్ల వున్నది జయశంకర్ సాబ్! ఏం జేద్దాం అంటె, కె.జి సత్యమూర్తి రావొద్దు అంటె.. వరవరరావుగారు జెప్తెనె అయిద్ది. ఇంకోరు జెప్తె గాదు. నేను హ్యాండిల్ జేసిన విషయాలు జెప్తున్న. మధ్యరాత్రి 12 గంటల దాక విసి లాడ్జ్‌లో డిస్కషన్ అయినంక, మరి నేను వరవరరావు దగ్గర బోవాలె. వైస్ ఛాన్సలర్ కారు దీసుకొనే వరవరరావు ఇంటికి బోయిన. మాట్లాడిన ఇగ, ఆయనేదో జెప్పిండు, మొత్తం మీద అయింది.

ఏం జెప్పిండో, ఏం జెప్పలేదో కె.జి సత్యమూర్తి రాలే. పోలీసోల్లకు దెలిసింది. ఏందంటె ఎందుకు రాలేదు ఈయన. పోలీసోల్లకు మధ్యరాత్రి వైస్‌ఛాన్సలర్ కారు వరవరరావు ఇంటికి.. వైస్ ఛాన్సలరే బోయిండు అనుకుంటాండ్రు. తర్వాత ప్రోగ్రాంకి రాలేదు. వరవర రావు సహకరించందె.. ఇది ఆ రోజుల్లో జరిగే పని గాదు గద. వరవరరావు వాస్తవాలు గమనించి చెప్తున్న ఎట్ల హ్యాండిల్ జేసినం అంటె, నేనొక నోన్ ఆస్తికున్ని, ఆయనొక నాస్తికుడు అక్కడే వుంది గద. నా ఆస్తికత్వంలోపల అరమరికలు లేవు, దాపరికం లేదు, ఆయనకు గూడ లేవు గావొచ్చు. ఇగ నన్ను నాస్తికుడు అని రకరకాలు లేబుల్స్ పెడితే, నేను దేన్ని ఖండించలె. దేన్ని సమర్థించలె, వ్యక్తిగత విమర్శలు నేను ఏనాడు పట్టించుకోలె.

నాడు పట్టించుకోలె, ఇపుడు తెలంగాణ కాంటెక్స్ట్‌లో ఈనాడు వచ్చే వానికి గూడ నేను పట్టించుకోలె. అది నా స్ట్రెన్తా, వీక్‌నెసా అది వేరు విషయం. అండ్ల పట్టించుకొంటే దానికి అంతుండదు. అయినతర్వాత ఎట్ల బంద్ అయింద్రు అంటె, వరవరరావు ఇంటికి వైస్ ఛాన్సలర్ బోయిండు అని నాకు ఎస్పీ ఫోన్ జేసిండు తెల్లవారి కనుక్కుందామని. ఫోన్ జేసినప్పుడు నేను అప్పుడు ఇంట్లో ఏదో పూజలో వుంటి. ఫోన్ జేసినపుడు పిల్లలు ఫోన్‌లో సార్ పూజలో వున్నడు అని జెప్తే, నేను మల్ల ఐ కాల్డ్ బ్యాక్ టు హిమ్. ఆ రోజుల్లో అంతా ల్యాండ్ ఫోన్లే గద. మిమ్మల్ని గలవాలె, మాట్లాడాలె అని అంటె ఆఫీస్‌కు పోతు పోతు వస్త అని జెప్పిన. తొవ్వల్నె గద.

ఆయన ఫస్ట్ క్వశ్చన్.. మీరు పూజ జేస్తారా అన్నడు. ఎందుకండీ! ఆ ప్రశ్న ఎందుకు వేస్తుండ్రు అని అన్న. దేవుడు వున్నడంటరా?! అంటె తెలియదు అన్న. దేవుడున్నడంటె దెలియదు అంటున్నరు, మరి పూజ జేస్తున్నరు ఇది ఏందండి! అంటె, ఉంటె పూజలు అక్కరకు వస్తయ్ గద అన్న. ఆయనకు అర్థం గాలె.(పెద్దగ నవ్వు) దీన్ని ఎట్ల ఇంటర్‌ప్రెట్ జేస్తరో జెప్పండి. ఆ సమయాన్ని, సందర్భాన్ని బట్టి నేను రియాక్ట్ అయిన, ప్రవర్తించిన. ఐతె ఒక పబ్లిక్ మీటింగ్‌లో అదె ఎస్పీతో ఒక ఫ్లాట్‌ఫామ్ షేర్ జేసిన. జయశంకర్ గారంటె మాకు అర్థమె గాదు. ఇదంటరు, అదంటరు ఆయన ఏందో తెలుసుకోటానికి వారు జెప్పరు. ఎన్నడు జెప్పరు అన్నడు. అంటె నేను నవ్వి ఇవాల జెప్త అన్న నేను. అందరు ఏం జెప్తడో, లెఫ్టిస్ట్, రైటిస్ట్ అని జెప్తడనుకున్నరు అందరు. అంటె నేను అన్న నేను కథ జెప్త వినండయ్యా! అన్న. చిన్నప్పుడు నేను ప్రైవేట్ స్కూల్లో చదివిన కథ అది. ఒక ఏనుగు ఎనిమిది మంది గుడ్డోల్లుండిరట. ఒక గుడ్డోడు దాని తల బట్టుకుని అది తోకె అనుకున్నడు. ఇంకో గుడ్డోడు తొండమె అనుకొన్నడు, ఇంకో గుడ్డోడు కాదు కోరలే అనుకున్నడు, కాదు కాలే అనుకున్నడు. కనుక నన్ను కండ్లకు రంగున్న అద్దాలతో జూసేవాల్లుకు ఏ రంగు అద్దాలు పెట్టుకుంటె, ఆ రంగులో కనబడత అన్న నేను. ఇగ దాన్ని ఎట్ల ఇంటర్‌ప్రెట్ జేస్తం జెప్పు. ఐతె నేను జెప్పింది సమంజసమా? అసమంజసమా అనేది కాదు గాని, ఆ స్టైల్ నన్ను కాపాడింది.

ఎక్కడ ఖరాఖండిగ జెప్పాల్నో జెప్త, ఎక్కడైతె అవసరం లేదో నిజంగ నేను జెప్పింది కరెక్టే, లెఫ్టా రైటా అంటే నీకో తీరుగ, నాకో తీరుగ కనబడితిని. నేను పూజజేస్త అంటె వాల్లు ఆర్ఎస్ఎస్ అనుకొనె, నేను గద్దర్‌తో కూసుంటె, వరవరరావుతో మాట్లాడితె లెఫ్టిస్ట్ అనుకొనే.. నేనేం జేయను. ఇంతకు నేను ఇదా, అదా? నేను అందరితో వుంటిని మరి.

## అదే నాకు పెద్ద తృప్తి

బిలీఫ్స్‌వల్ల గాదు అది, బిలీఫ్స్‌తో సంబంధమె లేదు. ఇన్‌డిసిప్లెన్, ఆబ్సెంటీస్. లీవ్ బెట్టి ఏండ్ల తరబడి పోతె ఏం జేస్తాం. అంతకు ముందు అలవాటైపోయింది. ఏండ్ల తరబడిపోయి తిరిగొచ్చేది. అయితె మీరు జాబ్‌జేయండి, లేకపోతె ఎల్లిపోండి. జవాబియ్యరు. ఇద్దర్నే తీసేసింది. ఒకర్ని ఇద్దర్ని ఇగ తర్వాత ఏమైందంటె..నాకు వైస్ ఛాన్సలర్ పదవి అయిపోయిన తర్వాత వాల్లు కోర్టుకు బోయింద్రు. ఇగ కోర్టు ఎట్ల నీకు దెలుసు గద. వచ్చింద్రు, తీసుకున్నోల్లు పశ్చాత్తాపబడ్డరు. నాకు వాల్ల పట్ల వ్యక్తిగతంగ ఏం వుండదు, డిసిప్లెన్ కాపాడాలె గద. నేను సికెఎం కాలేజ్‌ల గూడ చాల హార్ష్‌గ బిహేవ్ జేసిన. తప్పు జేసిన వాల్లను కఠినంగ శిక్షించిన. మంచి జేసిన వాల్లను ఉదారంగ వాల్లకు హెల్ప్ జేసిన. విత్ ఇన్‌ది ఫ్రేమ్ వర్క్.

అదొకటి.. మా ఇంటి వాతావరణం నుంచి చిన్నప్పటి నుంచి వచ్చింది అది. నేను ఏదో కొత్తగ తీసుకొన్నది గాదు. పరంపరగ వచ్చిందే. అది నా విశ్వాసం. అది నా వ్యక్తిగత విశ్వాసం, పబ్లిక్ డెమాన్‌స్ట్రేషన్ గాదు. నా వ్యక్తిగత విశ్వాసం ఏదైతె పబ్లిక్ డెమాన్‌స్ట్రేషన్ గాదో, పొలిటికల్ విషయాల్లో కూడ ... అది నా లైఫ్ వెంకట్.

ఉమ్మడి కుటుంబంలో నేను ఒక వ్యక్తిగ పుట్టిన, పెరిగిన. అందరు పెద్ద వాల్లు అయిపోయినంక నేను ఒక్కన్నే అయిపోయిన. ఎవరి సంసారాలు వాల్లకుంటయి గద. ఒక దశలో నాకు సిఫెల్‌లో పనిజేస్తున్నప్పుడు హెల్ప్ జేయడానికి ఒక పిల్లవాడు గావాలె అని అంటె, తెలిసిన వాల్లు ఇద్దరు ముగ్గురు పిల్లవాల్లు వస్తె, ఇద్దరు ముగ్గురిట్ల ఎవరు అడ్జస్ట్ గాలేదు. చివరికి ఒక పిల్లవాడు ఎడ్జెస్ట్ అయిండు. అతనే బ్రహ్మం. నాతో వుండె అబ్బాయి. 91లో సిఫెల్ వున్నప్పుడు జేరిండు. చిన్నపిల్లవాన్ని బెట్టిండు. ఇంటర్ పాస్ గాలేదు. అతను కొన్ని రోజులు ట్రై జేసినంక నేను, విసిగ వున్న, ఎక్కడ వున్నా నాతోనె వున్నడు. మంచి బుద్ధిమంతుడు, నిజాయితీపరుడు.

ఎక్కడి నుంచో వచ్చిన పిల్లవాడు, అనాథ, తల్లి దండ్రులు లేరు. ఎవరు లేరు. నిజంగ ఇంట్లో హెల్ప్ జేయడానికి అని బెట్టుకున్న. కని అతని ప్రవర్తన జూసి నేను ఇంటి పిల్లవానిగ ట్రీట్ జేసి చదివించిన. బికాం, ఎంబిఎ, ఎంసిఎ అయింది. ఉద్యోగం కూడ చేస్తున్నడు. అతనికి పెండ్లి జేయడానికి ఇంకొక అనాథ బాలికను జూసి ఇద్దరికి నేనే పెండ్లి జేసిన. నాతో వాల్లే వుండేది. వాల్లకో చిన్న పాప. నాకు ఈ జీవిత చరమాంకంలో అది నా యూనిట్.

అయితె మొన్న మొన్నటి దాక నా పని నేను జేసుకొనేది. నా వంట నేను జేసుకోగలను. ఇప్పటికి వంట జేయగలుగత నేను. నాకు ఆస్తి పాస్తులంటూ ఏమీ లేవు. ఒక్క ఇపుడు మా తల్లిదండ్రులు ఇచ్చినటువంటి పాత ఇల్లు ఒకటుంది. నా డెబ్బై ఏండ్లు అండ్లనే గడిపిన. అది శిథిలావస్థకు వస్తె, దాన్ని తీసేసి వరంగల్‌లో ఒక ఫ్లాట్ తీసుకున్న. నాకున్న ఆస్తంతా ఆ పన్నెండు, పదమూడు వందల స్క్వేర్ ఫీట్ల అపార్ట్‌మెంట్ తప్పితె నాకు వేరే ప్రాపర్టీ లేదు. పెన్షన్ వస్తది. నాకు వేరే ఆదాయం లేదు. నేను ఎవరి మీద ఆధారపడలేదు. ఆధారపడవలసిన అవసరం లేదు. ఉద్యోగ రీత్యా సంపాయించినపుడు చాలా భాగం ఉద్యమాల కోసం ఖర్చు బెట్టిన నేను. కనుక నేను అంటె.. వెనక్కి తిరిగిచూస్తె ఒక తృప్తేంటంటె!?.. నేను ఎవరిని బాధపెట్టని వ్యక్తిని గనుక అవసరాల కొరకు వీలైనంత వరకు సహాయపడుతున్న. అదే నాకు పెద్ద తృప్తి.

## అధ్యాపక వృత్తి నన్ను ప్రభావితం జేసింది

ఇపుడు నేను ఏది గూడ స్టైల్ ఇట్ల వుండాలె అని మాట్లాడినపుడు, రాసినపుడు ఈ స్టైల్‌లోనె అనుకోను, అది వచ్చేస్తది అంతె. సందర్భాన్ని బట్టి, కంటెంట్‌ని బట్టి, అనుభవాన్ని బట్టి మాట్లాడినా, రాసినా. ప్రత్యేకంగ ప్లాన్ జేయను దానికి నేను. అపుడు ఆ ప్రసంగపాఠం రాసినపుడు అప్పుడప్పుడె ఉద్యమం పుంజుకొంటున్నది. 96 ఫస్ట్ నవంబర్ రోజు వరకు నా స్పీచ్ విన్న తర్వాత, మల్లేపల్లి లక్ష్మయ్య నన్ను లెక్చర్ ఇవ్వడానికి పిలిచిండు. దానికి తోడు ఏమైంది! ఆ స్పీచ్ కాంగనె ఆ రోజు పత్రికల్లో చంద్రబాబునాయుడు ఛాలెంజ్‌లు (చెప్పిన గద) ఉక్కు పాదంతో అణిచేస్తా అంటె.. ఇంక మా సంకల్పం పెరిగిపోయిందన్నమాట. రాసినయ్ వాస్తవాలు గనుక ఇంక ఫ్రీ ఫ్లో వుంటది. అవన్ని అనుభవాలు, వాస్తవిక అనుభవాలు గనుక ఫ్లో.. ఫ్రీగ వుంటది. నా పర్సనల్ అనుభవాలు, అభిప్రాయం ఏందంటె, ఏదైన చెప్పదలచుకొన్నప్పుడు, విషయం మెదడులో వున్నప్పుడు, కంటెంట్ వున్నప్పుడు.. భాష పెద్ద కన్‌స్ట్రెయింట్ కాదు. వచ్చేస్తది. ఇంగ్లిష్ అయిన, తెలుగయిన, ఉర్దూ మూడుభాషల్లో మాట్లాడుత గద నేను. అది వచ్చేస్తది ప్రత్యేకంగ ప్లాన్ జేయను నేను. ఇట్ల వుండాలె అని ప్లాన్ జేయను.

ఇపుడు ఒకటేందంటె, దానికొక కన్విక్షన్ ఏందంటె? వాస్తవాలు జెప్పినపుడు ఆవేశాలొస్తయ్. రాయడంలో గాని, మాట్లాడటంలో గాని ఆవేశాలొస్తె, వాస్తవం మరుగున పడిపోతుంది. ఎమోషన్‌కు ప్రాముఖ్యత ఇస్తె కంటెంట్ దెబ్బతింటది. కంటెంట్ దెబ్బదింటది. కంటెంట్ చెప్పేది.. సరళంగ అందరికీ అర్థమయ్యేటట్టు జెప్పాలె, చదివేవాడికి ఎమోషన్ రావాలె. చెప్పేవాడికి ఎమోషన్ వస్తె కంటెంట్ దెబ్బ తింటది. మనం రాసింది ఎంత స్పష్టంగ, ఎంత సరళంగ ఆవేశం లేకుండ రాస్తె.. చదివేవాడికి అంత ఆవేశం వస్తది. నేను రాసింది చాల మంది చదువుతున్నరు అంటె, ఎందుకు చదువుతున్నరు? చాల సరళంగ రాస్త. మాట్లాడిన అట్లాగే మాట్లాడుత. ఐతె ఈ స్టైల్ ప్రత్యేకంగ ఏదో కొని తెచ్చుకొన్నది కాదు. ఆశించింది కాదు, అది వచ్చేసింది అంతె. దానికి కారణం రెండు మూడు కారణాలు ఒకటేందంటె, ఒకటి అధ్యాపక వృత్తిలో వుండటం వల్ల, క్లాస్ రూం టీచర్ చెప్పేటప్పుడు ఫ్యాక్ట్స్ చెప్తడు గద. క్లాస్ రూంలో టీచర్ చాల ఇన్వాల్వ్ అయి స్కూల్ నుంచి యూనివర్శిటీ లెవల్ దాక.. చాల ఇన్వాల్వ్ అయి పాఠాలు చెప్పేవాడిని. కని పాఠాలు జెప్పినపుడు అధ్యయనం జేయాలి, విశ్లేషించాలి, ఆవేశ రహితంగ జెప్పాలె. కనుక అధ్యాపక వృత్తిలో వుండటం ఒక కారణం అయి వుంటది అనుకుంటున్న.

రెండవది.. అనుభవం, ఫ్యాక్ట్స్ చెప్పేటపుడు ఆవేశ పడ్డవాల్లు ఫ్యాక్ట్స్ కమ్యూనికేట్ జేయలేకపోయిండ్రు సరిగ్గ. ఫ్యాక్ట్స్ మరుగునపడిపోయినయ్. ఆవేశమే వినపడ్డది, కనబడ్డది. రెండవది ఒక ఫ్యాక్ట్ జెప్పినపుడు భాష అనేది కన్‌స్ట్రెయింట్ కాదు అది వేరు. ఎపుడు గూడ ప్రతిబంధకం కాదు, భాష వచ్చేస్తది అది. సరళమైన భాష అయినపుడు సులభంగ రాయగలుగుతం. ఈ వాగాడంబరాలుంటయె అందులో కొన్ని ఇబ్బందులొస్తయ్. చెప్పేవి స్పష్టంగ జెప్పాలె, చాల స్పష్టంగ జెప్పాలె. ఇంగ్లిష్‌కోసం పెద్ద పదం, తెలుగు కోసం పెద్ద పెద్ద సమాసాలు జెప్పడం వల్ల కంటెంట్ దెబ్బతింటది. అదొక విశ్వాసం, ఒక అలవాటు అదొచ్చేసింది. ప్రత్యేకం స్టైల్ ఇట్ల వుండాలె అని పద్ధతి ప్రకారం ప్రయత్నం చేస్తె వచ్చింది కాదది. ఒక ప్రవాహంలో అదొచ్చేసింది అంతె.

ప్రధానంగ అధ్యాపక వృత్తి నన్ను ప్రభావితం జేసింది. తరగతి గదిలో పాఠాలు జెప్పేటివంటి దాంట్లో, నేను చెప్పే క్లాస్ రూం టీచర్‌గ నాకు మంచి పేరు వుండె. విద్యార్థుల లోపల ఖచ్చితంగ మంచి పేరే వుండె. మంచి పేరు ఎందుకు వచ్చింది అంటె వాల్లకు అర్థమయ్యే విధంగ జెప్పినం గనుక. యూనివర్శిటీ లెవల్లో ఇంగ్లిష్ మీడియం అట్లనె జెప్పిన, స్కూల్ లెవల్లో తెలుగు మీడియం అట్లనె జెప్పిన. ఉర్దూ మీడియం జెప్పినా అట్లనె జెప్పిన. ఉర్దూ మీడియం క్లాస్‌లో చాలామంది పిల్లలు నన్ను లైక్ జేసేది. ఉర్దూ.. నాది మాతృభాష ఉర్దూ గాదు. కాకపోయిన ఉర్దూ మీడియంలో చెప్తే తెలుగులో, ఇంగ్లిష్‌లో నన్ను ఎంత బాగ పిల్లలు విన్నరో, ఎంత ఆదరించిండ్రో అట్లగే ఉర్దూలో గూడ ఆదరించిండ్రు.

## నిజంగ నాకు ఉర్దే ఇప్పటికి

లిట్రేచర్ కంటె లాంగ్వేజ్ అనొచ్చు. లిట్రేచర్ అంటె షేక్స్పియర్, షెల్లీ, మిల్టన్ నేను అందులోకిబోలె. లాంగ్వేజ్ వరకు ఒకటేందంటె, ఉర్దూ మీడియం జదువుకున్న కనుక ఉర్దూ పైన నాకు చిన్నప్పటినుంచె, నాకు బాగా రంగరించి పోసింది. కని తర్వాత టచ్ పోయింది, గనక కొంత బ్రేక్ పడింది. నిజంగ నాకు ఉర్దే.. ఇప్పటికి ఎక్కువగ లైక్ జేసే లాంగ్వేజ్ ఉర్దే. నా లీజర్ టైంలో ఉర్దే చదువుకుంట. చూసినవ్ గద నాదగ్గర ఎప్పుడూ ఉర్దూ పుస్తకాలుంటయ్. ఐతె తెలుగు ఎక్కడ జదువుకోలె నేను. తెలుగు అసలు మాకు.. మా రోజుల్లో తెలుగు లేనే లేదు. ఇపుడు మీకొచ్చే సరికి సెకండ్ లాంగ్వేజ్ అని పెట్టింద్రు. అది పాస్ కావడం కంపల్సరీ. ఎవరు పట్టించుకోలెదు. ఏదో తమాషాగ వచ్చిందన్నమాట.

ఇంగ్లిష్‌కు ఏమైందంటె, ఆ రోజుల్లో ఇంగ్లిష్ మాకు ప్రైమరీ స్కూల్‌నుంచే వుండె. వుర్దూ మీడియం, ఉర్దూ ఫస్ట్ లాంగ్వేజ్, ఇంగ్లిష్ సెకండ్ లాంగ్వేజ్. ప్రైమరీ స్కూల్ నుంచె. ఐతె నేను మిడిల్ స్కూల్లో వున్నప్పుడు మా క్లాస్ టీచర్ నేనిచ్చిన గ్రూప్ ఫోటోలో ఆయన గూడ వుండాలె. ఏడో తరగతి చదువుతున్న. కింద కూసోని వున్న. (ఫోటో చూపిస్తూ)

ఈ టోపీ పెట్టుకున్నడు సూడు పి. నారాయణ రావు, ఆయన గొప్ప సంగీత విద్వాంసుడు. ఆ రోజుల్లో నిజాం దర్బార్‌లో సంగీత విద్వాంసుడుగ వుండేవాడు. హిందూస్తానీ సంగీతం. టీచర్ వృత్తిపైన ప్రేమ వుండి టీచర్‌గ వచ్చిండు. అది ఏడో తరగతిలో ఆయన నా క్లాస్ టీచర్. ఇంగ్లిష్ జెప్పేది. నాకు ఆ దశలో ఇంగ్లిష్ కొద్దో, గొప్పో నేర్చుకొనే ఆసక్తి ఆయన వల్లె కలిగింది. అంతమంచి గొప్ప టీచర్ ఆయన. మిడిల్ స్కూల్లో. తర్వాత ఏమైంది ఆయన వేసిన పునాది. పునాది అంటె ఆయన ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్‌ల్లో నిష్ణాతుడు వుండె.

ఒక సంఘటన చెప్త నీకు. ఆయన లాంగ్వేజ్ అంటె ఎంత కరెక్ట్ వుండాలని చెప్పేవాడో ఒక ఎగ్జాంపుల్ ఇస్త. ఆ రోజుల్లో క్లాస్ టైమ్ టేబుల్ ఉర్దూలో బరూకలం అని వుండె. ఐడియ వుంది గద క్యాలిగ్రాఫీ అంటరు. అపుడు నేను బరూకలంతో ఉర్దూ రాసేవాన్ని. క్లాస్ టైం టేబుల్ సాధరణంగ నేను రాసేది, ఉర్దూలో రాయించేవాడాయన. రాస్తె నేను ఏమని రాసిన, అదె మౌల్వి ఆబ్దుల్ సత్తార్ సాబ్, రియాజి, టీచర్ పేరు, సబ్జెక్టు, రియాజి అంటె మాథమెటిక్స్. ఆస్తాద్ అంటె మౌల్వి అబ్దుల్ సత్తార్ సాబ్. సేమ్ మౌల్వి

పి. నారాయణ రావ్ సాబ్ అని రాసిన నేను. నన్ను లీజర్ టైంలో బిలిపించుకొని మౌల్వీ ఎవరికి రాయాలె, శ్రీ ఎవరికి రాయాలె, మిస్టర్ ఎవరికి రాయాలె ఎక్స్‌ప్లెయిన్ జేసిండు. చెప్తున్న అంటె ఒక టైం టేబుల్ రాసినదాంట్లో చిన్న తప్పుల్ని.. దాన్ని సరిదిద్దాడు, ఊరికె దిద్దడం గాదు, చెప్పిండు. ఎక్కడ ఎందుకు రాయాలె, ఎక్కడ ఎందుకు రాయగూడదు అని.

తర్వాత గ్రామర్ జెప్పినపుడు ఆయన మాకు ఏడో తరగతిలో జెప్పిన గ్రామర్ నాకు డిగ్రీ లెవల్ దాక ఉపయోగపడ్డది. అంత రంగరించి పోసిండు ఆయన. కనుక గట్టి పునాది పడ్డది నాకు అక్కడ. ఇప్పటికి గ్రామర్ సూత్రం జెప్పమంటే జెప్పలేను. కని రాసేది కరెక్ట్ రాస్తను అటోమెటిక్‌గ. ఎందుకంటె ఆ గ్రౌండింగ్. ఆ మార్గం అట్లె పోతది, పక్కకు పోదది. దాని తర్వాత ఏం జరిగింది. ఈ ఎడ్యుకేషన్‌లో ఉర్దూ మీడియం బోయి ఇంగ్లిష్ మీడియం వచ్చింది. ఇంగ్లిష్ మీడియం వచ్చినపుడు ఇంగ్లిష్ ఇంప్రూవ్ గావాలె, చేసుకోవాలన్నపుడు ఆరోజుల్లో ఒక అలవాటు ఏందంటె, ఒక్క హిందూ పేపర్ చదవాలె. హిందూ పేపర్ ఆనాటి ఇంగ్లిష్ పేపర్ల లోపల, దేశ స్థాయి లోపల్నె ఒక్క తప్పుగూడ వుండని పత్రిక. మంచి భాష, సరె ఇపుడు ఎట్ల వున్నదో నేను జెప్పనక్కర్లేదు. ఇప్పటికీ వున్నవాటిల్లో మంచిదే కని అప్పటి స్టాండర్డ్ లేదు. హిందూ పేపర్ చదివితె ఇంగ్లిష్ భాషపైన ఒక పట్టు వస్తది. అంటె ఇంగ్లిష్ భాష అంటె లిట్రేచర్ గాదు, భాష. ఏ కాంటెక్స్ట్‌లో ఎట్ల రాయాలె అనేది.

కనుక నేను హిందూ పేపర్ చదవడం 1950లో మొదలుబెట్టిన. నాటి నుంచి నేటి వరకు హిందూ పేపర్ తప్పకుండ చదువుత నేను, ఇప్పటిదాక. మొదటి పది పదిహేను సంవత్సరాల కాలం లోపల 1950 నుంచి 60 - 65 దాక హిందూ పేపర్ నన్ను చాల ప్రభావితం జేసింది. తర్వాత నాకు దొరికిన టీచర్స్ అంత ఇంటర్‌మీడియట్‌లో గాని, డిగ్రీలో గాని మాకువున్నవాల్లు, పిల్లవాల్లల్లో నేను ఇంగ్లిష్ బాగ రాస్త, మాట్లాడుత అని నన్ను బాగ ఎంకరేజ్ జేసేది. ఇంగ్లిష్‌లో వక్తృత్వ పోటీల్లో పాల్గొనమనేది. హై స్కూల్లో వున్నప్పుడు ఉర్దూలో పాల్గొనేది. కాలేజ్ లెవల్‌కి వచ్చినంక ఇంగ్లిష్‌లో పాల్గొనేది. ఉర్దూలో వున్నపుడు నన్ను ఉర్దూ టీచర్స్ ఎంత లైక్ జేసేదో, ఎంత నాకు ట్రైనింగ్ ఇచ్చేదో, ఇక్కడికి వచ్చినంక ఇంగ్లిష్‌లో గూడ అంతే ట్రైనింగ్ ఇచ్చింద్రు వాల్లు. కనుక ఇంగ్లిష్ భాషపైన కొద్దో, గొప్పో పట్టు చిక్కిందంటె.. నాకు ప్రైమరీ స్కూల్ నుంచి ఆ

రోజుల్లో ఇంగ్లిష్ వుండె, అంటె  అంతకు ముందు లేదా అంటె.. ఒక్కొక్కరి ఇన్‌ట్రస్ట్ అది.

మిడిల్ స్కూల్లో సెవెన్త్ వచ్చే వరకు వున్న టీచర్, మా క్లాస్ టీచర్ నాకు భాషపైన వుండేటువంటి ఆసక్తి జూసి, గమనించి నన్ను చాల ఎంకరేజ్ చేస్తూ పర్సనల్‌గ చాల ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చేది. ఏదన్న రాస్తె, టైంటేబుల్ విషయం జెప్పిన్నే అట్ల ఇండివిజువల్‌గ, ఏదన్న కాంపొజిషన్ రాస్తె తప్పులు పోతె కరెక్ట్ జేసినపుడు పిలిచి జెప్పేవాల్లు. ఊరికె దిద్ది పంపిచ్చే వాల్లు కాదు, పిలిచి జెప్పేవాల్లు, మల్ల రాయించేవాల్లు. దాంతో ఒక సెంటెన్స్ ఎట్ల వుండాలె అనేది ఒక అవగాహన వచ్చింది. ఉర్దూ మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంకు షిఫ్ట్ అయినపుడు ఇంగ్లిష్ చదవాలె, నేర్చుకోవాలె అంటె ఆ రోజుల్లో వున్న పెద్ద మనుషులు హిందూ పేపర్ చదివితె మంచిది అని చెప్పిరి. హిందూ పేపర్ అప్పుడప్పుడె మొదలుపెట్టిన నేను. దానికి తోడు ఇంగ్లిష్ నేర్చుకోడం అనేది ఇంటర్‌మీడియట్‌లో, డిగ్రీలో ఇంగ్లిష్ నేర్చుకోడం అంటె ఇంగ్లిష్ సబ్జెక్ట్ వుంటది గద. కొద్దిగ క్షుణ్ణంగ జదివేవాన్ని. చదివినపుడు ఏం జేసేవాన్నంటె ఏదన్న ఇంగ్లిష్ పోయమ్ జూస్తె నాకు ఉర్దూ పోయమ్స్ ఏదన్న కంపేర్ జేయొచ్చా, అనే ఆలోచన వచ్చేది. ఇట్ల వున్నపుడు అప్పుడప్పుడు డిబేట్స్‌లో అందులో మాట్లాడినపుడు నేను చెప్పేవాన్ని. అప్పటికి సమస్య ఏమొచ్చేదంటె, చాల మంది ఇంగ్లిష్ టీచర్స్ ఆంధ్రనుంచి వచ్చేది. వాల్లకి ఈ ఉర్దూ వచ్చేది గాదు. కొంత మంది ఉర్దూ వచ్చినోల్లు వుంటె వాల్లు నన్ను బాగ ఎంకరేజ్ జేసేది. బాగ  ఎంకరేజ్ జేసెవాల్లు.

# నన్ను నేనే ఎడ్యుకేట్ జేసుకొని..

ఇగ తెలుగు ఎట్ల వచ్చింది అంటె, కేవలం స్వయం కృషే. స్వయం కృషి అంటె ఎట్ల అంటె చదువు ఉర్దూలో మొదలైంది, ఇంగ్లిష్‌లో ఖతం అయింది. పంతులుగారు తెలుగు జెప్పమన్నరు. నేను ఛాలెంజ్‌గ తీసుకున్న దాన్ని. ఛాలెంజ్‌లో తెలుగు లాంగ్వేజ్ జెప్త అని దీసుకున్న. తెలుగు మీడియం గాదు, తెలుగు లాంగ్వేజ్ జెప్త అని దీసుకున్న హైస్కూల్ లోపల. దాని కొరకు ఏం జేసేవాన్ని నేను. నేను ముందు ఆ పుస్తకాన్ని జదివి తెలుగు పండితులతో కూర్చుని, టీకా తాత్పర్యాలు రాయించుకొని, నేను తెలుగు బాగ నేర్చుకొని వాల్లకు తెలుగులో జెప్పేవాన్ని. అంటె ఏం జరిగింది అంటె తెలుగు భాషా పండితులు జెప్పిన దాంతో నాకు అంతె ఆదరణ దొరికింది. అంటే నేను జెప్పడంవల్ల సరళత వుండేది. పండితులు జెప్పేదాంట్లో సరళత తక్కువ వుండేది. అపుడు వారి భాషా, వ్యాకరణం, గ్రాంథికం. నేను సరళమైనటువంటి శైలిలో చెప్తుంటే తెలుగు టీచర్‌గ మంచి పేరు వచ్చింది. దాంతో తెలుగు చదవడం మొదలుపెట్టిన. కొంత క్లాసికల్ లిట్రేచర్, కొంత గ్రామర్ చదివిన. మోడ్రన్ లిట్రేచర్ జదివిన. చదువు జెప్తూ పోయిన.

ఇంట్లో మాతృభాష తెలుగు గావడంజేత, ఇంకోటి ఇంట్లో మాతృభాష. మా నాయనకు తెలుగు, సంస్కృతంలలో మంచి అధికారం వుండె. ఇంట్లో తెలుగె. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడేది. అప్పటికి ఇప్పటికి తేడా ఏందంటె నేను జెప్తున్న! ఆ రోజుల్లో ఇంట్లో అమ్మను అమ్మ అని పిలిచేది, నాయనను నాయన అనేది. నాన్న అనేవాల్లు గాదు, నాయన. ఇపుడు మమ్మీ, డాడీ వచ్చింది. మరి ఉర్దూ మీడియంలో మేం గూడ అమ్మీజాన్, అబ్బాజాన్ అనొచ్చు గద, అన్లే. చెప్తున్న, ఆరోజుల్లో ఇంట్ల ఎవరు గూడ అట్ల పిలవలేదు.

ఈ రోజుల్లో మమ్మీ, డాడీ అంటున్నరు, పిలిపించుకోవడం ఇష్టం వుంటది, అదొక కల్చర్ వచ్చేసింది. ఎందుకు జెప్తున్న అంటె, ఆ వాతావరణం డొమెస్టిక్ వాతావరణం అచ్చ తెనుగుగ వుండె. ఇగ పోతె ఇంటి విషయాలు ఏమన్న రాయాలన్న, జేయాలన్న తెలుగులో రాసేవాల్లం. ఇంట్లో మా ఫాదర్.. అక్షరాభ్యాసన తెలుగుల్నె అయింది.

స్కూలు, కాలేజ్‌ల జదువుకొనే అవకాశం రాలేదు గనుక, విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు తెలుగు భాష మీద.. తెలుగు భాషలో మాట్లాడాలంటె ధైర్యం సరిపోయేది గాదు. రాయాలంటె ఏదో కష్టపడుతూ రాసేవాల్లం. ఒక పట్టుదలతో తెలుగును నేను స్కూల్ టీచర్‌గ వున్న రోజుల లోపల్నే తెలుగు మీడియం టీచింగ్ గద. అన్ని సబ్జెక్టులు తెలుగు

మీడియమే. తెలుగు మీడియంతో పాటు, నేను తెలుగు జెప్పిన. ఇంగ్లిష్ జెప్పిన. సోషల్, సైన్స్ జెప్పిన. కని తెలుగు లాంగ్వేజ్ కంపల్సరీగ జెప్పిన. ఎందుకు జెప్పిన అంటె నేర్చుకొనే అవకాశం నాకొస్తది అని. ఐతె పిల్లలకు చదువు జెప్పడానికి ఆ పుస్తకాలు నేను ముందు జదువుకొని.. ఇంకోరితో జెప్పించుకొనేది. అంటె నన్ను నేనే ఎడ్యుకేట్ జేసుకొని పిల్లలకు జెప్పేది.

# ఉర్దూ - ఇంగ్లిష్ - తెలుగు

అంతవరకు ఉర్దూ భాషపైన కొంత పట్టు వుంది, ఇంగ్లిష్ నేర్చుకున్న గనక ఒక భాషపైన పట్టొస్తె, ఇంకో భాషపైన పట్టు ఈజీగ వస్తది అని అనుకొంటున్న నేను. ఇపుడు నాకు ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లిష్ నాలుగు భాషల లోపల.. హిందీ రాయడం అంత సులభం గాదు గాని మాట్లాడుత. లిపి అంత పట్టు రాలేదు. నేను రాయగలిగింది, స్పష్టంగ రాయగలిగింది మూడు ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు. ఐతె ఒక్కొక్క భాషలో వ్యాకరణం ఒక తీరుగ వుంటది.  నేను దాన్ని చాల క్షుణ్ణంగ స్టడీ జేసిన. అంటె వాక్య నిర్మాణం. వాక్య నిర్మాణమే గాకుండ గ్రామర్‌లో చాల తేడా వుంటది.

ఇపుడు ఎగ్జాంపుల్ ఉర్దూలో స్త్రీ లింగం, పుంలింగం గురించి వున్నటువంటి ఒక వైవిధ్యం ఇతర భాషల్లో లేదు. ఏ మేరీ కితాబ్, కితాబ్ అంటె పుస్తకం. మేరీ. ఇంటికొస్తె ఏ మేరా మకాన్ హై. మకాన్ అంటె ఇల్లు. ఇల్లు ఒక వస్తువే, పుస్తకం ఒక వస్తువె. మకాన్‌కు మేరా స్త్రీలింగం అయితది, మేరా అంటె అర్థం.. మేరా అంటె పుంలింగం అయితది, మేరీ అంటె స్త్రీ లింగం అయితది. లింగం వస్తువుకు, పుస్తకం స్త్రీ లింగం అవుతుంది ఉర్దూలో. మకాన్ పుంలింగం అవుతుంది కనుక దానికి మేరా, మేరీ అవుతుంది. ఈ వ్యత్యాసం మిగతా భాషల్లో లేదు. ఇందులో అంటె దాన్ని బట్టుకొని భాషలో వుండెటువంటి ఆ ఎంటిటీస్ అంటె ఒక్కొక్క సందర్భంలో ఎట్ల బోతం మనం. ఇపుడు అట్లగె ఉర్దూ భాషలో ఉర్దూ పోయెట్రీలో వున్నటువంటి విశేషం ఏమంటె జంబ్లింగ్ స్టాంజాస్ అని వుంటయ్ జనరల్‌గ. ప్రతి రెండో స్టాంజాలో అపారమైనటువంటి మీనింగ్ వుంటది. ప్రతి రెండో స్టాంజాలో లేదా నాలుగో స్టాంజాలో. జనరల్‌గ రెండో స్టాంజాలో. రెండే లైన్స్ వుంటయ్, రెండో దాంట్లో సారాంశం అంతా వచ్చేస్తది. ఎంత సారాంశం వస్తది అంటె ఇది దాంట్లో ఉర్దూలో ఒక సామెత వుంది. దరియా కో కూజే మే బంద్ కర్నా అంటరు. దరియా అంటె నదిని తీసుకొచ్చి చిన్న పాత్రలో బంద్ జేయడమన్న మాట. అంత భావం వుంటది. ఐతె ఏంటంటె అది జూసినపుడు ఇతర భాషల్లో సాధ్యమ వుతదా? ఇతర భాషల్లో సాధ్యం కాదు. అంత దాన్నేమంటె బ్రివిటి అంత సంక్షిప్తంగ రెండే స్టాంజాస్ లోపల ఎంత ఫిలాసఫీ, ఎంత సారాంశాన్ని, పెద్ద విషయాన్ని జెప్పటం అన్నటువంటి అది ఉర్దూలో వున్నటువంటి ఒక వెసులుబాటు. అట్లగె ఉర్దూ భాష, ఆరే షన్‌కు రాదు. ఆ ఎఫెక్ట్ ఇతర భాషల్లో రాదు. ఎందుకు రాదు? అధ్యయనం జేస్తం గద.

చెప్తున్న. రాదు అది వేరే విషయం, ఎందుకు రాదు అన్నది అధ్యయనం జేస్తం గద. అట్లగె తెలుగులో వున్న కొన్ని ప్రత్యేకతలు ఇతర భాషల్లో రాదు.

నా దృష్టిలో ఏందంటె ఉర్దూ భాషలో వున్నన్ని స్వరాలు తెలుగులో, ఇంగ్లిష్‌లో లేవు. ఆ సౌండ్‌తో అర్థం మారిపోతది. ఎఫెక్ట్ మారిపోయి ఇన్‌ఫాసిజమ్ మారి పోతది. ఎగ్జాంపుల్ ఇస్త నేను. హ తెలుగుల లేదు, రా తెలుగుల లేదు, ఫా తెలుగుల లేదు, తెలుగుల లేదు, అది జబర్దస్తీ పెడతరు. హ ఎట్ల రాస్తవ్ జెప్పు. ... ఏవో గుర్తులు బెట్టి, అంతకు తప్పి ఎవడు జదవడు దాన్ని. ఫా, హా, రా తెలుగులో లేవు. ఉర్దూలో వున్నయ్. ఇగ స్వరాల్ని బట్టి, సందర్భాన్ని బట్టి, ఆ ఎంఫసిస్ వస్తది. ఎందుకు జెపుతున్న అంటె ఈ మూడు భాషల గురించి అధ్యయనం జేసినపుడు, ఒక భాషకు, ఇంకో భాషకు వున్నటువంటి వాక్యనిర్మాణంలో గాని, వ్యాకరణంలో గాని ఇతర విషయాల్లో ఏమిటి వ్యత్యాసాలు, ఎందుకున్నయ్ అని తెలుసుకునే ఆసక్తి కలిగింది. ఆసక్తి ఎట్ల పోతది. ఆ పండితులతో కూర్చోవాలి.

ఈ మూడు భాషల పండితులతో కూచోని నేను వాల్లు.. చాల ఆప్యాయతతో, ఎంతో.. నా కంటె చిన్నవాల్ల దగ్గర కూచున్నా, వాల్లందరు చాలా ఆప్యాయతతో, నా కంటె పెద్ద వాల్ల దగ్గర కూచున్న నేర్చుకొనే ఉద్దేశంతో. కనుక నేర్చుకోవాలె అనేటువంటి కుతూహలంతో వున్నప్పుడు ఎదుటి వాడు సమర్థుడైతె జాలు. చిన్నోడా, పెద్దోడా నేను హిందీలో.. నేను వైస్‌ఛాన్సలర్‌గ హిందీలో ఒక సందర్భంలో ఉపన్యాసం ఇవ్వాల్సి వచ్చింది. కొన్ని పదాల మీద డౌట్ వచ్చింది నాకు. ఒక స్కూలు టీచర్‌ని పిలిపించుకొని నేర్చుకున్న. చెప్తున్న. నేర్చుకోవాలి అన్నప్పుడు పండితుడా, కాదా చెప్పేవాడు కావాలె. కనక ఇదో పెద్ద అధికార ముంది భాష మీద అని జెప్పను గాని, మూడు భాషల్లో అధ్యయనం జేసిన. ఒక్క దృక్కోణం గాదు, అనేక దృక్కోణాలతో అధ్యయనం జేసిన. కొద్దో గొప్పో మాట్లాడగలుతున్న, రాయగలుగుతున్న.

ఏ భాష ఇంకో భాష కంటె తక్కువ గాదు, ఎక్కువ గాదు. ఉర్దూలో వున్నటువంటి కొన్ని వెసులుబాట్లు, ఇతర భాషల్లో లేవు. ఇతర భాషల్లో వున్నయ్ ఉర్దూలో లేవు. ఇపుడు ఫర్ ఇన్స్‌టెన్స్ తెలుగు అజంత భాష. ఉర్దూ కాదు. అజంత భాష గావడం చేత సెంటెన్సెస్ అచ్చుతో ఎండ్ అయితయ్. హల్లుతో ఎండయితె కట్నా వుంటది. ఫర్ ఇన్స్‌టెన్స్ ప్రసాద్ అది హలంతం. తెలుగులో ప్రసాదు అయితది. అయితె తెలుగుని ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అని ఎందుకంటరు, అంటె అచ్చుతో అంతం అయితది ప్రతి పదం. మన

సంస్కృతం గూడ అజంతం గాదు. అచ్చుతో అంతమయ్యే ప్రత్యేకత తెలుగుకె తప్ప ఇతర భాషల్లో లేదు. దాంతో భాషలో కొంత మార్దవం, కొంత మృదుత్వం అదొస్తది.

ఇంగ్లిష్‌కు బోతె దాని అల్ఫాబెట్ 26 అక్షరాలే. తెలుగులో 56 వున్నయ్, ఉర్దూలో ఇంకెక్కువ (35)వున్నయ్ గాని, ఇదైతె 26 అక్షరాలే. మొత్తం ప్రపంచాన్నే తిప్పి కొట్టింది. ఆ ప్రత్యేకత ఇంగ్లిష్‌లో తప్ప ఇంక వేరే భాషలో లేదు. కనుక ప్రతి భాషకు ఒక ప్రత్యేకత వుంటది. ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని గాదు. మనం వాడుకోవటంపైన వుంటది. మన అండర్‌స్టాండింగ్ పైన వుంటది. ఐతె ప్రతి భాషకు ఒక ప్రత్యేకత వుంటది, కని అన్ని భాషలు గూడ వున్నతమైనవె. వాటిని మనం సరిగ అర్థం చేసుకున్నామా, లేదా, వాటి గురించి సరిగ అధ్యయనం జేసుకున్నామా అంటె మన జ్ఞానాన్ని బట్టి మన అనుభవాన్ని బట్టి వుంటది. ఇపుడు, లిపి లేని భాషలు గూడ చాలా వుంటయ్. చాల మృదువుగ వుంటయ్ అని చెప్తరు మరి. అది అర్థం గాదు. నేను అప్పుడప్పుడు నార్తీస్ట్‌కు బోయినపుడు వినడానికి చాల సొంపుగ అనిపిస్తయ్, అర్థంగావు.

ఇపుడు ఉర్దూకొస్తె ఒక ఎగ్జాంపుల్ ఇస్త నేను. గాలీబ్ అనే కవి, చాల గొప్ప కవి. గాలీబ్ తాగేవాడు. కని గొప్ప సూఫీ గద. తాగుడు వ్యసనం అని తెలుసు. ఆయనొక గొప్ప కప్లెట్ రాసిండు ....తుమ్ వలీ సమజ్‌తె ... అంటె నీ సూఫీ తత్వ విచారము, నీ ప్రవచన వైఖరి ఎంత బాగుందంటె నువ్వు తాగక పోతె నిన్ను యోగీశ్వరుడు అనేవాల్లని రాసుకున్నడు. తాగకపోతె, బాదాఖార్ బాదా అంటె మధు, ఖార్ అంటె మధుపానం జేసెవాడు. బాదాఖార్ అనే పదం. గాలీబ్‌ను అనేక భాషల్లోకి ట్రాన్స్‌లెట్ జేసింద్రు. ఇంగ్లిష్‌లో గొప్ప గొప్ప వాల్లు ట్రాన్స్‌లేట్ జేసింద్రు. బాదాఖార్ అనే పదానికి చాలా మంది డ్రంకర్డ్ అని ట్రాన్స్‌లేట్ జేసింద్రు. బాదాఖార్‌కు సమానపదం దొరకదు. డ్రంకర్డ్ అనే పదానికి సమానమైన పదాన్ని తీసుకోవలసివస్తే....

అంటె ఆ ప్రవచన వైఖరి అందాజె బయాన్ అంటరు. ఆ ప్రవచన వైఖరిని అన్న ప్పుడు ఆ పదాల యొక్క లాస్యం 'బాదాఖార్' యొక్క లాస్యం మీకు ఉర్దూలో తప్ప ఇతర భాషల్లో దొరకదు. కనుక ఆ దృక్కోణంతో స్టడీ జేసినమన్నమాట. అట్లగె పాతతరంలొ ఇక్బాల్.. నేను బాగ ఇక్బాల్, గాలీబ్‌లను ఇష్టపడత. ఆధునికుల లోపల సాహిర్ లుధ్యాన్వీ. లీజర్‌టైంలో ఉర్దే ఎక్కువ చదువుత ఇప్పటికి. చదివిందె చదువుతుంట. చదవటం వల్ల కొత్త ఇంటర్‌ప్రెటేషన్స్ వస్తుంటయ్. ఐడియాస్ వస్తుంటయ్. ఒక పదం యొక్క ప్రయోగంతోని దాన్ని తెలుగులో అనువాదం జెసిండు దాశరథి, ఇదే నేను జెప్పిందాన్ని.

నీ సూఫీతత్వ విచారము, నీ ప్రవచన వైఖరి యోగి అన్న నిన్ను తాగకుండెనా. తాగకుండె అంటె తాగకపోతె అని అర్థం. ఇక్కడ బాదాఖార్ అనే పదం రాదు. ఎంతన్న ప్రయత్నం జేయి ఆ పదం రాదు. ఆ అర్థం, ఆ లాలిత్యం, ఆ లాస్యం రాదు. కని చెప్పదలుచుకున్న పాయింట్ ఏందంటె చదివినపుడు చదివి, దాని సారాంశాన్ని తీసుకోవడం ఒక ఎత్తు. ఒక్కొక్క పద ప్రయోగం ఎందుకు జరిగింది? దీనికి బదులు ప్రత్యామ్నాయ పదాలు లేవా? ఇవే పదాలు ఇతర భాషల్లో ఎట్ల వుంటయ్ అనే దృక్కోణంతో గూడ చదివితె కొంత అవగాహన పెరుగుద్ది. నేను చాలా కాలం ఆ దృక్కోణంతో చదివిన. అంతమాత్రాన పండితున్ని కాను. పండితున్ని అని జెప్పను, చదువుకున్న అంతె.

ఉర్దూ అంటె వాల్లు చదివిన సాహిత్యాన్ని బట్టి వుంటుంది. ఉర్దూలో రకరకాల సాహిత్యాలున్నయ్ గద. ఉర్దూలోపల చాలా సీరియస్ సాహిత్యం చదివిన వాల్లందరు చాలా సోబర్‌గ వుంటరు. సీరియస్ సాహిత్యం చదవటం.. ఊర్కె పైపైన చదివిన వాల్లల్లో ఆ పాలిష్ రాదు. ఇపుడు మాకు హైస్కూల్లో ఉర్దూ జెప్పిన టీచర్స్ ఈ రోజు యూనివర్శిటీ ప్రొఫెసర్ కంటె గొప్పోల్లు. అట్ల జెప్పేది వాల్లు. అది.. ఒక భాష ఎట్ల నేర్చుకున్నామనేది ముఖ్యం. భాష అందరు నేర్చుకుంటరు. అందరు ఇంగ్లిష్ మాట్లాడతరు, తెలుగు మాట్లాడతరు. ఎట్ల నేర్చుకున్నవ్, ఆ నేర్పించిన దశలోపల మన టీచర్స్, ఎట్ల నేను ఇప్పటికి చెప్తున్న. ఒక భాషపైన పట్టొస్తె ఇంకో భాషపైన పట్టు ఈజీగ వస్తది. నాకు మొట్టమొదలు పట్టొచ్చింది ఉర్దూ భాషపైన. అది రావడానికి మా టీచర్స్ కారణం. హైస్కూల్ టీచర్స్.

గజల్‌లో రకరకాలుంటయ్ గద. భక్తిరసం వున్నయ్, శృంగార రసం వున్నయ్, వేదాంతం వున్నయ్ రకరకాలుగ వున్నయ్. ఉర్దూయె గాదు వెంకట్! ఏ భాషైన గాని సీరియస్ చదువుకున్న వాల్లు సోబర్‌గనె వుంటరు. సీరియస్‌గ చదివిన వాల్లు. బయాన్తోని, ఫ్యాషన్‌కు చదివిన వాల్లల్లో అది వుండదు.

# కాళోజి! ఉద్యమాలల్లో నాకు గురువు

కాళోజి ఒక విధంగ ఉద్యమాలల్లో ఆయనే నాకు గురువు. స్టూడెంట్ లైఫ్ నుంచి దాదాపు ఆయన్ను ఉద్యమాలల్లో చిన్నప్పుడు చూసిన, పెద్దయినంక ఆయనతోని కలిసి పనిజేసిన తెలంగాణ ఉద్యమం దాక. నిజాం వ్యతిరేక పోరాటం రోజుల్నుంచి ఆయన చనిపోయే వరకు ఏ ఉద్యమాల్లో అయినా ఒక కార్యకర్తగ ఆయనతోని పాల్గొన్న. ఆ విధంగా ఉద్యమ స్ఫూర్తి నాలో నాటింది కాళోజి గారే.

ఆయన స్టైల్, నా స్టైల్స్ ఒకటి గావు. కని ఉద్యమ స్పిరిట్, ఆయనలో వున్న ఫైటింగ్ స్పిరిట్, టోటల్లీ హానెస్ట్. అరమరికల్లేని ఉద్యమ జీవి ఆయన. నాకు, ఆయనకు జరిగిన సంభాషణలు చెప్త విను! ఎట్ల వుంటది అనేది. నిర్మొహమాటంగ చెప్తడాయన ఏదున్న. తెలంగాణ ఉద్యమం గురించి 1968-69లో ఇట్లనె అన్ని సెమినార్‌లు పెట్టేది, పేపర్లు రాసేది, లెక్కలు జేసేది. ఈ లెక్కలు ఎంత కాలం జెప్తరయ్యా ఇంక ఎల్ల గొట్టాలె, ఈ పంచాయితీ, ఇది ఎవడికి గావాల్నయ్య ఈ లెక్కలు? ఎల్లగొట్టాలె అనేవాడు. అంటె ఏందంటె ఆయన జెప్పింది కరెక్టే అనిపిస్తాంది మరి. ఈ లెక్కలు ఎవడికి గావాలె. అయినంక మల్ల 1996-97 మల్ల గదె మొదలయ్యింది. జయశంకర్..! ఈ చిత్రగుప్తుని లెక్కలు వద్దయ్య. యమధర్మరాజు గావాలె, చెప్తున్న చిత్రగుప్తుడు లెక్కలు జెప్పందె యమధర్మరాజు ఏం జేస్తడు సార్..! అని నేను (నవ్వు) చిత్రగుప్తుడు లెక్కలు దీయాల గద సార్ అంటె, అంటె నవ్వేది. అంటె స్టైల్ చెప్తున్న.

ఇపుడు 'తెలంగాణలో ఏం జరుగుతోంది' అని ఫస్ట్ పుస్తకం గురించి అన్నవు గద. ఆ పుస్తకం ఏందంటె మల్లేపల్లి లక్ష్మయ్య ప్రింట్ జేయించిండు అని జెప్తి గద. ఆ రోజు ఉపన్యాసం గోదావరిఖనిలో అయిపోయింది. తర్వాత ఫార్మల్‌గ బుక్ రిలీజ్ జేయాలి అంటె అశోకా టాకీస్‌లో పెద్ద ఫంక్షన్ బెట్టినం. కాళోజి రిలీజ్ జేయాలె. రిలీజప్పుడు పక్కన నేను గూర్చున్న, పక్కన గద్దరుండె, ఇంక ఎవరెవరో వుండిరి. ఆ పుస్తకం టైటిల్ ఆయనకు నచ్చలె. 'తెలంగాణలో ఏం జరుగుతోంది' అని వుంది. టైటిల్ నేను బెట్టలె. నేను టెక్స్ట్ రాసిచ్చినంక.. లక్ష్మయ్య ఏం టైటిల్ సార్ అంటె, నీకు దోచింది బెట్టుకోవయ్యా అని నేను అన్న. అంతకు ముందు 'కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది' అని బాలగోపాల్ పుస్తకం వుంది. అట్లాగే దీనికి పెట్టుకున్నరు. అయితె ఆయనకు నచ్చలె. తెలంగాణ మీద రాసినపుడు తెలంగాణ టైటిల్ వుండాలె గద. ఆయన ఏమి అన్నె. ఒక చిన్నమాట జయశంకర్! 'ఏం

జరుగుతాంది' అన్నడు అంతె. ఇంకేం అన్లె. (పెద్దనవ్వు) ఆయనేమన్నడో నాకర్థం అయిపోయె. అంటె ఒకవేళ టైటిల్ నేను పెట్టివుంటే, పుస్తకం నువ్వే రాసినవా మొత్తం అంటడు. ఇగో ఆయన తత్వం అదన్నమాట. ఆయనకు నచ్చకుంటె అంత నిర్మొహ మాటంగ జెప్తడు. ఆయన నిర్మొహమాటతనానికి నేను రెండు మూడు ఎగ్జాంపుల్స్ ఇస్త. చాల గొప్పయి. గొప్ప ఎక్స్‌పీరియెన్సెస్. లైఫ్‌లో ఒక మనిషి ఎంత నిర్మొహమాటంగ వుండగలుగుతడు అనే దానికి ఒక రేర్ ఎగ్జాంపుల్ ఆయన. కొన్ని నేను పర్సనల్‌గ చూసినటువంటి, విన్నటువంటి ఎగ్జాంపుల్స్ చెప్తా.

నేను ఇక్కడ కాకతీయలో పనిజేస్తున్నప్పుడు పి.వి. నరసింహారావు ప్రైమ్ మినిస్టర్ వుండె. ఆయనతో మాట్లాడాలంటె ఆ రోజుల్లో ఈ ఎస్టీడీలు లేవు గద, వుండె కని ఇంత సౌకర్యం లేదు గద. అక్కడ విసి లాడ్జ్‌కొస్తే అక్కడ కూర్చొని పి.ఎకి కలిపిస్తె ఆయన్ది లైన్ కలిసింది. ఇచ్చిండు(ఫోన్). ఈయన, ఆయనతోని ఫోన్ కలవంగనె ఏదో ఫ్రెండ్స్ మాట్లాడుకుంటరు గద అని లోపలికి పోతున్న. ఎక్కడ బోతవ్ కూర్చోవయ్యా అన్నడు, కూర్చున్న. సంభాషణ ఏదో జరిగింది. తర్వాత ఆయనే చెప్పిండు, సంభాషణ ఏందంటె అప్పుడెదో రష్యా ఇంటర్నేషనల్‌గ క్రైసిస్‌లో వుండె. రష్యా ప్రధాని ఇట్ల అంటున్నడు, అమెరికా ప్రెసిడెంట్ ఇట్ల అంటున్నడు, బ్రిటన్ వాడు ఇట్ల అంటున్నడు. మరి నువ్వేం అంటల్లేవు. ఏమంటవు! అంటె ఆయనన్నడట కంచు మోగినట్టు కనకంబు మోగునా అని ఆయన అన్నడట. ఈయన జవాబు అది కంచో, కనకమో మోగితె గద తెలిసేది అన్నడట. ప్రైమ్ మినిస్టర్‌తోని. ఎంత స్నేహితుడైన దేశానికి ప్రధానమంత్రే గద. ఇగ నాకు జెప్పిండు గిట్ల గిట్ల అయ్యింది అని.

అది అయ్యిందా.. పి.వి. నరసింహారావు ప్రైమ్ మినిస్టర్ షిప్ అయ్యిందని ఆయనకేదో సన్మానం బెట్టింద్రు హైదరాబాద్‌ల. ఏదో అప్పాజోశ్యుల విష్ణుభోట్ల, అజోవిభో అదేదో లబో దిబో సంఘమంటరు. దాని సన్మానం పి.వి నరసింహారావుకు. అంటె కాళోజి ఎప్పుడు బోయినా హైదరాబాద్‌కు నా కార్లే బ్రహ్మంని దీసుకొని బోయేటోడు. ఇగ పి.వి. సన్మానం గనక నేను గూడ బోయిన. అందరు ఇగ సి. నారాయణరెడ్డి ఏదో పెద్ద పెద్దోల్లందరు చాల మంది మాట్లాడింద్రు. కాళోజి లాస్ట్‌కు మాట్లాడిండు. కాళోజి ఒక్క నిమిషమె మాట్లాడిండు. ఎక్కువ మాట్లాడలె. కాళోజి అన్న రామేశ్వరరావు అని వుండె. రామేశ్వరరావు హిందీ, ఉర్దూలో గొప్ప పండితుడాయన. ఆయన తనకు తెలిసిన వాల్లందరి గురించి కప్లెట్స్ రాసిండు హిందీలో. పి.వి. గురించి ఒక కప్లెట్ రాసిండన్నమాట ఎవరు.. రామేశ్వరరావు.

'సప్న కమ్ కిస్ కె కమాయా'. స్వప్నమనేది ఎవనికి ఎప్పుడు ఉపయోగపడతది అనేది. 'పి.వి ఏక్ సుందర్ సప్నా హై' అని రాసిండు రామేశ్వరరావు. ఈయన పి.వి మాకు సన్నిహితుడు, పివి గురించి మా అన్న ఒక కప్లెట్ రాసిండు. అంతకంటె నేను ఎక్కువ జెప్పేది ఏముండదు. ఆయన హిందీలో రాసిండు నేను తెలుగులో అనువాదం జెప్త అని తెలుగులో జెప్పిండు. 'స్వప్నం ఎప్పుడు ఎవనికి ఉపయోగపడ్డది, పి.వి ఒక సుందర స్వప్నం'. పబ్లిక్ మీటింగుల పి.వి ముఖం మీద. అందరు నవ్విండ్రు, పి.వి. గూడ నవ్విండు. ఎందుకు జెప్తున్న అంటె ఆయన జయశంకర్‌తో ఏం జరుగుతాంది అన్నా? ప్రైమ్ మినిస్టర్‌తో అట్ల మాట్లాడినా? ఏం తేడా వుండదు, అది గొప్పతనం.

చాల నిర్మొహమాటంగ, చాల హానెస్ట్‌గ. కనుక ఆ క్యారెక్టర్ అంటె ఉద్యమాలతో పాటు, ఒక నిబద్ధత అంటె పెద్దోడు, చిన్నోడు అని గాదు. నిజం నీకు తోచినట్టు స్పష్టంగ చెప్పాలె. నిర్మొహమాటంగ చెప్పాలె అనేది ఒక గుణం. కనుకనె కాళోజీలో వున్నటువంటి ప్రత్యేకతలల్లో అదొకటన్నమాట. కంప్లీట్లీ నిస్వార్థమైన మనిషి ఆయన. ఏమీ స్వార్థం లేదు ఆయనకు. ఏనాడు ఏదీ లేదు. పోతె ఎవ్వరిని స్పేర్ జేయడు. తప్పు జేసినవాన్ని స్పేర్ జేయడు. ముఖం మీద అనేస్తడు.

ఇపుడు ఆయన చనిపోయె ముందు, కాలు విరిగింది కద. విరిగితె కలెక్టర్ వచ్చిండు, నువ్వెందుకొచ్చినవయ్య అన్నడట. నేను కలెక్టర్‌గ రాలేదు, మీ అభిమానిగ వచ్చిన అన్నడట. అదే సందర్భంలో నేను జ్వరంతో బోయిన, ఆ రోజు దసరా పండగ. దసరా ములాఖత్‌కు వచ్చినావయ్య అని నన్ను అన్నడు, చెప్తున్న (నవ్వు). సరె ఇక్కడి నుంచి తీసుకుని పోతె హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యిండు, ఇగ దగ్గరికి వస్తుంటె. ఇగ చివరికి రెండు రోజుల్లో పోతడు అనంగ లెవంత్ నవంబర్ కేమో కాళోజి రామేశ్వరరావు బర్త్‌డే, ఫస్ట్ నవంబర్‌కేమో ఆంధ్రప్రదేశ్ ఫార్మేషన్‌కి వ్యతిరేకి. ఈయన థర్టీన్త్ నవంబర్ రోజున చనిపోయిండు. నేను ట్వల్త్ నవంబర్ రోజు బ్రహ్మంను దీసుకుని బోయిన. చాల సార్లు బోయిన గాని ఆ రోజు బోయిన లాస్ట్. ఆయన ఇంటెన్సివ్ కేర్‌లో వుంటె బ్రహ్మం బయటనె వున్నడు నేను లోపలికి బోయిన. ఆయన ఫస్ట్ నవంబర్‌కు ఏవన్న జేసిండ్రా అన్నడు. తెల్లారి చనిపోతున్నడు. ఎప్పటి మాదిరిగనె జేసినం సార్! అంటె రామేశ్వరరావు బర్త్‌డె జ్ఞాపకం వున్నదా అన్నడు. నిన్న జేసినం సార్ అన్న. నీతో బ్రహ్మం రాలేదా అన్నడు. చెప్తున్న ఎక్కడి నుంచి ఎక్కడికి అంటె బ్రహ్మం అంటె చాల ఎటాచ్‌మెంట్ వుండె. ఎప్పుడూ కార్లో దీసుకుని బోయేది. లోపలికి ఎందుకు రాలేదు అంటె మీరు

ఇంటెన్సివ్‌లో, డాక్టర్లు వున్నరంటె.. డాక్టరును బిలిపిచ్చి ఏందయ్య! సచ్చేటోడికి ఇన్ని ఇబ్బందులు పెడతరా మీరు. ఇన్ని ఇబ్బందులు పెడతరా సావటానికి అన్నడు. బ్రహ్మంను పిలిపిచ్చిండు. అంటె వాటీజ్ బ్రహ్మం. ఆయన రెండు నిమిషాల్లోపల ఫస్ట్ నవంబర్ ప్రొటెస్ట్ జేసింద్రా లేదా, రామేశ్వరరావు బర్త్‌డె జేసింద్రా లేదా, బ్రహ్మం దాక వచ్చి మాట్లాడిండు. ఇంకో 26 గంటలకు పోతడు అనంగ. ఆ మనిషియొక్క నిబద్ధత, మనుషుల పట్ల విలువ, కాళోజి రామేశ్వరరావు, బ్రహ్మం మధ్యలో ఎంత పెద్ద గ్యాప్ వుంది. కని ఆయనకు తేడా లేదు.

చిన్నప్పటి నుంచి అంతె ఆయన. ఆయన అట్ల ఎదగడానికి కారణం వాళ్ల అన్న రామేశ్వరరావు. రామేశ్వరరావు పోషణ వల్లనె. ఆయన అప్పుడపుడు చెప్పేది రామేశ్వరరావు ఏడేండ్ల పిల్లవాడప్పుడు వీళ్లిద్దరికి ఏడేండ్ల తేడా వుండేదట. చిన్నోడని భుజాల మీద ఎత్తుకునేవాడట రామేశ్వరరావు గారు. ఆయన ఏడో ఏట భుజాలెక్కిన.. ఇంక ఈ రోజుకి దిగలేదు అన్నడు కాళోజి. 90 ఏండ్లు ఆయనకి ఇంక దిగుతలేడట(పెద్దనవ్వు) అంటె చెప్పే పద్ధతి.

# లైఫంత సాహిత్య సేవ జేసిండు

సదాశివగారంటె  నాకు చాల గౌరవం, అభిమానం. అంతకంటె ఉర్దూ భాష యొక్క ప్రత్యేకతను తెలుగు ప్రపంచానికి అందించిన వాల్లల్లో టాప్ మనిషి. పోషణ లేక అదయింది కని, నా దృష్టిలో బూర్గుల రామకృష్ణారావు, దాశరథి కృష్ణమాచార్య, వాల్లు గొప్ప సేవజేసింగ్రు. కని వాల్ల కంటె ఎక్కువ సేవ జేసిండు ఈయన సదాశివగారు. పోతె అటు ఉర్దూ,తెలుగు, హిందీ, సంస్కృతం పైన అపారమైన పట్టువుంది. ఆయన ప్రత్యేకత ఏందంటె ఉర్దూ సాహిత్యాన్ని తెలుగు ప్రపంచానికి అందించిండు. పోతె ఎప్పుడు ఏ పారితోషికాలు, ఏ సన్మానాలు ఆశించిన మనిషి గాదు. లైఫంత సాహిత్య సేవ జేసిండు, లైఫంత.

తెలంగాణ ప్రాంతంలో నిజంగ బహుభాషా ప్రవీణుల లెక్క దీస్తె, ఉన్న ఐదారుగురుల్లో ఆయన మొదటి వ్యక్తి. లాస్ట్ వన్ సెంచరీ చరిత్ర దీస్తె, ఉన్న ఐదారుగురుల్లో ఆయన స్థానం చాలా పైన వుంటది. నాకు గూడ ఉర్దూ, తెలుగు పరిచయం. రెండోది వృత్తిరీత్యా ఒకే వృత్తిలో వున్నం ఇద్దరం. దానికి తోడు నేను ఆదిలాబాద్ జిల్లాలో పనిజేసినపుడు మే మిద్దరం ఎక్కువ తిరిగేది. అయితె ఆయనలో వున్నటువంటి సాహిత్య పిపాస, ఉర్దూ భాషపై ఆయనకున్నటువంటి పట్టు, నేను చాలా విషయాలు ఆయన దగ్గర నేర్చుకున్న.

ఉర్దూ, తెలుగు సాహిత్యంలో వుండె చాల విషయాలు ఎట్ల నేర్చుకున్నంటె, అటువంటి వాల్లతో కూర్చొని నేర్చుకున్న. చిన్న చిన్న విషయాలపైనె చర్చించుకునేవాల్లం. అంటె ఒక చర్చ జరిగినపుడు ఆ విషయం తెలవందె దాని ప్రాముఖ్యత అర్థంగాదు. అంటె ఎగ్జాంపుల్ ఇస్త. కాళోజి రామేశ్వరరావు ఆయన గజల్‌లల్లో ఒక దగ్గర రాసుకున్నడు. అంటె శరీరం  కష్టాలు రాకుండనె పోతె మంచిదన్నప్పుడు ఒక కప్లెట్ రాసిండు. జడ్‌జావోన అంటె రాలిపోలేవా? ఆగిపోరాదా? పత్‌జడ్ అనేసె పహెలె అంటె ఆకురాలు కాలం రాక ముందె రాలిపోలేవా? అని తనకు తను అనుకుంటడన్నమాట. బాగ వృద్ధాప్యం వచ్చి పోయేదానికంటె ముందే పోతె మంచిది. చాల గొప్ప 'జడ్ జావోన పత్‌జడ్ ఆనేసె పహెలె'. దాన్ని ఆ రోజుల్లో చాల చర్చకు వచ్చింది డిస్‌కషన్. దాన్ని అనువాదం జేయాలె తెలుగులో. ఎట్లజేయాలె? చాల మంది చాలా రకాలుగా జేసేవాల్లు. రాలె, పట్టు రాలె.

దేవులపల్లి సుదర్శన్‌రావు అనే ఆయన ట్రాన్స్‌లేట్ జేసిండు. ఏమని రాసిండు అంటె మక్కీ కి మక్కి భావం దీసుకొచ్చి బెట్టిండు. 'కాలమా కడదీర్చవె, కాని కాలం రాకముందె'. దానిపైన సదాశివగారు మూడు గంటల ఉపన్యాసం ఇచ్చిండు. ఆ ఒక్క కప్లెట్ మీద.

భాష భాషకు తేడా ఎట్ల వుంటది. ట్రాన్స్‌లేషన్ మక్కీకి మక్కీకి చేయకుంట భావాన్ని తెస్తె ఎట్ల వుంటది? అట్ల కొన్ని చిన్న చిన్న విషయాలె. దాని ద్వారా ఇపుడు నీకా భాష గురించి వచ్చేటువంటి కవి ఆసక్తి వుండాలె. వందమంది వింటె వందమందికి ఎక్కదు, బుర్రకు కొంత మందికె ఎక్కుతది. ఇటువంటి విషయాలు  బుర్రకు ఎక్కించడంలో సదాశివగారు చాల టాప్ మ్యాన్.

ఒకసారి రామేశ్వరరావు గారు, ఉర్దూలో ఆయనకు 'షాద్' అని పెన్‌నేమ్. షాద్ అంటె సంతోషాన్ని కలిగించేవాడు, సంతోషపడేవాడు. ఉర్దూలో పెన్‌నేమ్స్ వుంటయ్ గద. గాలిబ్ గూడ పెన్‌నేమే. మన రామేశ్వరరావు 'షాద్' అని పెట్టుకున్నడు. షాద్ అంటె ఇతరులకు ఆనందాన్ని కలిగించేవాడు, సంతోషపెట్టేవాడు అని అర్థం. ఆయన కవిత్వమంత చాల వరకు గూడ బాధిత ప్రాణుల గురించి వుండేది. జీవితంలో బాధలు పడేవాళ్లు, కష్టాలు పడేవాళ్లు, సమాజంలో వున్నటువంటి అనాచారాలు, అనర్థాల గురించి ఎక్కువ రాసే వాడాయన. అందుకె ఇవన్ని జూసి, ప్రపంచాన్ని చూసి ఎందుకుండాలె 'జడ్ జావోన పత్‌జడ్ ఆనేసె పహెలె' అట్లంటివి వుండెవి.

అయితె కాళోజి రామేశ్వరరావు గారి పేర అప్పుడు ఒక సభ జరిగింది, ఆయన జ్ఞాపకార్థం. నన్ను గూడ మాట్లాడమన్నరు. దానికి సదాశివగారు ప్రిసైడ్ జేసిండ్రు. సదాశివ గారుంటె నేను ఉర్దూలో మాట్లాటానికి సాహసం జేయొద్దు. అనర్థం అన్నట్టె కని తప్పలె మాట్లాడాల్సి వచ్చింది. అనుకోకుండ నోటి నుంచి ఒక ఎక్స్‌ప్రెషన్ వచ్చింది. అనుకోకుండ, అనుకోని పోయింది గాదది, అట్ల వచ్చేసింది. ఏమని వచ్చిందంటె షాద్ అంటె సంతోషం, నా షాద్ అంటె విచారం, దుఃఖం. నా షాద్ అంటె షాద్ లేకపోవడం. కళా నిషాద్ అంటె షాద్ యొక్క కవిత్వం. నేను జెప్పింది కళా నిషాద్. 'ఏక్ దిలే నషాద్ కి ఆవాజ్ హై' అంతె ఆ ఎక్స్‌ప్రెషన్ వచ్చేసింది అంతె. దాని పైన సదాశివగారు గంటసేపు మాట్లాడిండు. అంటె ఆ ఎక్స్‌ప్రెషన్ ఎందుకొస్తది? ఏ సందర్భంలో వస్తది? ఎవరికి వస్తది? చిన్న పదం, కని భాషా పరంగ జూస్తె విస్తృతమైనటువంటి అర్థం. అంటె సదాశివగారి వల్ల తెలుగు, ఉర్దూ భాషల యొక్క సంపర్కం, పరస్పర సమ్మేళనం రెండిటిలో వుండె పాజిటివ్ రిలేషన్, కొంత మంది ఏందంటె నెగెటివ్ జూస్తరు. పాజిటివ్ రిలేషన్ ఆయన వల్ల నాకు తెలిసింది.

# సంపాదన అనేది ముఖ్యమైపోయింది

తెలంగాణ అనే గాదు మొత్తం దేశమంత అట్లనె వుంది. వాల్యూస్ పడిపోయినయ్. కెరీర్, కేరీరిజమ్ పెరిగిపోయింది. సంపాదన ప్రధాన ధ్యేయం అయిపోయింది. జీవితంలో సుఖపడటం అయిపోయింది. సుఖపడటం ధ్యేయమైపోయింది. ఇపుడు ఎంత మంది టీచర్లు ఈ రోజు క్లాసుకు ప్రిపేర్ అయిపోతరు. ఏదో పోతరు, చెప్పేస్తరు, వస్తరు. వాడు వింటడా, వినడా అర్థంగాని, కాకపోని పట్టించుకునే వాల్లు ఎంత మంది వున్నరు? కొంత మంది ఇప్పటికీ వున్నరు. క్లాసుకుపోయే ముందు చదువుకుని పోవాలనేటువంటి తపన చాల మందిలో లేదు. మరి జీతాలు విపరీతంగ బెరిగినయ్. నేను నూటఇరవై నాలుగు రూపాయిలతో ఉద్యోగం మొదలుబెట్టినయ్య. ఆ రోజు తరగతిలో పిల్లలకు పాఠాలు జెప్పడానికి నేను స్వయంగ బోయి పంతులు దగ్గర కూర్చొని నేర్చుకున్న చెప్ప డానికి. నాకు లాభమైంది దాంతోనె. నేనాపని జేయకపోతె నాకు ఈ రోజు ఈ కొద్దిపాటి పరిజ్ఞానం వుండెది కాదుగద. దాన్లో ఒక గుర్తింపు వున్నది గద. ఇపుడు గుర్తింపు కంటె ఎక్కువ సంపాదన అనేది ముఖ్యమైపోయింది. గుర్తింపు గూడ ఏందంటె ఇంటలెక్చువల్ గుర్తింపు గాదు, ఆర్థికంగ ఎట్ల వున్నరు, హోదా ఎట్లున్నది, గుర్తింపుకు అవి చిహ్నాలై పోయినయ్.

ఒకటేందంటె, ఎక్కడ ఏదున్న నేర్చుకోవాలి, తెలుసుకోవాలి అనే కుతూహలం నాకు. ఏదైన నేర్చుకోవాలి, ఏదైన తెలుసుకోవాలి. మనకు తెలవనివి చాల వుంటయ్ గద. పోతె చిన్న చిన్న విషయాలె గావొచ్చు గాని మనకు తెలవనివి వుంటయ్. రేపు అవి చాలా పెద్ద విషయాలైతయ్. నాలో వున్నటువంటి ప్రధానమైనటువంటి ఆ నేచర్ ఏందంటె అది ఏ వేదిక, ఇపుడు నువ్వు అంటివి గద ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యు దాక అన్ని వేదికలకు బోయిన. ఎందుకు బోయిన నేను? అందరు యాక్సెప్ట్ చేసింద్రు నన్ను. నాతో ఏకీభవించినా, లేకపోయినా కని నన్ను అందరు యాక్సెప్ట్ చేసింద్రు. నిర్మొహమాటంగ జెప్పిన, నిర్మొహమాటంగ బోయిన ప్రతిచోటకు అయినా యాక్సెప్ట్ చేసింద్రు. వాల్ల గురించి తెలవంది మనం మాట్లాడలేం. తెలుసుకోవాల్నంటె అధ్యయనం, అబ్జర్వ్ జేయాలె గద. ఏదైన అధ్యయనం, లైఫంత అధ్యయనమె గద. ఏదైన అధ్యయనమె అది. అధ్యయనమంటె పుస్తకం చదవడమె గాదు గద. తెలంగాణ ఉద్యమం చిన్న అధ్యయన మయ్య! అది ఇప్పుడు జరుగుతున్న చరిత్ర.

# నేను చేసిన యూనివర్శిటీ రిఫార్మ్స్

రిజిస్ట్రార్‌గ వున్నపుడు పైన వైస్‌ఛాన్సలర్ వుంటడు గద. నిర్ణయాధికారి వైస్ ఛాన్సలర్ గద. నేను రిజిస్ట్రార్‌గ వున్నప్పుడు యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్‌ను స్టెబిలైజ్ జేసే ప్రయత్నం జేసిన. అంతకు ముందు అనిశ్చితి పరిస్థితి చాలా వుండెది. పది పన్నెండు మంది రిజిస్ట్రార్‌లు మారిపోయింద్రు. యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ స్టెబిలైజ్ కావాలన్నప్పుడు యెక్కువ కాన్‌సన్‌ట్రేషన్ యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్‌ను సిస్టమాటిక్ చేయడం లోపల్నే మూడేండ్లు గడిచిపోయినయ్ నాకు. పరిమిత కాలమే గద.

విసిగ వచ్చినంక అడకమిక్ రిఫార్మ్స్ పట్టుకున్న. అకడమిక్ రిఫార్మ్స్‌లో ఏందంటె అప్పటికి జాతీయ స్థాయిలో మొత్తం సిలబస్‌ను రివైజ్ చేయాలనేటువంటి ఒక ఎఫర్ట్ మొదలైంది. అప్పుడే యుజిసి ఛైర్మన్‌గ మన్‌మోహన్‌సింగ్ వుండేది. నేను సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆండ్ ఫారన్ లాంగ్వేజెస్‌కు రిజిస్ట్రార్‌గ వుండేవాన్ని. అప్పుడా కమిటీ పనిజేసింది బాగ. ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కొక్క యూనివర్శిటీని ఒప్పజెప్పేది. కొత్త సిలబస్ రిఫార్మ్స్ లోపల. పేరున్న యూనివర్శిటీలకు కొందరికి కెమిస్ట్రీ, కొందరికి ఇంకోటి సిఫెల్‌కు ఇంగ్లిష్ ఇచ్చింద్రు. నేను దాంతో బాగ అసోసియేట్ అయిన. దాన్ని అమలు పరచడానికి చాలా యూనివర్శిటీస్ వెనుకా ముందు ఆడుతున్నయ్. అమలు పరచాలంటె భయపడేవి, కష్టపడాలె గద.

లిట్రేచర్ నుంచి లాంగ్వేజ్ వైపు అప్లికేషన్ ఓరియెంటెడ్ అన్నమాట. లిట్రేచర్, లాంగ్వేజ్ ఇపుడు షేక్స్పియర్, మిల్టన్, చాసరు ఇవన్ని చదువుకుంటరు. కని నీ వృత్తికి నీ జీవితానికి వుపయోగపడే భాష గూడ గావాలె గద. అది లేకపోతె లిట్రేచర్‌తోనె అయిపోతది. ఏది నన్నయ, పోతన, తిక్కన చదివి వదిలేస్తం. మరి భాష ఎక్కడ వస్తది. సాహిత్యం వస్తది, భాష రాదు గద. కనుక సబ్జెక్టుల్లో ప్రధాన మౌలిక మార్పులు రావాలె అన్ని సబ్జెక్టుల లోపల. కెమిస్ట్రీ అయినా, ఫిజిక్స్ అయినా అంతె గద. ఇదిప్రాక్టికల్‌గ వుపయోగపడేది కాదన్నమాట. అయినప్పుడు నేను ఇక్కడికి వచ్చే వరకు మొత్తం సిలబస్‌ను ఏది ముట్టుకోలె వాళ్లు. అంటె ముట్టుకోలె అంటే పట్టించుకోలె ఎవరికి వాళ్లు పట్టించుకోలె, నిష్ఠాతులుండిరి. చాలా మందికి మార్పులు తేవాలె అని వుంది గాని, పై నుంచి వాళ్ల రెసిస్టెన్స్ వస్తయ్. పిల్లవాళ్ల నుంచి రెసిస్టెన్స్ వస్తయ్, పిల్లవాళ్లకు అపోహలు కలుగుతయ్. ఇగ పంతుల్లకు గూడ అట్ల వుంటె, నేను ఫస్ట్ ఫస్టే పిల్లలతో ఇంటరాక్ట్ అయిన. ఇది

చదువుతాండ్రు దీని గురించి మీ అభిప్రాయం ఏంది? ఏయ్! ఇది ఏం అక్కరకు వస్తది సార్! అన్నరు. మొదలు వాల్లతోని అక్కరకు రాదు అనిపించిన పిల్లలతో. చెప్త పద్ధతి. మార్పు గావాలె. మార్పు గావాల్నంటె పిల్లలు సిద్ధంగ వుండాలె. దాదాపు ఏకగ్రీవంగ పిల్ల లంత కావాలంటున్నరు. తర్వాత పంతుల్లను పట్టిన. పిల్లలకు మార్పు గావాల్నంట. దేశ మంత గావాలంటున్నరు, మరి మీరు మారకపోతె ఎట్ల? అపుడు చాల మంది టీచర్స్‌ని ఇన్‌సెంటివ్‌గ వున్నటువంటి వాల్లను ముందుబెట్టి మొత్తం సిలబస్ రివైజ్ చేపించిన. అది ఆంధ్రప్రదేశ్ యూనివర్శిటీల్లో కాకతీయ ఫస్ట్ యూనివర్శిటీ. ఆ సిలబస్ మారింది.

దాని తర్వాత అంతట పాకింది. నేను ఒక ఇంగ్లిష్ గాదు అన్ని సబ్జెక్ట్స్ చేయించిన మొత్తం A to Z. సరె అది జేసి ఇరవై ఏండ్లు అయితాంది ఇప్పటికి అది వ్యాలీడా కాదాంటె అది వేరు విషయం. ఒక రిఫామ్, ఒక సంస్కరణ ఇరవై ఏండ్ల కింద జేసిన, కాకతీయ యూనివర్శిటీ ఫస్ట్ జేసింది. దానికి కారణమేమిటి అంటె ఆ మన్మోహన్‌సింగ్ యుజిసి ఛైర్మన్‌గ వున్నప్పుడు, ఆ సంస్కరణ వచ్చినపుడు నేను సిఫెల్‌లో రిజిస్ట్రార్‌గ వున్నప్పుడు ఇన్వాల్ కావడం, ఇంగ్లిష్ ఒకటే రిఫార్మ్ జేయడం చేయడమా? ఇంగ్లిష్‌లో దేశంలో టాప్ యూనివర్శిటీ అది. అన్ని యూనివర్శిటీలో అదే ఫాలో జెయాలె. ఇపుడు ఎపిల వున్న యూనివర్శిటీలు ఫాలో జేయకపోతె ఎట్ల అని అనుకోకుండ ఈ అవకాశం వచ్చే వరకు పట్టుబట్టిన. దాని తర్వాత అన్ని యూనివర్శిటీల్లో వచ్చేసింది అది.

ఒకటి విసిగ వున్నప్పుడు నాకు చాల తృప్తినిచ్చింది ఏవిటంటె సిలబస్ రిఫార్మ్ ఒకటి. రెండవది పిల్లలు టీచర్స్‌కు బాగ సహకరించేటోల్లు. ఆ పిరియడ్‌లో పెద్ద ఏమీ రెసిస్టెన్స్ అంటె రిఫామ్ రెసిస్టెన్స్ ఏమీ రాలేదు, చాల మంచిగ చదువుకున్నరు, ఆ పిరియడ్‌లో తెలంగాణవాదిగ నాకు తృప్తినిచ్చినటువంటి నిర్ణయాలు ఒకటి రెండు నిర్ణయాలు ఏంటంటె తెలంగాణ పేరెత్తకుండ జేయించేసిన నేను. ఈ స్టూడెంట్స్ అడ్మిషన్ లోపల ఈ లోకల్, నాన్ లోకల్ కాండిడేట్స్ టీచర్స్ వుండె. నాన్ లోకల్ పదం లేదు. 6 పాయింట్ ఫార్ములా లోపల నేను స్వయంగా ఇన్వాల్ అయిన గనుక నాకు దెలుసు. అంత ప్రతిచోట నేను విసిగ వుండి దాన్ని సరిగ ఇంట్రడ్యూస్ జేయకపోతె ఎట్ల అని నేను. ఇంటర్‌ప్రిటేషన్ మార్చేసిన. లోకల్, జనరల్. దాంతోని తెలంగాణ వాల్లకు ఎక్కువ లాభం అయింది. నేను ఏంజేయలె ఉన్నదాన్ని కరెక్ట్ ఇంటర్‌ప్రెట్ జేసిన, గవర్నమెంట్ గూడ కరెక్టే అన్నరు. అది పోయి పోయి ఇప్పుడు అన్నింటికి వర్తించింది. నేను బీజం నాటిందపుడు, ఎవ్వరు సాహసం జేయలె. ఎవరు పెట్టుకుంటరు అని. నేను సాహసం

చేసిన. దానికి గవర్నమెంట్ అప్రూవల్ ఇచ్చింది. అప్రూవలేంది! పరిస్థితి ఇది దాన్ని ఆల్టర్ జేయలేం అంటె యస్ అన్నరు. నో అనే సాహసం ఎవ్వరు జేయలేదు. దాంతో ఏమైందంటె ఈ నాన్ లోకల్ కోటా అనేది కాకతీయ యూనివర్శిటీలో ముందు పోయింది. నాన్ లోకల్ అనేది జనరల్ కోటా అయిపోయింది. బోత్ ఫర్ అడ్మిషన్స్ అండ్ అపాయింట్‌మెంట్స్.

రెండవది పి.జి సెంటర్స్ అన్ని ఉస్మానియా కింద వుండె. పోతె డిగ్రీ కాలేజీ ఇచ్చింండ్రు కని పిజి సెంటర్స్ ఇయ్యలె. ఒక్కొక్కటి చివరికి కొత్తగూడెంలో స్కూల్ ఆఫ్ మైన్స్ అసలు ఇవ్వమని కూర్చున్నరు. ఎందుకివ్వరన్నరంటె అక్కడున్నోల్లంత ఆంధ్ర ఎంప్లాయిస్. వాల్లు ఏందంటె ఇవి కాకతీయకుబోతె జయశంకర్ ఈయన తెలంగాణ వాది అని లేనిపోని అనుమానాలు వాల్లకు. జరిగేదేముండదు. అప్పుడు ఉస్మానియా యూనివర్శిటీని వాల్లు వదులుకోడానికి సిద్ధంగ లేకుండె. వాల్ల కాందాన వాల్లకుండె, పెత్తనం మొత్తం పోద్దని. ఐతె యూనివర్శిటీ యాక్ట్ ప్రకారం ఈ జ్యూరిస్‌డిక్షన్ కాలేజి అక్కడికి ఎట్ల పోతది? కాకతీయ యూనివర్శిటీ, తెలంగాణ ప్రాంతం నాలుగు జిల్లాలకు. ఇపుడు జిల్లాకో యూని వర్శిటీలు వచ్చినయ్ అది వేరు విషయం.

నాలుగు జిల్లాలకు ఒక యూనివర్శిటీ అని బెట్టినపుడు, మరి ఈ జిల్లాలో కొన్ని కాలేజీలు అక్కడ ఇక్కడ ఎట్ల వుంటయ్. చెప్తే మినిస్టర్ల మీటింగ్, సెక్రెటరీల మీటింగ్, వైస్ ఛాన్సలర్‌ల మీటింగ్‌లను బెట్టింండ్రు ఇగ ఎక్కడ్నో అడగాల్సి వచ్చేది. అపుడు విజయ భాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి బోయి విజయభాస్కరరెడ్డి సిఎం అయ్యిండు. వాల్లందరికి గూడ తెలంగాణ అంటె గిట్టదు. నేనంటె మంచిదే గాని తెలంగాణ అంటె గిట్టదు వాల్లకు. ముఖ్యంగ విజయభాస్కరరెడ్డికి. నేను అనుకున్న ఒకటే.. దీనికి తెలంగాణ డైమెన్షన్ ఇవ్వంది ఈ సమస్య పరిష్కారం గాదు. మరి ఎవరివ్వాలె దానికి, నేనే ఇవ్వాలె. ఎవరితో జెప్పాలె, ముఖ్యమంత్రితోనె జెప్పాలె, ఇంకోరితో జెప్తె అయ్యేది గాదు. నేను అప్పుడు కొంత మంది అధికారులతో మాట్లాడిన. మీ స్టాండ్ కరెక్ట్, ఇది మీరే ముఖ్యమంత్రికి జెప్తె అనుకోని నిర్ణయం వచ్చే అవకాశం వుంటది.( నేను నవ్వి) రాక పోతె రాజీనామా జేసి పోత. వస్తె సంతోషమె. అనే నిర్ణయానికి వచ్చిన నేను. అప్పుడు ఆయనకున్న పర్సనల్ స్టాఫ్, సెక్రెటరీ వాల్లంత గూడ ఈ ఉస్మానియా వాల్ల మనుషులె, రకరకాల ఫ్యాక్టర్స్, ఆంధ్ర ఫ్యాక్టర్, కులం ఫ్యాక్టర్ చాల వున్నయ్. నేను విజయభాస్కరరెడ్డి అపాయింట్‌మెంట్ దీసుకొని పోయిన. అయిపోతదనె అనుకున్నడాయన. ఎందుకను

కున్నడు, అసెంబ్లీ యాక్ట్ పాస్ జేసిన అమలు కావట్లేదు. ఎందుకు గావడంలేదు అంటె ఇండ్ల కొంత మంది ఉస్మానియా వాల్లు వ్యతిరేకిస్తున్నరు అంటె వుండనీ రాదు ఏదో తీయ్ అన్నడు. అంటె అంత సింపుల్ ఇష్యూ గాదు అని నేను అన్న (ముఖ్యమంత్రితో) ఏమిటి అన్నడు, కాకతీయ యూనివర్శిటీని స్టార్ట్ జేసిందె తెలంగాణ నాలుగు జిల్లాలను డెవలప్ చేయడానికి. ఈ నాలుగు జిల్లాల్లో కొన్ని కాలేజీలు వీల్లకు, కొన్ని వాల్లకు ఎట్ల అయితది. ఎట్ల వుంటది ఇది. దీనికి తెలంగాణ డైమెన్షన్ వస్తది అని నేనన్న. ఒక్క నిమిషం ఆలోచించి ఫైల్ దెప్పించి.. అప్పుడె అప్రూవల్ చేసిండు. రిస్కే గద. కని పని అయింది. ఎక్స్‌ప్లెయిన్ జేసిన ఎట్ల అయితది అని. యూనివర్శిటీ బెట్టిందె దాని కొరకు గద మల్ల ఇండ్ల కొరతలేంది. ఉస్మానియా పెద్ద యూనివర్శిటీ. నన్ను అడిగితె నల్లగొండ, నిజామాబాద్ గూడ మాకే ఇవ్వాలి, వాల్లకు రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ మూడు జిల్లాలు చాలు అన్న.

అట్లాగె స్టాఫ్ రిక్రూట్‌మెంట్ అప్పుడు టీచింగ్, నాన్ టీచింగ్ ఎక్కడ గూడ ఒక్క నాన్‌లోకల్‌ను అపాయింట్ జేయలేదు నేను. మేనేజ్ జేయాల్నంటె ఎట్ల జేయాలె. చాలా మందికి చాల ప్రెషర్లు, మినిస్టర్లు, సిఎంలు వాల్లు వీల్లు ప్రెషర్స్ చాల, కని చేయలె. నేనుండి నాన్‌లోకల్స్‌ను అపాయింట్ జేయడమనేది నా పరువు పోతది. కనుక సెలక్షన్ కమిటిలో ఎక్కువ చాల వరకు ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసర్స్‌నే బెట్టిన ఎక్స్‌పర్ట్‌లని. నార్త్ ఇండియా నుంచి.. అంటె ముగ్గురి లోపల కనీసం ఒకరు ఆంధ్ర నుంచి ఒకరు, నార్త్ నుంచి ఒకరు, ఇంకో దగ్గర నుంచి ఒకరిని పెట్టిన. కనుక తప్పని సరిగ ఆంధ్ర నుంచి వెంకటేశ్వర యూనివర్శిటీ, ఆంధ్ర యూనివర్శిటీ విజయవాడ నుంచి బెట్టేవాన్ని. వాల్లకు చెప్పేది, రిజర్వేషన్ రూల్స్ కొన్ని. వెనుకట రిజర్వేషన్‌లు గూడ సరిగ పాటించే వాల్లు గాదు. నేననేది చట్టబద్ధమైన రిజర్వేషన్స్ వున్నయ్. ఎస్.సి, ఎస్.టి, బిసిలకు వాల్లకు తప్పనిసరిగ ఇవ్వాల్సిందె అని చెప్పి, కొన్ని చట్టంలో లేని రిజర్వేషన్స్ వుంటయండి అని చెప్పిన నేను. ఏంటంటె లోకల్ కాండిడేట్స్‌కు ప్రిఫరెన్స్ ఇవ్వాలె. అంటె అందరు సహకరించిండ్రు. ఏ ఒక్కరు గూడ ప్రొటెస్ట్ చేయలేదు. మేనేజ్ జేయడం, చెప్పడం ముఖ్యంగా ఈ సమస్యలుంటయని చెప్పడం.

కాకతీయ యూనివర్శిటీ విసిగ వున్న మూడేండ్లల్లో, మూడేండ్లు చాలా స్వల్ప కాలం గద. రిజర్వేషన్ల అమలు ఒకటి, సిలబస్ రిఫామ్స్ నా దృష్టిలో చాల మేజర్. పిజి సెంటర్స్ ట్రాన్స్‌ఫర్ చేయించుకోడం, దానికి ఎన్నో పోస్టులు శాంక్షన్ జేయించుకొని

దానికి అపారమైన బడ్జెట్.. అప్పుడు ఉదారంగ ఇచ్చింద్రు. తెలంగాణ ప్రాంత డెవలప్‌మెంట్ అనే పేరుతోని పోతె ఏ యూనివర్శిటీకి రానన్ని పోస్టులు, అంత నిధులు వచ్చినయ్ అంటే పిల్లలు సహకరించారు, టీచర్స్ గూడ సహకరించారు. ఏ అలజడి లేకుండ మూడేండ్లు గడిచినయ్. అనుకోకుండ వచ్చిందది. నేను కాకతీయ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అయితనని కలలో గూడ అనుకోలె, వచ్చింది. మూడేండ్లు, నేను చేయగలిగింది నాకు తోచింది చేసిన.

# లక్ష్మీపార్వతి జేయబట్టి పోయింది

జరిగిందేందంటె.. చాల విచిత్రమైన సంఘటనలు జరిగినయ్. అప్పుడు ఏం జరిగింది! నా టర్మ్ ఖతం గావడం, జనరల్ ఎలక్షన్స్ రావడం, తెలుగుదేశం ఎన్.టి. రామారావు రావడం జరిగింది. జస్ట్ నా టర్మ్ అయిపోవడం, తెలుగుదేశం గవర్నమెంట్ రావడం జరిగింది. ఎన్.టి. రామారావుకు నన్నే అపాయింట్ జేయాల్నని వుండె. నా రిపోర్ట్సను బట్టి చాల సిన్సియర్‌గ నాకివ్వాలని వుండె. అప్పుడాయనకు సెక్రటరీగ జయప్రకాష్ నారాయణ వుండేది. ఆయనకు గూడ నాకివ్వాలనె వుండె. చెప్తున్న కాకతీయ యూని వర్శిటీని ఆయనే మంచిగ నడిపిండు ఇంకో టర్మ్ ఆయనకివ్వాల్సిందె.. వేరే వాళ్లు మేనేజ్ చేయలేరు అని. సెర్చ్ కమిటీలో నా పేరు పెట్టిండ్రు. నా పేరుతో పాటు వైకుంఠం పేరు గూడ పెట్టిచ్చిండ్రు వాళ్లు. నాతో పోటీకి వచ్చినాయన (వైకుంఠం) కమ్మాయన. వైకుంఠంకు వేరే ఏదైనా పొజిషన్ ఇవ్వాలని గూడ ఎన్. టి. రామారావు అనుకున్నడు, జయప్రకాష్ నారాయణ అనుకున్నడు. మొత్తం ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అనుకున్నరు. లక్ష్మీపార్వతి అడ్డొచ్చింది. మనోల్లకు మనం ఇవ్వకుంటె ఎట్ల, ఆయనొకసారి జేసిండు గద, మనోల్లకు ఇవ్వాలె అంది, అట్ల బోయింది అది.

రెండో టర్మ్ ఇవ్వకూడదు అని ఏం లేకుండె, ఇప్పటికి గూడ ఏం లేదు. ఇప్పుడు అది బంద్ జేసిండ్రు అనుకో. అప్పుడు నాకు దాదాపు సెటిల్ అయిపోయిన దాన్ని లక్ష్మీపార్వతి జేయబట్టి పోయింది. అమె అపుడు మొత్తం రాజ్యాన్నే ఏలింది గద. అప్పు డప్పుడే మంత్రులైన వీల్లుండిరి కడియం శ్రీహరి, ప్రణయభాస్కర్ వాల్లు గూడ బోయి నా పేరు జెప్తే, లేదు వారికె ఇస్తం అని జెప్పిన తర్వాత గూడ ఓవర్ నైట్ విష యం మారిపోయింది. వైకుంఠం ఆంధ్ర నుంచి వచ్చిన కమ్మ సెటిలర్, ఖమ్మం జిల్ల. కట్టర్ (కట్‌త్రోట్) యాంటి తెలంగాణ. ఆయన ఎన్.టి. రామారావు భక్తుడు గావడం, లక్ష్మీపార్వతి శిష్యుడు గావడం.

# వరంగల్ మొదట్నుంచి ఇంటలెక్చువల్ సెంటర్

ఉద్యమం 1952లో మొదలైంది ఇక్కడె చెప్తి గద నేను. 1952లో బీజం నాటింది వరంగల్ స్టూడెంట్సే. మొదలైంది అక్కడ్నే గద. తర్వాత స్ప్రెడ్ అయింది. తర్వాత 1968-69లో వరంగల్‌లో చాల మందుండె. రెండవది వరంగల్ తెలంగాణ ఇంటలెక్చువల్ సెంటర్. దీంట్లో తెలంగాణ గురించి రాసినటువంటి కవులు, దాశరథి గాని, కాళోజి గాని ఇక్కడ్నుండె గద. ఇంటలెక్చువల్, తెలంగాణ గురించి ఆలోచన రేకెత్తించినటువంటి మేధావులు ఎక్కువ వరంగల్ నుంచె వున్నరు. యూనివర్శిటీ మొన్న వచ్చే. 1952లో యూనివర్శిటీ ఎక్కడిదయ్యి. 1976లో యూనివర్శిటీ వచ్చె. 1968లో యూనివర్శిటీ ఎక్కడిది. 1952 దాక ఇంటర్‌మీడియట్ కాలేజ్, డిగ్రీ గూడ లేదు గద. అప్పటి పరిస్థితుల్లో విద్యార్థుల్లో నేను చెప్తి గద ఎట్ల రివోల్ట్ కావాలె అనేది. అదొక స్ఫూర్తి. తెలంగాణ మొత్తం స్ఫూర్తినిచ్చింది. 87లో వరంగల్‌లో చాల ఉధృతంగ నడిచింది. ఇంకోటి ఏందంటె ఇక్కడ మేధావులు, కవులతో ఇంటలెక్చువల్ సెంటర్ వరంగల్. మొదట్నుంచి ఇంటలెక్చువల్ సెంటర్ కావడమె. చిన్నచిన్న విషయాలు అనుకుంటె పి.వి. నరసింహారావు ఇక్కడి వాడు, చెప్తున్న. చాలా మంది గొప్ప గొప్ప విద్యావేత్తలు ఇక్కడి నుంచి వచ్చింద్రు. అందరు తెలంగాణ గురించి అనకపోవచ్చు గాని పెద్ద పెద్ద మేధావులు, కవులు ఇక్కడి నుంచి వచ్చింద్రు. లిటరరీ సెంటర్, కల్చరల్ సెంటర్, చాల ఎన్‌లైటెన్ సెంటర్‌తో పాటు ఇక్కడ రాజకీయాల్లో గూడ ఒక విచిత్రమైనటువంటి సందర్భాలొచ్చినయ్. ఇంత పెద్ద తెలంగాణ సెంటర్లో చాలా కాలం ఇక్కడ్నించి కనీసం ఒక్కరైన నాన్‌లోకల్ ఎమ్మెల్యేలే ఎలెక్ట్ అయింద్రు.

మొదటికి పోదాం.. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఎం.ఎస్ రాజలింగం. బూర్గుల రామకృష్ణారావు 1952లో ఇక్కడి నుంచి ఎలెక్ట్ అయ్యిండు, మినిస్టర్ అయ్యిండు. ఆయన తెలంగాణ వ్యతిరేకి, పైకి ఎన్ని జెప్పిన. తర్వాత ఎస్వీకె ప్రసాద్ అని సిపిఐ పార్టీ పరకాలనుంచో ఎక్కడ్నుంచో వుండె, మనిషి మంచోడె కని ఆంధ్ర అతను. తర్వాత డాక్టర్ టి.ఎస్. మూర్తి ఆంధ్రావాడె, కనకరత్నమ్మ ఆంధ్రమనిషి, బండారు నాగభూషణరావు ఆంధ్రావాడె. చివరకు దోనెపూడి రమేష్. మనుషులు అంతా మంచోల్లు గావొచ్చు కని మొదట్నుంచి గూడ కనీసం ఒక్క మనిషైన ఇక్కడి నుంచి (వరంగల్) ఆంధ్రావాడు ఎమ్మెల్యేగ వచ్చేది, మంచి పదవిలో వుండెది. వాల్లు తెలంగాణ వ్యతిరేకులు. వాల్లకు వ్యతిరేకంగ ఎప్పటికి ఏదో పోరాటం నడిచేది.

చెప్త ఎట్ల నడిచింది అంటె, ఇక్కడ కొన్ని సోషల్‌ఫోర్స్ ఎట్ల పనిజేసినయ్ అంటె ఈయన ఎం.ఎస్ రాజలింగం అప్పుడు, ఆ రోజుల్లో బ్రాహ్మిన్ వర్సెస్ రెడ్డి ఫోర్సెస్‌లో పోటీ వుండె. రెడ్లకు వ్యతిరేకంగ బ్రాహ్మిన్స్‌లో ఆ రోజుల్లో ఆ సిచ్యువేషన్ వుండె. బూర్గుల రామకృష్ణారావు సపోర్టు జేయబట్టి ఆయనొచ్చిండు. తర్వాత ఈ ఆంధ్రప్రాంతం ఆరాధ్యులని ఈ బ్రాహ్మిన్ కమ్యూనిటి పెద్ద. నేను జెప్పిన దాంట్లో ఎం.ఎస్ రాజలింగం బ్రాహ్మడె, టి.ఎస్ మూర్తి బ్రాహ్మడె, బండారు నాగభూషణరావు బ్రాహ్మడె. ఆరాధ్యులని కొందరొచ్చింండ్రు. వాళ్లకేంటి ఇక్కడి షావుకార్లందరికీ వాల్లు గురువులు. ఇప్పటికి సాష్టాంగ నమస్కారం జేస్తరు. ఈ చార్టెడ్ ఎకౌంటెంట్స్ కొంత మంది, వచ్చే సరికి ఏందంటె ఈ బిజినెస్ కమ్యూనిటి ఇగ వాల్లకు దేవుల్లు వాల్లు. ఇప్పుడిప్పుడు బోయిందది. మొన్నమొన్నటి దాక వుండె. ఐతె వాల్లకు వ్యతిరేకంగ.. పోరాట వ్యతిరేకత వచ్చేది.

1968-69 మూవ్‌మెంట్‌లో టి.ఎస్ మూర్తికి వ్యతిరేకంగ నేను గూడ వీధుల్లో బడ్డ. ఆయనతో జై తెలంగాణ అనిపించిన అప్పుడు. ఐతె అది బలవంతం. అట్లగె ఈ బండారు నాగభూషణరావుకు మాకు ఎప్పటికి ఉప్పు, నిప్పే వుండె. మేం వాల్ల ముగ్గురన్నదమ్ములను బండారు చంద్రమౌళీశ్వరరావు, నాగభూషణరావు, సదాశివరావు లోపట, చంద్రమౌళీశ్వరరావు ఎప్పటికి కాంగ్రెస్ వాడు. సదాశివరావు ఎప్పటికి బిజెపి వాడు. నాగభూషణరావు ఏ పార్టీ అధికారంలో వుంటె వాల్ల పార్టీ. అట్ల జేసుకుని ఆ మొత్తం కుటుంబం ఇక్కడ రాజకీయాల్లో చాలా కాలంగ వున్నరు. తర్వాత పి.వి. నరసింహారావుకు దగ్గర అయ్యింండ్రు వాల్ల కులం జేయబట్టి. మన నూకల రామచంద్రారెడ్డి, హయగ్రీవాచారి మధ్య రసరసలు ఇరవై ఏండ్లు నడిచినయ్. ఆ పోరాటంలో బ్రాహ్మలకు అథారిటి లేదు. బ్రాహ్మలు ఖతమైంండ్రు చివరికి.

# బిసిలె ఆత్మ విమర్శ జేసుకోవాలె

బిసిలు పొలిటికల్‌గ ఎవరి అటాచ్‌మెంట్‌లో వుండాలనే ప్రశ్న వస్తె, వెలమ చాల చిన్న కమ్యూనిటి. రెండు జిల్లాల్లో మహా అయితె పది పన్నెండు అసెంబ్లీ సెగ్మెంట్స్ తప్ప ఎక్కడ లేరు. రెడ్డి త్రూ అవుట్ ద స్టేట్. పోతె సోషల్లీ అకామిడేషన్ వెలమాస్‌లో ఎక్కువ వుంటది. కని వాల్ల శక్తి సరిపోదు. రెడ్డీస్‌లో మార్పు వస్తున్నది, రియలైజ్ చేసు కుంటున్నరు. ఒకటేందంటె నా దృష్టిలో ఎవ్వరిని ఫాలో చెయ్యొద్దు. ఇండిపెండెంట్ అసోసియేషన్ అయితె వాల్లె రావాలె. ఎప్పుడు గూడ ఒకర్ని ఆశ్రయిస్తె అటే వెల్లిపోతం, మల్ల బయటికి రాలేం. బిసిలె ఆత్మ విమర్శ జేసుకోవాలె. ఒక్కొక్క కమ్యూనిటి ఒక్కొక్క అగ్రకులంతో వెంట పోతె యూనిటీ ఎక్కడుంటది. కనుక బాగుపడ్డ, అభివృద్ధి చెంది నటువంటి బిసిలల్లో ఆ వైఖరి రావాలి. ఇపుడు అదె గద సమస్య ఐదారు కులాలు దప్పితె మిగతావన్ని నెగ్లెక్టెడే గద.

ఇపుడు నువ్వు జెప్పింది చదువురానోల్లు, విజ్ఞానవంతులు కానోల్ల గురించి, కొద్దో గొప్పో చదువుకుని కొద్దో గొప్పో విజ్ఞానవంతులు మా కమ్యూనిటీలో కూడ వున్నరు. మొత్తం ఆంధ్రప్రదేశ్ చరిత్రలోపల ఒకే ఒక్కడు ఎమ్మెల్యే అయ్యిండు మధుసూదనాచారి. ఒకే ఒక్కడు ఒక్కసారి. ఎట్ల హౌ డు యు ఎక్స్‌ప్లెయిన్. సదువుకున్నోల్లున్నరు, పైసలున్నోల్లు వున్నరు, సంపన్నులున్నరు, చదువుకున్న వాల్లున్నరు, విజ్ఞానవంతులున్నరు. ఇతర కమ్యూనిటీస్‌కి పోతె ఈ మాత్రం గూడ లేరు. మరి వీల్లు గూడ ఎందుకు రాలేకపోతున్నరు అంటె వీల్లల్లో యూనిటీ లేదు. ఐదుకులాలున్నయ్ గద వీల్లల్నే యూనిటీ లేదు. అన్ని వుండాలె, ఏ ఒక్క దాన్తో గాదు. ఇది ఒక్క రోజులో అయ్యే పని గాదు, లాంగ్ ప్రాసెస్.

అదె నేను చెప్పింది పైకొచ్చినోల్లు వాల్ల గురించి ఆలోచించాలె. దళితుల్లో అదె గదనయ్య పరిస్థితి. దళితుల్లో ఇంక ఎంత అధ్వాన్న స్థితి ఎంత మంది పైకి వచ్చిరయ్య వాల్లు. ఉన్నవి లిమిటెడ్. అండ్ల రెండె సెక్షన్స్ గద. ఎంత మంది దళితులు బాగున్నరు. రిజర్వేషన్ వున్నది. అయిన గాని మెజారిటి మంచిగ లేరుగద. పైకొచ్చినోల్లు, రాని వాల్ల గురించి ఆలోచించకపోతె ఇది జరగడం కష్టం.

(టిఆర్ఎస్ దళితుడు ముఖ్యమంత్రి, మైనారిటీ ఉపముఖ్యమంత్రి అని ప్రకటించింది. దీంతో బిసిలలో వ్యతిరేకత వస్తున్నది కదా అన్నప్పుడు) కరెక్ట్ ఇంప్రెషన్ కాదది. ఇపుడు ఒక పొలిటికల్ స్ట్రాటజీలో దళితులకు ఆ అష్యూరెన్స్ ఇవ్వడం అవసరం. బిసిలు

కాగలిగె స్టేజ్‌కి వచ్చింర్రు. దళితున్నైతె పర్మినెంట్ జేయరు గద. ఎవరున్న ఐదేండ్లు అంతకన్న తక్కువనె గద. దళిత్ ఒక సింబాలిక్, దళితుడు ముఖ్య మంత్రి అన్నది ఒక సింబాలిక్. వీకెస్ట్ ఆఫ్ ది వీక్. ముస్లిం మైనారిటీకి ఆ కాన్ఫిడెన్స్ ఇవ్వాల్సి వస్తది. బల్క్ మెజారిటీ మల్ల బిసిలె గద. ఇప్పుడేందంటె ఇవన్ని ఎప్పుడు? టిఆర్ఎస్ పార్టీ గవర్నమెంట్ ఫామ్ జేసిన రోజు. ఫస్ట్ సిఎం అనేది టిఆర్ఎస్ పార్టీ గవర్నమెంట్ ఫామ్ జేసే పరిస్థితి వస్తె గద. కాంగ్రెస్ వచ్చిన రోజు కాంగ్రెస్‌ను నిలదీయొచ్చు మనం. మీరు వీకర్ సెక్షన్స్ కివ్వాలె, కనీసం ఎస్‌సి గాకపోతె బిసికైన ఇవ్వాలె అని బార్గెయినింగ్‌కి పాయింట్ దొరుకుద్ది గద. తెలంగాణ వచ్చి కాంగ్రెస్ గవర్నమెంట్ తెరాసతో వాల్లకు అలయెన్స్, సపోర్టో గావా ల్నంటె ఫస్ట్ వీకర్ సెక్షన్, మేం దళితున్ని అన్నం, దళితుడు కాదు అంటె కనీసం బిసి లకు ఇవ్వండి. లేదా ముస్లింకు. వాల్లకు బార్గెయినింగ్ పాయింట్ వుంటది గద, అదో స్టార్టింగ్ పాయింట్ అయితది.

ఇగ పోతె బిసిలను తెరాసలో ఎదగనివ్వలేదు అన్నది.. బెగ్గింగ్. ఆ ఇంప్రెషన్ కరెక్ట్ గాదు. ఎదగేటోల్లు ఎదుగతనె వున్నరు. ఎదగడం అంటె ఏంది? ఎమ్మెల్యే టిక్కెట్టు, ఎంపి టిక్కెట్టు వస్తెనె వాల్లను పోషించినట్టా? అంటె అదొక యాంగిల్ మాత్రమె. తెలంగాణ వుద్యమంలో పనిచేయి, తెలంగాణ గురించి అధ్యయనం చేయి, తెలంగాణ గురించి మాట్లాడటం లోపల ఎవర్ని ఎవరన్న ఆపింర్రా. నరేంద్రకి ఎంత పెద్ద పొజిషన్ ఇచ్చిం ర్రయ్య. ఆయనకు ఏముండె, సెంట్రల్ మినిస్టర్ జేస్తె, ఆయన జేసిన కథ ఏంది. ఒక బిసిని ఆ రోజు మినిస్ట్రీ ఫార్మేషన్ అప్పుడు వాల్లు ఒక్కటె అన్నరు. ఒక్కటె అంటె సిగ్నల్స్ బయటికి పోవు, ఇంకోరికి ఇవ్వాలె అంటె మరి ఇంకో ఎంపి అంటె ఇంకొకడు అయేటోడు గద. ఈయనికిస్తె... మంచిగ బిసి తర్వాత పాత మనిషి అని ఇచ్చిరి. నిలవక పాయె. ఇగపోతె ఎమ్మెల్యేస్‌గ మంచిగ ఎదిగే అవకాశం వున్నవాల్లు మధ్యలో అబ్రప్ట్‌గ టిక్కెట్టు రాకపోయెవరకు ఎల్లిపోయింర్రు. టిక్కెట్టే ధ్యేయంగ బెట్టుకుంటె ఎవరూ ముందుకు రాలేరు. 90% టిక్కెట్టే ధ్యేయం అయిపోతున్నది.

## ఆయన చదవకుండ ఏది మాట్లాడడు

ఇపుడు పదేండ్లు ఖర్చు బెట్టటం అనేది క్రైటీరియా ఒక్కటే గాదు. సమర్థవంతంగ తెలంగాణ గురించి అధ్యయనం చేసి ఆర్గ్యూ చేయగలుగుతున్నవా లేదా? లక్షలు ఖర్చుబెట్ట వచ్చునయ్య. నువ్వు ఖర్చు బెట్టిన, వాల్లు ఖర్చుబెట్టిన గాని న్యాయార్జితం అయితె గాదు గద. చెప్తున్న, ఎవరు బెట్టిన గాదు. రాజకీయాల్లో.. ఎవడు జేబులోంచి తీస్తడయ్య. ఎట్ల తెచ్చుకున్నరనేది వేరు విషయం. ఏది జేసిన, స్వార్జితమైతె చాల మందిది గాదు. తెలంగాణ గురించి డిస్కషన్ వచ్చినపుడు, ఆర్గ్యుమెంట్ వచ్చినపుడు కెసిఆర్ ఫ్యామిలీలో అందరు సమర్థవంతంగ మాట్లాడుతున్నరు. ఎవరు నేర్పలె, నేర్చుకున్నరు వాల్లు. ఇతరులను ఎవరన్న ఆపింగ్రా. నేను మొత్తుకున్న గౌడు..! ఎన్నోసార్లు వాల్లకు ట్రైనింగ్ క్లాసులు బెట్టి, గోడకు జెప్పినట్టు అయ్యింది. ఇగ తర్వాత మానుకున్న. వీల్లే వీకర్ సెక్షన్స్‌కె. ఎన్ని జెప్పినయ్య సోషల్ జస్టిస్ గురించి.. ఆవలింతలు దీసుకుంట కూర్చునేది. బలవంతంగ కూర్చునేది. ఇగ తర్వాత వదిలేసిన. మరి అదే వీల్లయితె ఇంటికి వచ్చి కూర్చొని, నేర్చుకొని పోతరు. అంటె పొలిటికల్‌గనె అది, ఆ అర్జ్ (శ్రద్ధ) వుండాలె గద. పైకిరావాలె రాజకీయంగ అంటె కేవలం పైసలుంటె వస్తాదయ్య. ఎంతమంది లేరు పైసలున్నోల్లు. గుర్తింపు రావడానికి పైసలక్కర్లేదు, శ్రమ గావాలె. శ్రమిస్తె గుర్తింపు వస్తది.

నాకు ఇపుడు అదే ఆశ్చర్యమేస్తది చాలా మంది వెరీ సీనియర్ పీపుల్, ఎమ్మెల్యేలు, ఎంపిలుగ కంటెస్ట్ జేసినోల్లు, గెలిసినోల్లు, ఓడిపోయినోల్లు ఒకసారి ఫోన్ జేస్తరు, సార్..! మేం ప్రెస్ కాన్ఫరెన్స్ బెట్టినం ఈ విషయం ఏం జెప్పాలె అంటె నేనన్న వాల్లు ఏమడిగేది నాకేం దెలుసునయ్య. నీకు స్వతహాగ వుండాలె. నువ్వు టెలిఫోన్‌లో అడిగితె, నీకు నేనేదో జెప్త, వాల్లేదో అడుగతరు పద్ధతి ఇది గాదు. ఇన్ని రోజుల నుంచి మీరు ఏం జేసింగ్రు అని అన్న. కనీసం చాలా మందికి నేను రాసిన పుస్తకాలు చదివే ఓపిక గూడ లేదు. అదె కొంతమంది ఎ టు జడ్ జదువుకుంటరు, ప్రతి ఆర్టికల్ మీద డిస్కస్ జేస్తరు. ఇప్పటికి కేసిఆర్ క్షుణ్ణంగ చదువుతడు. ఆయనకు పెద్ద అవగాహన వుంది గద. ఆయన చదవకుండ ఏది మాట్లాడడు. తిప్పి అటుదిటు చెప్తడు కని చదవంది, అవగాహన లేంది మాట్లాడడు.

# ఆ హ్యాండీక్యాప్ పిల్లలకు రావొద్దు

నేను ఎక్కువ ఈ ఔట్ డోర్ గేమ్స్‌లో, చేయి చెడిపోక ముందు బాడ్మింటన్ ఆడేది. ఇన్‌డోర్‌గేమ్స్ చెస్ ఆడేది. చెస్ గూడ ఔటాఫ్ టచ్ అయిపోయిన. ఇప్పటికి గూడ నాకు నేను ఆడిన ముఖ్యమైన ఆటల్లో బాడ్మింటన్ ఒకటి, చెస్ ఒకటి, క్యారమ్స్ ఒకటి. క్యారమ్స్, బాడ్మింటన్ ఆడే పరిస్థితి నాకు 1952 తర్వాతనె పోయింది, హ్యాండీక్యాప్ రావడం వలన. చెస్ మొన్న మొన్నటి దాక ఆడిన. కని చెస్ కంటిన్యూస్ ప్రాక్టీస్ లేంది టచ్ పోతది. ఇగ మరీ ఉద్యమ లైఫ్‌లో, ఈ ఉద్యోగంలో బిజి అయినంక దాదాపు అన్ని స్పోర్ట్స్ ఫీల్డ్ ఔటాఫ్ టచ్చే గాని నేను ప్రిన్సిపల్‌గ, రిజిస్ట్రార్‌గ, వైస్ ఛాన్సలర్‌గ నేను బాగ ఎంకరేజ్ జేసింది స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రతిచోట. కాకతీయ యూనివర్శిటీలో ఇండోర్ స్టేడియం కట్టించింది నేనే, నా పిరియడ్‌లోపలే. కాకతీయ యూనివర్శిటీలోపల గేమ్స్ కాంప్లెక్స్ కట్టించింది నేనే. ఇంటర్ యూనివర్శిటీ స్పోర్ట్స్ పెట్టించింది నేనే. అయితె కారణమేందంటె ఎందులోనైతె నేను పాల్గొనలేకపోయిన్నో ఆ హ్యాండీక్యాప్ పిల్లలు రావొద్దు అని గేమ్స్ బాగ ఎంకరేజ్ చేసిన.

యాక్సిడెంట్ ఎట్లయిందంటె, 1952లో ఇంట్లో దొంగలుపడ్డరు. దొంగలంటె దొడ్డి వుండేది. ఇంటి వెనుక పాత ఇంట్లో. దొంగలు పడితె పట్టుకోబోతె వాల్లు పొడిచి పారి పోయింద్రు. దాంతో నర్వ్స్ బోయినయ్. దాంతోటి వన్ ఇయర్ ఎడ్యుకేషన్ బోయింది. ఐతె 1952లో నా చెయ్యిబోతె, చెడిపోయిన చెయ్యితోనె నా ఎడ్యుకేషన్ కంప్లీట్ జేసుకున్న. ఉద్యోగం కంప్లీట్ జేసుకున్న. 52 నుండి 2011 వరకు అంటె ఎన్నేండ్లు, 60 ఏండ్లు.

నేను కుడిచేత్తోనె రాస్త, పరీక్షలన్నీ కుడిచేయితోనే రాసిన, ఇప్పటికి కుడిచేయితోనె రాస్త. చిన్నప్పుడు హ్యాండ్ రైటింగ్ బాగుండెది, పెయింటింగ్స్ ఏసేది, దీంతోని హ్యాండ్ రైటింగ్ చెడిపోయింది. నేను తిండి కుడి చేయితోనె తింట, చుట్టూ పడుతుంటదని పబ్లిక్‌లోకి పోతె స్పూన్‌తో తింట. చేయితో తిన్న తృప్తి స్పూన్‌తో తింటె రాదు. చెప్తున్న లైఫ్‌లో ఒక డైమెన్షన్ ఏందంటె.. హ్యాండీక్యాప్ అయిన చేయితోని రెండేండ్లు నేను పెన్‌బట్టి రాయలేకపోయిన. ఆ చేయికి రెండు ఆపరేషన్లు అయి ఏదో కొంత కరెక్షన్ జరిగింది. దాంతో నా విద్యాభ్యాసం పూర్తయింది, ట్రైనింగ్ పూర్తయింది, ఉద్యోగం పూర్తయింది. రచనా వ్యాసంగం ఇప్పటికి అదె చేయితో, అదె చేయి.

# సిఫెల్ రిజిస్ట్రార్‌గ వుండి గూడ వంట చేసుకున్న

నేను స్కూలు టైంలోనే కాదు చాలా కాలం వంట చేసుకున్న. వంట నేను పట్టుబట్టి నేర్చుకున్నది ఆదిలాబాద్‌కు లెక్చరర్‌గ బోయినపుడు. ఎందుకు నేర్చుకోవాల్సి వచ్చింది, అంతకు ముందు పెద్దగ వచ్చేది గాదు. నేను ఆదిలాబాద్‌లో నేను, ఇద్దరు ఫ్రెండ్స్ కలిసి ఒక ఇల్లు దీసుకుని వుండెది. బయట హోటల్‌లో తినేది. పగలు ఉద్యోగం చేసు కునేది. అదే రోజుల్లో ఇంకో ఫ్రెండ్ కరీంనగర్ నుంచి తెలుగు లెక్చరర్ ట్రాన్స్‌ఫరై వచ్చిండు. ఆయన హోటల్ తిండి తినలేడు. వండుకోటం వస్తది. ఎవరూ వండొద్దు, నేను వంట చేస్త అని వంట మొత్తం రోజు ఆయనే చేసేది. అరె ఆయన వంట చేస్తు న్నడు మనం గూసోని తింటె ఎట్ల అని ఆయనకు హెల్ప్ చేసేది. హెల్ప్ జేస్తూ వంట నేర్చు కున్నం. వంట నేర్చుకుంటంల ఆయన్ని మించి పోయినం.

అయినంక 1965-66 ఆ ప్రాంతంలో హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయినంక అప్పటికె హోటల్ తిండి అలవాటు తప్పింది. ఒక దిక్కు ఈ వుద్యమాలు. టీచర్స్ యూనియన్‌లు, ఈ వుద్యమాల్లోనె వంట చేసుకునేది. అయితె రెగ్యులర్‌గ చేసేవాన్ని గాదు. ఆ రోజుల్లో ఇవన్ని ఎక్కడివి, ఈ ఫ్రిజ్‌లు, గిజ్‌లు, ఈ గ్యాస్ స్టవ్‌లు ఎక్కడివి. కిరోసిన్ స్టవ్. ఏ పూటకాపూట వండుకుని తినేవాన్ని. అట్ల నేను ఒక్క హైదరాబాద్‌లో సికెఎం కాలేజ్‌కి వచ్చినంత వరకు ఎక్కువ రోజులు నేనే వంట చేసుకున్న. నాతోపాటు ఒక ఫ్రెండ్ వుండెది, కలిసి చేసుకునేది. లేకపోతె హోటల్‌లో తినేది. హోటల్‌లో నేను తినలేకపోతె వంట చేసుకునేది. ఈ టీచర్స్ యూనియన్‌లో తిరిగి తిరిగి వస్తె, హోటల్ బంద్ అయితె, ఇంటికొస్తె ఏం లేకపోతె ఏం జేసేవాల్లం ఐదారు గుడ్లు ఉడకబెట్టి తినేటోల్లం. ఏజ్‌లో నడిసింది. సికెఎం కాలేజ్‌కి వచ్చినప్పుడు ఇంటికొచ్చిన కనుక అవసరం ఏర్పడలె. అయినా అప్పుడు ఊర్కే ఇంట్లో అప్పుడప్పుడు షోక్కు చేస్తుంటె మా అమ్మ కోప్పడేది, కని నేను చేస్తే వంట మంచిగుండెదని అందరు మెచ్చుకునేది. తర్వాత మల్ల హైదరాబాద్ పోతి.

ప్రత్యేక టేస్ట్ అంటె నేను మంచిగ చేసేవాటిలల్లో పప్పుచారు ఒకటి. ఇప్పుడు టచ్ పోవచ్చు గాని చాలా మంది లైక్ జేసేది. ఆల్ వెజిటబుల్ కర్రీస్ జేసేది, నాన్ వెజ్ గూడ మంచిగనె వండేది. అన్ని దాదాపు అన్ని రకాలు జేసేది. ఏం చేసిన అందరు మంచిగనె తినేది. హైదరాబాద్ పోయిన తర్వాత కొంత కాలం ఈ రీసెర్చ్ ఆఫీసర్‌గ పనిజేసినపుడు

లీజర్ ఎక్కువుండెది. నేనే వంట చేసుకున్న దాదాపు ఐదారేండ్లు. తర్వాత సిఫెల్‌లో రిజిస్ట్రార్ అయిన. అక్కడ సమస్యేమొచ్చింది. పేద్ద క్వార్టర్, నేను ఒక్కన్నే. అప్పటికే మా మదర్ చనిపోయింది, మాఫాదర్ అప్పుడు బీమార్ వుంటె నా దగ్గరికి వచ్చి వుండె. మా ఫాదర్ హెూటల్ తిండి తినలేడు. ఆయన కొరకు నేను వంట చేయాల్సి వచ్చేది. సిఫెల్ రిజిస్ట్రార్‌గ వుండి గూడ వంట చేసుకున్న నేను. ఇంతలో కాకతీయ యూనివర్శిటీ విసి అయిన. దాని తర్వాత ఏదో వంట టచ్ పోయింది. ఇపుడా ఓపిక కూడ లేదు. ఇగ తర్వాత కాకతీయ విసి అయినంక ఉద్యమంలో దిగిన. టైం లేదు, ఇప్పటికి వంట రెండు మూడు రోజులు చేసుకుంటె మల్ల టచ్ వస్తది.

ఆబ్లిగేషన్ కాదు, కంపల్‌షన్. హెూటల్ తిండి ఇబ్బందిగ వుండె. మొదట చిన్నప్పుడు తినేది, తర్వాత హెూటల్ తిండి తినడానికి ఇబ్బందిగ వుండెది. కంటకమౌతది, హెూటల్ తిండి తినాలంటె భయం వేస్తది నాకు. అవసరం ఏం జేస్తాం, నెసెసిటి. ఎంజాయ్ గూడ చేసేది, ఎంజాయ్ ఎప్పుడంటె లీజర్‌గ వున్నప్పుడు. నాకిష్టం వచ్చినయ్ ఎక్కువ జేసుకునేది. అడ్డగోలుగ జేసేవాన్ని కాదు. పోతె ఇన్ని సౌకర్యాలు ఇవన్ని ఎక్కడియి. గ్యాస్‌స్టవ్‌లు, ఎలక్ట్రిక్ స్టవ్‌లు ఓ ఇన్ని హీటర్లు ఎక్కడియి. కిరోసిన్ స్టవ్, ఏపూటకాపూట వంట. ఫ్రిజ్‌లు గూడ పెద్ద పాపులర్ గాలె అప్పటికి ఇంక.

## ఇచ్చే స్టాటిస్టిక్స్ ఆథెంటిక్‌గ వుండాలె

ఇష్యూను బట్టి వుంటది. చెప్పలేమా అంటె చెప్పొచ్చు, సస్‌స్టెయిన్ చేయాలె. మాకు అన్యాయం జరుగుతాంది అని వదిలిపెడితె ఎట్ల, ఎంతయింది, ఎక్కడయింది, ఎందు కయ్యింది, ఎవరివల్ల అయ్యింది? మరి అన్యాయమైందని మొత్తుకుంటె ఈ క్వచ్చన్స్ రెయిజ్ అయితయి గద. కామన్ మ్యాన్‌కు చదుకున్నోల్లకు తేడా అదే. చదువు రానోల్లకు మా గురువు గారు రావాడ సత్యనారాయణ చెప్తిని గద.. ఆయన చెప్పింది గదే. అందరి తీరుగ మీరు లొల్లి బెడితె ఎట్లనయ్యా! ఎం జరిగిందో జెప్పాలె గదనయ్యా! అంటె మా అధ్యయనం మొదలైంది. ఇచ్చే స్టాటిస్టిక్స్ ఆథెంటిక్‌గ వుండాలె, రిలయబుల్‌గ వుండాలె. అందుకే నేను ఏ స్టాటిస్టిక్స్ ఇచ్చినా నన్ను ఎవరూ క్వచ్చన్ చెయ్యరు ఈనాటికీ. ఏ ప్రైమ్‌మినిస్టర్, ఏ ఛీఫ్ మినిస్టర్, ఎంత ఆంధ్ర కట్‌ర్తోట్‌గ వున్నవాడైనా నేనిచ్చిన రిపోర్ట్లను క్వచ్చన్ చేయలేరు. ఇచ్చానంటే ఆల్ రిఫరెన్స్ ఇస్త నేను. అందుకు కంటిన్యూ స్టడీ అవసరం గావాలె.

కొంత పబ్లిష్‌డ్ వుంటది, కొంత స్నేహితుల ద్వారా. అదంతా అదే మొత్తం 1956 నుంచి ఇప్పటి దాకా. అన్ని స్టాటిస్టిక్స్ అవన్నీ బైండింగ్ జేసి ప్రిజర్వ్ జేయాల్సి వస్తది. అన్ని తీసిపెట్టిన. స్టేట్ ఫార్మేషన్ నుంచి నేటి వరకు. అఫీషియల్‌గ పబ్లిష్ అయిన స్టాటిస్టిక్స్. కొన్ని అవి. కొంత కాలం కొందరివ్వలె ఏదో విధంగ తెచ్చిన.

ఇప్పుడు ఒకటి ఒక ట్రెండ్ వుంటది గద. హండ్రెడ్ పర్సెంట్ ఆథెంటిక్ మనం ఇచ్చినవి, వాల్లు ఇచ్చినవి వుండవు. ఒక ట్రెండ్ వుంటది, స్టాటిస్టిక్స్ ఎప్పుడైన ట్రెండే. ట్రెండ్ ఒకే తీరుగ వున్నది. ఇప్పుడేందంటె తెలంగాణలో ఐదు స్కూల్లున్నయ్, ఆంధ్రలో పది స్కూల్లున్నయ్ అంటం. ఐదు కాకపోతె ఆరుండొచ్చు, అక్కడ పదిగాక పదిహేను వుండొచ్చు. కని పది లేక ఆరు చెప్పడానికి బేసిస్ గావాలె గద. బేస్ లెక్కేంటి. వాల్లు ఇచ్చిన డేటాని బట్టి మనం జిల్లాల వారి వాల్లిచ్చిన దాన్ని రాబట్టిండ్రు. దాన్ని జిల్లాల వారి దీసుక పోయి మరి ఇక్కడ ఏ ట్రబులుంది అని విశ్లేషిస్తం. అది వాల్లకి అర్థం గాదు, వాల్లిచ్చేదాన్ని వాల్లకర్థం జేస్తం. కొంత కాలం బంద్ జేసిండ్రు. చంద్రబాబు హయాంలో వీటిని బాన్ పెట్టిండు బయటికివ్వద్దని. నేను విశ్లేషణ మొదలుబెట్టిన. అప్పుడు మొత్తంమీద మేనేజ్‌జేసి తెచ్చుకున్న బయటికి. అఫీషియల్‌గ పబ్లిష్ జేయడానికి, ఏదన్న కమిటి వుంటె బంపాలె గద. దీనికి ఏందంటె ఆ పట్టుదల, ఆ వెసులుబాటు తెచ్చుకునే

తెలివుండాలె. మనం అంటె నమ్మి ఇచ్చేటోల్లు గావాలె గద. కొంత మంది భయపడుకుంట, భయపడుకుంట ఇచ్చేది. దాన్ని జిరాక్స్ దీసుకుని మల్లిచ్చేది.

శ్రీకృష్ణ కమిటీ వల్ల రాదు, దాని వల్ల పోదు అని మొదట్నుంచి అంటున్నం గద. ఇప్పటికి ఇరవై కోట్లు ఖర్చు అయ్యింది. ఇరవై కోట్లు ఖర్చు అయింది అంటే వాల్లే జేసుకున్నరు. హైకోర్టుల వాల్లే అన్నరు, హిస్టారికల్ ..... ఒకమాట ఏమన్నడంటె దీనికి లీగల్ స్టేటస్ లేదు అన్నడు మొదటిది. అంటె చట్టబద్ధత లేదు. రెండవసారి ఏమన్నడంటె ఈ రిపోర్టుతోనే నిర్ణయాలు ప్రభావితం కాకపోవచ్చు అన్నడు. మరి దేనికది. నువ్వే దీనితోని ప్రభావితం కావు అని జెప్పినంక మేమెందుకంటం. ఆ రిపోర్టు తప్పుల తడక అని ప్రపంచ వ్యాప్తంగా ఇపుడది వుండె. కనుక దాన్ని ఆధారంగా జేసుకుని దాన్ని ఆధారంగా జేసుకున్న ఆల్టర్నేటివ్ ఫైవ్ వున్నయ్ మరి ఇవాల జూసుకుంటె. త్రిఫోర్త్ గాల్లు వాల్ల వుద్దేశం ఏంది, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఉద్దేశం ఏంది అన్న దాంట్లో కంపల్‌సరి తప్పని పరిస్థితి వచ్చింది గనుక. చాలా కాలం కొనసాగించలేరు దీన్ని. రెండేల్లల్లో 2011, 2012 మధ్యలో అయిపోవాలె. ఇంక ఆలస్యం జేస్తే కాంప్లికేషన్. ఆలస్యం జేస్తే చాల కాంప్లికేషన్స్ వస్తయ్. అల్టిమేట్‌లీ సెంట్రల్ కాంగ్రెస్ వాల్లకు లాభమైద్దా అనేది వాల్లు జూసే వాల్ల కొలమానం అది. ఇప్పుడిస్తే వాల్లకు లాభం. లేకుంటె వాల్లకు నష్టం. ఇప్పుడిస్తే అటొమెటిక్‌గ వాల్ల గవర్నమెంటే వస్తది గద. ఇక ఇవ్వకుంట ఎన్నికలు బెడితె వాల్లొస్తరా? గెలుస్తరా?

## జంద్రల్‌గ

నేను జంద్రల్‌గ పొయెట్రీ చదువుత. ఉర్దూగాని, తెలుగు గాని. ఇగపోతె ఎకనామిక్ ఇష్యూస్, పొలిటికల్ ఇష్యూస్.

...

సినిమాలు చూడటం చాల రేర్, చిన్నప్పుడు జూసేది గాని, నేను సినిమాలు చూడక దాదాపు అంటె గత 30, 35 ఏండ్లల్లో థియేటర్‌లకు బోయి చూసిన సినిమాలు ఐదారు వుండొచ్చు అంతె. ఇగ అప్పుడప్పుడు టి.విలో వస్తాంటె మంచిగ గనిపిస్తె జూస్త గంతె. సినిమా చూద్దామని బోయింది మహా అంటె పదుండొచ్చు నలభై ఏండ్లల్లో. ఎక్కువ సినిమాలు నేను స్టూడెంట్‌గ వున్నప్పుడు చూసిన. స్కూలు టీచర్‌గ వున్నప్పుడు మొదటి దశలో చూసిన. కాలేజీ టీచర్ అయినంక తగ్గింది, ఉద్యమంలో ఇన్‌వాల్వ్ అయిన గద.

...

బ్యాచ్‌లర్‌గ వుండటంఅడ్వంటేజ్‌గాదు, డిస్ అడ్వంటేజ్ గాదు. జరిగిపోయింది, కుటుంబ విషయాలు, పర్సనల్ విషయాలు, చాలా అట్టడుగునుంచి వచ్చిన వాల్లం కాదయ్య. కోరికలు చదువుకోవాలె, పైకి రావాలె, ఉద్యమాలు, ఉమ్మడి కుటుంబాలు, బాధ్యతలు, పోయి పోయి ఒక స్టేజికొచ్చాక ఏజ్ దాటిపోయింది. దాటిపోయినంక ఇన్వాల్‌మెంట్ అవసరం లేదనుకున్న.

...

ఇగో ఇందులో సాహిత్యం కంటె ఎక్కువ బలపడిన సెక్షన్స్, బలపడని సెక్షన్స్ ఖాతర్ జేయడం లేదు. వాల్లకే కాన్సన్‌ట్రేషన్ అయిపోతోంది. నీకు తెలుసు బాగా దెలుసు ఒక ఐదారు సెక్షన్స్ తప్ప మిగతా, మరి బిసి మూమెంట్ బోవాల్నంటె వాల్ల ఒక్క కులం సరిబోదు గద. అన్ని కులాలు రావాలె గద. రావాలన్నపుడు వాల్లని ఎట్ల దీసుకపోవాలె వెంట. పెద్ద లోపం నా అనుభవంలో పెద్ద లోపం అది.

...

నమ్మడం లేదు గదా? ఫ్యాక్టేగ. లేదుగనుక ఇక్కడ రాలేదు గనుక. దేవేందర్‌గౌడ్ బెస్ట్ ఎగ్జాంపుల్. ఐతే వీల్లు వాల్లని నాదేందంటె వాల్లని ఇన్‌స్ట్రుమెంట్‌గ వాడుకోవాలి మనం. నేనేం జేస్తున్న, ఇన్‌స్ట్రుమెంటుగ వాడుతున్న. ప్రతి పౌరుడు అట్ల వాడుకున్నపుడు ఇది ఎమర్జ్ అయితయ్ గద.

...

రెండూ కావొచ్చు, కొన్ని కేసెస్ కాన్స్పిరసీ గావొచ్చు, కొన్ని కేసెస్ యాక్సిడెంట్స్ రెండూ గావొచ్చు. ఆ కల్చర్ అట్ల అయిపోయింది. అన్ని యాక్సిడెంట్స్ గాక పోవచ్చు అన్ని ఉద్దేశపూర్వకంగ గాకపోవొచ్చు. సమ్ మెబి యాక్సిడెంట్స్, సమ్ మెబి డిజైన్.

# KOTHAPALLI JAYASHANKAR
(A Profile)

| | | |
|---|---|---|
| 1) Date of Birth | : | 6th August, 1934 |
| 2) Place of Birth | : | Hanamkonda, A.P. |
| 3) Educational Qualifications | : | M.A. Economics (Banaras)<br>B.Ed.(Osmania)<br>M.A. Economics (Aligarh)<br>Ph.D. Economics (Osmania) |
| 4) Linguistic Proficiency | : | Telugu, English, Urdu, Hindi |

5) Experience :

*(a)Academic :*

Level:

(i) Taught Economics and supervised research at Doctoral

(ii) Made in-depth studies on the problems emanating from regional disparities in the levels of development with special reference to A.P.

(iii) Has to his credit a large number of papers published in the areas of Economic Development and Educational Economics.

*(b) Administration:*

Positions held –

(i) Member of the National Commission for Enterprises In the Unorganized Sector, Government of India, New Delhi (2004-06)

(ii) Vice Chancellor of Kakatiya University, Warangal (1991-94

(iii) Registrar of Central Institute of English & Foreign Languages (CIEFL), Hyderabad (1982-91)

(iv) Registrar of Kakatiya University, Warangal (1979-81)

(v) Principal of CKM College, Warangal (1975-79)

Also served as a Member of -

(vi) Board of Governors: Central Institute of English & Foreign Languages (CIEFL), Hyderabad

(vii) Board of Governors: Regional Engineering College, Warangal

(viii) Planning Board: Mahatma Gandhi University, Kottayam, Kerala

(ix) Andhra Pradesh State Council of Higher Education

(x) Central Institute of English & Foreign Languages (CIEFL), Hyderabad

(xi) Several Working Groups Constituted by t he University Grants Commission

(xii) Senate: Osmania University, Hyderabad

(xiii) Academic Council: Osmania University, Hyderabad

(xiv) Senate: Kakatiya University, Warangal

(xv) Academic Council: Kakatiya University, Warangal

(xvi) Academic Senate: Kakatiya University, Warangal

(xvii) Governing Body: SLNS College, Bhongir(also was its Chairman)

(xviii) Governing Body: Lal Bahadur College, Warangal

(xix) Governing Body: Sardar Patel College, Secunderabad

(xx) Advisory Board: Life Insurance Corporation of India

*c) Organisational:*

Served as -

(i) President, and also General Secretary: Government College Teachers' Association, A.P.

(ii) General Secretary: Telangana Government College Teachers' Association

(ii) Member of the National Executive: All India Federation of University and College Teachers' Organisations

6) Life Membership:

(i) India International Centre, New Delhi

(ii) Indian Institute of Public Administration, New Delhi

(iii) American Studies Research Centre, Hyderabad

(iv) Exhibition Society, Hyderabad

(v) Economic Committee, A.P. Hyderabad

(vi) Osmania Graduates, Association, Hyderabad

7) Telangana Concerns:

(i) Participated in the 1952 Non-Mulki Agitation as a student activist opposing formation of Vishalandhra (i.e. Andhra Pradesh).

(ii) Appeared before the States Reorganisation Commission (1954) Pleading for retaining Telangana as a separate state.

(iii) Participated in the 1968-69 Jai Telangana Movement as a teacher activist demanding formation of Telangana as a separate state.

(iv) Authored a large number of books, articles and research papers, in English and Telugu, on various aspects of Telangana Problem.

(v) Was instrumental in forming the Telangana Development Forum (TDF) in U.S.A. in the year 1999.

(vi) Was invited by the American Telugu Association (ATA) U.S.A., to speak about the Problems of Regional Disparities in Andhra Pradesh during their biennial conferences held in July 2000 and July 2002.

(vii) Was invited by the Telangana Development Forum (TDF) U.S.A. to give a series of lectures on various facets of Telangana Movement in ten major cities of the United States during July/August 2000.

(viii) Currently is the Chairman of Centre for Telangana Studies which is engaged in research and publication relating to problems of Telangana.

(ix) Is the founder member of Telangana Aikya Vedika and, at present, is on its Executive Committee.

8)Other Interests:

Is currently associated with a group of social activists known as the Committee of Concerned Citizens which has been interacting with the state government and the Naxalite groups with the objective of restoring peace and tranquility in the state, especially in the Telangana region.

# రవానీ...



# కుటుంబం



అమ్మా - నాన్న



అన్న, తమ్ముడు, అక్క, చెల్లెండ్లు - 2009



వరంగల్ జిల్లా అక్కంపేటలో పూర్వీకుల ఇల్లు



సొంత గ్రామం అక్కంపేటలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్కూల్ కోసం ఇచ్చిన స్థలం - 2002



పెంపకంలో పెరిగిన పిల్లలు - 2005



మనుమరాలితో



75వ జన్మదినం రోజు - 6-8-2009



ఆప్తమిత్రులు ఆర్. వెంకటేశ్వర్లు (ఎడమ), ఆనందర్‌రావు తోట కుటుంబం (కుడి)1992

# బాల్యం - విద్యాభ్యాసం



బాల్యంలో - 1942



7వ తరగతి విద్యార్థిగా - 1947
(కూర్చున్న వారిలో కుడి నుంచి రెండవ బాబు)



ఇంటర్ మీడియట్
విద్యార్థి - 1953




బి.ఎ విద్యార్థి, ఆర్ట్స్ కాలేజ్
ఓయు - 1954



కాలేజ్‌లో వేసిన
నాటకంలో స్త్రీ పాత్రలో



కాలేజ్‌లో వేసిన నాటకంలో స్త్రీ వేషధారణ,
మధ్య వరుసలో ఎడమ నుండి రెండవ వ్యక్తి - 1952




గ్రాడ్యుయేషన్ - 1956



ఉస్మానియా యూనివర్శిటీలో పిహెచ్.డి పట్టా తీసుకుంటూ

## ఉద్యోగిగా




స్కూల్ టీచర్‌గా విద్యార్థులతో (కూర్చున్న వారిలో కుడి నుంచి మూడవ వ్యక్తి)




ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా - 1974



ఎస్. ఎస్. రేతో సికెఎం కాలేజ్ ప్రిన్సిపల్‌గా - 1977



మన్మోహన్‌సింగ్, కృష్ణకాంత్‌లతో - 1992



కాకతీయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా
కాళోజి, మన్మోహన్‌సింగ్, కృష్ణకాంత్‌లతో - 1992



లండన్‌లో బకింగ్‌హాం ప్యాలెస్ దగ్గర



కె.సి అబ్రహం, కె. వెంకట్రామయ్యతో కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా -1979



రిజిస్ట్రార్ సిఐఇఎఫ్ఎల్ (సిఫెల్) హైదరాబాద్ - 1990




ప్రొఫెసర్ జి. రాంరెడ్డితో - 1992



కామన్‌వెల్త్ యూనివర్సిటీల అసోసియేషన్ వి.సిల కాన్ఫరెన్స్‌లో యు.కె - 1993

విదేశాలలో



యుఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ హాల్, న్యూయార్క్‌లో



నయాగర వాటర్‌ఫాల్స్ దగ్గర



అట్లాంటాలో ఆటా,
టిడిఎఫ్ కాన్ఫరెన్స్ - 2000



స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ ముందు, న్యూయార్క్

## ప్రముఖులతో



జవాహర్‌లాల్ నెహ్రూతో - 1959



జవాహర్‌లాల్ నెహ్రూతో (ఎడమ వైపు) గ్రూప్‌ఫోటో



మదర్‌థెరిస్సాతో కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా - 1980



పి.వి. నరసింహారావుతో కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా - 1981



మన్మోహన్‌సింగ్, కృష్ణకాంత్‌లతో - 1992



అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మతో - 1994



కాళోజి ఆశీస్సులు అందుకుంటూ - 1992



డాక్టర్ సి. రంగరాజన్‌తో



కోట్ల విజయభాస్కరరెడ్డితో - 1992



ప్రొ. ఎ.ఎం. కుస్రో (ఆర్థికశాస్త్రవేత్త), ప్రొ. జాఫర్ నిజాం (విద్యావేత్త)లతో



జస్టిస్ పి. జగన్మోహన్ రెడ్డి, ప్రొ. రమేష్ మోహన్‌లతో



శంకర్‌దయాళ్ శర్మ, పి. శివశంకర్‌లతో



జె.వి. నర్సింగ్‌రావుతో



కేసీఆర్‌తో



'జైబోలో తెలంగాణ' సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో



కాళోజి విగ్రహం ముందు నివాళులు అర్పిస్తూ - 2009

వొడువని ముచ్చట • తెలంగాణ సిద్ధాంతకర్త • ప్రొఫెసర్ జయశంకర్



వొడువని ముచ్చట • తెలంగాణ సిద్ధాంతకర్త • ప్రొఫెసర్ జయశంకర్



edited by: kompelli venkat goud
email: kompellivenkatgoud@gmail.com
9849112799